ఇంటినంబర్లు అవకతవకగా వేయబడి వున్నాయి. నాకు కావలసిన ఇల్లు దొరకక్క నేను కొట్టుకు చచ్చాను. చిట్టచివరికి ఒక పూరిగుడిసె ముందున్న మనిషిని అడిగి నాకు కావలసిన ఇంటివైనం తెలుసు 'న్నాను. "కాలనీలో పూరిగుడిసె ఏమిటీ" అని ఆశ్చర్యపడతారేమో? ఔనండీ, నేనుకూడ మొదట మీలాగే ఘోష్‌కాలనీలో పూరిగుడిసె ఎక్కడినుంచి వచ్చిందబ్బా అని విస్తుపోయాను. కాని కాలమే నా అనుమానాలన్నింటినీ తీర్చివేసింది. ఘోష్ కాలనీలో పూరిగుడిసె ఉండటం ఒక శాశ్వతమైన సత్యమని నేనిప్పుడు తెలిసికో గలిగాను. అష్టావక్రుని ప్రక్కనవున్నప్పుడే కదా మన్మధుని సౌందర్యం మరింత రాణించేది? దరిద్రుడైన కుచేలుని పూరిగుడిసెతో పోల్చి చూచినప్పుడే కదా శ్రీ కృష్ణుని వైభవోపేతమైన భవనాల సొంపు మనకు తెలిసేది!

కుచేలుడు ఏ విధంగా ద్వారకలోని భవనాలను ఒక్కటొక్కటిగా దాటుకుంటూ చివరికి శ్రీ కృష్ణుని రాజభవనం చేరుకున్నాడో, నేనూ అలానే నా మిత్రుడైన శ్రీకృష్ణుని బంగళా సమీపించాను. గేటు దగ్గర గూర్ఖానూ లేదు, సుస్వాగతం బోర్డు అంతకంటే లేదు. వెక్కిరిస్తున్నట్లుగా 'కుక్కలున్నాయి జాగ్రత్త' అనే బోర్డు మాత్రం నాకు కన్పించింది. ఆ బోర్డు చూడగానే నాకు సగం ప్రాణం పోయినట్లయింది. ఈ బంగాళాలో శ్రీకృష్ణ కాని అతని సంసారం కాని లేకుండా కేవలం కుక్కలే ఉన్నాయా అని అనుకొన్నాను.



1974 సంవత్సరానికి (సాహిత్య రంగంలో ఉత్తమ కృషికి) జ్ఞానపీఠ్ బహుమతి పొందిన ప్రముఖ కన్నడకవి డా॥ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రె (కుడివైపు), ప్రముఖ ఒరియా నవలాకారుడు శ్రీ గోపీనాథ్ మొహంతి.

అయినా నా చచ్చు జోకుకు నాకే నవ్వు రాలేదు. గేటు తెరచి బిక్కుబిక్కుమంటూ లోనికి వెళ్ళాను.

కాలింగ్‌బెల్ నొక్కగానే శ్రీకృష్ణవచ్చి నాకు స్వాగతం చెప్పలేదు. ఎందుకంటే అప్పుడు శ్రీకృష్ణ ఇంట్లోలేదు. నౌకరు వచ్చి తలుపు తీశాడు. వాడు నన్నొక శని దేవతగా భావించి ఏదో జవాబు చెప్పి తిప్పి పంపాలనుకొన్నాడు.

"అయ్యగారింట్లో లేరు" కరుగ్గా అన్నాడు నౌకరు.

"అమ్మగారయినా వున్నారా?" అడిగాను.

"నిద్రపోతున్నారు"—పొడి మాటల్లో సమాధాన మిచ్చాడు వాడు

"సుదామ వచ్చాడని చెప్పి అమ్మగార్ని నిద్రలేపు" కాస్త గట్టిగా అన్నాను.

ఇలా గట్టిగా చెప్పేసరికి ఇంటి యజమానికి, యజమానురాలికి కావలసిన వాడినని భావించి నన్ను లోనికి తీసుకెళ్ళి డ్రాయింగు రూములో కూర్చుండబెట్టాడు. అయినా వాడు అమ్మగార్ని నిద్రలేపలేదు. ఎప్పుడో నిద్రలేపి తిట్లుతిని వుండవచ్చు కాబోలు ఇంకోమారు వాడు అమ్మగారికి నిద్రాభంగం కల్గించాడా, అంతటితో వాడు పనికి స్వస్తి చెప్పాల్సిందే.

నాకోసం ఫ్యాన్‌వేసి, చల్లని నీళ్ళు తెచ్చి యిచ్చి పుణ్యం కట్టుకొన్నాడు. నా ఊరూ-పేరూ అడిగి లోనికి వెళ్ళాడు కొంత సేపయిన తర్వాతవచ్చి చెప్పాడు "అయ్యగారు మిమ్ములను ఫోనులో పిలుస్తున్నారు" వాని తెలివికి నేనెంతో సంతోషించాను. సొంత వూరికి శ్రీకృష్ణ రాగానే చేస్తున్న పని వదిలి, నేను వాని దగ్గరకు పరుగెత్తేవాడిని. నాలానే వాడుకూడ పనులన్నీ వదిలేసి రెక్కలు కట్టుకొని వచ్చి వాల్తాడని ఆశించాను కాని నేననుకొన్నట్లు జరుగలేదు. ఫోనులో మేమిలా మాట్లాడుకొన్నాము.

—ఏరా, సుదామా ఎప్పుడొచ్చావ్?

—ఇప్పుడేనోయ్.

—కంగ్రాచ్యులేషన్స్. నీజాబు చేరింది నీకెలాంటి ఇల్లు కావాలి?

—ప్రస్తుతం ఒక్కడినే వచ్చాను. ఒక రూమైతే చాలు.

—బాడుగ ఎంతలో వుండాలి?

—నా జీతం నాలుగు వందలు నేనెంత బాడుగ ఇవ్వగలనో నీవే ఊహించుకో.

కొద్ది సేపటివరకు శ్రీకృష్ణనుంచి సమాధానం రాలేదు. లైన్ కట్ అయిందనుకొన్నాను.

హలో! హలో! అని పిలువగా శ్రీకృష్ణ తగ్గు స్వరంలో ఇలా అన్నాడు.

"సుదామా! ఈ కాలనీలో ఇంటి బాడుగలు చాలా ఎక్కువ. అంతేకాదు. ఒక్క రూము బాడుగకు దొరకటం చాలాకష్టం ఒకవేళ దొరికినా బాడుగ 200-250 రూపాయల కంటె తక్కువ ఉండదు. పాత ఢిల్లీలో తక్కువ బాడుగలో సింగిల్‌రూమ దొరకవచ్చు కాని ఆ ప్రాంతంతో నాకట్టే పరిచయంలేదు. అయినా ప్రయత్నిస్తా నీవు రెస్టు తీసుకో. నేను చాలా బిజీగా ఉన్నాను సాయంకాలం కలుద్దాం."

శ్రీకృష్ణ ఫోను పెట్టేశాడు.

నాకూ శ్రీకృష్ణకూ గల స్నేహాన్ని గూర్చి ఇచ్చట మీకు కొంత చెప్పడం అవసరమని నేను భావిస్తాను మా ఇద్దరిదీ ఒక వూరే ఇద్దరమూ హైస్కూలువరకూ కలిసే చదివాం తర్వాత శ్రీకృష్ణ చదువుకి స్వస్తిచెప్పి ఢిల్లీలో వ్యాపారంలోకిదిగాడు. నేను బి ఏ ప్యాసయి సొంత వూళ్ళోనే ఉద్యోగంలో ప్రవేశించాను అప్పుడప్పుడు శ్రీకృష్ణ సొంత వూరికి వస్తూవుండేవాడు. వచ్చినప్పుడల్లా నన్ను తప్పక కలిసేవాడు. మా స్నేహం అలా ఎన్నో ఏళ్లు కొన

సాగుతూ వచ్చింది.

శ్రీకృష్ణ అదే వూళ్లోనే పెళ్ళిచేసు కొన్నాడు. నేను కూడ ఆ పెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నాను లెండి. ఒక మాట చెప్పడం మరిచాను శ్రీకృష్ణ స్నేహితుడ్నని గర్వంగా చాటుకొనేందుకై అతని సూటే ధరించాను.

అది వదులుగా ఎంతోఎబ్బెట్టుగాతోచింది. ఆసూటులో నేనొక కార్టూన్‌లా అగపడ్డాను అది అరువుసూటని ఎవరైనా గుర్తుపడతారేమోననే భయం లోలోనే వేధించేది ఆసూటు ధరించిన తర్వాత నేను సిగ్గుతో చచ్చిపోయానంటే నమ్మండి, ఇక ఎవ్వరి పెళ్ళికి కూడా వెళ్ళకూడదని ఆరోజే నిశ్చయించుకొన్నాను అఫ్‌కోర్స్ నాపెళ్ళికి నేను తప్పనిసరిగా వెళ్లాల్సి వచ్చిందనుకోండి.

శ్రీకృష్ణ వూరికి వచ్చినప్పుడల్లా తాను సాధించిన ఘనకార్యాల గూర్చి చెప్పేవాడు. తాను బంగళా, కారు కొన్నట్లు, వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా వృద్ధిచేస్తున్నట్లు ఇంకా ఎన్నో విషయాలు నాతో ముచ్చటించేవాడు. అంతేకాదు, ఢిల్లీకి రమ్మని నన్ను ఎన్నోమార్లుకోరాడు. ఢిల్లీలో ఉద్యోగం రావటంతో నా ఆనందానికి హద్దు లేకపోయింది "నీవు ఢిల్లీ వెళ్తున్నావు నగంజీతం ఇంటిబాడుగకే సరిపోతుంది ఈమాట జ్ఞాపకముంచుకో ఈ ప్రయాణం ఆపేసెయ్" అని ఎంతో మంది నాకు నచ్చజెప్పారు

"ఢిల్లీలో నా ప్రాణస్నేహితుడు శ్రీకృష్ణ వుండగా నాకేమి కొదువ? వానికో పెద్ద బంగళావుంది నేనక్కడే వుండిపోతాను." నేను వాళ్ళ నోళ్లు మూయించాను.

శ్రీకృష్ణ తనయింట్లోనే వుండమంటాడనీ, అందువల్ల నాకెంతో డబ్బు ఆదా అవుతుందని అనుకొనే నేను ఢిల్లీ ఉద్యోగం వొప్పుకున్నాను ఎంతో దర్జాగా బ్రతుకుతున్న శ్రీకృష్ణ నాలాంటి బాల్య స్నేహితుణ్ణి దూరంగా ఉండనివ్వడు నన్ను కూడా తమలో ఒకడిగా భావిస్తాడు. నేను వారియింట్లో వున్నందువల్ల నాకుగాను వారికయ్యే నెలసరి ఖర్చు వారికి ఎలా ముట్టచెప్పడమా అనే సమస్యతో కొట్టుమిట్టాడుతూ వున్నాను ఆ! ఓ ఐడియా తట్టింది. వారు నాకుగాను చేసే ఖర్చు, నేను వారి పిల్లలకై వినియోగిస్తే సమస్య పరిష్కారం మయినట్లే కదా! అది చూసి శ్రీకృష్ణ కోపంతో అంటాడు "ఏమిటోయ్ ఇదంతా!" అప్పుడు నేనంటాను "నీకెందుకోయ్. నేను నా అల్లుళ్ళకు ఖర్చు చేస్తాను. మా విషయంలో తలదూర్చటం అనవసరం" వాడు చప్పున ఊరకుంటాడు. ఈ మాట నేను నా శ్రీమతికి చెప్పాను. అప్పుడామె లెక్కవేసి నెలకు నూటయాభై రూపాయలకంటె ఎక్కువగా పిల్లలకై ఖర్చు పెట్టవద్దని నాతో గట్టిగా చెప్పింది. నూటయాభై రూపాయల్లోగా నా తిండీ, భోజనం, వసతి సౌకర్యాలు గడిచిపోతాయని ఆవిడ అభిప్రాయం. ఇలాంటి వ్యవహారాల్లో నా శ్రీమతి తెలివి

తేటలముందు నేను బలాదూర్. అలాగే మరోమాటకూడ చెప్పింది.

"ఎందుకైనా మంచిది. నేను ఢిల్లీ వస్తున్నాననీ, అక్కడే ఉద్యోగం అయిందనీ. ఓ యిల్లు కూడ చూడమని కార్డు ముక్క వ్రాసి పడేయండి. మిగతా విషయాలు ఆయనే చూసుకుంటాడు." నేను శ్రీమతి చెప్పిన మాటలు తు. చ. తప్పకుండా పాటించాను


ఫోనులో శ్రీకృష్ణతో మాట్లాడిన తర్వాత నేను ఒట్టి తెలివితక్కువ దద్దమ్మననీ, లౌకిక వ్యవహారాలు నాకంటే నా శ్రీమతే నాలుగాకులు ఎక్కువ చదివిందని గ్రహించాను. ఫోను పెట్టేసి. నేను డ్రాయింగు రూములోకివచ్చి చింతిస్తూ కూర్చున్నాను.

నా మిత్రుణ్ణి తిట్టాలనే ఉద్దేశ్యం నాలో ఏకోశానా లేదు. వాడు నాకెంతో సహాయం చేశాడు. నేను వచ్చిన మరుసటిరోజే తన ఫ్రెండ్‌కి చెప్పి ఒక పెద్ద బంగాళాలో కారు గ్యారేజ్‌మీద ఉన్న సర్వెంట్స్ క్వార్టర్ నాకు వాడుగకు కుదిర్చాడు. వంటిల్లు కాక ఓ చిన్నగది బాడుగ ఎనభై రూపాయలు పోష్‌కాలనీలో ఈపాటి వసతి గల ఇల్లు ఇంత తక్కువ బాడుగకు దొరకాలంటే మాటలా? ఇంత త్వరలో ఇలాంటి ప్రాంతంలో ఇల్లు దొరికినందులకు శ్రీకృష్ణ నన్ను ఎంతగానో అభినందించాడు.

నేనున్న కాలనీపేరు చెపితేచాలు, నా కొలీగ్స్ అంతా నన్నో పెద్ద ఆఫీసర్‌లా గౌరవిస్తారు. మరి నేను అదృష్టవంతుడిని కాదంటారా? కాని సర్వెంట్స్ క్వార్టర్‌లో ఉంటున్నాననే సిగ్గుతో నాలో నేనే కుంచించుక పోతున్నాను

మావూరి వారందరికీ దర్జాగా శ్రీ కృష్ణ అడ్రస్ ఇచ్చి నేనక్కడే వుంటానని చెప్పి వచ్చాను ఉత్తరాలన్నీ ఆ అడ్రస్‌కే వస్తాయి, నేను ప్రతిరోజూ సాయంకాలం అక్కడికి వెళ్లి నా ఉత్తరాలను తెచ్చుకుంటూ వుంటాను ఆ నెపంతో సాయంకాలంవేళ టీ, ఒక్కొక్కప్పుడు రాత్రి భోజనం కూడా శ్రీ కృష్ణతోనే జరిగిపోతూ వుంటుంది శ్రీకృష్ణ, అతని భార్యకు నేనంటే ఎంతో ఇష్టం. కాని వాళ్ళ నౌకరుగాడున్నాడే—ఆ దుర్మార్గుడికి నేను సర్వెంట్స్ క్వార్టరులో వున్నసంగతి తెలుసు అందువల్ల వాడు నన్ను గౌరవించకుండా—తనలా ఓ నౌకరుగా భావించి నాతో స్నేహితునిలా మాటలు కలుపుతాడు. వాణ్ణి చూడగానే నాకు ఒళ్ళంతా తేళ్లు జెర్రులు ప్రాకినట్లవుతుంది నేను తప్పకుండా ఏదో ఒకరోజు వానికి బుద్ధివచ్చేటట్లు చీవాట్లు వేస్తాను అప్పుడుగాని ఆ వెధవాయిగాడు నన్ను తన యజమాని స్నేహితునిగా భావించి గౌరవించడు.

ఎప్పుడైనా మావూరివాళ్లు నాకోసం వెదుకుతూ వస్తే నాపరువేంగాను? ఈ సంగతి అనుకున్నప్పుడల్లా నా మనస్సు కలవరపడుతుంది. అప్పుడు శ్రీ కృష్ణ పెళ్ళి వూరేగింపులో వాడిచ్చిన వదులుగా వున్న సూటులో కార్టూన్‌లా నడుస్తున్న నారూపం జ్ఞప్తికివచ్చి నాలో నేనే పాతాళంలోకి క్రుంగిపోతూ వుంటాను. ★



# విజ్ఞానవీధుల్లో...

అగాధమైన సముద్రం మధ్యాహ్న సమయం ప్రచండభానుని వాడికిరణాలు సముద్రంలో ప్రతిఫలిస్తున్నాయి ఆసముద్రంలో ఒక ఎత్తయిన ప్లాటుఫారముంది దానిమీద 32 మంది పనివాళ్ళున్నారు వాళ్ళలో కొంతమంది నిద్రావస్థలో వున్నారు ఉన్నట్లుండి వారున్న ప్లాటుఫారము ఒక ప్రక్కకు వొరిగిపోసాగింది ఇంకేముంది? ఒకటే హడావుడి! ఒకటే గందరగోళం! కొందరు చెక్క తెప్పల సాయంతో బయటపడ్డారు కొందరు గబగబా ప్లాటుఫారము పైభాగానికి ఎగబ్రాక సాగారు ఇంతలో ఒక ఓడ అటుగా వచ్చింది దాని సాయంతో కొందరు బతికి బయటపడ్డారు అయినా కొందరి జీవితాలు సాగరగర్భంలో సమసిపోయాయి

ఇది కలితకల్పన కాదు, ఘటితసంఘటన 1965 డిసెంబరు 27 మధ్యాహ్నం బ్రిటను దేశంలోని ఉత్తర సముద్రంలో జరిగిందీ సంఘటన తైల పరిశోధన నిమిత్తము 'సీ జెం' అనే ఆయిల్ రిగ్ జరిపిన ప్రయత్నం విఫలమయి నప్పటి సంగతిది.

ఆధునిక విజ్ఞాన ప్రగతిని ఆసరాగా చేసుకుని జరుగుతున్న ప్రయోజకరమైన ప్రయత్నాలలో 'ఆయిల్ ఎక్స్‌ప్లొరేషన్' ఒకటి – అంటే సముద్రగర్భంలో దాక్కునివున్న ఆయిలును వెలికి దీయడమన్నమాట బొగ్గు తరువాత పారిశ్రామిక శక్తికి ముఖ్యమయిన మూలపదార్థం ఆయిలు సర్వసాధారణంగా ఇది తన నేస్తం నేచురల్ గ్యాసుతో కలిసి వుంటుంది సముద్రంలోంచి బయటకు తీసుకొచ్చిం తర్వాత యిది అనేకరకాల ఇంధనతైలాలు, చమురుపదార్థాలు, ద్రావణులు వగైరా వగైరా ప్రసాదిస్తుంది ఇలా సముద్రంలో లభ్యమయ్యే ముతక పెట్రోలు రకరకాల ఆకారాలు, వికారాలు కలిగివుంటుంది

నిజానికి తైలాలకు, నేచురల్ గ్యాసుకు మూలస్థానం ఒకటే వృక్షజాలం క్షీణించి బొగ్గు ఏర్పడినట్లే సముద్రంలోని జీవరాశి క్షీణించి, లెక్కలేనన్ని సంవత్సరాలపాటు బురద పొరలక్రింద పూడుకుపోయి వుండటంతో ఆయిలు, నేచురల్ గ్యాసు ఏర్పడతాయి సముద్రంలోని బాక్టీరియా, ఆల్గే, మొలస్కాలు, ఎఖినోడర్ములు, వర్టిబ్రేటులు – మున్నగు వాటినుండి ఇవి వుద్భవిస్తాయి తైలోత్పత్తిక్రియ దాదాపు 400 మిలియన్ల సంవత్సరాలక్రితం ఆరంభమయింది చమురుతో నిండిన పెద్ద మొత్తాలు సాగరగర్భాలలో అభేద్యమయిన పాషాణాలతో కప్పబడి వుంటాయి

ఇలా సాగరగర్భంలో రహస్యంగా దాక్కునివున్న ఆయిలును, గ్యాసును వెలికితీసే పద్ధతిని 'డ్రిల్లింగ్' అంటారు ఇది రెండురకాలు కేబుల్ టూల్ సిస్టం,

'ఆలపాటి'

రోటరీ సిస్టం సముద్రంలో ఆయిలుందని అంచనా వేసుకున్నచోట మొదట ఒక ప్లాటుఫారాన్ని ఏర్పాటుచేస్తారు దాని కాళ్ళు సముద్రతలానికి పైగా గాలిలో వుంటాయి పెద్దపెద్ద జాకీల సాయంతో ఆ ప్లాటుఫారం కాళ్ళు సముద్రంలో బాగా పాతుకుపోయేట్లు చేసి, ఆపైన ప్లాటుఫారాన్ని సముద్రతలానికి బాగా ఎత్తుగా వుండేట్లు చేస్తారు పిదప ఒక ఉక్కు గొట్టాన్ని సముద్రంలోనికి దించుతారు దాని వ్యాసం సుమారు 2, 3 అడుగులు వుంటుంది గొట్టం, లోనికిపోయే కొద్దీ రంధ్రం ఇరుకుగా తయారవుతుంది ఇలా తైలమున్న ప్రదేశాన్ని చేరుకునేంత వరకూ డ్రిల్లింగుచేస్తారు

ఆధునిక పద్ధతుల్ని అవలంబించి ఆయిల్ ఎక్స్‌ప్లోరేషన్ కోసం భారతదేశములో ప్రథమ ప్రయత్నం 1948 లో జరిగింది పిదప 'బర్మా ఆయిల్ కో' ఈ విషయంలో చాలాశ్రద్ధ తీసుకుంది 1953 డిశంబరులో భారతప్రభుత్వం, 'స్టాండర్డ్ వాక్యూమ్ ఆయిల్ కో' కలసి ఉమ్మడిగా 'ఇండో-స్టాన్వాక్' ప్రాజెక్టు నిర్మించి, పశ్చిమబెంగాలులో పరిశోధన కావించారు 1955 లో 'ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ డైరక్టరేట్' స్థాపించబడి '56 కల్లా కమీషన్‌గా రూపొందింది సోవియట్ మున్నగు విదేశాల సహాయంతో భారతీయ టెక్నీషియన్లకు తగిన శిక్షణ యివ్వబడింది 1959 నవంబరులో విదేశీయ కంపెనీలను భారతదేశంలో జరుగుతున్న అన్వేషణలో చేరమని ఆహ్వానించడం జరిగింది

భారతదేశంలో దాదాపు 400,000 చదరపు మైళ్ళ విస్తీర్ణంగల ప్రాంతములో ఆయిలు లభించవచ్చునని అభిజ్ఞవర్గాల అంచనా భారతదేశంలో మొదటి సారి రైలుమార్గాలు వేసే సందర్భంగా 'అస్సాము'లోని 'డిగ్‌బాయి' ప్రాంతంలో

ఆయిలుదొరికే ఛాయలు పొడసూపాయి. ఫలితంగా ఆ ప్రాంతంలో జరిపిన కృషి 1944 కల్లా రోజుకు 5,600 పీపాల ఆయిలు లభించేందుకు దోహదం చేసింది. అంతేకాక రాజస్థాన్, కచ్, గంగా మైదానం, ఆంధ్ర, మదరాసు తీరాలు-మున్నగు ప్రాంతాలలోగూడా ఆయిలు వనరులు వున్నట్లు తెలుస్తుంది

ప్రస్తుతం ఈ రంగంలో 3 సంస్థలు బాగా కృషిచేస్తున్నాయి 'ది అస్సాం ఆయిల్ కో', 'ది ఆయిల్ ఇండియా లిమిటెడ్', 'ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కమీషన్', ఇటీవల బొంబాయి సమీపాన అరేబియా సముద్రంలో 15 కోట్ల ఖర్చుతో 'సాగరసమ్రాట్' నిర్మించబడింది దానివల్ల చాలా సత్ఫలితాలను ఆశించవచ్చు. అక్కడ లభించిన ఆయిలు మేలిరకమయినదని చెప్పుకుంటున్నారు కనుక దానివల్ల ఎంతో ప్రయోజనముండొచ్చు అమెరికా శాస్త్రజ్ఞులు గతమాసం ఒరిస్సా ప్రాంతంలో బంగాళఖాతంలో పరిశోధనలు జరిపారు

ఈ అంచనాలన్నీ సక్రమంగా రూపుదిద్దుకొని, సాధ్యపడితే భారతదేశానికి కావలసినంత ఆయిలు లభిస్తుంది. ఆధునిక ప్రపంచంలో ఆయిలు లేనిదే అడుగడుగునా ఆటంకాలే ఎదురవుతున్నాయి కనుక మన శాస్త్రజ్ఞుల నిరంతరకృషి తప్పక ఫలిస్తుందనీ, పరిశ్రమ లన్నిటికీ వెన్నెముకలాంటిదయిన ఆయిలును ప్రసాదించి, ప్రస్తుతం మనకున్న సమస్యల్ని తీరుస్తుందని ఆశిద్దాం. ★

# ఈ దేశంలో నేనో ఆడపిల్లను

''అమ్మాయిలు కావాలా సార్?'' సంతలో కూరగాయల నమ్మినంత తేలిగ్గా అడిగాడు రిక్షావాడు, రిక్షా స్లో చేస్తూ.

''ఏ రకం?'' ఉత్సుకతతో ప్రశ్నించాడు రాంబాబు.

''ఇవాళ మామూలు సరుకేసార్. రేపయితే కాలేజీ అమ్మాయిలు దొరుకుతారు. రేపటివరకు ఉంటారా?''

''ఉంటాం. రేపు విశేష మేమిటో?'' రిక్షాలో కూర్చొని 'ఫుట్‌పాత్' మీద కనిపిస్తున్న పచ్చదనం కేసి పచ్చిగా చూస్తున్నాడు రాంబాబు.

''మీకు తెలీనట్టడుగుతారేటి సార్? ప్రతి శనోరం ఉమెన్స్ కాలేజి ఆస్టలాడపిల్లలు లాడ్జిల్లో దొరుకుతారనే మీలాంటి స్టూడెంట్సు దూరాన్నుంచి పనిగట్టుకొస్తారు'' మెయిన్‌రోడ్ నుంచి రిక్షాను పక్క వీధి పట్టించాడు.

''ఐ కాంట్ బిలీవ్'' అన్నాడు అంత వరకు మౌనంగా వింటున్న మురళీ రాంబాబు కేసి తిరిగి, రిక్షావాడికి తమ విషయాలు తెలీడం ఇష్టం లేక

''నిజం సార్ నేను మోసం చేసినా ఆళ్ళతో మాట్లాడితే మీకు తెలీదా?'' నవ్వుతున్నాడు రిక్షావాడు.

''నువ్వు చదువుకున్నావా?'' గతుక్కుమన్నాడు మురళీ.

''సెకండ్ ఫారం సదివానండి ఆ తర్వాత మీ స్టూడెంట్స్ మద్దిన మసలడం వల్ల ఇంగ్లీసు అర్థమవుద్దండి. మీరేటి సదువుతున్నారు సార్?''

''చదువయిపోయింది. మేమిద్దరం లెక్చరర్లుగా పన్చేస్తున్నాం.'' రాంబాబుకు అబద్ధం చెప్పాల్సిన అగత్యం కనిపించ లేదు

''నేను మొదట్లో యూనివర్శిటీ స్టూడెంట్సనుకున్నా. కొత్తగా ఉద్యోగంలో సేరారా సార్?''

''ఆఁ–రెండేళ్ళయింది'' వాడితో సాధ్యమైనంత తక్కువగా మాట్లాడ్డం మంచిదని మురళీ అభిప్రాయం

''మీలాంటోళ్ళంటే ఇక్కడమ్మాయిలు బాగా లైక్ సేస్తారు. ఉద్యోగస్తులకీ స్టూడెంట్లకే కాని అందరికీ ఒప్పుకోరు సార్.''

''ఈ కాలేజీ వాళ్ళంతా ఈ రకమేనా?'' అనుమానం తీరడం లేదు మురళికి.

---

పైడిపాల



''అంతా ఎందుకుంటార్లెండి. కొంత మంది ఈ రకం ఉంటారు. ఒకళ్ళను చూసి ఒకళ్లు నేర్చుకుంటా రండి ''

''ఇంతకు ముందు లేడీస్ హాస్టల్ లో అక్కడక్కడ ఇలాంటివి జరుగుతాయని విన్నాను. కాని అవన్నీ అబ్బాయిలు బులబాటంకొద్దీ ఎక్జాజరేట్ చేసి చెప్పేవనుకున్నా. అవి నిజమేనని ఇప్పుడు నమ్మాల్సొస్తోంది.'' మురళి అంతరాత్మ ఓ పట్టాన ఈ దారుణాన్ని నమ్మడం లేదు.

''మీకు కొత్తలా వుంది. పెళ్ళయిందా సార్?'' అదోలా నవ్వాడు రిక్షావాడు.

''లేదింకా'' ఈ సందర్భంలో అదో డిస్క్వాలిఫికేషన్‌లా ఫీలయ్యాడు మురళి.

''అయితే మీకు అనుభవమున్న పిట్టనే వెదకాలి.''

''ఉహూ ...నాకు '' కంగారు పడు తున్నాడు మురళి

''ఆ ...వచ్చేశాం, దిగండి'' రిక్షా ఆగింది. ఎదురుగా పెద్ద పెద్ద అక్షరాలతో బోర్డు - హోటల్ 'పేరడైజ్'- బోర్డింగ్ అండ్ లాడ్జింగ్.

రిక్షావాడు సూట్ కేస్, ఎయిర్‌బాగ్— రెండు చేతుల్లోకి తీసుకొని కౌంటర్ దగ్గ

రకు దారి తీశాడు.

ముందు నడుస్తున్న రాంబాబు, కౌంటర్ దగ్గర ఆగి పర్స్ తీస్తూ రిక్షావాడి కేసి చూశాడు

"వారికి డబుల్ రూమ్ కావాల్టండి రేపటికి ప్రక్క రూం కూడా కావాల్టండి" రిక్షావాడు ప్రొప్రయిటర్ వైపు చూసి కన్ను గీటాడు.

రాంబాబు డబ్బిస్తున్నాడు. మురళి అభ్యంతరంగా చూస్తున్నాడు.

"రూమ్ నెంబర్ సిక్స్‌టీన్. మీకు కన్వీనియంట్‌గా వుంటుంది." అడ్వాన్స్ తీసుకొంటూ బాయ్‌ని పిల్చి తాళాలిచ్చాడు ప్రొప్రయిటర్.

రూమ్ తెరిచేటప్పటికి ఇరవై రూపాయలకు దండగ కాదనిపించింది. లగేజ్ టేబుల్ దగ్గిర పెట్టి నిల్చున్నాడు రిక్షావాడు. ఫోమ్‌బెడ్ మీద చతికల బడ్డారు మిత్రులిద్దరూ.

"రిజర్వేషన్‌లో రూమెందుకు? నాకిష్టం లేదు" మురళిలో అయిష్టం కంటె భయం ఎక్కువగా కనిపించింది రిక్షావాడికి.

"భయపడుతున్నట్టున్నారు. రైడింగులేం జరగవిక్కడ. ఆ పూచీ నాది"

"అద్సరే కాని కాలేజీ అమ్మాయిల పేరుతో 'నాటు' తీసుకొచ్చి చిలక పలుకులు పలికిస్తే మాత్రం ఊరుకొనేది లేదు. ఇలా చెట్టు పేరు చెప్పి కాయలమ్మే వ్యాపారం చాలా చోట్ల చూశాను. మంచి సరుకు పట్రా. రేటెంతైనా ఫర్వాలేదు రేపటికి ఇద్దర్ని-ఫస్ట్‌క్లాస్‌గా ఉండాలి మరి" తాను అనుభవజ్ఞుడనని, రికావాడి టోకరాలో పడేవాణ్ని కానని వాడికి తెలియాలని రాంబాబు అభిప్రాయం.

"మీ యిష్టమొచ్చినట్టుంటారు. మరి మనిషికో వందైనా "

"ఆల్రైట్." రాంబాబు దృష్టిలో ఆ మొత్తం ఓ లెక్కలోది కాదు.

"అన్నట్టు ఆళ్ళతో కొన్ని షరతులున్నాయండోయ్. ఎమ్మిదింటి కొచ్చి పదికల్లా యెలిపోతారు. పైగా మొకాలు గుర్తుపడితే గుట్టు రచ్చకెక్కుతుందని లైటుండడాని కొప్పకోరండి "

"సర్లే" అన్నాడు రాంబాబు-ఇలాంటివి కొత్త కాదన్నట్టు. చదువుకొనే రోజుల్లో తెలుగు మాష్టారు చెప్పిన మాయాప్రవరుడు వరూధినికి విధించిన షరతులు గుర్తొచ్చాయి-మురళికి.

రిక్షా కూలి చేతిలో పెట్టాడు రాంబాబు.

"మరి ఈ రాత్రికి ...." నసిగాడు రిక్షావాడు

"అక్కర్లేదు. వేరే పనుంది " సిగరెట్టు తీసి వెలిగిస్తున్నాడు రాంబాబు రిక్షావాడు వెళ్ళిపోయాడు.

"ఏవిట్రా అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్." తిరుగుతున్న ఫాన్‌కేసి అదే పనిగా చూస్తూన్న మురళిని కదలేశాడు

"రిక్షావాడి గురించి. మన రచయితలందరూ కథల్లో రిక్షావాళ్ళను గొప్ప నిజాయితీ పరులుగా చిత్రించి ఓ పేజీ జాలైనా ఒలకబోస్తారు. నిజ జీవితంలో వాడి పాత్ర ఇలా వుందే అని?"

"చిట్టి తండ్రి. రిక్షావాళ్ళంతా వీడిలా ఉండరు. కాలేజీ అమ్మాయిలంతా ఈ

వూరు ఉమెన్స్ కాలేజి హాస్టలాడ పిల్లల్లా ఉండరు. లెక్చరర్సంతా మనలా వుండరు. ఒకటి మాత్రం నిజం వాడు తీసుకొచ్చే కేసులు మాత్రం జెన్యూనే వాడి మాటలు వింటుంటే కాలేజీ వాతావరణం బాగా తెలిసిన వాడిలా ఉన్నాడు. బస్‌స్టాండ్‌లో మనలాంటి వాళ్ళను పట్టడమే వీడి బిజినెస్''

''నువ్వెన్ని చెప్పు పాతికేళ్ళు నిఖార్సైన బ్రహ్మచారిగా వుండి రేపో మాపో పెళ్ళి చేసుకోబోతూ ఇప్పుడు కక్కుర్తి పడ్డం నా కిష్టంలేదు. నన్నొదిలిపెట్టు లేక పోతే ఆ అమ్మాయితో కాసేపు మాట్లాడి.''

"ఏం? ప్రవరాఖ్యుడిలా ఉపదేశాలు కాని చేస్తావేమిటి? ఇలాంటి వెర్రిమొర్రి వేషాలెయ్యక నేను చెప్పినట్టు బుద్ధిగా విను ఈ ఛాన్సు మళ్ళీ రమ్మంటేరాదు ఫస్ట్‌కేస్ ఇలాంటిది దొరకడం నీ అదృష్టం'' యాష్ ట్రేలో సిగరెట్టు పడేస్తూ కుడిచేత్తో మురళి చేతిని మృదువుగా నొక్కాడు రాంబాబు.

మురళి మాట్లాడలేదు

''లే తొందరగా స్నానంచేసి డ్రెస్ చేసుకో. లేటయితే గురువుగారు అవుటాఫ్ మూడ్స్‌లో ఉంటారు'' రాంబాబు ఇన్ షర్ట్ తీసేస్తున్నాడు

''ముందు నువ్వు కానియ్.''

రాంబాబు బాత్రూమ్ తలుపు తెరిచాడు. మురళి లేచి కిటికీ దగ్గర నిల్చుని బయటకు చూస్తున్నాడు. చీకటిలో మెరుస్తున్న రంగు రంగుల దీపాలతో వింత వింత శబ్దాలతో నగరం సర్కస్ గుడారంలా కనిపించింది.

* * *

''నమస్కారం మాష్టారూ!''

''ఏం మహానుభావా. ఇన్నాళ్లకు గుర్తొచ్చామా? రా. లోపలకు రా''

''ఇతను మురళి అని కెమిస్ట్రీ లెక్చరర్. ఈయన రాందాసుగారు. మా మాష్టారు''

''గ్లాడ్ టు సీ యు'' షేక్ హాండ్‌తో రిసీవ్ చేసుకున్నాడు రాందాసు.

''ఎవిటి విశేషాలు? ఇంకా అక్కడే పన్చేస్తున్నావా?'' రామదాసు రాంబాబు ఎమ్మే చదివే రోజుల్లో దగ్గరయిన యూనివర్శిటీ లెక్చరర్.


''ప్రస్తుతాని కక్కడే, మరో మంచి కాలేజి ఏదైనా చూసుకొని మారిపోదామనుకుంటున్నా. కాలేజి పాలిటిక్స్ మరీ అసహ్యంగా తయారయ్యాయి.''

''ఈ రోజుల్లో అవి లేని దెక్కడ? ఒకో కమిటీ కాలేజి ఒకో కులానిది దూరపు కొండలు నునుపంతే. ఎలాగో సర్దుకుపోవడం మంచిది''

''మీకు తెలీదు మా కాలేజి కంటె పందుల దొడ్డి నయం. కులాలూ, శాఖలూ- ఈ రొంపిలోపడి కొట్టుకు చస్తున్నారు జనం. లెక్చరర్సే కుర్రాళ్ళతో చేతులు కలిపి అవతలి వర్గంమీద వుసిగొల్పే కాలేజిలో పాఠాలు చెప్పడం ఎంత కష్టమో మీరే ఊహించండి.''

''కొత్త గనుక మరింత ఆవేశపడుతున్నారు అలవాటుపడితే ఇంత 'బాధ' అనిపించదు. తొందరపడి ఉద్యోగాలు మాత్రం వదులుకోకండి.''

''ప్రిన్సిపాల్ నుంచి మొదటి సారి




'మెమో' అందుకున్నప్పుడు అంతపనీ చెయ్యబోయాడు మురళి. నేను నచ్చజెప్పిన తర్వాత 'రిజిగ్నేషన్ లెటర్' చించేశాడు!'' నవ్వుతున్నాడు రాంబాబు.

''అంతా బావున్నారా? పిల్లలెంత మంది?'' కావాలని టాపిక్ మార్చాడు రామదాసు.

''పాప మీకు తెలుసుగా. ఆ తర్వాత కూడా ఆడపిల్లే. ఏడాదయింది. ఆపరేషన్ చేయించేశాను. అంతకంటె అయితే ఈ రోజుల్లో కష్టం మాష్టారూ.''

''నీ కేవయ్యా. బంగారపు పిచ్చికవి. దులిపితే కనకవర్షం కురిపించే కల్పతరువు లాంటి మావగారున్నాడు. ఆ! - ఇంతకీ వచ్చినపని చెప్పావు కాదు.''

''ముఖ్యంగా మిమ్మల్ని చూడాలని పోతే దేశంమీద పడి వెకేషన్ని సద్వినియోగం చేదామని టూర్స్ రూమ్కి వెళ్దామా?''

రూమ్ అనేటప్పటికి రాందాసుకి నోరూరింది. టాక్సీలో ముగ్గురూ పేరడైజ్ చేరుకున్నారు

కాలింగ్ బెల్ మోగింది బాయ్ నిల్చున్నాడు - వినయంగా రెండుచేతులు కట్టుకొని.

'మాష్టారూ !' ఏం కావాలో చెప్పండి అన్నట్టు చూశాడు రాంబాబు. రామదాసు మురళికేసి అభ్యంతరంగా చూసిన చూపుకి ఫర్వాలేదన్నట్టు రాంబాబు నుంచి సమాధానం వచ్చింది.

క్షణాల్లో స్కాచ్ విస్కీ బాటిల్, సోడాలు, కేష్యూనట్స్ తీసుకొచ్చి వెళ్ళిపోయాడు బాయ్.

రెండుగ్లాసుల్లో పోసి మూడోదాన్ని కూడా నింపబోయాడు రామదాసు!

''సారీ సర్ నా కలవాటు లేదు''

అలా చెప్పడానికి మురళి సిగ్గుపడు తున్నాడు.

''అలవాటు అలవాటు చేసుకొంటే గాని ఎలా అవుద్ది. మై డియర్ గుడ్ బాయ్–హేవిట్'' బలవంతంగా చేతిలో పెట్టాడు రాందాసు

''మా వాడు మరీ చద్దన్నం - గ్లాసు మజ్జిగ మార్కు మనిషి'' నవ్వాడు రాంబాబు.

''ఛీర్స్ '' మరేం చెప్పుకోడానికీ మురళికి అవకాశమివ్వలేదు. మురళి బ్రతి మాలుకొని మొదటి రౌండ్ లో ఆగి పోయాడు. మధ్యలో జోక్స్ నవ్వులు తుళ్ళులు సెకండ్ రౌండ్ తర్వాత రాంబాబు చెప్పాడు.

''మా తోడల్లుడి పేపరు మీ దగ్గరికి థర్డ్ వేల్యూయేషన్ కొచ్చింది. ఇంటర్నల్ 56 వేస్తే, ఎక్స్టర్నల్ 26 వేశాడట ఈ పేపర్ మీరో చూపు చూస్తే ఫస్టుక్లాస్ లో పడతాడు, మిగతావి అతడే మేనేజ్ చేసుకున్నాడు, నెంబరు ''

నోట్ చేసుకున్నాడు రాందాసు

''ఎన్ని వెయ్యమంటావు బాయ్ 126 వెయ్యనా? యూనివర్శిటీ ఫస్టవుద్ది?'' మళ్లీ గ్లాసులు నింపుతున్నాడు రామదాసు.

''టొటాఫ్?-'' ఉత్సుకతతో అడిగాడు మురళి.

''వన్ ఫిఫ్టీ ' రాంబాబు నవ్వాడు,

''ఈజిట్ పాజిబుల్?'' కళ్లు పెద్దవి చేశాడు మురళి. వాటీజ్ ''ఇంపాసిబుల్'' ప్రొఫెసర్ రాందాసు నమః గదిలో ప్రతి మురళికి నిల్చున్న నేల గిర్రున తిరుగుతున్నట్టనిపించింది.

* * *

మర్నాటి మధ్యాహ్నంవరకు మురళి జీవితంలో దిద్దుకోలేని పొరపాటు చేసినట్టు కుమిలిపోయాడు.

''సిల్లీ! ఎందుకంత బాధపడ్తావు. మందు కొట్టడం పాపమా?'' రాంబాబు సమాధానపర్చడానికి ప్రయత్నిస్తున్నాడు.

''ఇంతవరకు జీవితంలో రుచిచూడనివి రెండేరెండు. ఒకటి మందు. రెండు మగువ. ఎలాగూ ఒకదానికి దిగజారాను గనుక రెండోదికూడా చూసేస్తాను ''

''వెరీ గుడ్. సాహసం చెయ్యరా డింభకా .''

''కాని రాధకి అన్యాయం చేస్తున్నానని ఓ మూల ''

''రాధ .నీ వుడ్ బి కదూ, ఆ మాట కొస్తే అన్యాయం చెయ్యకుండా ఉండడానికే ఇది. డోంట్ బి సెంటిమెంటల్''

తలూపాడు మురళి

* * *

లైటు ఆరిపోయింది. బెస్టాఫ్ లక్ చెప్పి రాంబాబు సెవంటీన్ లోకి వెళ్ళిపోయాడు.

చీకటిలో మెరుపు తీగలాంటి ఆకారం వచ్చి గుమ్మం దగ్గర నిలబడింది. 'వెళ్లు' ఎవరో తోస్తున్నారామెను.

''మే ఐ కమిన్?'' ఆ గొంతు టీనేజ్ ఆడపిల్లది.

''విత్ ప్లెజర్'' డోర్ లాక్ చేసి ఆమె నడుము మీద చెయ్యి వేసి మంచం వరకు

తేనె మనసు (లూ)-దేవదాసూ కృష్ణకు
హైలైట్స్
పని నీవంతు-ఫలితం నావంతూ అని
చెప్పే అతగాడివే రియల్ గట్స్
బాండ్ సైపు వేషాలు బయటపెట్టాయి
ట్యాలెంట్స్
వాటితోనే పెరిగిపోయారు అతనికి
ఫేవరెట్స్.



---

''కిటికీలోంచి పడుతున్న వెలుగు చారలో ఆమెను గుర్తించడానికి ప్రయత్నిస్తున్నాడు మురళి. స్పష్టంగా రూపు రేఖలు కనిపించక పోయినా ఆమె అందాన్ని చీకటి దాచలేక పోతోంది

చెక్కిలి నిమురుతూ ''పేరు...?'' అన్నాడు.

''మైథిలి'' కాలేజి అమ్మాయి కాని అంత స్టయిల్‌గా ఉచ్చరించ లేదు.

''ఏం చదు వు తున్నావ్?'' నరాల్లో విద్యుత్తు ప్రసరిస్తోంది. గొంతు వణుకుతోంది.

''సెకండ్ బి. ఏ'' పల్చని పెదవులు కదిలాయి మధ్య పలువరస మెరిసింది. అతని నిగ్రహం సడలింది. రెండు చేతుల్తో బలంగా ఆమెను హృదయానికి హత్తుకొని పెదవుల్ని చుంబించాడు

* * *

''నీ పేరేవిటన్నావ్?'' మెడమీద ముద్దుల వర్షం కురిపిస్తూ అడిగాడు రాం

''కళారాణి'' తియ్యగా మూలిగినట్టుంది దాస్వరం.

''బాగా ఉన్నదానిలా కనిపిస్తున్నావ్?'' మెళ్లో ఖరీదైన లాకెట్ చీకట్లో మెరుస్తోంది

''మా డాడీ లాండ్‌లార్డ్‌రాం'' అతని ఉంగరాల జుట్టును చేత్తో సవరిస్తోంది రాణి,

''మరింకా ఎందుకీ వృత్తి?''

''వృత్తికాదు—సరదా''

''ఈజిట్?'' ఆశ్చర్యపోయాడు రాంబాబు.

''యా!—నీలాగే నలుగుర్ని చూడాలని '' కౌగిలి మరింత బిగిసింది

* * *

చీకట్లో వెక్కిళ్లు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

''మైథిలీ ఏడుస్తున్నావా? కన్నీళ్లు చేత్తో తుడుస్తూ అడిగాడు మురళి ''ఇదే మొదటిసారా?''

"దానికేముంది?—నాక్కూడా ఇదే మొదటి అనుభవం ఎప్పుడూ తప్పుపని చెయ్యనివాణ్ణి పరిస్థితులకు బానిసనయ్యాను అయినా నాకేం ఫర్వాలేదు మగవాణ్ణి. నువ్విలా ఎందుకు దిగజారావ్? పైగా చదువుకున్న దానివి!"

"దిగజారడానికి చదువడ్డురాదు. నేను చదువుకుంటున్న దాన్ని. మీరు చదువు చెప్తున్నవారు కూడా " మురళి షాక్ తిన్నాడు.

"చదువుకున్న నేరమే నాచేత ఈపాపం చేయించింది చదువు ఈరోజుల్లో డిస్క్వాలిఫికేషన్ చదువుకున్న ఆడపిల్లకి అంతకంటె ఎక్కువ చదివిన వరుణ్ణి వెతకాలి. అతగాడి రేటు ఎంత తక్కువయినా లాంఛనాలు కాకుండా పదివేలు అటు చదువులకీ ఇటు కట్నాలకీ నలుగురేసి ఆడపిల్లలున్న తండ్రులు ఈ వేలన్నీ ఎక్కడ దులుపుకు రాగలరు చెప్పండి. పోనీ ఓ రెండేళ్ళు ఉద్యోగం చేయించి పెళ్ళి చేద్దామంటే ఉద్యోగినికి పెళ్ళవడం దీనికి రెండింతలు కష్టం ఈ పరిస్థితుల్లో చదువుకున్నఆడపిల్ల, కని పెంచిన నేరానికి తండ్రి గుండెల్లో చిచ్చుపెట్టాల్సిందేనా?"

"మీ బాధ నా కర్థమయ్యింది. అభ్యంతరం లేకపోతే మీ కథ వినాలనుంది "

"మానాన్న హైస్కూలు టీచరు. జీతమే కాని గీతంలేని ఉద్యోగం, సంతానం నలుగురూ ఆడపిల్లలమే పెద్దవాళ్లిద్దరికి చదువులకీ కట్నాలకీ ఉన్న రెండెకరాలకొంప్ర సరిపోయింది అతికష్టం మీద నన్నెలాగో ఈ డిగ్రీ చదివిస్తున్నాడు. ఈలోగా పెళ్ళి చెయ్యాలని అమ్మ పోరు. సంబంధాలకోసం కాళ్ళరిగేలా తిరిగేడు మా కట్నం సరిపోక అనేక సంబంధాలు తప్పిపోయాయి. చివరకు ఓ కాలేజ్ లెక్చరర్ సంబంధం ఖాయమయింది. కాని వాళ్ల పెద్దలు మానాన్న ఇవ్వడానికి సిద్ధపడిన పదివేలూ కాక మరో అయిదైనా ఇస్తేకాని లాభంలేదని చెప్పేశారు ఆయనో అభినవ శ్రీరామచంద్రుడు నాకంటె మా నాన్నకి బాగా నచ్చాడు ఆ సంబంధం ఎలాగైనా చెయ్యాలని ఆశ కాని తాహతు లేదు. ఎలాగో తల తాకట్టుపెట్టి కట్నమివ్వడానికి నానాయాతనలు పడుతున్నాడు. నా కక్కరలేదని చెప్పినా విన్లేదు. కాని ఎక్కడా అప్పు పుట్టలేదు. తొందరగా ఏమాటా చెప్పమని అవతలనుంచి కబుర్లు. నాన్న బెంగతో మంచంపట్టాడు. ఇవతల కాలేజీ ఫీజులూ, పుస్తకాలు, హాస్టల్‌బిల్స్ సంవత్సరానికో రెండువేలన్నా కావాలి."

"అయితే కేవలం డబ్బుకోసమే ఈ వృత్తి లోకిదిగావన్నమాట?"

"లేకపోతే మీలా ఒళ్ళు కొవ్వెక్కి అనుకుంటున్నారా? ఈ కాలేజీ హాస్టల్లో ఓ అంటురోగం ఉంది. అది ఎలా వ్యాపించిందో తెలీదు కాని సగంమంది పైగా ప్రతిశనివారం లాడ్జిల కెగబడి డబ్బు సంపాదించుకొని ఫాషన్లకీ సరదాలకీ ఖర్చు పెడుతూ విలాసంగా జీవిస్తారు. అందరూ కేవలం డబ్బుకోసమేకాదు. ఉన్నవాళ్ళు కూడా సరదాకోసం వస్తారు. ఇక్కడ దాన్ని తప్పుగా భావించనంతగా ఈరోగం ప్రబలిపోయింది. నాసమస్యనిపరిష్కరించుకోడానికి ఇదో సాధనం కనిపించింది. నెల్లాళ్ళుగా ఆలోచించి చివరకు అందరి కోరిక తీరడానికి ఈ రోజు నేనీ నిర్ణయానికొచ్చాను. ప్రభుత్వం స్కాలర్‌షిప్

ఇస్తుందనీ. ఇక నాకు డబ్బు పంపించ నక్కరలేదనీ ఉదయం ఇంటికో ఉత్తరం రాసి పడేశాను. ఆ తర్వాత ఏ లాటరీ వచ్చిందనో ! డబ్బు సంపాదించడానికి చాలా మార్గాలున్నా నాకందుబాటులో వున్న ఈ మార్గా నెన్నుకున్నా

కాబోయే భర్తకి ఇది ద్రోహం అను కోవడం లేదు నేను. మహా పతివ్రత అన సూయ భర్త గౌరవాన్ని నిలపడం కోసం త్రిమూర్తులను పసి పాపల్ని చేసి తాను వివస్త్ర అయింది. సుమతి కామాంధుడైన భర్త వాంఛ తీర్చడం కోసం వేశ్య ఇంటికి మోసుకెళ్ళింది. సీత జనాపవాదానికి భయ పడిన రాముడి కోసం అగ్ని ప్రవేశం చేసింది వాళ్లు పుట్టిన పుణ్య భూమిలోనే నేనూ పుట్టాను. అంచేత నా కాబోయే



భర్త ప్రియమైన మొదటి కోరిక పదిహేను వేల రూపాయలు సమకూర్చడం కోసం శక్తి మేరకు ప్రయత్నిస్తున్నా మరి నేను కూడా ''

''మైథిలీ ప్లీజ్. మరేం చెప్పకు'' అతని గొంతు గాద్గదిక మయ్యింది.

''మీకేమైనా జ్ఞాపకం తెచ్చి బాధ పెడితే నన్ను క్షమించండి ''

అతని ఆలోచనలు అతన్ని తవ్వు తున్నాయి.

''మైథిలీ, నేను కూడా మీ హీరో కోవకి చెందిన దౌర్భాగ్యుణ్నే! ఉద్యో గంలో ప్రవేశించింది మొదలు అనేక సంబంధాలు వచ్చాయి. కాని చదువుకొన్న అమ్మాయిని కాని చేసుకోనన్నాను. కట్నం ప్రధానం కాదన్నాను. చదువుకున్న పిల్ల యితే నా రేటు తగ్గుతుందని నాన్న బెంగ నేను గట్టి పట్టు పట్టడంతో చదువుకున్న అమ్మాయిల వేట ప్రారంభించాడు. సంతలో దూళ్ళబేరం చేసినట్టు అందర్నీ చూసి ఇంటర్వ్యూలో ప్రశ్నల వర్షం కురి పించే సరదా నాకు లేదు. వచ్చిన వాటిలో వివరాలను బట్టి కృష్ణ నగరం సంబంధం నచ్చింది ఆయన కూడా మీ నాన్నగారిలా టీచరే. ఆ అమ్మాయి పేరు రాధ ''

''మీ పేరు మురళీమోహన్, కదూ?'' ఆమె గొంతు తడబడింది

''అయితే నువ్వు '' ఎక్స్‌రే చూపు లతో ఆమె మొహంలోకి చూస్తున్నాడు

''రాధని, మైథిలిని, మరో మాధవిని. పేరేదయితేనేం-ఈ దేశంలో నేనో చదువు కున్న ఆడపిల్లని మన్నించండి!'' బయటి చీకట్లోకి రివ్వున బాణంలా దూసుకు పోయింది!

★

# సరాగమాల పోటీ 25

## రూ. 1890-00 బహుమతులు

నిబంధనలు తు. చ. తప్పక వ్రాయాలి

| | |
|---|---|
| పణి మాదవీ కంబైన్స్ | 'దొరబాబు' |
| సత్యా ఎంటర్ ప్రైజెస్ | 'ఆడపిల్లల తండ్రి' |
| శ్రీవాణీ ఆర్ట్ కంబైన్స్ | 'పుట్టింటి గౌరవం' |

ఒక్కొక్క చిత్రానికి, ఒక నగదు బహుమతి రూ 102-00 లు, పదునొకండు తదుపరి బహుమతులు.

అందరూ అతి స్వల్ప వ్యయ ప్రయాసలతో పాల్గొనదగిన అతి సులభమయిన నిబంధనలు

1. పోస్టు కార్డుపై మీకు ఆ సినిమాలో నచ్చిన పాట ఒకటి, నచ్చని పాట ఒకటి వ్రాసి, వాటి ప్రక్కనే దానికి కారణం (రచన, వరస, వాద్యగోష్టి, పాడటం సన్నివేశం, చిత్రీకరణ, నృత్యదర్శకత్వం. సెట్ లేక ఔట్ డోర్ —ఇవే, వీటిలో ఒకటే వ్రాయాలి )
2. దాని క్రిందుగా ఆ సినిమా గురించి ఒకే వాక్యం స్లోగన్ లాంటిది వ్రాయాలి.
3. అడ్రసు వ్రాసే చోట దిగువ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయటమేగాక దానిపైన ఫలానా సినిమా పోటీ అని వ్రాయాలి. దానికి యెడమ ప్రక్క ఖాళీ జాగాలో పిన్ కోడ్ నెంబరుతో సహా మీ పూర్తి అడ్రసు, ఇంతకు ముందు గెలుపొందిన పోటీల వివరాలు వ్రాయాలి

4 ఒక కార్డులో ఒక సినిమా గురించే వ్రాయాలి.

ముగింపు తేదీ జనవరి పదిహేను. ఆ నెల 25 వ తేదీకంతా బహుమతులు (రూ. 48-00 విలువ చేయు రికార్డులు, పుస్తకాలు) రిజిస్టర్ పోస్టుద్వారా, నగదు మనియార్డరు ద్వారా విజేతల కందగలవు ఫిబ్రవరి 1975 సంచికలో విజేతల జాబితా చూడనగును


V. A. K. Ranga Rao
'Ram Mahal'
Pycrofts Gardens

# ఈ నెల విడుదలలు

ఈ నెల నిజంగా పారిడాల్ డీలర్లకు అభిమానులకు పండగ ఎన్నో విడుదలలు ఎన్నో రకాల సంగీతం కె. ఎల్ సైగల్ పాడిన అత్యంత మధురగీతాలు అది స్టీరియోలో విడుదల చేయబడినవి. 2392 071, వింటానికి అమృతం, కొంటానికి బంగారం, సోజారాజకుమారి, దోనైనా బాలమ్ ఆయే బాబుల్ మొరా యిత్యాదులు

శంకర్ (జై కిషన్) చాలారోజుల తరువాత చేసిన లోకప్రియ సంగీతం "లవ్ యిన్ బాంబే" 6405 028 లో వినవచ్చు ఆశా 'నామైలీ' అన్నా 'సైయ్యసైయ్యా' అని పిలచినా ఉండబట్టదు మనసు.

"వర్దాన్" 2392 053 లో కల్యాణ్‌జీ-ఆనంద్‌జీ ఒక అద్భుతమైన శాస్త్రీయ నృత్యగీతాన్ని మన్నాడే (ఏమన్నాడే? ఈ రికార్డు విని కొనమన్నాడే!) ద్వారా వినిపించారు. 'జమునాకేతటో' లతా పాడిన 'దేఖోదేఖో' చక్కని కైపు పిలుపు "శారద" హిందీ ప్రతి "దుల్హన్" 2392 054 సంగీతం లక్ష్మీ ప్యారే నిజానికి తెలుగు ఘాత్రకలతో సరిరాని కాని సినిమాతోబాటు చాలా భావప్రేరణగా వున్నవి ముఖ్యంగా 'ఆయేగా జరూర్ చిట్టి 'మై దుల్హాన్ తేరీ' అన్న లత పాటలు

రెండు సినిమా వరసల వాద్యగోష్టుల ఎల్ పి లు ఉప్పెనలా వచ్చి వేడి వేడి మసాలవడల్లా అమ్ముడు పోతున్నవట పాలిడార్ అమ్మకపు ప్రతినిధి శ్రీ ఆనంద రెడ్డి చెప్పిన ప్రకారం ఒకదానిలో 2392 824 వేర్వేరు సినిమాలు, వేర్వేరు వాద్యాలు పన్నెండు పాటలు, మంచి యెన్నిక. మరొకదానిలో 2392 823 "బాబీ"లో నాలుగుపాటలు, "మేరానామ్ జోకర్"లో మూడు పాటలు వాద్యం కమ్మగా వుంది.

పాకెట్‌మార్ 2392 021 ఎల్. పి. ఎప్పుడో విడుదలైనా చిత్రం విడుదల తరువాత సంగీతం రాజుకుంది, ఇందు

---

## సరాగమాల (23) 'ఇంటికోడలు' పోటీ విజేతలు

నగదు రూ 102/- కె మురళీధర్ పత్తికొండ.

తదుపరి బహుమతులు 1. ఎస్ వి సాగర్‌రావు, కరీంనగర్ 2 ఎ జనార్దనం, పార్వతీపురం. 3. జి అమర్‌నాథ్, ఆదోని. 4 డి. వెంకటరావు, విజయనగరం, 5. కె అబ్బాస్, ముక్కామల 6 కె పద్మజ, హైదరాబాదు. 7 ఎస్. ఎస్. రెడ్డి. పాటూరు, 8. కె. సుశీల, తెనాలి. 9. ఎ గోపాలకృష్ణ, అనకాపల్లి 10. కె సురేంద్ర, బందరు 11. ఎస్. వి. ఎస్. ఆచార్యులు, ఏలూరు

కో ఆనంద్ బక్షి సాహిత్యమే పైచేయి రఫీ పాడిన 'మై బడీ ముష్కిల్ మేహుం' ఆశా పాడిన 'దుష్మనీ హైయే' వింటే శృంగారరస శృంగారోహణ అంటే యేమిటో తెలుస్తుంది. పిన్నలూ జాగ్రత్త మరి! పెద్దలూ సిద్ధమకరధ్వజాలకు పూర్ణ చంద్రోదయాలకు ఇక స్వస్తి!

శాస్త్రీయ సంగీతప్రియులు గజానన్ కార్నాడ్ 64(5 600 వాయులీనంపై మిశ్ర జీలూ, సుజ కేరిస్, ఉస్తాద్ గులాం హుసేన్ ఖాన్ 2392 825 సితార్ పై నందకల్యాణ్, పీలూ వినిపించగా ఎండనైనా వెన్నెలగా భావించగలరు. ప్రఖ్యాతనర్తకుడు సుదర్శన్ ధీర్ కథక్ ఎల్. పి ద్వారా 2392 827 ఆ నృత్యంగురించి యెంతో తెలుసుకోవచ్చు మన్ హర్ పాడిన లలితగీతాలు 2392 828 (మజ్బార్ వారసులు మానస్ ముఖర్జీ సంగీతం) మృదుమధురంగా అతిలలితంగా ద్రాక్షాపాతానికి సరియైన ఉదాహరణలుగా వున్నవి

జైన్ విదికా 2392 829 గుజరాతీ భాషలో అతి పునీతమైన పరవళ్లలో భక్తి గీతాలు గచ్ ఈస్ లవ్ 2992 830 పుట్టపర్తి శ్రీ సత్య సాయిబాగారిపై వారి అమెరికన్ భక్తులు ఆంగ్లంలో పాడిన భజనలు

పాశ్చాత్య సంగీతంతో పరిచయం వున్నవారు ఎల్లాఫిట్ జెరల్డ్ డ్యూక్ ఎల్లింగ్టన్ V6-4070 చూచే పరవశించిపోతారు వింటే మూర్ఛే! అంతటి విలక్షణ లక్షణా సమన్వితమైన రికార్డులు. జాన్ విలియమ్స్ బౌంజస్ 2326 005 మరొక ప్రత్యేకమైన రికార్డు విలాస్ఖానీ తోడి అన్న హిందుస్థానీ రాగాన్ని ఆయన వాయించిన తీరు అపూర్వం తక్కిన పాశ్చాత్య సంగీతపు ఎల్ పి. లు మార్స్ గ్రెగర్ 74, 2371 434 జేమ్స్ లాస్ట్ 74 2371 444 మొదలైనవి.

పైవన్నీ ఎల్ పిలు. ఎల్. యి పిలలో చెప్పుకోదగినవి మీనాకుమారి 'బాంవ్ తన్ యీ' 2221 855, దుల్హన్ 2221 126, వర్ధాన్ 2221 125, రోటీ వాద్యగోష్టి 2221 862, రోటీ ఎస్. పి. ఒకటి 2067 200 విడుదలైనది.

ఇక కొలంబియా హెచ్. ఎం. వి. విడుదలలు సమయానికి డీలర్ల కెలా అందడం లేదో రిప్యూకని అలాగే అందటంలేదు. ఈమధ్య రానున్న వాటిలో దేవదాసు పాటలది ప్రత్యేక స్థానం

—రి కం. వై, రి. బం, రి. శ్రో. స.

# సినిమా

★ శ్రీ సుధాచిత్ర సంస్థ నిర్మించే చిత్రంలో చంద్రమోహన్, ప్రసాద్‌బాబు, జయంతి, ప్రమీల, రోజారమణి నటిస్తున్నారు. నిర్మాత ఎస్. ఎల్. జె. మనోహర్. దర్శకత్వం: కె. వి. నందనరావు.


★ 'వీడని బంధాలు' చిత్రాన్ని కృష్ణగాయ పిక్చర్స్‌వారు నిర్మిస్తున్నారు. డి. రవి నిర్మించే యీ చిత్రానికి కె. యం. రెడ్డి దర్శకుడు.

★ చంద్రమోహన్, మురళీమోహన్, రాజబాబు, ప్రభాకరరెడ్డి, అల్లు రామలింగయ్య, రాజసులోచనలు నటించే 'పెళ్ళిపందిరి' చిత్రానికి కథ, మాటలు, చిత్రానువాదం, దర్శకత్వం దాసరి నారాయణరావు. విజయ వెలాంగని పతాకం క్రింద యీ చిత్రం నిర్మిస్తున్నది తుమ్మా మార్రెడ్డి

★ కీ॥ శే॥ డా॥ రాజారావుగారి పుత్రుడు పృథ్వీరాజ్ 'శ్రీ రాజ్యలక్ష్మి చిత్ర' బానర్‌పై నిర్మించే చిత్రానికి దర్శకత్వం గిడుతూరి సూర్యం నిర్వహిస్తున్నారు. రామకృష్ణ, గిరిబాబు, అల్లు రామలింగయ్య, మొదలైనవారు నటిస్తున్నారు.

★ కిరణ్ ప్రొడక్షన్స్ రంగుల్లో నిర్మిస్తున్న 'బ్రతుకే ఒక పండుగ' చిత్రం

ఉమా మూవీస్ తొలిచిత్రం పాటలు రికార్డింగు చేసినప్పటి చిత్రం





'కృష్ణవేణి' చిత్ర శతదినోత్సవ సందర్భంలో... బహుమతి ప్రదాత శ్రీ ఎన్. టి. రామారావు, లక్ష్మీకంబైన్స్ అధినేత శ్రీ కె. జయదేవ్

లో ఆనంద్, రాధిక, చంద్రమోహన్, భవాని, శ్రీధర్, సత్యప్రియ రమాప్రభ మొదలైనవారు నటిస్తున్నారు దర్శకత్వం పి చంద్రశేఖరరెడ్డి

★ శారద, రంగనాథ్, నాగభూషణం రాజ్‌బాబు, నటిస్తున్న శ్రీ రామకృష్ణా ఆర్ట్స్‌వారి చిత్రానికి కె బాపయ్య దర్శకుడు ఎం రామకృష్ణారెడ్డి నిర్మాత.

★ నహాత ఎంటర్ ప్రైజస్ నిర్మించే సూర్యకాంతి చిత్రంలో కృష్ణంరాజు, జమున నాయకానాయికలు దర్శకత్వం బి ఎ సుబ్బారావు

★ డిశంబర్లో విడుదలకు సిద్ధమౌతున్నది శ్రీ లక్ష్మీ ప్రొడక్షన్స్‌వారి రంగుల చిత్రం 'దేవుడుచేసిన పెళ్ళి' శోభన్‌బాబు, శారద నటిస్తున్న యీ చిత్రాన్ని తాతినేని రామారావు దర్శకత్వంలో నిర్మిస్తున్నది ఎ. పూర్ణచంద్రరావు

★ ఉమాసూపీస్‌వారు నూతన తారలతో సహజ గ్రామీణ వాతావరణంలో నెల రోజుల్లో నిర్మించ తలపెట్టిన చిత్రానికి కథ కె ఈశ్వరరావు, సంభాషణలు దాసం గోపాలకృష్ణ దర్శకత్వం భీమేశ్వరరావు



నవచిత్ర ఎంటర్ ప్రైజెస్ ప్రారంభసందర్భంలో కృష్ణ, మంజుల

★ రాజ్యలక్ష్మీ కంబైన్స్ 'రాం రహీమ్' డిశంబరులో విడుదల. దర్శకత్వం బి ఎ సుబ్బారావు నిర్మాత కె ఆర్ వి ప్రసాదరావు. చంద్ర మోహన్, సత్యనారాయణ, రేలంగి, జానకి, రోజారమణి, హరికృష్ణ, బాలకృష్ణ నటిస్తున్న చిత్రమిది.


★ జమున దర్శకత్వంలో వంశీకృష్ణ ఫిలింస్ నిర్మించే 'డాక్టర్ అరుణ' చిత్రానికి కొన్ని పాటలు రికార్డు చేశారు ఎక్కువ అవుట్ డోర్ లో నిర్మించబడే చిత్రం యిది.

★ టి. మాధవరావు దర్శకత్వంలో శ్రీ కాకతీయ పిక్చర్స్ (వరంగల్లు) వారు చిల్లర దేవుళ్ళు చిత్రం నిర్మిస్తున్నారు నూతన నటుడు ఎ రామకృష్ణారావు, ఉమాభారతిలతోపాటు ప్రభాకరరెడ్డి, సావిత్రి, త్యాగరాజు కాంచన, రమాప్రభ కూడా నటిస్తున్నారు కథ, మాటలు దాశరధి రంగాచార్య యోగానంద్ ఫొటోగ్రఫీ, ఆర్ట్ చంద్ర

★ విజయకృష్ణా మూవీస్ వారు సినిమాస్కోప్ కలర్ లో నిర్మించిన దేవదాసు' డిశంబరు మొదటివారంలో విడుదలవుతుంది కృష్ణ, విజయనిర్మల, జగ్గయ్య, గుమ్మడి కాంతారావు, చంద్రమోహన్, సత్యనారాయణ ముఖ్యతారాగణం దర్శకత్వం విజయనిర్మల ★

స్వాతి నవలానుబంధం

# తొణికిన స్వప్నం



వాసిరెడ్డి సీతాదేవి

''సిస్టర్!'

''ఏం రాధా?''

''దాహం!''

గ్రేస్ రాధకు స్పూన్‌తో నీళ్ళు తాగించింది.

# 13

''రాధా! రాధా!'' గ్రేస్ వణుకుతున్న కంఠంతో గాబరాగా పిల్చింది. రాధ పలక లేదు. నాడి చూసింది గంగబా బయటికివెళ్ళి డాక్టర్ని తీసుకొచ్చింది

డాక్టరువచ్చి చూశాడు ఇంజక్షన్ ఇచ్చి ''పర్వాలేదు పది నిముషాల్లో తెలివి వస్తుంది '' అన్నాడు.

''ఆమె బ్రతుకుతుందా డాక్టర్ ''

''ఐదు కావస్తుంది ఆమె మృత్యువుతో పోరాడుతూంది. చెప్పలేను.''

''రాత్రంతా తన జీవితం గురించి చెబుతూనే వుంది డాక్టర్ ఆమెకు తన కధ పూర్తిగా వినిపించాలనే బలమైన కోరికవుంది అందుకే ఓపిక లేకపోయినా, మాట్లాడు తూనే వుంది '' అన్నది గ్రేస్

డాక్టర్ ఆశ్చర్యంగా గ్రేస్ ముఖంలోకి చూశాడు. ''ఆమెకు మెలకువ వస్తుంది. నువ్వు మళ్ళీ ఆమెను మాటల్లోకి దించు ఆరుదాటేంతవరకూ ఆమె మాట్లాడేలా చూడు. ఆ తర్వాత ఆమె మృత్యువుని జయించవచ్చు '' అన్నాడు డాక్టర్.

గ్రేస్ సంతోషంగా ''నిజమా డాక్టర్? ఆమెను మాటల్లో పెట్టేసి ఆరువరకూ బ్రతికించ గలిగితే ఆ తర్వాత ప్రమాదం లేదంటారా?'' అడిగింది.

''నాకు అలాగే అనిపిస్తోంది. వస్తాను '' అంటూ డాక్టర్ వెళ్ళిపోయాడు.

గ్రేస్ రాధ ముఖంలోకి చూస్తూ, ముంగుర్లు సవరిస్తూ కూర్చుంది.

రాధ కళ్లు తెరిచింది.

''ఎలావుంది రాధా!''

''నిద్రపోయానా సిస్టర్?''

''అవునమ్మా. పది నిముషాలు మాత్రమే ''

''టైం ఎంతయింది సిస్టర్!''

''అయిదు కావస్తుంది ''

''నాకు తమాషా కలవచ్చింది సిస్టర్ నేను ఒక నది ఒడ్డున నిలబడివున్నాను. నాతోపాటు చాలామంది నిలబడివున్నారు. ప్రతి ఒక్కరికీ చిన్నచిన్న పడవలువున్నాయ్. నా ముందు కూడా ఒక పడవవుంది అందరూ తమ తమ పడవల్లో కూర్చుని పడవల్ని నీళ్ళలోకి వదులుతున్నారు ఒక్కొక్కరే అందరూ వెళ్ళిపోయారు నేను మాత్రం అలాగే నిల్చుండిపోయాను పడవ అవతలిగట్టు చేరకుండానే మునిగిపోతుం దనే భయం నన్ను పట్టుకుంది. నాకళ్ల ముందే ఒక్కొక్కరూ అవతలిగట్టు చేరు తున్నారు కొందరు-చాలా కొద్దిమంది మధ్యలో మునిగిపోతున్నారు. నేను మాత్రం

క్రమంగా నీరు గట్టును కొయ్యసాగింది. నా కాళ్ళ క్రింద మట్టి కొట్టుకుపోతూంది. నా పాదాలకు కంకర మాత్రం తగులుతూవుంది. మరుక్షణంలో ఆ కంకరకూడా కొట్టుకుపోవచ్చు. నేను నీళ్ళలోకి జారిపోవచ్చును పడవకోసం చూశాను అది నాకు చాలా దూరంగా కన్పించింది. దాని దగ్గిరకు వెళ్ళే ఓపికలేదు నా తెలివి తక్కువ తనం నాకు అర్ధం అయింది ''

గ్రేస్ రాధ చేతిని నిమురుతూ "రాధా!'' అన్నది జాలిగా

''నా అసంపూర్ణ జీవితాన్ని చూసి జాలిపడుతున్నారా సిస్టర్? ఆమాటకొస్తే సృష్టిలో ఏ వస్తువూ, ఏ భావనా కూడా సంపూర్ణమైనదికాదు. భూమి ఎందకు విసుగూ విరామం లేకుండా నిరంతరం సూర్యుని చుట్టూ తిరుగుతుంది! భూదేవి గుండెల్లోని ఆ అశాంతికి కారణం ఏమిటి? సూర్యుని నుంచి విడిపోయింది. తనకు సంపూర్ణత్వం సిద్ధించలేదు ఆ దినకరునిలో లీనం అయినప్పుడుగాని తను సంపూర్ణతను పొందలేదు. ఆరోజుకొరకే, ఆ ప్రభాకరునిలో ఐక్యం అయి సంపూర్ణతను పొందే రోజుకొరకే భూదేవి అశాంతిగా నిరంతరం తన చుట్టూతాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతూంది. కాని భూదేవి ఒక విషయం విస్మరించింది తను సూర్యునిలో ఐక్యమైన రోజు తను మిగలదు తనకు ప్రత్యేకమైన అస్తిత్త్వం వుండదు మిగిలేది సూర్యుడు మాత్రమే. గమ్యం చేరుకోవడమే మృత్యువు. నిరంతర అన్వేషణే జీవితం నేను నిరంతరం దేనికోసమో అన్వేషిస్తూనే జీవించాను కలలు కంటూ, జీవితాన్నే ఒక సుందర స్వప్నంగా మలచుకోవడానికి ప్రయత్నించాను ''

''కాని స్వప్నం జీవితం కాదు కాలేదు కలలు కనడం తప్పుకాదు. నువ్వు చేసిన తప్పల్లా ఆకలల్నే వాస్తవాలుగా భ్రమపడటమే.'' అన్నది గ్రేస్.

రాధ ఆశ్చర్యంగా గ్రేస్ ముఖంలోకి చూసింది

''నిజమే సిస్టర్, స్థూలంగా చూస్తే బిస్కెట్లతో కంటే జొన్న రొట్టెతో పొట్ట నింపుకొనేవాడే జీవితంలో సుఖపడగలడు ''

''రాధా! ఒక సుబ్బారావును గురించి మాత్రమే చెప్పావ్.''

''రాధ పేలవంగా, విరక్తిగా నవ్వింది గతాన్ని నెమరు వేసుకోసాగింది

*　　*　　*

రాధ ఉద్యోగంలో చేరి మూడేళ్ళయింది. జీవితంలో చెప్పుకోతగిన విశేషం ఏమీ జరగలేదు. రాధకు జీవితం విసుగ్గావుంది. ఏదో వెలితిగావుంది అంతరాంతరాల్లో ఏదో ఖాళీ అది ఇంతింతై భూగోళమంతైనట్టు అనిపించసాగింది ఆ ఖాళీని ఆవెలితిని పూడ్చుకోవడానికి స్నేహితుల సంఖ్య పెంచుకోసాగింది ప్రైవేటుగా ఇంటర్ పాసై బి ఏ కి చదువుతూవుంది. ఆలోచించడానికి తీరిక లేనంత బిజీగా వుండటానికి ప్రయత్నించసాగింది.

అయినా గుండెలోని ఖాళీనుంచి వచ్చే హోరు నిరంతరం ఆమె చెవుల్లో ''గుయ్''మంటూనే వుంది. ఎక్కడా ఒక్కక్షణం నిల్చోలేని తనం దేన్నో పొందా

లనే ఆరాటం  దేనితోనో ఆ ఖాళీని నింపితేగాని తన అశాంతి దూరం కాదనే భావం అది  ఆ ఖాళీ ఎలానిండుతుంది? అందుకే మనిషి ప్రేమకోసం తపిస్తాడా?

ప్రేమించడం అసహజమా? కాదేమో అనిపిస్తోంది.

మానవజాతి క్రమవికాసం తోపాటే ప్రేమభావనకూడా వికసించిందేమో? మొదట మూగప్రేమ గుండెల్లో చోటుచేసుకొని  తర్వాత కళ్ళలో వెలుగుగా మారి  ఆతర్వాత సాక్షరరూపాన్ని ధరించి ఈనాడు కావ్యాల్లో, కథల్లో, నటనలో, నృత్యంలో పాటలో వ్యక్తం అవుతుందేమో!

ఏమిటి తను ఈ మధ్య ఇలా ఆలోచిస్తుంది?

రాధ వంటరిగా కూర్చున్నప్పుడు గంటలకొలదీ ఆలోచించేది

రాధ తల్లి రాధను వివాహం చేసుకోమని గొడవ చెయ్యసాగింది  రాధ నవ్వేసేది. కాని సమాధానం ఇచ్చేది కాదు.

అనుకోకుండా గుండెపోటువల్ల రాధ తల్లి చనిపోయింది  తల్లి రెక్కల్నుంచి వేరుచెయ్యబడిన పక్షిపిల్ల లా రాధ విలవిల్లాడిపోయింది  రాధ, అత్తయ్యా మామయ్యా వచ్చారు. వాళ్లు తిరిగివెళ్తూ రాధను తమతో రమ్మన్నారు. ఎలాగయినా ఆ మూడు ముళ్లూ కూడా వేయిస్తామని హామీ ఇచ్చారు

అంత దిగుల్లోనూ రాధకు నవ్వొచ్చింది  హుం! మూడుముళ్లు! స్త్రీ జీవిత సార్థకత ఆ మూడు ముళ్ళలోనే వుందని వాళ్ళ నమ్మకం! వాళ్లే ఏమిటి నూటికి తొంభై మంది నమ్మకం అదే  ఆ మధ్య కొందరు రచయిత్రులు పెళ్లికానివాళ్ళను పాత్రలుగా తీసుకొని పాపం వాళ్ళ మనసుల్లోని జాలినంతా కాగితాలనిండా కుమ్మరించేస్తున్నారు. వాళ్ళకుకూడా "పెళ్లికానివాళ్లూ, పెళ్లిచేసుకోనివాళ్లూ" అంటూ రెండురకాలు వుంటారని తెలియదు.

"ఆ బసవయ్యకు ఇంకా పెళ్లికాలేదు  బోలెడంత ఆస్తి  పొద్దుటినించి రెక్కలు ముక్కలు చేసుకొని సంపాదించేది నీ పొట్టకే చాలదు. ఏం సుఖపడుతున్నావ్? నా మాట విని ఆ బసవయ్యను చేసుకో సుఖపడతావ్!" అన్నది రాధ అత్తయ్య

రాధ విసురుగా తలఎత్తింది. రోషంతో ముఖం కందగడ్డలా అయింది.

"సుఖం! డబ్బు! బసవయ్య!" రాధ మనసు భగ్గుమంది.

"నీ చిన్నకూతురు కూడా పెళ్లికి తయారైవుందిగా? దాన్నిచ్చి చెయ్ బసయ్యకు  బోలెడంత ఆస్తి!" కసిగా అన్నది రాధ.

"మాశారా దాని మాటలు? ఆడపిల్ల గదా, వంటరిగా పెళ్లీ పెటాకులు లేకుండా ఎలా వుంటుందని  "

"ఏం మగవాళ్లుమాత్రమే పెళ్లిపెటాకులు లేకుండా వుండగలరా? ఆడవాళ్లెందుకు వుండలేరు? మీరు నా గురించి ఏం బాధపడకండి." విసురుగా అన్నది రాధ.

రాధ అత్తయ్య. మామయ్య వెళ్ళిపోయారు ఆ రెండుగదుల ఇల్లే బావురు మంటూ ఎంతో పెద్దదిగా అన్పించసాగింది రాధకు ప్రతినిముషం తల్లిలేని లోటు మనసును బాధిస్తూనే వుంది రాజేశ్వరి వెనకా ముందు ఎవరూ లేని ఓ వయసు మళ్ళిన స్త్రీని రాధకు సహాయంగా పంపించింది

రామారావు ప్రేమలేఖ రాశాడు. రాధ అంగీకరించకపోతే ఆజన్మ బ్రహ్మచారిగా వుంటానని రాశాడు. రాధకు వళ్ళు మండిపోయింది పొట్టిగా, లావుగా వుండి గుమాస్తా ఉద్యోగం చేసే రామారావు తనను ప్రేమిస్తున్నట్టు ఉత్తరం రాయడం పెద్ద అవమానంగా బాధపడింది. జవాబు రాయలేదు ఒకరోజు దిగాలుపడిన ముఖంతో రాధ దగ్గరకు వచ్చాడు రాధ నాలుగు చివాట్లు వేసించి బ్రహ్మచారిగా వుంటే, దేశ జనాభాను పెంచకుండా దేశసేవ చేసినట్టవుతుందనీ, బ్రహ్మచారిగానే వుండమనీ అన్నది. ఆరునెలలు తిరక్కుండనే సుబ్బారావు పెళ్లి వార్త విని రాధ లోలోపల నవ్వుకుంది

రాధ స్నేహితులందరికీ కాకపోయినా కొందరికైనా ప్రేమకథలున్నాయి కళ్ళలో కన్నీళ్లున్నాయి, వేడివేడి నిట్టూర్పులున్నాయ్.

రామచంద్రం రాధ పనిచేసే స్కూల్లోనే లెఖ్ఖల మాస్టరుగా పనిచేస్తున్నాడు. వయసులో పెద్దవాడు. రాధను చాలా అభిమానిస్తున్నట్టు కన్పించేవాడు కొందరు లేడీ టీచర్స్ అతన్ని గురించి చాలా దారుణంగా మాట్లాడుతూ వుంటే రాధకు జాలివేసేది. అతను రాధ ఇంటికి వస్తూపోతూ వుండేవాడు. ఆమెకు స్టడీస్‌లో సహాయం చేసేవాడు. కాని క్రమంగా అతని ప్రవర్తనలో మార్పు కన్పించసాగింది పెద్దవాడు ఆరుగురు బిడ్డల తండ్రి తనే పొరపాటుపడుతున్నానేమో అనుకొనేది

రాధకో టీచర్ మీనాక్షి అందంగా వుంటుంది చాలా చక్కగా ముస్తాబై వస్తుంది ఆమెనుగురించి అనేక కథలు ప్రచారంలో వున్నాయి ఆమె ఇంకా వివాహం చేసుకోలేదు తనను ఎంతమంది ప్రేమించారో, పెళ్ళి చేసుకుంటానన్నారో కథలు కథలుగా ఉత్సాహంగా చెబుతూవుంటే రాధ ఆశ్చర్యంగా వినేది.

మీనాక్షి అంత ఉత్సాహంగా ఆ కథలు ఎలా చెబుతుంది? తన కెందుకు ఎవరైనా ప్రేమిస్తున్నానన్నా, పెళ్ళిచేసుకోమన్నా అవమానం అనిపిస్తుంది. కోపం వస్తుంది. మళ్ళీ వాళ్ళ ముఖం చూడాలనిపించదు?

రాఘవరావు ఒకగంట పాఠం చెప్పి మూడుగంటలు కూర్చునేవాడు. రాధ పాఠం చెప్పించుకోవడం మానేసింది అయినా అతను రావడం మానలేదు ఎలా వదిలించుకోవాలో అర్థం కావడంలేదు

తను ప్రేమించని వ్యక్తి, తనని ప్రేమిస్తూ, ఆ ప్రేమను కళ్లతో, మాటల్లో, ప్రతి కదలికలో వ్యక్తంచేస్తూ గంటలకొద్దీ ఎదురుగా కూర్చోవటమంత జుగుప్సాకరమైందీ, బాధాకరమైందీ మరొకటి వుండదు అనిపించేది రాధకు రాఘవరావును చూస్తూంటే.

''రాధా!'' రాఘవరావు గొంతు అదోలా ధ్వనించింది

రాధ చివ్వున తలెత్తి చూసింది. ఆ ''పిలుపు'' ఎంతో ఎబ్బెట్టుగా అన్పించింది. అసహ్యం వేసేది

''నీకు ప్లెటానిక్ లౌలో నమ్మకం వుందా?'' ముఖంలోకి లోతుగా చూస్తూ అన్నాడు. రాధకు ఆ కళ్లు పీకాలనీ, ఆ ముఖం రక్కాలనీ అనిపించింది ఆ కళ్ళనిండా అదో రకమైన లాలస ''ఛ! ఛ!'' అనుకుంది

''ప్లెటానిక్ లౌలోనే కాదు అసలు లౌలోనే నాకు నమ్మకం లేదు!'' కట్టె విరిచినట్టు అన్నది పెళుసుగా.

అతన్ని ఏదో అనరాని మాట అన్నట్టు ముఖం ముడుచుకున్నాడు.

రాధకు సంతోషం కలిగింది అతని ముఖం చూస్తుంటే

''మీరు ఇకముందెప్పుడూ 'ప్రేమాగీమా' అంటూ మాట్లాడకండి ఆ మాటలు మీ నోటినుంచి వస్తుంటే చాలా అసహ్యం కలిగించే వాసన ఏదో వస్తున్నట్టనిపిస్తుంది'' అన్నది రాధ కసిగా.

రాఘవరావు ముఖం నల్లగా మాడిపోయింది. చివ్వున లేచి నిల్చుని ''వస్తా!'' అంటూ వెళ్ళిపోయాడు

''మళ్లీ రావడం ఎందుకూ?'' మనసులోనే అనుకుంది రాధ.

కాని రాఘవరావు రావడం మానలేదు వస్తూనే వున్నాడు రాధ ముఖం చిట్లించుకున్నా గమనించనట్లే గంటలకొద్దీ మౌనంగా కూర్చుంటాడు ఆమె ప్రతి కదలికనూ గమనిస్తూ కూర్చునే వాడు రాధకు చాలా ఇబ్బందిగా వుండేది

ఒక రోజు రాఘవరావు వచ్చేటప్పటికి రవీంద్ర కూర్చుని వున్నాడు రవీంద్ర అందమైన వాడు. ఎం ఏ పాసయాడు. స్టేట్ బ్యాంక్‌లో పని చేస్తున్నాడు. హాయిగా మాట్లాడతాడు. రాధకు కూడా అతనంటే అభిమానం ఏర్పడింది అతనితో మాట్లాడుతూ వుంటే రాధకు ఎలాంటి ఇబ్బందిగానూ వుండదు రాజేశ్వరీ, కామాక్షీ, మీనాక్షీ మొదలైన ఆడ స్నేహితులతో మాట్లాడినట్టే అతనితో హాయిగా మాట్లాడుతుంది.

రవీంద్ర క్రికెట్ ప్లేయర్. గత వారం జరిగిన మాచ్ గురించి చెబుతున్నాడు. రాధ శ్రద్ధగా వింటోంది. రాఘవరావు ముఖం చిట్లించుకున్నాడు రాధ గమనించక పోలేదు

ఇద్దర్నీ పరిచయం చేసింది రాఘవరావు ముఖం రంగులు పములోంది. రెండు కణతలూ కుడిచేత్తో నొక్కుకుంటూ కూర్చున్నాడు తను ఎవరితోనైనా మాట్లాడితే అతనికి బోలెడంత ఈర్ష్య అని రాధకు తెలుసు అతన్ని మరీ ఉడికించాలనే ఉద్దేశంతో రవీంద్రతో మాట్లాడుతూ ఉత్సాహంగా గలగల నవ్వసాగింది.

రాఘవరావు దిగ్గున లేచి నిల్చున్నాడు. ''నే వస్తా!'' అన్నాడు రాధను చీదరించుకుంటున్నట్టు చూస్తూ.

''మంచిది'' అన్నది రాధ అతని ముఖంలోకి చూస్తూ

రవీంద్ర ఆశ్చర్యంగా ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు.

''అదేమిటి మీరు ఇప్పుడేగా వచ్చారు? కూర్చోండి. నేను వెళ్తున్నాను'' అంటూ రవీంద్ర లేవబోయాడు

''మీరు కూర్చోండి. రాజేశ్వరి వస్తానన్నది. సినిమాకు వెళ్దాం!'' అన్నది రాధ.

రవీంద్ర ఆశ్చర్యంగా రాధ ముఖంలోకి చూశాడు. రాధతో తనెప్పుడూ సినిమాకు వెళ్ల లేదు.

రాఘవరావు ఇక భరించలేనట్టు గబగబా బయటకి వెళ్ళిపోయాడు.

రాధ పకపక నవ్వింది. ఆ నవ్వులో ఏదో అపస్మృతి వినిపించింది రవీంద్రకు.

''ఏమిటోయ్ పాపం కుటుంబరావు అంత సీరియస్, వెళ్ళి పోతున్నాడు?'' అంటూ రాజేశ్వరి వచ్చింది.

రవీంద్ర ''హలో!'' అన్నాడు "అతని పేరు రాఘవరావన్నారుగా?" రాధను అడిగాడు ఆశ్చర్యంగా రవీంద్ర.

''మా రాజేశ్వరి అతన్ని అలాగే ముద్దుగా పిలుస్తుందిలే'' అన్నది రాధ,

''అదేమిటి? ఎందుకూ?'' అన్నాడు రవీంద్ర ఆశ్చర్యంగా.

''ఆయనకు నలుగురు ఆడ పిల్లలూ, ఇద్దరు మగ పిల్లలూ. నెలలో వారం రోజులు వాళ్లంతా అర్ధాంగలితోనే వుంటారు అయినా అతనికి ఆడవాళ్ళంటే వల్లమాలిన ప్రేమ. ప్రస్తుతం మా రాధను ప్రేమిస్తున్నాడు. పెద్ద కుటుంబం కలవాడు, అందుకే కుటుంబరావు అంటాను,'' రాజేశ్వరి చెప్పింది.

''అందుకే కాబోలు పాపం నన్ను చూసి బాధతో మెలికలు తిరిగి పోయాడు'' అన్నాడు రవీంద్ర నవ్వుతూ.

''మిమ్మల్ని చూసి అయితే పర్వాలేదు. రాధ ఆడవాళ్ళతో మాట్లాడడం కూడా సహించడు. చచ్చేంత జలసీ. రాధ తన స్వంతం అయినట్టు ప్రవర్తిస్తాడు.''

''ఏమిటో అతని తత్వం నాకు అర్థం కాదు. చదువుకొని ఉద్యోగాలు చేసే ఆడ వాళ్ళంతా చెడిపోయిన వాళ్ళ కిందే లెఖ్ఖ అతని దృష్టిలో. నా స్నేహితురాళ్ళను గురించి ఆరాలు తీస్తాడు నాకు వళ్లు మండిపోయి నసాళానికి అంటే సమాధానం ఏదో ఇస్తాను పట్టి పిరికి గొడ్డు ఉడుకుబోతు తనం కూడా ఎక్కువే ఆ దెబ్బతో పది రోజులు కన్పించడు. మళ్లీ మామూలే. ఏదో పెద్దవాడు కదా అని జాలి వేసి రెండు మాటలు మాట్లాడితే చాలు ఆ ముఖం చూస్తే మళ్లీ వళ్లు మండిపోతుంది.''

''అదేమిటి పాపం!''

''కాస్త మాట్లాడితే చాలు ఆ ముఖం ఎలా పెడ్తాడో తెలుసా? ఒక గదిలో మూతలేని పాలకుండ వుందనుకోండి అక్కడ ఎవరూ వుండరు పిల్లి వస్తుంది. నాలుకతో మూతి తుడుచుకుంటూ ఆ పాలకుండ కేసి చూసే ఆ పిల్లి ముఖంలా

వుంటుంది అతని ముఖం. నాకు వళ్లు మండిపోతుంది" అన్నది రాధ.

రవీంద్ర పకపక నవ్వాడు. "అతనికి అంతా జెలసీ కదా? మరి మీరు నాతో సిని మాకు వెళ్తున్నట్టు ఎందుకన్నారు?"

"మిమ్మల్ని చూశాడు. వారం రోజులు కన్పించడు. మీతో సినిమాకు వెళ్తున్నట్టు తెలిస్తే కనీసం నెల రోజులైనా కన్పించడు. అందుకే అన్నాను" అన్నది రాధ.

"పాపం!" అన్నాడు రవీంద్ర ఆలోచిస్తూ

"ఆ జాలి నామీదా లేక అతని మీదా" నవ్వుతూ అడిగింది రాధ.

"పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్నారు పెద్దలు. పిల్లి మీద జాలి ఎందుకు పడాలి?"

"అంటే నేను పిల్లినా? నేను ఎవర్తోనూ చెలగాటం ఆడడం లేదు." అన్నది రాధ సీరియస్‌గా ముఖం పెట్టి

"మీరు కావాలని చెలగాటం ఆడటం లేదనుకోండి " అంటూ రవీంద్ర పకపక నవ్వాడు.

రాధ కూడా నవ్వేసింది

రవీంద్ర వెళ్లిపోయాడు.

"ఇక చెప్పు తల్లీ మీ రహస్య ప్రణయం ఎంతవరకు వచ్చింది?" అన్నది రాధ.

రాజేశ్వరి మాట్లాడలేదు కళ్ళు శ్రావణ మేఘాలే అయాయ్.

"క్షమించు రాజూ! బాధ పెట్టానా? కాని ఇది నాకేం నచ్చలేదు" అన్నది రాధ.

"అంతకింటె చెయ్యగలిగింది మాత్రం ఏముంది?" రాజేశ్వరి కంఠంలో జీర పలికింది

రాధ విసురుగా ఏదో అనబోయి రాజేశ్వరి ముఖం చూసి అనలేక పోయింది.

"పిరికి వాళ్ళంటే నాకు అసహ్యం!" అని మాత్రం అన్నది రాధ

రాజేశ్వరి నిట్టూర్పు విడవడం కంటే ఏమీ అనలేదు

ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు రాధ రాజేశ్వరి గురించి ఆలోచిస్తూంది.

"నీ స్థానంలో నేనుంటే ఏం చేస్తానో తెలుసా?" అన్నది రాధ

రాజేశ్వరి ప్రశ్నార్థకంగా చూసింది

"ఇవాళ నీ మనసు బాగున్నట్టు లేదు. మరోసారి చెబుతాలే" అన్నది రాధ.

"రాధా! ఒక్కటడుగుతాను. నిజం చెబుతావా? రవీంద్ర అంటే నీకు ఇష్టం గదూ?" రాజేశ్వరి ప్రశ్నించింది.

"ఇష్టమే! సంస్కారంగలవాడు. తెలివైనవాడు. ఎదటమనిషిని అర్థంచేసుకొని ప్రవర్తిస్తాడు. నువ్వంటేనూ నాకు ఇష్టమే. అంతే!" అన్నది రాధ.

"అంతేనా?"

"అంతే: అంతకంటే ఆ ఇష్టంలో ప్రత్యేకత ఏదీలేదు "

"ప్రేమలో నీకు బొత్తిగా నమ్మకంలేదా?"

"నాకు అదంటే ఏమిటో తెలియదు. కాని 'ప్రేమ' అంటే నాకు భయం. మగవాడు ప్రేమలో మునిగిపోడు, ఆడది మునిగిపోతుంది. ఈత వచ్చినవాడు ప్రమాదవశాత్తు నీళ్లలోపడ్డా మునిగిపోడు ఈదుకుంటూ వడ్డుచేర్తాడు కాని ఈతరానివాళ్ల సంగతివేరు పడితే మునగటంతప్ప వేరేగత్యంతరంవుండదు నీసంగతే చూడరాదూ? మీ ఇద్దర్లో మునిగిపోయేది ఎవరంటావ్? అందుకే నేను ఆ భావనునుంచి తప్పించుకుంటూ వస్తున్నాను "

రాజేశ్వరి ఆలోచనలోపడింది

నాలుగురోజులు రాఘవరావు రాలేదు స్కూల్లో ఎదురుపడ్డా ముఖంతిప్పుకొని వెళ్ళిపోతున్నాడు పీడవిరగడైనట్టే అనుకుంది రాధ.

కాని ఐదోరోజు రాఘవరావు వచ్చాడు. గుర్రపుపందాలలో వున్నదంతా పోగొట్టుకున్నవాడిలా డీలాపడివున్నాడు. అతని ముఖంచూస్తుంటే రాధకు నవ్వొచ్చింది

"వంట్లో బాగాలేదా?" అడిగింది రాధ.

చివ్వున తలెత్తి "నావంట్లో బాగాలేదని ఎవరుచెప్పారూ?" అన్నాడు అనుమానంగా చూస్తూ.

రాధకు వళ్లు మండిపోయింది అన్నిటికీ ఉలికిపాటే

"రవీంద్ర చెప్పాడు." కావాలని అతన్ని ఏడిపించటానికి అన్నది.

"అతనికెలాతెలుసూ?" ముఖం చిట్లించి అడిగాడు

"అతనికెలాతెలుసో నాకేం తెలుసూ?" అదే ధోరణిలో అన్నది రాధ.

"అతను మళ్ళీవచ్చాడా?" అదోలా చూస్తూ అడిగాడు

"రోజూ వస్తూనేవున్నాడు " అబద్ధంచెప్పింది

అతని ముఖం ముడుచుకుపోయి అసహ్యంగా కన్పించింది. అద్దంతెచ్చి ముఖం చూసుకోమని చెప్పాలనిపించింది రాధకు.

కళ్లుమూసుకున్నాడు. గడదల ఎముకలు పైకి పొడుచుకువచ్చాయి ఏభయ్యోపడిలోవున్న అతను అరవై దాటినవాడిలా కన్పిస్తున్నాడు.

"రవీంద్ర మీకెలా తెలుసు?"

రాధకు వళ్ళుమండిపోయింది శాంతంగానే చెప్పటం మొదలుపెట్టింది,

"ఒకరోజు నేను స్కూల్‌నుంచి వస్తున్నాను. అతను సైకిల్‌మీద వస్తున్నాడు. నాకు సైకిల్ డాష్ ఇచ్చాడు నాచేతిలో పుస్తకాలూ పర్సూ క్రిందపడ్డాయి వంగి తీసుకోబోతుంటే అతనూ వంగాడు ఇద్దరి తలలూ కొట్టుకొన్నాయ్, నేను కోపంగా అతని ముఖంలోకి చూశాను అతను క్షమించమన్నట్టు చూశాడు. అంత నేను కరిగి

పోయాను కళ్ళూ కళ్ళూ కలిశాయి. మనసులు నాట్యంచేశాయి'' అతని ముఖంలోకి చూస్తూ కథ అల్లి చెప్పింది రాధ

రాఘవరావు ఏవగించుకుంటున్నట్లు చూశాడు ''ఏం? మా ప్రేమ కథ బాగా లేదూ?'' అన్నది.

''ఎలాంటివాడో తెలుసుకోకుండా బజారుపోయేవాడితో స్నేహం చెయ్యడం అంతమంచిదికాదు'' అన్నాడు.

''ఎవరికి మీకా నాకా'' రెట్టించింది రాధ

''మీకే!''

''నామంచి చెడులు నేను నిర్ణయించుకోగలను మరొకరి సలహాలు నాకు అక్కర్లేదు.''

''అతనికి పెళ్ళయిందా?''

''కాలేదు ఎలిజిబుల్ బేచులరే.

''అతని మాటల్ని నమ్మావా? అబద్ధాలు కూడా చెబుతారు ఈకాలం కుర్రాళ్ళు.''

ఆ ఏకవచన ప్రయోగానికి రాధకు చిరాకువేసింది ''ఇవ్వాల్టితో ఎలాగయినా వదిలించకోవాలి'' అనుకుంది.

''నేను అతని వివరాలు తెలుసుకోనా?''

''అక్కర్లేదు. ఆతను మీగురించి ఏమన్నాడో తెలుసా?''

''ఏమన్నాడేమిటి?''

''ఈ ముసలాడు ఏమిటి అంత బాధపడిపోతున్నాడు? అంటూ నవ్వాడు ''

రాఘవరావు ముఖం అరడబ్బా ఆముదం పట్టించినట్టయింది.

''రవీంద్రకు మీరు రావడం ఇష్టంలేదు'' అన్నది.

''అంతవరకు వచ్చిందన్నమాట.''

''అంతవరకేమిటి? చాలావరకు వచ్చింది ఎందుకైనా మంచిది మీరు రావడం మానెయ్యండి రవీంద్ర అసలే పొగరుబోతు. ఈకాలం కుర్రవాళ్ళగురించి నాకంటే మీకే బాగా తెలుసుగా?'' అన్నది రాధ వచ్చేనవ్వును పెదవులమధ్య బంధిస్తూ.

రాఘవరావు దిగ్గునలేచాడు. విసురుగా బయటికి వెళ్ళిపోయాడు. రాధ రిలీఫ్‌గా నిట్టూర్చింది.

ఇది జరిగిన వారంరోజులకు రాధను హెడ్‌మిస్ట్రెస్ పిల్చింది.

''చూడమ్మా రాధా! వయసులోవున్న ఆడపిల్లలు చాలా జాగ్రత్తగా వుండాలి'' అన్నది హెడ్ మిస్ట్రెస్ కామేశ్వరి.

ఆ ఉపోద్ఘాతం దేనిగురించో అర్థంకాక రాధ కామేశ్వరి ముఖంలోకి అయోమయంగా చూసింది.

''నీగురించి నాకుతెలుసు రాధా! కాని మగవాళ్లతో చనువుగా మాట్లాడ కూడదు. అనేక కథలు అల్లి ప్రచారంచేస్తారు ''

''మన మనస్సు నిర్మలంగా వున్నప్పుడు ఎవరో ఏవో అనుకుంటారని ఎందుకు భయపడాలి మేడం?'' అన్నది రాధ ఆవేశంగా

''అవుననుకో! కాని ఈ ఉత్తరం చూడు!'' అంటూ ఓ ఉత్తరం అందించింది కామేశ్వరి

రాధ ఉత్తరం తీసుకుంది క్రింది సంతకం చూసింది ''ఆకాశరామన్న'' అని వుంది ఆత్రుతతో ఉత్తరం గబగబా చదివింది రాధ శరీరం కోపంతో దహించుకుపోయింది మనస్సు జుగుప్సతో నిండిపోయింది రాధ చరిత్ర మంచిది కాదనీ, చాలా చౌకబారు మనిషనీ, ప్రస్తుతం రవీంద్ర అనే రౌడీతో ప్రేమకలాపాలు సాగిస్తుందనీ, అలాంటి చరిత్రగల స్త్రీ ఆ స్కూల్లో టీచర్‌గా వుండటం ఆడపిల్లల జీవితాలకు శ్రేయస్కరం కాదనీ, ఇంకా ఏమేమో చాలా అసహ్యంగా రాసివుంది ఆ ఉత్తరం ఎవరు రాశారో రాధకు వెంటనే అర్థంఅయింది రాఘవరావును పిస్టల్‌తో కాల్చాలనిపించింది. పెట్రోల్ పోసి అగ్గిపుల్లగీసి ముట్టించాలనిపించింది

''ఇవన్నీ నమ్ముతున్నారా మేడం!'' దాదాపు ఏడుస్తున్నట్టే అడిగింది రాధ

''లేదమ్మా అసలు ఈ ఉత్తరం నీకు చూపించాలని కూడా అనుకోలేదు. కాని ఎందుకైనా మంచిదని చూపించాను''

రాధ కసితో మునిపళ్ళతో క్రింది పెదవి కొరుక్కుంది

''బయటికివచ్చి పనిచేసే ఆడపిల్లలకు ఇలాంటివి ఎదుర్కోక తప్పదు రాధా. నాకూ ఉద్యోగంలో చేరిన కొత్తలో ఇలాంటి అనుభవం కలిగింది.''

రాధ అక్కడ నిల్చోలేకపోయింది పర్మిషన్ అడిగి ఇంటికి వచ్చేసింది ఆ ఉత్తరంలోని ప్రతి వాక్యం గుర్తొస్తుంది ఎంత అసభ్యంగా వుంది ఆ ఉత్తరం? వెధవ రాసేవాడు ధైర్యం వుంటే పేరుపెట్టి రాయాలి. పేరు లేకుండా ఆకాశ రామన్న ఉత్తరాలు రాసేవాళ్ల మనసులు ఎంత కుళ్లిపోయి వుంటాయో! ఎంత వికృతమైన స్వభావమో వాళ్లది? ఒక మగవాడి చరిత్ర గురించి ఎవరైనా అటువంటి ఉత్తరం రాస్తే ఎవరూ పట్టించుకోరు ఎందుకు? ఈ సంఘం—మగవాడు ఏర్పరచిన ఈ సంఘం—ఆడదాని శీలాన్ని గురించి మాత్రమే నీతి సూత్రాలను వల్లించింది అందుకే ఆడదాని మీద దెబ్బతీయాలంటే ఆమె శీలాన్ని గురించి దుష్ప్రచారం చెయ్యాలి. ఆడదాని ప్రత్యేకతను ఎత్తిచూపే ఈ సంఘం పునాదుల్తో సహా కదిలిపోవాలి అంతవరకూ ఆడదానికి ఈ దేశంలో నిజమైన గౌరవం లభించదు రాధ మనసులో కసి రాఘవరావుమీద కసి. సంఘంమీద కసి ఆడదిగా జన్మించినందుకు తనమీద తనకే కసి. రాఘవరావు నలుగురు ఆడపిల్లల తండ్రి ఎంత అసహ్యంగా వయసులోవున్న ఒక ఆడపిల్లను గురించి రాశాడు? ఛ! ఏం మనుషులు?

పిరికి వెధవ పేరు రాయకుండా మనసులోని కుళ్ళంతా ఉత్తరంలోకి కక్కేశాడు.

రాధకు ఆ ఉత్తరంలోని వాక్యాలు గుర్తొచ్చినప్పుడల్లా ప్రపంచాన్నే పెట్రోలు పోసి కాల్చి వెయ్యాలనిపించేది.

ఆ రోజు రవీంద్ర చాలా ఆవేశంగా వచ్చాడు.

"ఏమిటి అలా వున్నారు?" అడిగింది రాధ

"రాస్కెల్ ఏదేదో వాగాడు. బాగా తన్నేశాను" ఆవేశంగా అన్నాడు రవీంద్ర.

"ఎవర్ని?" రాధ ఆశ్చర్యంగా అడిగింది

"వాడ్నే ఆ రాఘవరావుగాడ్ని"

రాధ అయోమయంగా చూసింది.

"నేనూ ఒక స్నేహితుడూ తాజమహల్ హోటల్‌కు వెళ్లాం అక్కడ రాఘవరావుగాడు స్నేహితులతో కూర్చొని వున్నాడు నేను వినాలనే పెద్దపెద్దగా మాట్లాడుతూ నవ్వుతున్నాడు. నీ పేరు విన్పించి వాళ్ల సంభాషణ శ్రద్ధగా విన్నాను వాడు నిన్ను గురించి అసభ్యంగా ఏదేదో వాగాడు స్నేహితులు నవ్వారు నాకు కోపంతో వళ్లు తెలియలేదు అనుకోకుండా వెళ్ళి వాడి షర్టు పట్టుకొని గుంజి ఆ చెంపా ఈ చెంపా వాయించాను పిరికి వెధవ నోరు మెదపలేదు తోక ముడిచాడు" ఉద్రేకంగా అన్నాడు రవీంద్ర

"ఏం మాట్లాడాడు నా గురించి?"

"చాలా అసహ్యంగా ఏదేదో వాగాడు నేను చెప్పలేను"

"మీరు అలా చెయ్యకుండా వుండాల్సింది"

"అంటే నేను చేసింది, రాఘవరావును కొట్టడం నీకు బాధ కలిగించిందా?"

"అబ్బే అదికాదు. అసలే కుళ్లు వెధవ కసిపట్టి మిమ్మల్నేమన్నా చేస్తాడేమోనని నా భయం"

"ఏడ్చాడు వెధవ మళ్లీ వస్తే నీ జోలికిరాడు. కొందరికి దెబ్బంటే మహాభయం ఆ రాఘవరావు ఆ కోవకు చెందినవాడే" అన్నాడు రవీంద్ర.

రాధ ఆకాశ రామన్న ఉత్తరం గురించి చెప్పింది

ఆ రాత్రంతా రవీంద్ర గురించి ఆలోచిస్తూనే వుంది రవీంద్రకు ఎందుకు తనంటే అంత అభిమానం? ఒకవేళ అతను కూడా తనను ప్రేమించడంలేదు కదా? అయినా అతను వెకిలిగా ప్రవర్తించడు. అతని ముందు తన మనసు ముడుచుకుపోదు అందుకే అతనంటే తనకు ఇష్టం. అంటే అప్పుడప్పుడు తను ఒంటరిగా వున్నప్పుడు, అశాంతితో తన మనసు వేగిపోతున్నప్పుడు, తన అంతరాంతరాల్లో స్పృశించే అస్తిత్వం ఇతనిదేనా?

కాదు కాదు అందరి మగవాళ్లలా కళ్లలో జుగుప్స కలిగించే భావాన్ని నింపుకొని తనకేసి చూడడు. కాని ఈ మధ్య ఏదో దిగులుగా కన్పిస్తున్నాడు. కళ్లుమూసుకొని కూర్చుంటాడు. ఆ కళ్లు తెరవగానే ఎర్రగా కన్పిస్తాయి కాని మరుక్షణంలో అవి మామూలుగా నిర్మలంగా కన్పిస్తాయి అతని చూపుల్లో, మాటల్లో, చేష్టల్లో ఎలాంటి వికారం కన్పించదు.

కాని అతను దిగులుగా ఎందుకు కన్పిస్తున్నాడు? నిజంగానే రవీంద్ర తనను ప్రేమిస్తున్నాడేమో? హే! భగవాన్! నన్ను క్షమించు రవీంద్రా!

"సిస్టర్ దాహం!"
గ్రేస్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

# 14

"ఎందుకు సిస్టర్ నవ్వుతున్నారు?"

"నీ కథ తెలిసిపోయింది రాధా. నువ్వు రవీంద్ర ప్రేమలో పడిపోయావ్. ఏ కారణంవల్లనో అతను నిన్ను తిరస్కరించాడు" అన్నది గ్రేస్ రాధ చేతిని నిమురుతూ.

రాధ పెదవులమీద విరిగిన పాలలాంటి చిరునవ్వు ఓ క్షణకాలంపాటు కదలింది.

"లేదు సిస్టర్ అదే జరిగివుంటే నా కథకు ప్రత్యేకత ఏముంది? అలా జరగ లేదు కాబట్టే మీకు వినిపిస్తున్నాను"

"అంటే రవీంద్రను కూడా తిరస్కరించావా?" అదోలా విన్పించింది గ్రేస్ కంఠం.

"ఏం సిస్టర్ నన్ను చూస్తుంటే అసహ్యం వేస్తుందా?"

"లేదమ్మా!" అన్నది గ్రేస్ మృదువుగా.

"వినండి సిస్టర్

రాధను ఎవరైనా నిలదీసి "రవీంద్ర అంటే నీకు ప్రత్యేకమైన ఇష్టమా?"అని అడిగితే చస్తే ఒప్పుకోదు కాని అప్పుడప్పుడు ఆమెకే అనుమానం కలిగేది. తను రవీంద్ర వైపుకు ఆకర్షింపడటం లేదు కదా అని! కాని వెంటనే మనసు " కాదు. కాదు . ఈ ఆర్తి—ఈ అన్వేషణ – ఈ తపన అతనికోసం కాదు ' అరుస్తున్నట్టు అనిపించేది.

ఒకరోజు రవీంద్ర అతని స్నేహితునితో వచ్చాడు. రాధ బల్లముందు కూర్చుని పుస్తకం చదువుకుంటూ వుంది చిప్పుక్కున లేచి నిల్చుంది

"ఇతను నా ఫ్రెండ్. పేరు రాహుల్." రవీంద్ర పరిచయం చేశాడు.

"నమస్తే!" అంటూ చేతులు జోడించి ఓ క్షణం అతన్ని చూస్తూ అలాగే నిలబడిపోయింది.

రాహుల్ చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేశాడు. అతని చూపులు రాధ కళ్ళలోనుంచి దూసుకుని మనసులోకి లోతుగా వెళ్ళి అక్కడ గాలంలా చిక్కుకున్నాయ్. రాధ బల్ల పట్టుకుంది. ఎప్పుడూ ఎవరిముందూ కలగని తడబాటు ఏదో కలిగింది.

"ఏదో పనిమీద ఇటునుంచి వెళ్తూ నిన్ను చూసి వెళ్దామని వచ్చాను." అన్నాడు రవీంద్ర.

రాధ మౌనంగా కూర్చుంది. రాహుల్ కేసి చూడకపోయినా అతని చూపులు ఆమెను ఇబ్బంది పెడ్తున్నట్టే ఉన్నాయ్. ఓ పదినిముషాలు కూర్చుని వెళ్ళిపోయారు. అయినా అతని రూపం అతని చూపులు ఆమెను వెంబడిస్తున్నట్టే అన్పించసాగింది.

ఏమిటీ అనుభూతి? గమ్యాన్ని అన్వేషిస్తూ పయనిస్తున్న బాటసారికి అనుకోకుండా గమ్యం ఎదురైనట్టూ, అతని ప్రయాణం ఆగిపోయినట్టూ అనిపిస్తుందేమిటి? ఇంతకాలం తనలోపల బావురుమంటూవున్న బోలుతనం ఏదో మధురభావనతో నిండిపోయినట్టనిపిస్తుంది యుగాలుగా తననుంచి విడిపోయిన వస్తువేదో మళ్లీ తనలోకి ప్రవేశించినట్టనిపిస్తుంది

రాహుల్! ఎంత చక్కని పేరు? అతని చూపులు కాళిదాసు ఉపమాలంకారం లాగ మనసుకు ఏదో తియ్యటిబాధను కలిగిస్తాయి.

రాధ రవీంద్రకోసం ఎదురుచూడసాగింది. ఆమెకు రాహుల్‌గురించి వివరాలు తెలుసుకోవాలని వుంది.

ఈ దేశంలో వున్న ఇన్నికోట్ల మగవాళ్లలో తను అన్వేషిస్తున్న వ్యక్తి ఇతనేనా?

ఒకరోజు సాయంత్రం రవీంద్ర వచ్చాడు చాలా దిగులుగా కన్పించాడు.

"ఎందుకు అలా వున్నారు?"

"ఎలా వున్నాను?"

"ఏదో దిగులుగా?"

రవీంద్ర దిగులుగా నవ్వాడు

"నాకు చెప్పకూడదా?"

"నీకు చెప్పకూడదనే ఇంతకాలం ఈ దిగుల్ని గుండెల్లోనే దాచుకున్నాను. కాని ఇప్పుడు నాకు అంత శక్తిలేదు. దాచుకోలేకపోతున్నాను" అన్నాడు రవీంద్ర.

రాధ గతుక్కుమంది రవీంద్రకూడా

"రాధా! ఇవ్వాళ నీతో ఒక విషయం మాట్లాడాలనుకుంటున్నాను, అనుమతిస్తావా?"

"ఏమిటది?" భయపడుతూనే అడిగింది

రవీంద్ర ఓ క్షణం ఆలోచిస్తూ కూర్చుండిపోయాడు.

రవీంద్ర ఏం చెప్పాలనుకుంటున్నాడు? అందరిలా ఇతనూ తనను ప్రేమిస్తున్నానని చెప్పబోతున్నాడా? అదే నిజమైతే? అందరిలా ఇతన్ని తను అవమానించగలదా? అసహ్యించుకోగలదా? బాధపెట్టగలదా?

"మీ స్నేహితుడు ఏం చేస్తుంటాడు?" మాటమారుస్తూ అడిగింది రాధ,

''డాక్టరు. కె జీ ఆసుపత్రిలో పనిచేస్తున్నాడు ''

అతన్ని గురించి ఇంకా ఎన్నో వివరాలు తెలుసుకోవాలని వుంది కాని అడగ లేకపోయింది.

''మాట మార్చకు రాధా! ఇవ్వాళ నిన్నొక ప్రశ్న సూటిగా అడిగి తెలుసుకుందామనే నిర్ణయంతో వచ్చాను నాకు సమాధానం కావాలి ''

రాధ అసహాయంగా రవీంద్ర ముఖంలోకి చూసింది

''నిన్ను నేను ప్రేమిస్తున్నాను రాధా? నువ్వు అంగీకరిస్తే పెళ్ళిచేసుకుంటాను. నీకూ ఇష్టం అయితేనే?''

రాధకు ఓ క్షణం గదిలోని ప్రతివస్తువూ గిర్రున తిరిగినట్టనిపించింది. ''రవీంద్రా! నువ్వుకూడా అందరిలా కనీసం మరికొంతకాలం నిన్ను ప్రేమిస్తున్నాను రాధా అని అనకుండా వుంటే '' రాధ మనసులో ఏదో 'ఛళ్ళున' పగిలింది.

''చెప్పు రాధా! నాకు సూటి సమాధానం కావాలి.''

''రవీంద్రా! నువ్వు నన్ను అర్థం చేసుకున్నావనుకున్నాను నువ్వు కూడా అందరిలాగే 'నిన్ను ప్రేమిస్తున్నాను.' అంటూ అరిగిపోయిన రికార్డు యుగాలుగా తుప్పు పట్టిన రికార్డునే వేశావ్'' గొణిగినట్టు అన్నది రాధ.

రవీంద్ర ఓ క్షణం రాధ ముఖంలోకి చూశాడు.

''అవును. ఆ మాటలు అరిగిపోయిన రికార్డులోనివే కావచ్చు. చాలా పురాతనమైనవే కావచ్చు యుగాలుగా పూలు వికసిస్తున్నాయ్ మారుతం ఆ సుగంధాన్ని దశదిశలా వ్యాపింప చేస్తూనే వున్నది కాని ఆ పుష్పాలూ, ఆ సుగంధం, కవులకూ, కళాకారులకూ నిత్యం కొత్త ప్రేరణను ఇస్తూనే వున్నాయ్. ప్రతి పాత భాషా, అరిగిన శబ్దం, కొత్త భావనను వ్యక్తం చేస్తున్నప్పుడు నూతనత్వాన్ని పొందుతున్నాయ్. 'ప్రేమ' ఆ శబ్దం పురాతనమైనదే కావచ్చు అరిగిపోయిన రికార్డే కావచ్చు కాని ఆ శబ్దం ఉచ్చరించే ప్రతి వ్యక్తి పెదవుల మీదా కొత్త రూపాన్ని ధరిస్తూ నూతన ఆకర్షణను కలిగిస్తుంది ''

రాధ కళ్ళు పెద్దవి చేసుకొని రవీంద్ర మాటలు వింటూ వుంది.

''సారీ! సినిమా డైలాగ్స్ చెప్పేస్తున్నట్టున్నాను చెప్పు రాధా! నీ కిష్టం లేకపోతే చెప్పు నేను రంగారావులా, సుబ్బారావులా, రాఘవరావులా నీకు న్యూసెన్సుగా తయారుకాను, భయపడకు!''

''నన్ను క్షమించు రవీంద్రా!''

''దట్సాల్‌రైట్ గుడ్‌బై!'' అంటూ లేచి నిల్చున్న రవీంద్రను బేలగా చూసింది రాధ

రవీంద్ర వెళ్ళిపోయాడు వెనక్కు పిలవాలనిపించింది గొంతు పెగల్లేదు. దుఃఖం పొర్లుకొచ్చింది

వారంరోజులైనా రాధ మనసు మనసులోలేదు ఆత్మవిమర్శ చేసుకోసాగింది. స్నేహితులూ, కోటీచర్లూ రాధను "అలా వున్నావేం?" అని అడగసాగారు.

ఇంతమంది తమ ప్రేమను ప్రకటించడంలో తన ప్రమేయం ఏమీలేదా? కొంత వరకు తన ప్రవర్తన కూడా కారణం కాదా? కాదు కాదు కాదా? అవును! ఎవరి విషయంలో ఎలా వున్నా రవీంద్ర విషయంలో తన ప్రవర్తన కూడా కొంతకారణం కావచ్చును రవీంద్ర కళ్ళల్లో, మాటల్లో ఆరాధన కన్పించేదికాదు. రవీంద్రకు తనంటే ప్రత్యేకమైన ఇష్టం అంటూ లేదా అని ఎన్నోసార్లు ఆలోచించింది "లేదు" అనుకున్నప్పుడు ఏదో అసంతృప్తి కలిగింది అతను తనంటే ప్రత్యేకమైన అభిమానం చూపించాలనే కోర్కె లీలగా కదిలినమాటకూడా నిజమే. అందుకే అతనితో చాలాసర్దాగా, నొప్పించకుండా మాట్లాడేది రవీంద్రకు తను అన్యాయం చెయ్యలేదా? అతను కూడా అందరి మగవాళ్ళలా తొందరపడి తన ప్రేమను ప్రకటించకుండా కొంతకాలం వుంటే ఎలా వుండేదో?

కాని అతను అలా అడగ్గానే తన మనసు ఎదురుతిరిగింది. తన ఈ అన్వేషణా, తపనా అతనికోసం కాదనిచెప్పిం?

ఎవరిదో అడుగుల చప్పుడు అయింది ఆలోచనలనుంచి పూర్తిగా బయటపడకుండానే తలెత్తిచూసింది. రాధ ఒక్కసారిగా లేచినిల్చుంది గుండెలు దడదడలాడాయి. కాళ్ళు నిలబడలేనట్లు కొంచెం వణికాయి ఆనందం భయం ఇంకా ఏదేదో ఊపిరి సలపని అనుభూతి. కొత్త అనుభూతి.

ఎప్పుడో ఒకసారి జీవితంలో ఓ క్షణం మానవుడు తను నేర్చిన భాష మర్చిపోతాడు అతనికి నోట్లో నాలుకలేనట్టయినా అనిపిస్తుంది, లేక దానికి కదిలేశక్తి నశించినట్టయినా అనిపిస్తుంది

రాధ రాహుల్‌ను చూస్తూ నిలబడిపోయింది. కూర్చోమనడం కూడా మర్చిపోయింది

"చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టున్నారు? రవీంద్ర గురించేనా?"

రాధ బిత్తరపోయి చూసింది అతని చూపులు చురకత్తుల్లా కళ్ళను కోస్తూ గుండెల్ని గాయపరుస్తాయని ప్రథమ పరిచయంలోనే తెలుసుకుంది కాని ఆ గుండెల్లో వున్న భావాల్ని తేలిగ్గా బయటకి లాగుతాయని ఇప్పుడే తెలుసుకుంది

"కూర్చోండి!" అంటూ ఇక నిల్చునే శక్తిలేదన్నట్టు రాధ కూర్చుంది

"నా ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదు." అన్నాడు

రాధకు ఏం మాట్లాడాలో తోచలేదు.

"మీ మౌనంలోనే నాకు సమాధానం దొరికింది రవీంద్ర ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్తున్నాడు. ఎక్కడికి వెళ్తాడో అతనికేం తెలియదనుకుంటాను. బ్రిలియంట్ బాయ్ చేతులారా భవిష్యత్తును పాడుచేసుకుంటున్నాడు." రాహుల్ ముఖం గంభీరంగా మారింది.

కంఠం ఎంత బాగుందో! ఫుల్‌వాయిస్ అంటే ఇలాగే వుంటుందేమో?

"అతను అలా ఎందుకు చేస్తున్నాడో మీకు తెలుసు. అదే విషయాన్ని మరొకరి నోటినుంచి వింటే ఎలా వుంటుందో చవి చూడండి. అతను మీవల్లనే కాదు మీరే అతని భవిష్యత్తును నాశనం చేస్తున్నారు."

రాధ చివ్వున తలెత్తి చూసింది.

"అలా అని మీరంటున్నారా లేక అతను చెప్పాడా!" కొంచెం తీవ్రంగానే అడిగింది రాధ

"అతను చెప్పలేదు చెప్పడు కూడా. కొన్ని విషయాలు నోరు తెరిచి చెప్పక పోయినా సన్నిహితులకు అర్థం అవుతాయి."

"బాగుంది! ఆడది కొంచెం చనువుగా మాట్లాడితే, ఏదేదో ఊహించుకొని పిరికి వాళ్లలా ప్రపంచం నుంచి పారిపోవడం ఆమె తప్పా? ఆడదాని మనసు మిఠాయి కాదు, అడిగిన ప్రతి మగవాడికీ పంచి పెట్టడానికి!" కోపంగా అన్నది రాధ

రాహుల్ ఓ క్షణం ఆమె ముఖంలోకి చూశాడు అతను అలా చూస్తుంటే రాధ కుర్చీలో ఇబ్బందిగా కదిలింది.

"మనసు మిఠాయికాదు. కాని కొందరు ఆడవాళ్ళు, ఎదటి వారికి, మనసు మిఠాయి అనే భ్రమ కలిగిస్తారు చెయ్యి చాపితే అందుతుందనే అపోహను కలిగిస్తారు. ఆశపడి చాచిన చేతిని కసిగా కాటేస్తారు."

రాధకు ఏం సమాధానం ఇవ్వాలో తెలియలేదు అవమానంతో దహించుకు పోసాగింది.

మళ్ళీ రాహుల్ అన్నాడు-"మీలాంటి వారికి అహం ఎక్కువ తమకేం కావాలో తమకే తెలియదు దూరంనుంచి చూసి అదే తమకు కావాల్సిందని భ్రమపడ్తారు. తమకు తెలియకుండానే దాన్ని దగ్గరకు రప్పించుకునే ప్రయత్నం చేస్తారు తీరా దగ్గిరకు వచ్చాక దాన్ని చులకనగా చూస్తారు. ఈసడిస్తారు, అది తమ ప్రత్యేకతగా భావిస్తూ అహాన్ని పెంచుకుంటారు దూరంగా మనోహరంగా కన్పించే దృశ్యం దగ్గిర కాగానే వట్టి ఇసుక దిబ్బగా మారిపోతుంది"

రాధ లోలోపలే ఉడికిపోతుంది. కాని ఏం సమాధానం ఇవ్వాలో తెలియడం లేదు, తను ఓడిపోతూందా?

"ఇన్నిటికీ మీరు అనేదేమిటి?" కంఠం పెగల్చుకొని అన్నది.

"నేనేమీ అనడంలేదు. మరొక్కసారి రవీంద్ర విషయం ఆలోచించ మంటున్నాను."

ఏమిటి ఇతని ధైర్యం? అసలు అతనెవరు తనను ఆజ్ఞాపించడానికి?

"ఆలోచించవలసిన అవసరం నాకులేదు" అన్నది రాధ.

"అని అంటున్నారు పైకి. కాని ఆలోచిస్తూనే వున్నారని నాకు తెలుసు."

తెరిచివున్న పుస్తకంలా తన భావాలను చదివేస్తున్న ఇతనితో మాట్లాడటం ఎలా?

''సారీ! మీరు అతిగా మాట్లాడుతున్నారు '' రోషంగా అన్నది రాధ.

రాహుల్ చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వుచూస్తే రాధ మనసు భగ్గుమన్నది

' అతిగా మాట్లాడటం నా స్వభావం కాదు కాని మిమ్మల్ని చూస్తుంటే మాటలు వచ్చేస్తున్నాయ్ కారణం ఏమిటో ఇంటికివెళ్లి ఆలోచిస్తాను '' అన్నాడు రాహుల్.

రాధకు అతని ఎదురుగా కూర్చోవాలంటే ఇబ్బందిగా వుంది ముఖంలోకి చూడ లేకుండా వుంది ఏదో బలహీనత తనను చుట్టేస్తున్నట్టు అనిపించింది చేతిగోళ్లకు వేసుకున్న రంగుకేసి చూస్తూ కూర్చుంది.

''వెళ్లొస్తాను.''

రాధ తలెత్తింది అప్పటికే వెనక్కు తిరిగాడు వెళ్లిపోయాడు. అతను వెళ్లి పోయిన వైపు చూస్తూ కూర్చుండి పోయింది.

వెళ్లిపోయాడు! ఏం మనిషి? ఎంత సూటిగా ధైర్యంగా మాట్లాడాడు? ఎట్లా వచ్చాడో అట్లాగే వెళ్లిపోయాడు

మళ్లీరాడేమో? ఎందుకొస్తాడు? అతను వస్తే తనకేం? రాకపోతే తనకేం! రావాలి! వస్తాడు! అరే! ఏమిటి తను ఇలా ఆలోచిస్తుంది? తన స్వభావానికి విరుద్ధంగా. తను ఓడిపోయింది లేదు లేదు తను ఓడిపోకూడదు. ఓడిపోతే, ఓడిపోయినరోజు తను వుండదు తను వున్నంతకాలం తనకు ఓటమిలేదు

తనని చుట్టేస్తున్న ఈ దిగులేమిటి? దేన్నో అన్వేషిస్తూ ప్రతి నిమిషం అశాంతిగా పయనించే తను అకస్మాత్తుగా ఆగిపోయినట్టు అనిపిస్తుందేమిటి?

తనకు పరిచయమైన ప్రతి మగవాడిలో ఏదో ఒక బోలుతనం తనకు కన్పిం చింది. కాని రాహుల్ ముందు తనకు తనే బోలుగా కన్పిస్తోంది అతని ముందు తన అహం కరిగిపోతూంది. తన మనసులోని ఖాళీ నిండుతోంది

అతను మళ్లీ రాకపోతే? తప్పక వస్తాడు. రావాలి. వచ్చి తీరాలి వస్తాడని తన అంతరాత్మ చెబుతూంది రాడు వస్తాడు రావాలి హే భగవాన్

రాధ తెల్లవారు ఝామున ఎవరో వీపు తట్టినట్టు మేల్కొన్నది. మెలకువస్తూనే ఆమె కళ్లలో కదిలింది రాహుల్ రూపమే బుర్రలో మెదిలింది రాహుల్ ఆలోచనే.

తనను గురించి ఒకసారి విమల అన్నమాటలు రాధకు గుర్తొచ్చాయి.

''మరీ అంత గర్వంగా ప్రవర్తించకు. నీలాంటివాళ్లు ఒకసారి ప్రేమలో పడిపోతే మళ్లీ తేలరు ''

ఇది ప్రేమా? తను రాహుల్ని ప్రేమిస్తుందా? ఛ! తనేమిటి! ప్రేమించడ మేమిటి? సినిమాల్లోలాగా, కథల్లోలాగా కన్పించగానే ప్రేమించడం ఏమిటి, అసలు 'ప్రేమ' అంటేనే తనకు గిట్టదు నూటికి తొంభయి తొమ్మిది మందికి వుండే బలహీనత తనలో వుండదు వుండకూడదు.

ఆరోజు పాఠాలు చెప్తున్నా, తోటి వారితో మాట్లాడుతున్నా అన్య మనస్కం గానే వుంది రాధ.

బస్ స్టాండ్‌లో నిల్చుంది బుర్ర చెదల పుట్టలావుంచి చిరాగ్గావుంది. ఎంత ప్రయత్నంచినా రాహుల్ గురించి ఆలోచించకుండా వుండలేకపోతూంది రాహుల్ మళ్లీ వస్తాడా?

తనకు కావాల్సిన బస్ పదనిముషాల్లో వస్తే వస్తాడు మళ్లీ బస్ రాకపోతే రాడు అనుకుంది ఆత్రంగా గడియారంకేసి చూడసాగింది. బస్ రాకపోతే? గడియారంలో సెకండ్లు చూపించే ముల్లు పరిగెత్తుతున్నట్లనిపించింది. ఐదు ఆరు ఏడు ఎనిమిది తలెత్తి బస్‌వచ్చే దిక్కుకు చూసింది, దూరంగా ఏదో బస్ వస్తుంది బస్ వస్తోంది. అతను వస్తాడు, ఏదో సంతోషం సంతృప్తి బస్ దగ్గరకు వచ్చింది కాని ఆ బస్ తనకు కావాల్సిన బస్‌కాదు. ఎవరో బాల్చీతో నెత్తిమీద చల్లటి నీరు గుమ్మరించినట్టయింది. ఛ! అన్ని బస్‌లూ వస్తాయి మనకు కావాల్సిన బస్ మాత్రంరాదు. గడియారం చూసు కుంది. పదహేను నిముషాలు అయింది ఆ గడియారం విసిరి రోడ్డుమీద కొట్టాలని పించింది. అంతలో బస్ వచ్చింది. బస్ కండక్టర్‌మీద కోపం వచ్చింది ఐదు నిము షాలు ముందు తీసుకొస్తే ఏం పోయేదో!

ఏమిటి తను ఇంత పిచ్చిగా ఆలోచిస్తూంది, మళ్లీ అదే ఆలోచన! బస్ దిగే ప్పటికి రోజూ కన్పించే ఆ ముసలి బిచ్చగాడు కన్పిస్తే అతను తప్పక వస్తాడు రాధ బస్ దిగింది. బిచ్చగాడు రాలేదు, ఆత్రుతతో బస్‌స్టాండ్ అంతా కలయజూసింది. వాడు కన్పించలేదు. వెధవకు ఇవ్వాళ ఏమైంది, రేపటినుంచి కన్పించినా తను ఒక్క పైసా కూడా ఇవ్వదు. వాడు చచ్చి గీపెట్టినా తను ఇవ్వదుగాక ఇవ్వదు.

బిచ్చగాడు లేడు అయితే రాహుల్ రాడా, బిచ్చగాడూ, రాహుల్, రాహుల్ బిచ్చగాడూ! ఛ! ఏమిటిది? రాహుల్ బిచ్చగాడేమిటి? తనకు మతిపోతోంది. ఇక అతన్ని గురించి ఆలోచించకూడదు

భోజనంచేసి పుస్తకం పట్టుకొని కూర్చుంది. పుస్తక పఠనంలో మనసు లగ్నం కావడంలేదు గోడకేసి చూస్తూ కూర్చుంది, బల్బ్ వెలుగుతోంది బల్బ్ పైగా గోడ మీద బల్లి రెక్కల పురుగు కోసం చిన్నగా కదులుతోంది.

"ఆ బల్లికి ఆ పురుగు చిక్కితే రాహుల్ వస్తాడు!" అనుకుంది.

బల్లికేసి రెప్పవాల్చకుండా ఆత్రంగా చూస్తోంది బల్లి ఆగివుంది. ముందుకు పోవడంలేదు కదల్దేం, కదుల్తోంది. పోజు మార్చి మళ్లీ ఆగిందేం, వదల్దు! అది ఆ పురుగును పడుతుంది

మనసులోనే భగవంతుణ్ణి ప్రార్థించింది.

"భగవాన్! స్వామీ, వెంకటేశ్వరస్వామీ! నువ్వు వున్నావా లేవా అనే మీమాంస నన్నింతకాలం పట్టుకుంది. నువ్వు నిజంగా వుంటే నీ మహాత్మ్యం చూపించు.

ఆ పురుగు ఎగిరి పోకుండా చూడు! ఆ బల్లి నోట్లో పడేలా చెయ్యి. అప్పుడే నువ్వు వున్నట్టు నమ్ముతాను '

బల్లి పురుగుమీదకు దూకింది. పురుగు ఎగిరిపోయింది రాధ మనసులో మినుకు మినుకు మంటున్న ఆశ ఆరిపోయింది కోపం వచ్చింది. భగవంతుడిమీద కోపంవచ్చింది. ప్రాణ భయంలో ఎగిరిపోయిన పురుగుమీద కోపం వచ్చింది పురుగును పట్టటంకూడా చేతగాని బల్లి మీద కోపం వచ్చింది ఆ బల్లిని ఆ గోడమీదనుంచి ఆ ఇంట్లోనుంచే వెళ్ల గొట్టాలనిపించింది.

అంటే అంటే రాహుల్ ఇకరాడు. తనకు కన్పించడు. ఏం కన్పించకపోతే, రాకపోతేనే మంచిది అసలు తనకు అతను రావాలని లేనేలేదు.

అనుకోకుండా బల్లి కేసి చూసింది మళ్లీ పురుగు కొంచెం దూరంలో వాలివుంది. బల్లి ముందుకు కదులుతూంది. "నీకు అది దొరక్కూడదు" పైకే అనేసింది.

బల్లి పురుగుమీదకు దూకింది పురుగు బల్లికి చిక్కింది. రాధ మనసు చివుక్కు మంది. బల్లి మీద కోపం వచ్చింది పురుగును తల్చుకొని జాలిపడింది తనమీద తనకే జాలి కలిగింది

"సిస్టర్ దాహం వేస్తుంది."

సిస్టర్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

# 15

"సిస్టర్?"

"ఏం రాధా, ఏం కావాలి,"

"చలివేస్తుంది."

"దుప్పటి తొలిగిపోయింది చూడనేలేదు " అంటూ గ్రేస్ రాధమీద దుప్పటి కప్పింది.

"ఆ( ఆ తర్వాత ఏమైంది రాధా' రాహుల్ మళ్లీ వచ్చాడా?" ఆరాటంగా అడింది గ్రేస్

రాధ పేలవంగా నవ్వి చెప్పసాగింది

. .

ఆరోజు ఆదివారం. రాధ ప్రతి నిముషం రాహుల్ కొరకు ఎదురు చూసింది. ఎవరిదో అడుగుల శబ్దం అవుతోంది. రాధ ఆత్రంగా లేచి నిల్చుంది రాజేశ్వరి లోపలకు వచ్చింది. రాధ దిగాలుపడిపోయింది.

"ఏమిటి రాధా అలావున్నావేం," ఎప్పుడూ రాధ రాజేశ్వరిని అడిగే ప్రశ్న రాధను రాజేశ్వరి అడిగింది.

"ఏంలేదు బాగానే వున్నానే, ఎలా వున్నాడు మీ హీరో!" మాటమార్చే ఉద్దేశంతో అడిగింది రాధ.

రాజేశ్వరి జవాబివ్వలేదు. తల దించేసుకుంది.

"ప్రేమలేని వివాహం, వివాహంలేని ప్రేమ-వీటిలో మొదటిది వ్యక్తిని బాధిస్తుంది-రెండవది సంఘాన్ని బాధిస్తుంది. నేననుకోవడం సంఘం బాధపడినా ప్రమాదం లేదు, వ్యక్తుల సంతోషం ముఖ్యం"

రాజేశ్వరి చివ్వున తలెత్తి రాధ ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది.

"ఏమిటలా చూస్తావ్? ఆ మాటలు నా స్వంతం కాదులే, బుచ్చిబాబు అన్నాడు" అన్నది రాధ చిరునవ్వుతో.

రాజేశ్వరికి రాధలో ఏదో మార్పు కనిపించింది ఆలోచనలో పడింది

"మనిషి ఒంటరిగా బతకడానికి భయపడి సంఘంగా మారాడు చివరకు సంఘమే మనిషిని భయపెట్టసాగింది. సంఘానికి భయపడి వ్యక్తి ఆత్మవంచన చేసుకుంటున్నాడు. మీరిద్దరూ సంఘానికి భయపడి ఆత్మవంచన చేసుకుంటున్నారు."అన్నది రాధ ఆవేశంగా.

"ఏం చెయ్యమంటావ్ రాధా! మా పరిస్థితి నీకు అర్థంకాదు."

"ఎందుకు కాదు. నాకు అర్థం అయింది కనకనే చెబుతున్నాను నీ కిష్టమయిన వ్యక్తితో, నువ్వు ప్రేమించిన వ్యక్తితో ధైర్యంగా పదిమంది ముందు తలెత్తుకొని తిరగటానికి ఎందుకు భయపడాలి?"

రాజేశ్వరికి ఆశ్చర్యం వేసింది. "ఉంపుడు గత్తెగా వుంటావా?" అసహ్యకరమైన పదార్థం నిండివున్న కుండను తనముందు ఢిల్లున పగలేసినట్టు ఆ మాటలు అన్న రాధేనా ఇవ్వాళ ఇలా మాట్లాడుతుంది.

"నా మాటలు నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయ్ గదూ," రాధ వాక్యం పూర్తి అవకముందే రాహుల్ వచ్చి నిల్చున్నాడు.

రాధ తడబాటు చెందింది రాధ కళ్ళూ ముఖం వింత కాంతితో వెలిగిపోవడం రాజేశ్వరి గమనించింది ఏదో అర్థం అయినట్టు ముసిముసిగా నవ్వుకుంది రాజేశ్వరి.

"సారీ డిస్టర్బ్ చేశానా?" అన్నాడు రాహుల్.

"అబ్బే లేదు. కూర్చోండి. ఈమె నా స్నేహితురాలు రాజేశ్వరి. వారు "

"నా పేరు రాహుల్ కే. జీ. ఆసుపత్రిలో డాక్టర్ని." రాధమాటను మధ్యలోనే అందుకొని తన పరిచయం ఇచ్చుకున్నాడు.

రాజేశ్వరి ఏదో పని వుందంటూ వెళ్ళిపోయింది.

"నేను మళ్ళీ రాననుకున్నారు గదూ?" అన్నాడు రాహుల్ నవ్వుతూ.

రాధకు సమాధానం వెంటనే స్ఫురించలేదు. అతని ప్రశ్న రాధను తికమక పెట్టింది. వినిపించుకోనట్టు "కాఫీ తెస్తాను."అంటూ అతని సమాధానానికి ఎదురుచూడకుండానే లోపలకు వెళ్ళిపోయింది. రాధ మనసులో రేగిన సంచలనాన్ని అదుపులో

పెట్టుకొనే ఉద్దేశంతో లోపలకు వెళ్ళింది. ముసలమ్మకు కాఫీ పెట్టమని చెప్పి తను అద్దం ముందుకెళ్ళి నిలబడింది. ముఖం జిడ్డుగా అన్పించి తడి బట్టతో తుడుచుకుంది. పౌడర్ వేసుకొని తిలకంతో దోసగింజ బొట్టుపెట్టుకుంది ముంగురులు సవరించుకుంది. చీర మార్చుకోవాలనుకుంది కాని చీర మార్చుకుంటే అతను గమనిస్తాడని మానేసింది.

కాఫీ కప్పు రాహుల్‌కు అందిస్తుంటే కొంచెంగా చెయ్యి వణికింది. తన కప్పుతో ఎదురు కుర్చీలో కూర్చుంది

"ఏమండీ బయటికి వెళ్ళబోతున్నారా?" కాఫీ సిప్ చేస్తూ అడిగాడు.

"లేదు. ఏం?" అన్నది అతనికేసి చూడకుండానే.

"పౌడరు రాసుకొని, తలదువ్వు కొచ్చారుగా? అందుకే అడిగాను." అన్నాడు.

రాధ చివ్వున తలెత్తి చూసింది రోషంతో మనసు భగ్గుమంది. "నా కోసమేనా ఈ అలంకరణ?" అన్నభావం అతని మాటల్లో ధ్వనించింది

ఏదో అనాలనుకుంది. కాని ఏమంటుంది, అతని మాటలో నిజం లేకపోలేదుగా.

"పొడవు బొట్టు మీకు ఎక్కువ అందాన్ని ఇస్తుందనుకున్నారా? గుండ్రటి బొట్టే బాగుంది."

రాధ ముఖం రోషంతో జేవురించింది

"కోపం వచ్చిందా? కోపంగా వుంటే మీరు అందంగా కన్పిస్తారు."

ఏమిటి ఇతని ధైర్యం, తనను ఏడ్పించడానికే ఇలా మాట్లాడుతున్నాడు. రవీంద్ర స్నేహితుడు. రవీంద్రకు అన్యాయం జరిగిందనే కసి కొద్దీ ఇలా మాట్లాడు తున్నాడు. రాధకు కోపంగా జవాబివ్వాలనివుంది కాని అతని మాటల్లో ప్రశ్నలేదు. సమాధానం అంతకంటేలేదు 'చాలా తెలివైనవాడు' అనుకుంది

"ఇతనికి పెళ్ళయిందేమో?" అనుమానం వచ్చింది రాధకు.

"మీకు పిల్లలున్నారా " మాటమార్చే ఉద్దేశంతో అడిగినట్టు అడిగింది.

రాహుల్ ఓ క్షణం జవాబివ్వలేదు. రాధ ముఖంలోకి చూశాడు. తనలో తను నవ్వుకుంటూ "ఒక్కడే వాడి వయసు ఆరునెల్లు?" అన్నాడు.

రాధ మనసు కలుక్కుమంది. కాని బాధ ముఖంలో కన్పించకుండా వుండేం దుకు జాగ్రత్తపడింది. తెచ్చిపెట్టుకున్న నవ్వుతో "మీ అబ్బాయి పేరేమిటి?" అడిగింది.

రహుల్ పకపక నవ్వాడు రాధ అతని ముఖంలోకి విస్మయంగా చూసింది.

"నాకు పెళ్ళయిందో లేదో తెలుసు కోవాలని వుంటే సూటిగా అదే ప్రశ్న వెయ్యవచ్చుగా?" అన్నాడు.

రాధకు తలకొట్టేసి నట్టనిపించింది. "మీకు పెళ్ళయితే నాకేం కాకపోతే నాకేం? మీరు టూ మచ్‌గా మాట్లాడుతున్నారు." రోషంగా అన్నది రాధ.

"ఉన్నమాటంటే అంత ఉలుకెందుకండీ! నాకు ఇంకా పెళ్ళికాలేదు. ఎలిజిబుల్ బ్యాచులర్నే!" అన్నాడు కొంటెగా చూస్తూ.

అంత చొచ్చుకుపోయే వ్యక్తితో ఎట్లా మాట్లాడాలో రాధకు అర్థం కావడంలేదు. కందగడ్డలావుంది ముఖం మౌనంగా కూర్చుంది. ఇబ్బందిగా కుర్చీలో కదిలింది.

"మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలాకాలం క్రితం చదివిన ఇంగ్లీషు నవలలోని ఒక పాత్ర గుర్తొస్తుంది." అన్నాడు రాహుల్.

రాధ తలెత్తి చూసింది. తనను గురించి ఎందరో ఎన్నోరకాలుగా పొగిడారు. కాని కథలో పాత్రలా వున్నదని ఎవరూ అనలేదు. రాధకు అతనిమాట కొత్తగా అని పించింది. కాని అది పొగడ్తో, వ్యంగ్యమో అర్థం కాలేదు.

"ఆ పాత్ర గురించి వినాలని లేదా," అతను సిగరెట్ పొగ ఊది అడిగాడు.

"లేదు." అన్నది వినాలని వున్నప్పటికీ.

"అబద్ధం! మీకు వినాలని వుందని నాకు తెలుసు. అయినా మీరు చెప్పమంటే గాని చెప్పను. మీరు అడగరని కూడా నాకు తెలుసు" అన్నాడు.

ఏమిటీ మనిషి? తనను తెరిచివున్న పుస్తకాన్ని చదివినట్టు చదివేస్తున్నాడు?

చాలా సేపటివరకూ రాహుల్ మాట్లాడక పోవడంతో రాధ తలెత్తి చూసింది. అతను సుళ్లు తిరుగుతున్న సిగరెట్ పొగలోకి చూస్తున్నాడు. రాధకు అతని ముఖం తనివి తీరా చూసే అవకాశం లభించింది. ఆ ఫేస్ ఎంత థాట్‌ఫుల్‌గా వుందో! ఆ కళ్లు ఎంత భావయుక్తంగా వుంటాయో! ఎక్కడా బోలుతనం కన్పించదు.

రాహుల్ చూపులు పొగ నుంచి విడివడి రాధ ముఖంమీద నిల్చాయి. రాధ కళ్ళు తిప్పుకుంది.

"వస్తాను" అంటూ దిగ్గున లేచి నిల్చున్నాడు.

"అభీనజావో ఛోడ్‌కర్-అభీతో కుచ్ కహానహీఁ-అభీతో కుచ్ సునా నహీఁ!" పాట విన్పిస్తోంది.

వెంటనే రాధకు నవీన్ వ్రాసిన అంపశయ్య నవల గుర్తొచ్చింది. ఆ రచయిత ఈ పాటని ఎంత చక్కగా ఉపయోగించుకున్నాడు? ఎంత వాస్తవంగా చిత్రించాడు! తనకు ఇప్పుడు సరిగా అలాగే అనిపిస్తోంది. ఆ హీరో ఒకమ్మాయిని గురించి అన్న మాటలే తనకూ అనాలనిపిస్తోంది

"ఆ పాట బాగుంది కదూ?" తృళ్ళిపడి రాహుల్ ముఖంలోకి చూసింది క్రింది పెదవిని ముని పంటితో నొక్కుతూ, కళ్ళు చిన్నవి చేసి తమాషాగా చిరునవ్వు నవ్వాడు.

రాధ అహాన్ని అతని నవ్వు గాయపర్చింది.

"వస్తాను," అంటూ గబగబా వెళ్ళిపోయాడు.

మళ్లీ అదే పాట వినిపిస్తోంది. అవును వెళ్ళిపోయాడు. కాని తను వెళ్లవద్దని చెప్పలేదు. అతను ఏమీ చెప్పలేదు ఇంకా. తను కూడా ఏమీ వినలేదు. వెళ్ళిపోయాడు.

రాధ అనుకోకుండానే పెన్ చేతులో వుంటే కనిపించిన కాగితం మీదల్లా "రాహుల్! రాహుల్!" అని రాస్తోంది. కాగితం దొరక్కపోతే అర చేతిలో రాసుకొని చెరిపేస్తూంది.

ఏమిటి తనకీ పిచ్చి? అతను తనను గాయపరుస్తున్నాడు. అయినా తను అతని కోసం ఎదురు చూస్తోంది.

మరో వారం గడిచింది. కాని రాహుల్ రాలేదు. రాధకు దిగులుగా వుంది. ఇంకో వారం కూడా గడిచింది.

అతను రాడు. కేవలం తన స్నేహితునికి జరిగిన అన్యాయానికి ప్రతీకారంగా రెండు మూడుసార్లు వచ్చి తనను లోతుగా గాయపర్చడానికి ప్రయత్నించాడు అతను డాక్టర్. శ్రీమంతుడిలా కన్పిస్తున్నాడు. తన పిచ్చి కాకపోతే అతను తనమీద ఇష్టం కొద్దీ వస్తున్నాడని ఎందు కనుకోవాలి? తనేం పెద్ద సౌందర్యవతి కాదు తనలో ప్రత్యేకం అతన్ని ఆకర్షించ గలిగే విశేషం ఏమీ లేదు రెండు వందలు సంపాదించు కొనే ఒక టీచర్, అతనిని గురించి ఆలోచించడం, మనసు పాడుచేసుకోవడం తన తెలివితక్కువ తనాన్నే ఎత్తి చూపిస్తుంది

"ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?"

రాధ తడబడుతూ లేచి నిల్చుంది. ఎంత పొడవుగా ఎంత ఠీవిగా కన్పిస్తున్నాడు?

రాహుల్ కూర్చున్నాడు రాధ కూర్చుంది. రాహుల్ ఆమెనే చూస్తూ మౌనంగా కూర్చున్నాడు. రాధకు ఇబ్బందిగా వుంది. సిగ్గు సిగ్గుగా వుంది.

ఏమిటి తనుకూడా సిగ్గు పడుతోంది. అతని ముఖంలోకి చూసి మాట్లాడాలంటే ఏదోగా అనిపిస్తోంది తనలో బలహీనత చోటు చేసుకుంది

"ఈ చీరలో మీరు చాలా బాగున్నా రనుకుంటున్నారు గదూ."

రాధ అంతరాంతరాల్లో ఏదో కలుక్కుమన్నది. నిజంగా ఆమె అలా అనుకొనే ఆ రోజు ఆ ఆకుపచ్చ రంగు చీర కట్టుకున్నది

"బాధ కలిగించానా?" అతని కంఠంలో జాలి వుంది వ్యంగ్యం లేదు

రాధ అహం దెబ్బతిన్నది. వ్యంగ్యాన్నైనా భరించ గలదు, కాని జాలిని భరించ లేకపోయింది అతను తనను చూసి ఎందుకు జాలిపడాలి?

"ఆ రంగు నాకిష్టం! మరొకరికి బాగుండాలని కట్టుకోలేదు."

"గుడ్! మీకు నామీద కోపం కూడా వస్తుందన్నమాట?" అతను తన బల హీనతను ఎత్తి చూపినట్టనిపించింది రాధకు.

కోపం వచ్చింది. కాని ఏమీ అనలేక పోయింది.

"మీరు మీ మనస్సు చాలా గట్టిది అనుకుంటారు. కాని చాలా మెత్తనైన మనసు మీది," అన్నాడు రాహుల్ రాధ కళ్లలోకి చూస్తూ.

ఆ రోజు రాహుల్ పది నిముషాలు మాత్రం కూర్చుని వెళ్ళిపోయాడు. రాధకు దుఃఖం పొర్లుకొచ్చింది. గది తలుపులు మూసుకొని మంచానికి అడ్డంపడి వెక్కి వెక్కి ఏడ్చింది.

తను ఓడిపోయింది. పూర్తిగా ఓడిపోయింది. సృష్టి క్రమాన్నే జయించగలననే

తన గర్వం అణగిపోయింది. తన అహం కరిగిపోయింది. తనూ మామూలు జీవితం కోసమే... అదే అమ్మా, అమ్మమ్మల జీవితం కోసమే తపిస్తోంది.

రాహుల్ అప్పుడప్పుడు వస్తూనే వున్నాడు. అతను రాధకు ఎక్కడా అందడం లేదు. అతనికి తనంటే ఇష్టమో కాదో కూడా తెలుసుకోలేక పోతుంది. రాత్రింబవళ్ళు మనసు మధన పడుతోంది

సంవత్సరం గడిచిపోయింది. రాధ ఇప్పుడిప్పుడే కొంచెం తడబాటు లేకుండా అతని ముందు కూర్చో గలుగుతుంది. కాని ఇద్దరి మధ్యా దూరం తరగలేదు.

ఒకరోజు రాహుల్ జేబులో నుంచి సిగరెట్ పెట్టె తీస్తూ వుంటే ఫోటో ఒకటి కింద పడింది.

రాధ వంగి అందుకొన్నది. ఫోటో కేసి చూడసాగింది. అది ఒక అందమైన అమ్మాయి ఫోటో. రాధ మనసు చివుక్కుమన్నది.

''ఏమిటి అంత శ్రద్ధగా చూస్తున్నారు? ఆ అమ్మాయి బాగుందా?''

''బాగానే వుంది,'' అంటూ ఫొటో బల్లమీద వుంచింది.

''ఏమిటంత నీరసంగా అంటున్నారు? ఈర్ష్య కలుగుతుందా?'' అదోలా పలికింది అతని కంఠం.

రాధ చివ్వున తలెత్తి చూసింది. కోపంతో ముక్కుపుటాలు ఎర్రబడ్డాయి.

''నాకెందుకు ఈర్ష్య?'' అన్నది కొంచెం తీవ్రంగానే.

''మీకు కాక మరెవరికి ఈర్ష్య వుంటుంది? ఏదీ? నా కళ్ళలోకి చూసి చెప్పండి అదే మాట?''

''మీరు అనవసరంగా ఏదేదో ఊహించు కుంటున్నారు. మీ గర్ల్ ఫ్రెండ్‌ను గురించి ఈర్ష్య పడాల్సిన కర్మ నాకేం లేదు,'' అన్నది రోషంగా. కాని ఆ మాటలు అంటున్నప్పుడు అతని ముఖంలోకి చూడలేదు. పక్క చూపులు చూస్తూ అన్నది.

''గరల్ ఫ్రెండ్ కాదు. నా కాబోయే భార్య ''

రాధ హృదయానికి విసురుగా కంకరరాయి తగిలినట్టు విలవిల లాడిపోయింది. ముఖంలో బాధ కన్పించకుండా వుండే ప్రయత్నంలో ''అలాగా? పెళ్లెప్పుడూ?'' అని చిరునవ్వుతో అడిగింది. రాధకు తన నవ్వు తనకే ఎబ్బెట్టుగా తోచింది.

''నా పెళ్ళికి వస్తారా?''

''ఎందుకు రానూ?'' కంఠంలో ఏదో అడ్డుపడుతూ వుంటే బలవంతంగా అన్నది.

''నిజంగా? ఏదీ ఆ మాట నా ముఖంలోకి చూసి చెప్పండి?''

ఏమిటి ఇతని ధోరణి? తనను ఏమనుకుంటున్నాడు? రోషం, దుఃఖం కంఠంలో నేను ముందంటే నేను ముందని పోటీ పడ్డాయి.

''ఏమిటి మీ ఉద్దేశం?'' చాలా తీవ్రంగా అడిగింది.

"అబ్బే! ఉద్దేశాని కేముందీ? మీ వెలవెలా పోతున్న ముఖం, మీ బోలు నవ్వూ చూసి ఏదో అనుకున్నాను లెండి. బాధ కలిగిస్తే క్షమించండి," అన్నాడు.

రాధ మౌనంగా కూర్చుంది. రాహుల్ కూడా ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

"వెళ్లొస్తాను," అంటూ లేచాడు.

రాధ తలెత్తి చూడలేదు. అవమానం జరిగినట్టు బాధపడసాగింది. అతను వెళ్ళిపోయాడు.

నిజంగా ఆ ఫోటో అతని కాబోయే భార్యదేనా? అయితే ఇక్కడకు ఎందుకు వస్తున్నాడు? తనలో ఆశలు రేకెత్తించడంలో అతని ఉద్దేశం ఏమిటి? తనను ఇలా ఆడించడంలో అతనికి లభించే దేమిటి? ఇదో సరదా ఆటగా వుందా?

తను పేక ముక్కలతో మేడ కట్టుకొని అందులో కాపరం చెయ్యాలని ప్రయత్నిస్తోందా? అతను పేక ముక్కల్ని తన ముందుకు విసిరాడు తను పసిపిల్లలా ఆ పేక ముక్కల్తో మేడ కట్టడానికి ప్రయత్నిస్తూంది. అవి మధ్య మధ్య పడిపోతూ వుంది. తను మళ్లీ మళ్లీ కడుతూంది అది చూసి అతను వ్యంగ్యంగా నవ్వుకుంటున్నాడు.

రాధ గుండెల్ని ఎవరో పిండుతున్నట్టని పించింది. మనసును ఏదో మొండి కత్తి కోస్తూ వుంది.

"సిస్టర్! దాహం!"

గ్రేస్ స్పూన్‌తో గొంతులో నీళ్లు పోసింది.

# 16

"రాధా! ఎలా వుందమ్మా?"

"బాగానే వుంది సిస్టర్. మనసు మరీ తేలిగ్గా వుంది ఇంత కాలంనుండి మనసులో ఘనీభవించిన ఆవేదన కరిగిపోతున్న ట్టనిపిస్తోంది. ముసురు పట్టిన ఆకాశంలా వున్న మనసుకు సూర్యరశ్మి సోకినట్టూ, మబ్బులు విచ్చిపోతున్నట్టూ వుంది." అన్నది రాధ.

గ్రేస్ రాధ ముఖంలోకి పరీక్షగా చూసింది. ఆ ముఖం తేటగా కన్పించింది. డాక్టర్ అన్నమాటలు గుర్తు వచ్చాయి. గ్రేస్ ముఖం ఆనందంతో వెలిగిపోయింది. గడియారంకేసి చూసుకుంది.

"ఐదున్నర దాటుతోంది మరో అర్ధగంట దాటిపోతే రాధ మృత్యు ముఖం నుంచి బయటపడినట్టే." అనుకుంది గ్రేస్.

"రాహుల్ చివరకు మోసంచేశాడా రాధా?" గ్రేస్ ఆత్రంగా అడిగింది.

"అలా అని చెప్పలేను సిస్టర్. పూర్తిగా విని మీరే నిర్ణయించుకోండి ఎవరు ఎవర్ని మోసం చేశారో "

మరో ఆరునెలలు కూడా గడిచిపోయాయి పరిచయం అయి దాదాపు రెండు సంవత్సరాలైనా ఇద్దరిలో ఏ ఒక్కరూ ఒక అడుగు కూడా ముందుకు వెయ్యలేదు. రాధకు రాహుల్ పరిచయం అయిన మొదటి రోజునుంచి మాట్లాడిన ప్రతి మాటా జ్ఞాపకం వుంది. ఒంటరిగా వున్నప్పుడు మననం చేసుకుంటూ వుండేది. అతని మాటల్లో ఎక్కడైనా తనను ప్రేమిస్తున్నట్టు బయటపడ్డాడా అని ఆలోచించేది. ఎంత ఆలోచించినా ఆమెకు పట్టుకొని ముందుకు వెళ్ళడానికి కొస కూడా దొరకడంలేదు.

ఆరోజు రాధకు మరీ చికాకుగావుంది. బాగా ఏడవాలని వుంది. గుండెలు పగిలేలాగ కాదు గుండెలు విచ్చేలాగ ఏడవాలని వుంది. అదికూడా ఆమెకు చేతకావడం లేదు

రాహుల తన వాకిట్లోకి వచ్చాడు. తలుపుమీద చెయ్యివేసి తట్టి పిలవాలా వద్దా అన్నట్టు ఆగిపోయాడు. తనులోపల గడియ పట్టుకొని పిలుపుకోసం ఎదురుచూస్తూ నిలబడిపోయింది. తనలో సహనం నశించిపోతూంది తలుపు తెరవాలనివుంది కాని తనకు రాహుల్ తత్త్వం అర్ధంకావడంలేదు. తీరా తలుపు తీశాక అతను నిర్లక్ష్యంగా నవ్వి గిర్రున తిరిగి వెళ్ళిపోతే? తన స్వభావాన్ని అర్థం చేసుకున్నాడు. తనను తెరిచి పెట్టిన పుస్తకంలా చదివేస్తున్నాడు కాని అతను మాత్రం ఎక్కడా అందడంలేదు. అతను తనను ప్రేమించడం ఏమిటి? కేవలం తన అహంకారంమీద దెబ్బకొట్టి, రవీంద్రకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్నాడు నిజంగా అతను తనను ప్రేమిస్తూ వుంటే ఇంతకాలం గుండెల్లో ఆ ప్రేమను దాచుకోగలడా? ఏమో! అలా దాచుకున్నాడు కనకనే తను అతనికొరకు తపిస్తూంది ఈ మధ్య రాహుల్ కొంచెం గంభీరంగా, ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు కన్పిస్తున్నాడు

రాహుల్ వచ్చాడు. రాధ విరక్తిగా, నిర్లక్ష్యంగా వుండిపోయింది. ఓ క్షణం ఆమెకేసి దీక్షగా చూశాడు

"ఇవ్వాళ మిమ్మల్ని ఒక చోటుకు తీసుకెళ్ళాలనుకుంటున్నాను. వస్తారా?"

రాధ చివ్వున తలెత్తి నమ్మలేనట్టు చూసింది. అతని ముఖంలో కొంటెతనం లేదు వ్యంగ్యంగా నవ్వడంలేదు.

"వస్తాను. నువ్వు రమ్మంటే ఎక్కడికైనా నది సముద్రంలోకయినా వస్తాను. సప్తసముద్రాలు దాటి కాకులు దూరని కారడవిలోకి, చీమలు దూరని చిట్టడవిలోకైనా వస్తాను." అని అనాలని పించింది రాధకు. కాని అనలేకపోయింది వెంటనే "వస్తాను" అంటే ఆ మాటకోసమే మొహం వాచివున్నట్టు అతని దృష్టిలో తేలికైపోతానని భయపడింది

"ఎక్కడికి?" కుతూహలం లేనట్టు ముఖంలోకి తెచ్చిపెట్టుకున్న నిర్లక్ష్యంతో అన్నది.

"డ్రామాకు. కాంప్లిమెంట్స్ వచ్చాయి. నా ఫ్రెండ్ ఒకామె ఆ నాటకంలో యాక్ట్ చేస్తూంది. అదే ఆ రోజు ఫోటో చూశారుగా? ఆమే?" అన్నాడు రాధ ముఖం లోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

"ఆ ఫోటో మీకాబోయే భార్యది అన్నారుగా?"

"మీకు బొత్తిగా బుర్రలేదు." అన్నాడు నవ్వుతూ.

అతను అంత చనువుగా "బుర్రలేదు." అన్నందుకు రాధకు కోపం రాలేదు. హృదయం స్పందించింది

'మీరు అనడం ఎందుకు? నువ్వు అనకూడదూ?' మనసులోనే అనుకుంది.

"బుర్రలేదు బుర్రలేదు " మరోసారి అంటే బాగుణ్ణు అనిపించింది. ఎంతకాలానికి ఆ మాత్రం చనువు తీసుకున్నాడు!

"సారీ! తొందరపడి, బుర్రలేదన్నాను " అన్నాడు

'పర్వాలేదు.' అనాలనుకుంది, కాని ఆ మాట కూడా అనలేకపోయింది.

"ఏం నాటకం?" మాట మారుస్తూ అడిగింది.

"అవోహ! వస్తారా?"

"నాటకానికా? ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?" గబుక్కున అనేసింది. అలా అన్నందుకు తనమీద తననే కోపం వచ్చింది

"ఏమనుకుంటారా? తెలియనివాళ్ళు భార్యా భర్తలు అనుకుంటారు. అమ్మాయి కంటే అబ్బాయే బాగున్నాడను కుంటారు, తెలిసినవాళ్ళు ప్రేమించుకుంటున్నారేమో అనుకుంటారు. అమ్మాయిలైతే అతను ఆమెలో ఏం చూసి ప్రేమిస్తున్నాడో అని ఈర్ష్య పడ్తారు."

రాధకు సిగ్గువేసింది. వెంటనే కోపం వచ్చింది. మరు నిముషంలో అభిమానం దెబ్బతిన్నట్టు రోషపడింది. ఆమె ముఖంలోని భావాలు తను ఆశించినట్టే కన్పించాయి అన్నట్టు అదోలా నవ్వాడు. రాధకు అతని మీద ఎన్నడూ కలగని అసహ్యం కలిగింది.

"పొరపాటయింది మిమ్మల్ని నావెంట తిప్పుకోవడం మంచిది కాదని ఆలోచించలేదు. ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వగల స్థితిలో వున్నప్పుడే మనం కలిసి తిరగాలి. వస్తాను." అంటూ గబగబా వెళ్ళిపోయాడు

వెళ్తూ వెళ్తూ అతను అన్నమాటలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

అంటే అతను తమగురించి కాబోయే భార్యా భర్తలం అనిగానీ, ప్రేమికులం అనిగానీ, స్నేహితుల మనిగానీ చెప్పే స్థితిలో లేడన్నమాట! తను ఈ మూటిలో ఏ ఒక్కటీకాదు, అయితే ఎందుకు తన ఇంటికి వస్తున్నట్టు? రాధకు ఏడుపు రావడం లేదు. అయినా భోరున ఏడవాలనివుంది.

అసలు తనకే బుద్ధిలేదు. నిజంగానే బుర్రలేదు. అతను పిలవగానే బెట్టు చెయ్యకుండా "వస్తాను." అంటే ఇంతలోనే తనకు పోయింది ఏమిటి? పోనియ్ తను ఆ

మాట అన్నదేగాని మనసులో రావాలని వుందని అతను గ్రహించలేక పోయాడా? గ్రహించే వుంటాడు! మరోసారి రమ్మనకూడదూ? ఇక రాడేమో? రాకపోతే పోనీయ్! ఎంతకాలం తను ఈ త్రిశంకుస్వర్గంలో వేలాడుతూ వుంటుంది?

నెల రోజులు గడిచినా అతను రాలేదు. ఏదో పోగొట్టుకున్నట్టు దిగులు ఆమెను నిరంతరం వెంటాడుతూవుంది మృగం వెంటపడిన వేటగానిలాగ. ఒక్క నిముషం శాంతిలేదు నిద్రలో అకస్మాత్తుగా మెలుకువ వస్తుంది ఎవరో తనలోని ఒక భాగాన్ని బలవంతంగా గుంజుకు పోతున్నట్టు ఉలిక్కిపడి నిద్ర లేస్తుంది మొండి కత్తితో ఎవరో లోపల కూర్చుని తన హృదయాన్ని కోస్తున్నబాధ

ఎంత బింకంగా వుండటానికి ప్రయత్నించినా రాధ స్నేహితురాండ్రు "ఏం అలా వుంటున్నావ్?" అని అడుగుతూనే వున్నారు. "ఎలా వున్నాను? బాగానే వున్నానే!"అంటూ బోలుగా నవ్వేస్తూ వుంది.రాజేశ్వరి గ్రహించింది. కాని రాధ తత్వం తెలిసిన రాజేశ్వరిఏమీ అడగలేదు ఆ విషయం రాధకు తెలుసు.

రాధ పనిచేసే స్కూల్లో సుజాత అనే అమ్మాయి కొత్తగా టీచర్‌గా చేరింది. ఆమె శ్రీమంతుల బిడ్డ. ఆమె నెల జీతం ఆమె ఒక్కరోజు ధరించే దుస్తుల ఖరీదు వుండదు. "ఉద్యోగాలు దొరక్క జనం ఆత్మహత్యలు చేసుకొనే ఈ రోజుల్లో, ఇటు వంటివారికి ఉద్యోగం ఇచ్చే వాళ్ళకు బుద్ధిలేదు" అనుకొనేది రాధ సుజాతను చూసి నప్పుడు. సుజాత గర్వంగా కన్పించేది. ఎవరితోనూ కలిసిమెలిసి వుండేదికాదు. రాధతో మాత్రం చనువుగా వుండేది.

"రాధా! సాయంత్రం మా ఇంటికి రావాలి " ఆహ్వానించింది సుజాత.

"ఇవ్వాళకాదు మరోసారి వస్తాలే!" తప్పించుకోవాలని చూసింది రాధ.

"ఇవ్వాళే రావాలి. ఇవ్వాళ నా పుట్టిన రోజు."

రాధ దగ్గర "వస్తాను!" అనిమాట తీసుకొనిగాని సుజాత వదల్లేదు.

ఇంత వయసువచ్చి కూడా పుట్టిన రోజులు చేసుకుంటారు కాబోలు శ్రీమంతులు. తన పుట్టిన రోజు తనకు జ్ఞాపకమే వుండదు.

ఆ సాయంత్రం రాధ తనకున్న వాటిలో మంచిది అనుకున్న చీర కట్టుకొని బయలుదేరింది. తీరా వెళ్ళాక "ఎందుకు వచ్చాను!" అనుకొని బాధపడింది. సుజాత శ్రీమంతుల బిడ్డ అని తెలుసు కాని అంత ఐశ్వర్య వంతులని తెలియదు ఆ ఇల్లూ, ఆ అలంకరణా, అప్పటికే అక్కడ వున్నవాళ్ళూ, ఆ వాతావరణం అన్నీ రాధకు తనను ఎబ్బెట్టుగా ఎత్తి చూపిస్తున్నట్టని పించింది సుజాత స్నేహితులంతా రాధను అదోలా చూశారు సుజాత రాధను వాళ్ళకు పరిచయం చేసింది. ఎవరూ ఆమెతో మాట్లాడాలనే కుతూహలాన్ని చూపించలేదు రాధ పక్కగావున్న కుర్చీలో ముడుచుకు పోతూ కూర్చొంది. విద్యుద్దీపాల మధ్యన ఆముదపు దీపంలా వున్నాననుకుంది. ఎంత త్వరగా ఆ వాతావరణంనుంచి బయటపడదామా అని వుంది. అందరూ జోక్స్ కట్

చేసుకుంటూ, ప్రతి చిన్నదానికీ చాలా పెద్దగా నవ్వుతున్నారు. సుజాత చుట్టూ మూగిన యువతుల్నీ యువకుల్నీ చూస్తూ కూర్చుంది. ఆ యువతుల్లో కొందరు కోడి పెట్టల్లా, కొందరు బాతుల్లా మరికొందరు ఆడ నెమళ్ళలా కన్పించారు రాధ కళ్లకు. వాళ్ళను చుట్టుకొని తిరుగుతున్న యువకులు కోడి పుంజుల్లా ఖజానా బాతుల్లా కన్పించారు. ఒక్కరూ పురి విప్పిన మగ నెమలిలా కన్పించలేదు.

"ఏమోయ్! ఇంకా ఆలస్యం ఎందుకు? ఆ మర్చిపోయాను మీ హీరో ఇంకా రాలేదేం?" ఒక కోడి పెట్ట అన్నది. రాధకు ఆమె "కి కీ కీ కీ" అంటున్నట్టనిపించింది.

"అడుగో వస్తున్నాడు." అన్నది ఒక బాతు.

సుజాత ముఖం సంతోషంతో వెలిగిపోతూవుంది. రాధ కళ్ళు వాకిలివైపుకు తిరిగాయి. అప్పుడే లోపలకువచ్చిన వ్యక్తిని చూసి రాధ స్థాణువులా బిగుసుకుపోయింది.

యువతులంతా బిలబిల మంటూ రాహుల్ చుట్టూ చేరారు. ఏవేవో జోక్స్ వేస్తున్నారు. యువకులు కొందరు ఈర్ష్యగా చూస్తున్నారు. సరదాగా నవ్వుతూ మాట్లాడుతున్న రాహుల్ కళ్ళు రాధమీద నిల్చాయి. అతని నవ్వు ఆగిపోయింది

"ఆ శాల్తీని మీ హీరోకు పరిచయం చెయ్యవోయ్?" చిన్నగా అన్నది ఓ ఆడ నెమలి. అయినా ఆ మాటలు రాధకు విన్పించాయి.

రాహుల్ రెండడుగులు ముందుకు వేశాడు. రాధ వెర్రిదానిలా చూస్తూ కూర్చుంది. ఆమెకు అక్కడినుంచి పారిపోవాలనివుంది

"రాధ! మా కో టీచర్!" అంటూ పరిచయం చేసింది.

రాహుల్ తెలియనట్టే నమస్కరించాడు. రాధ కూడా బలాన్నంతా కూడదీసుకుంటూ నమస్కరించింది.

రాహుల్ ఓ క్షణం రాధ ముఖంలోకి చూసి దూరంగా వెళ్ళిపోయి చుట్టూ చేరిన వాళ్ళతో కులాసాగా నవ్వుతూ మాట్లాడుతున్నాడు

అందరూ నవ్వుల్లో, జోక్స్‌లో తేలిపోతున్నారు బర్త్‌డే 'కేక్' చుట్టూ చేరగానే రాధ లేచి పరుగులాంటి నడకతో గేటుదాటి గుండెల నిండా గాలి పీల్చుకుంది.

బస్‌స్టాండ్‌లో నిలబడ్డ రాధ బుర్ర చెదల పుట్టలావుంది. చిరాకుగావుంది.

సుజాత రాహుల్‌కు కాబోయే భార్యా! ఇంతకాలం తనతో సరదాగా ఆడుకున్నాడన్నమాట? తను తెలియనట్టే నటించాడు తర్వాత ఒక్కసారి కూడా తనకేసి చూడలేదు. అంతవరకూ ఆ వాతావరణంలో కుంచించుకుపోతున్న తను రాహుల్‌ను చూడగానే ఓ క్షణం బిగిసిపోయింది. కాని తర్వాత అతను తనను ఆప్యాయంగా పలకరిస్తాడనుకుంది తనంటే అతనికి ఎంత చిన్న చూపు? అటువంటి అతనిముందా తను తన బలహీనతను బయటపెట్టుకుంది? నోటితో అనకపోయినా తన ప్రవర్తన తన బల

హీనతను ఎత్తి చూపుతూనేవుంది. చివరకు తన అహమే తనను దగాచేసింది. తన గర్వమే తనను ఓడించింది.

అతన్ని చూసిన మొదటి రోజు జీవితంలో తను పోగొట్టుకున్నదేదో అతను తెచ్చాడనిపించింది. అది ఇవ్వడానికే వచ్చాడని భ్రమ పడింది కాని తనకు వున్న దనుకున్న ఆ ప్రత్యేక వ్యక్తిత్వాన్నికూడా తీసుకోవడానికి వచ్చాడని గుర్తించలేక పోయింది. ఇప్పుడు తనకు మిగిలింది ఏమీ లేదు. ఏమీ లేదు. తను జీవితంలో భంగ పడిపోయింది

ఓ కారువచ్చి రాధ ముందు నిల్చింది. రాధ యాంత్రికంగా కారులోకి చూపింది. స్టీరింగ్ దగ్గర కూర్చున్న రాహుల్ ముందు డోర్ తెరిచాడు. రాధ కదల్లేదు రాహుల్ కారు దిగడం గమనించింది.

"రండి డ్రాప్ చేస్తాను "

"అక్కర్లేదు. బస్‌లో వెళ్ళగలను "

"చాలా ప్రొద్దు పోయింది. రండి! మీకోసమే ఒక స్నేహితుడి కారు తీసుకొని ఫన్‌క్షన్ మధ్యలో లేచి వచ్చేశాను" ఆ కంఠంలో ఏనాడూ లేని ఆదరణ వినిపించింది.

"బస్ వస్తోంది. కారు అడ్డం తియ్యాలి వస్తారా? ఎత్తుకెళ్ళి కార్లో కూర్చో బెట్టమంటారా?" అన్నాడు రాహుల్. ఆ కంఠంలోని ఆత్మీయతకు రాధ గుండెలు దడదడలాడాయి.

గబగబా వెళ్ళి కార్లో కూర్చుంది. రాహుల్ పక్కన కార్లో కూర్చున్న రాధ మనసును తియ్యటి అనుభూతి చుట్టేసింది ఆ క్షణాలు శాశ్వతంగా నిల్చిపోవాలని కోరుకుంది. తను ఈ క్షణాలకొరకే ఇంతకాలం ఎదురుచూసినట్టూ, ఈ క్షణాల్లోనే తను నిజంగా జీవిస్తున్నట్టూ అనిపించింది. మనిషి జీవితంలో నిజంగా బతికే క్షణాలు చాలా కొద్దిగానే వుంటాయి. అవి ఎప్పుడో గాని రావు. కొందరి జీవితాల్లోకి అటువంటి క్షణాలు రానేరావు.

"నేను ఈమధ్య ఊళ్లో లేను " అన్నాడు రాహుల్.

రాధ సుందర స్వప్నం తొణికి పోయింది. వాస్తవం వెక్కిరిస్తూ కళ్ళముందుకు వచ్చింది. రాహుల్ సుజాత కాబోయే భర్త—

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

రాధకు మాట్లాడాలని లేదు. రాహుల్ ఎంత తెలివైనవాడు? ఫన్‌క్షన్ మధ్యలో ఎందుకు వచ్చేశావని అడగలేదు. అతను అలాంటి ప్రశ్నలు వెయ్యడు అర్థం చేసు కుంటాడు. కాని రాహుల్ తనకోసం ఫన్‌క్షన్ మధ్యలో లేచి వచ్చేశాడు! ఎందుకు? తనంటే చిన్న చూపు వుంటే వచ్చేస్తాడా? ఎంత మృదువుగా చనువుగా బాధ పెట్ట కుండా మాట్లాడుతున్నాడూ? కాని అతను సుజాతకు కాబోయే భర్త? తనమీద చూపే ఈ అభిమానానికి అర్థం ఏమిటి?

ఆమె బుర్రలో ఎన్నో ప్రశ్నలు .ఒక ప్రశ్నకు సమాధానం దొరక్కముందే మరో ప్రశ్న ప్రశ్ననుంచి ప్రశ్న - ఆర్తినుండి ఆవేదన ఆ ఆవేదన నుంచి ప్రశ్న ఆ ప్రశ్ననుంచి మరో ప్రశ్న

"కారు ఆగింది. దిగండి!" అన్నాడు రాహుల్ నవ్వుతూ ఆ కంఠం, ఆ నవ్వూ మళ్ళీ తనకు తెలిసిన రాహులే

"థ్యాంక్స్" అంటూ గబగబా లోపలకు వెళ్ళిపోయి మంచానికి అడ్డంపడి బావురుమని ఏడ్చింది మొదటి సారిగా రాధ.

ఈమధ్య రాహుల్ ప్రవర్తనలో చాలా మార్పు కన్పించసాగింది. వారానికో, పది రోజులకో వస్తాడు. ముళ్ళమీద కూర్చున్నట్టు వుంటాడు. ఏ పది నిముషాలో కూర్చుని వెళ్ళిపోతాడు. విసుక్కుంటున్నట్టు కన్పిస్తున్నాడు రాధను ఉద్ధరించడానికి వస్తున్నట్టు ప్రవర్తిస్తున్నాడు.

రాధలో సహనం నశించింది. ఆ రోజు రాధ మనసంతా మరీ బరువుగావుంది. ఏమిటి తనకీ శిక్ష? నిజంగానే అతను తనను శిక్షిస్తున్నాడు! తనేం పాపం చేసింది? చెయ్యలేదూ? తను రవీంద్రకు అన్యాయం చెయ్యలేదూ? రంగారావునూ, రామారావునూ అసహ్యించుకోలేదూ? అలా చెయ్యడం తన తప్పా? తను వాళ్ళకు ఆశలు చూపించి మోసం చేసిందా? మరి రాహుల్ మాత్రం తనకేం ఆశలు చూపించాడు? వాగ్దానాలు చేశాడా? ప్రేమిస్తున్నానని చెప్పాడా? రాహుల్ తెలివైనవాడు. నోటితో చెప్పకుండానే తనలో అన్ని ఆశలూ రేకెత్తించాడు తన పాత్రను చాలా సమర్థంగా నిర్వహించు కున్నాడు

ఒక్కసారిగా లైట్లు ఆరిపోయి చుట్టూ చీకటి కమ్ముకుంది. రాధ తడుముకుంటూ వెళ్ళి అగ్గిపెట్టీ, కాండిలూ తెచ్చి వెలిగించింది కిటికీ దగ్గరకు వెళ్ళి నిలబడింది

రాధకు తెలియకుండానే కళ్ళవెంట నీరు కారిపోతోంది.

రాహుల్ వచ్చి వెనగ్గా నిల్చోవడం రాధ గమనించలేదు. ఉన్నట్టుండి రెండు చేతులతో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నారు?"

ఆ కంఠం విని రాధ చివ్వున తలెత్తి చూసింది. రాహుల్ నిల్చొని వున్నాడు.

అదే కొంటె చూపు లోతుగా తన గుండెల్ని కోసే చూపు. అదే నవ్వు నాకు దొరక్కుండా ఎక్కడకి పోతావులే అని ప్రశ్నించే నవ్వు

రాధకు తల నేలకువేసి కొట్టుకోవాలనిపించింది, ఇంతకాలంగా రాహుల్ కళ్ళ ఎదుట ఏది జరగకూడదని తనలోని ప్రతి అణువుతో పోరాడుతూవుందో అదే జరిగి పోయింది.

"మీకు ఏం కావాలో మీకే తెలియదు. ఒకసారి సైక్యాట్రిస్ట్‌ను చూడ కూడదూ!" అన్నాడు రాహుల్ జాలిగా.

రాధ కోపంతో వణికిపోయింది. తను మానసికరోగంతో బాధపడుతూందా? ఏమిటి ఇతని ధైర్యం? ఎంతమాట అన్నాడు?

మనసును మొదటి పరిచయంలోనే గాయపరిచాడు. ఆ గాయాన్ని ప్రతిసారీ రేపి బాధ పెడ్తూనే వున్నాడు. కాని రోజూ ఆ గాయాన్ని చూపి ఎగతాళి చేస్తున్నాడు. ఇన్‌సల్ట్ టు ది ఇన్‌జూరీ తను చేసిన గాయాన్ని చూపి తనే నవ్వుతున్నాడు. అవమానిస్తున్నాడు ఛీ! ఇతను మనిషేనా?

"మీరూ నూటికి తొంభై తొమ్మిదిమంది ఆడవాళ్ళలాగే ఏడుస్తారన్నమాట!"

"మీ అభిప్రాయం?" కస్సున లేచింది.

"అభిప్రాయం స్పష్టమే. మీరు అందరి ఆడవాళ్ళలాంటి వారు కాదు గదా? మరి అందరిలో వున్న బలహీనత మీలోనూ ప్రవేశించిందా అని అడుగుతున్నాను."

"మిస్టర్ మీరు చాలా తెలివైనవారు కావచ్చు. మంచి వాక్చాతుర్యం గల వారూ కావచ్చు. కాని అప్పుడప్పుడు ఆ తెలివితేటలు హద్దులు మీరుతుంటాయని గుర్తుంచుకోండి."

రాహుల్ కొంచెం జంకినట్టు కన్పించాడు.

"ఒక విషయం మాత్రం తెలుసుకోండి. నేను ఏడవడానికీ మీ పరిచయానికీ ఎలాంటి సంబంధమూ లేదు."

"ముందు అనుకోలేదు కాని ఇప్పుడు అనుకుంటున్నాను "

"మీరు భ్రమ పడుతున్నారు. మీరు ఊహించేది నిజంగా కాదు అది మీ భ్రమ మాత్రమే!" అన్నది రాధ వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంటూ

"స్వప్నానికి వాస్తవానికీ వున్న భేదం నాకు తెలుసు. భ్రమను నిజం అనుకొనేంత తెలివితక్కువ వాణ్ణి కాదు. నేను ఊహించింది నిజం అని నాకు తెలుసు "

రాధకు అతని మాటలు సుత్తిదెబ్బల్లా తగులుతున్నాయ్

"నిజం కాదు నిజం కాదు మీరంటే నాకు అసహ్యం!"

రాహుల్ పకపక నవ్వాడు.

కోపంతో రాధ ముఖం ఎర్రబడింది. పెదవులు వణుకుతున్నాయ్

"అంటే చాలా ఇష్టం అన్నమాట. ఇష్టపడే వ్యక్తిమీదే అప్పుడప్పుడు అసహ్యం కూడా కలుగుతుంది."

"మిస్టర్! మీరు హద్దులు మీరుతున్నారు. మీకు కాలక్షేపం కలిగించే ఆట బొమ్మను అనుకుంటున్నారా నన్ను? ఇకనుంచి మా ఇంటికి రావడం మానెయ్యండి. మర్యాదగానే చెప్తున్నాను." అన్నది రాధ.

రాహుల్ ఓ క్షణం నివ్వెరపోయి నిలబడ్డాడు.

"పాపం! ఈరోజు మీ మనసు బాగున్నట్టు లేదు మళ్ళీ వచ్చినప్పుడు "

"మళ్లీ రావద్దనే చెప్తున్నాను." చాలా తీవ్రంగా వుంది రాధ కంఠం.

ఓ క్షణం ఆలోచనలో పడ్డాడు రాహుల్, కళ్లు కొంచెంగా ఎర్రపడ్డాయి.

"మీకేం కావాలో మీకు తెలియడం లేదు. నేను నిజమే చెబుతున్నాను. తాపీగా ఆలోచించండి వెళుతున్నాను వెళ్ళబోయే ముందు ఒకమాట మాత్రం చెప్పదల్చుకున్నాను. నేను మిమ్మల్ని ఆటబొమ్మలా ఎన్నడూ అనుకోలేదు నేను ఆడుకోవాలే గాని మీకంటే అందమైన బొమ్మలు ఎన్నో నాకు .అందుబాటులో వున్నాయి. మిమ్మల్నెప్పుడూ చులకనగా చూడలేదు." అంటూ ఓ క్షణం ఆగి రాధ ముఖంలోకి చూశాడు.

రాధ కోపంతో బుసలు కొడుతూ వుంది.

"మిమ్మల్ని మీరు అర్థం చేసుకున్న రోజు మీకు ఏం కావాలో మీకు తెలిసిన రోజు, నేను జ్ఞాపకం వస్తే నాకు కబురు చెయ్యండి."

ఎంత గర్వం? ఎంత అహంకారం? రాధకు వళ్లు మండిపోయింది.

"మీకు కబురుచేసే అవసరం నాకు వస్తుందని నేను అనుకోవడం లేదు."

"అవసరం అనుకుంటే అభిమానపడకండి నేనేమీ అనుకోను. వెంటనే వస్తాను. ఆల్ రైట్! గుడ్ బై!" గిర్రున వెనక్కు తిరిగాడు.

చివరి మాటలు అంటున్నప్పుడు రాహుల్ కంఠంలోని వణుకును రాధ గమనించక పోలేదు.

'రాహుల్! వెళ్ళిపోకు! నాకేం కావాలో నాకు తెలుసు నాకు నువ్వు కావాలి. వెళ్ళకు. నేను ఓడిపోయాను, నా బలహీనతను నీ ముందు అంగీకరిస్తున్నాను. నిన్ను నేను ప్రేమిస్తున్నాను రాహుల్. నన్ను వివాహం చేసుకోలేక పోయినా పర్వాలేదు. అప్పుడప్పుడు కన్పించు. ఈ జన్మకు అంతే చాలు! రాహుల్!' అరవాలనుకుంది. అరిచాననుకుంది

రాహుల్ వెళ్ళిపోయాడు. కిటికీ దగ్గరకు పరిగెత్తి బయటికి చూసింది. రాహుల్ చిన్నగా, బరువుగా అడుగుకో అడుగు వేసుకుంటూ వెళ్ళిపోతున్నాడు.

రాధ స్థాణువులా నిలబడిపోయింది. ఓపక్క స్టూల్‌మీద కొవ్వొత్తి కాలుతూ వుంది. రాధ నిల్చుని నిలువునా కాలుతూ వుంది కొవ్వొత్తి కరిగి క్రిందకు కారుతూ వుంది. రాధ కరుగుతూ వుంది. కన్నీరుగా మారి చెంపలమీదగా క్రిందకు జారిపోతుంది. ఆ గదిలో రెండు అగ్నిశిఖలు జ్వలిస్తున్నాయి.

అయిపోయింది. అంతా అయిపోయింది తన అన్వేషణ పూర్తి అయింది. తన జీవితం ఆగిపోయింది, రాధ ఓపిక లేనట్టు నేలమీద కుప్ప కూలిపోయింది.

"సిస్టర్! దాహం! నాలుక పిడచకట్టుకు పోతూంది." గ్రేస్ గ్లూకోజ్ వాటర్ తాగించింది.

## 17

గ్రేస్ గడియారం చూసుకుంది. రాధ ముఖంలోకి చూసింది. రాధ కళ్లు మూసుకొని వుంది చెంపలు కన్నీటితో తడిచివున్నాయి.

గ్రేస్ రాధ చెంపల్ని తుడిచింది.

రాధ కళ్లు తెరిచింది. డాక్టర్ వచ్చి రాధ నాడి చూశాడు.

"సిస్టర్! గండం తప్పింది. పేషెంటు బ్రతికింది" అన్నాడు సంతోషంగా.

"నిజంగానా డాక్టర్!" గ్రేస్ దాదాపు సంతోషంతో గంతులు వేస్తున్నట్టే అడిగింది.

"అవును! ఆమె బ్రతికింది."

అంతలో ప్రక్కబెడ్ మీది పేషెంటు బాధతో కేకలు పెడుతూంటే వెళ్లిపోయాడు డాక్టర్.

"రాధా!" రాధ చేతిని చేతిలోకి తీసుకుంది గ్రేస్.

"సిస్టర్! డాక్టరు చెప్పింది నిజమేనా?"

"నిజమేనమ్మా! ఇక భయం లేదు."

రాధ విరక్తిగా నవ్వింది.

"చివరకు నా కథ ట్రాజడీ చేశారా సిస్టర్ నన్ను బ్రతికించి" బాధగా అన్నది రాధ.

"అదేమిటమ్మా బ్రతకడం ట్రాజడీయా?" విస్మయంగా అడిగింది గ్రేస్.

"అవును సిస్టర్. కొన్ని కథలకు చచ్చిపోవడమే కామిడీ! బ్రతకడమే ట్రాజడీ!" బాధగా అన్నది.

"నీ కథ ట్రాజడీ కాదమ్మా! కామెడీయే అవుతుంది. రాహుల్ చాలా మంచివాడు."

"రాహుల్ మీకు తెలుసా సిస్టర్?"

"తెలుసమ్మా! పోయిన సంవత్సరం ఈ ఆసుపత్రిలో పనిచేశాడు. ఎవర్నీ నొప్పించే వాడు కాదు."

"మరి ?" ఏదో అడగబోయి ఆగిపోయింది రాధ.

"రాహుల్ సైకాలజీలో స్పెషలైజ్ చేశాడు. చాలా బ్రిలియంట్ స్టూడెంటుగా వుండేవాడు. ఫారెన్ కూడా వెళ్లొచ్చాడు. అతను నీ సైకాలజీ అర్థం చేసుకున్నాడు. అందరి మగవాళ్లలా అతనూ నిన్ను ప్రేమిస్తున్నట్లు చెప్పేశా డనుకో! నువ్వు భరించే దానివా? చిన్నప్పుడు కొన్ని సంఘటనలు నీ మనసును గాయపర్చాయి. సబ్ కాంషస్‌లో అవి పని చేస్తున్నాయి. ఓ వింత మనస్తత్వం నీకు అలవడింది. అందుకే సైకాలజిస్టును చూడమన్నాడు."

"మరి . నన్ను అలా అవమానించే వాడెందుకు?"

"అది అవమానించడం కాదమ్మా! నిన్ను రెచ్చగొట్టి నీ చేతనే అతన్ని ప్రేమిస్తున్నట్టు చెప్పించడానికి ప్రయత్నించాడు "

"నేను అతన్ని ప్రేమిస్తున్నట్టు తెలుసుకోలేక పోయాడా?"

"తెలుసుకున్నాడు కాని ఆమాట నీచేత చెప్పించాలని అతని పట్టుదల. మొత్తంమీద ఇద్దరూ తెగేంతవరకూ లాగారు." అన్నది గ్రేస్.

రాధ పలకలేదు ఆలోచిస్తూ వుండిపోయింది

"రాహుల్‌కు కబురు చెయ్యమంటావా రాధా!"

రాధ తృళ్లిపడింది "ఆ పనిమాత్రం చెయ్యకండి సిస్టర్! ముందు నాకేం కావాలో నేను తెలిసికోవాలి సిస్టర్. అది తెలుసుకో గలిగినప్పుడు ఏం చెయ్యాలో ఆలోచిస్తాను!"

"ఏమిటోనమ్మా నీ మనస్తత్వం! నువ్వు మనసు విప్పి చెప్పవు అవతలి వ్యక్తి చెబితే భరించలేవు!"

"అదే నా ప్రత్యేకత సిస్టర్! నాకు నిద్ర ముంచుకొస్తుంది సిస్టర్."

"నిద్రపోమ్మా! నా డ్యూటీ అయిపోయింది మళ్లీ సాయంకాలం వస్తాను "

గ్రేస్ దుప్పటిసర్ది రాధ ముఖంలోకి చూసింది. రాధ హాయిగా నిద్రపోతున్నది.

"తొణికిన స్వప్నం!" రాధ ముఖంలోకి చూస్తూ చిన్నగా అన్నది గ్రేస్. ★





**Edited and Published by V. Leelavathy Raghavaial**
**7-A, Sivaji Street, Madras-600 017 and Printed by**
**D. Hanumantha Rao, at Kranti Press,**

డిశంబరు - 1974

# జ్యోతి

రూ. 2/-





తెల్లని
నిత్యశోభ
కావాలి నాకు
New
RINSO
WASHES DAZZLING WHITE
రిన్సో అంటే
రిన్సో
నిత్యం వాడే నూలు బట్టలను
మిరుమిట్లు గొలిపేటంత
తెల్లగా ఉతుకుతుంది
రిన్సో మురికిని వదిలేస్తుంది...ఉత్తమ
సబ్బులకన్నా గ్యారంటీగా బాగా
ఉతుకుతుంది ఇక అది బట్టలనుతికే ఇతర
పౌడర్లకన్నా ఖరీదు తక్కువే
మరింత మిరుమిట్లుగొలిపే తెలుపుకోసం
రిన్సో వేడినీళ్ల ఉతుకు
రిన్సోను వేడినీళ్లలో వేసి కలపండి బట్టలను
నానబెట్టండి మామూలుగా ఉతకండి
హిందుస్తాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి
లింటాస్-RINSO 5-77 TL

డిశంబర్ 1974

సచిత్ర మాసపత్రిక సంపుటి 13; సంచిక 12

# విషయసూచిక



ముఖచిత్రం శ్రీ విజయకృష్ణ మూవీస్‌వారి "దేవదాసు"లో
కృష్ణ, విజయనిర్మల

సంస్థాపకులు: మేనేజింగ్ ఎడిటర్:
కీ. శే. వి. వి. రాఘవయ్య శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

జ్యోతి, 40/1 మూసాసెయిట్ స్ట్రీట్, టి. నగర్, మద్రాసు-600017.
విడి ప్రతి: రు 2-00; సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) రు. 29/-

# పాఠిమాట

విప్లవాత్మకమైన ఆలోచనలున్న రాధ కథ 'తొణికిన స్వప్నం'గా ఈ సంచికతో ముగుస్తున్నది. మూడు నెలలుగా పాఠకుల మేధకు పని కల్పించిన వాసిరెడ్డి సీతాదేవిగారి యీ నవల పాఠకుల ప్రశంశలు పుష్కలంగా పొందింది.

వచ్చే సంచికతో 'నవలానుబంధం'లో ప్రారంభిస్తున్న 'ప్రేమాయణం' కులాసాగా సాగే నవల. యువతీ యువకుల మధ్య ఉత్పన్నమయే ప్రేమా. ఆ ప్రేమ కల్పించే చిక్కులూ, ఆ చిక్కుల నెదుర్కొనే చిక్కుల పాలైన వ్యక్తులూ, ఆ నవలలో మీకగుపిస్తారు పోలాప్రగడ సత్యనారాయణమూర్తి రచన యిది.

ప్రగతిని సాధిస్తున్న వైద్య శాస్త్ర విజ్ఞానం మానవుల కెంతో మేలు చేస్తున్నా, ఆ ప్రగతి ఫలాన్ని పొందటంలో కూడా చిక్కుల నెదుర్కోవలసి వస్తుంది కొందరు వ్యక్తులు. 'జనరేషన్‌గాప్'వల్ల ఏర్పడే చిక్కుల కారణంగా కొందరు అమాయక జీవులు చిత్రహింసకు గురి అవుతుంటారు. 'తరాలు-అంతరాలు' మినీ నవల యీ సమస్యలను చర్చించిన 'ప్రణవి' రచన చూడండి 62 పేజీ.

రైల్లో ప్రయాణం చేస్తున్న ఓ యువకుడి దగ్గరకు అపరిచితురాలైన ఓ యువతి వచ్చి ప్రేమగా కౌగలించుకొని 'మధూ వచ్చావా . పద లేచి పోదాం' అనడంలో గల రహస్యం 35 పేజీలోని 'రాధమ్మ పెళ్ళి' కథ చెబుతుంది.

ప్రస్తుతపు నగరజీవితంమీద చక్కని సెటైర్ 'కార్టూన్' కథ. చూ. పే. 85

# ఉత్తరాలు

సంజీవ్‌కుమార్, శారదల అందమైన ముఖారవిందములచే ఎంతో అందముగా యుంది ఈనెల జ్యోతి. ఈనెల కథలలో ముఖ్యముగా "అమ్మో అప్పులు", "రేపటి బొమ్మలు", "ప్రిన్సిపాల్ దిగ్రేట్" కథలు ఎంతో బాగున్నవి,

నేనొక మంచి వెధవను! ఈ శీర్షిక ప్రయోజనాత్మకమైనదిగా యుంది కాని శీర్షిక పేరు మార్చితే బాగుండునేమో అనిపిస్తుంది.

—కాములు గంగామోహన్,
శ్రీమతి కె వీణమోహన్, ఆర్మూర్.

నవంబరునెల జ్యోతి' భరత్ సంజీవ్ కుమార్, శ్రీమతి శారద ముఖచిత్రంతో చాలా ఆకర్షణీయంగావుంది. 'తొణికిన స్వప్నం' సీరియల్ జోరుగా సాగుతోంది. అమ్మాయిలకోసం అర్రులుచాచే వారికి ఒక మంచి పాఠాన్ని నేర్పగలదు ఇందులో 'రాధ' పాత్ర ఒక క్రొత్తతరహాగా నడుస్తోంది. రచయిత్రిగారికి అభినందనలు.

—డి. వి. సుబ్బారావు, కొండాపురం.

'జ్యోతి' నవంబర్ మాస పత్రిక ముఖచిత్రం రంగులతో ఆకర్షణీయంగా వుంది. లాన్స్‌నాయక్ మరియు అది పొందిన హోదాను గురించి వ్రాసిన విషయములు చాలా ఆసక్తిదాయకంగా నున్నవి.

—గోపారపు సత్యం, మిర్యాలగూడ.

'ఊర్వశీ భరత్'ల ముఖ చిత్రంతో నవంబర్‌నెల జ్యోతి అందాన్ని సంతరించుకొంది 'ఇది ఒక వింత ప్రపంచం' 'విజ్ఞాన వీధుల్లో' శీర్షికలు విజ్ఞానదాయకంగా, తెలియని యెన్నో వింతలు పాఠకులకు తెలియచేస్తున్నాయి. అందుకు మా అభినందనలు. చలసానివారు 'మోడర్న్ ఆర్ట్'కు అర్థం తెలియచేశారు 'రేపటి బొమ్మలు'లో రచయిత ఈ నాటి ప్రేమ, క్రొత్త తరం, గురించి బాగా వివరించారు. పెరిగిన పరిసరాలూ, నేర్చుకున్న సంస్కారం మనిషిని మనిషిగానూ, పశువుగానూ నిలబెడతాయని 'మనిషి' ద్వారా తెలియచేసిన చింతావారు అభినందనీయులు.

—'రాజాసాగర్' ఐ ఏ ఎఫ్, డార్జిలింగ్.

నవంబరు జ్యోతిలో "ఇది ఒక వింత ప్రపంచం" శీర్షికలో వేసిన "పత్రికల ప్రపంచం" అన్న ఆర్టికల్ బాగుంది. కాని అందులో 1849 మే 19 వ వెలువడిన "కమూనిస్" అన్న పత్రికలో (శాస్త్రీయ సోషలిజం సృష్టికర్త) కారల్ మార్క్సని కాల్చి చంపినట్లుగా రచయిత స్పష్టీకరించారు. అది పూర్తిగా తప్పు. కారల్ మార్క్స 1849 మే 19 వ తేదీ, తరువాత మరో ముప్పయి నాలుగు సంవత్సరములు జీవించారు. ఆయన 1883 వ సం॥ లో

మార్చి 14 వ తేదీన మరణించారు. హత్య గావింపబడలేదు. కారల్ మార్క్స్ పడక కుర్చీలో పడుకొనే ప్రశాంతగా సహజ మయిన మరణాన్నే పొందారు (లెనిన్ వ్రాసిన "కారల్ మార్క్స్" అన్న ఆర్టికల్ చూడండి) 1849, మే 19 తేదీన మార్క్స్ ముఖ్య ఎడిటర్‌గా వెలువడిన పత్రిక పేరు NEUE RHINISCHE ZEITUNG. (లెనిన్ వ్రాసిన Bibliography) మార్క్స్ జీవితకాలంలో ముఖ్య ఎడిటర్‌గా వుండి మూడు పత్రికలు నడపటం జరిగింది. John Lewis వ్రాసిన The life & Teachings of Karl Marx.

—మొల్లేటి ప్రసాద్, విశాఖపట్నం-5.

"చీకటి పొద్దున వెలుగురేఖ" సీరియల్ చాలా ఇంట్రెస్టుగా సెలయేటిలా సాగుతుంది, కుమారి వాసిరెడ్డి సీతాదేవి గారి "తొణికిన స్వప్నం" నవల 'జ్యోతి' వెన్నెముకలాంటిది. పోలాప్రగడ సత్య నారాయణమూర్తిగారి "ప్రేమాయణం" నవలకు మా హృదయపూర్వక స్వాగతములు

ప్రయోజనాత్మక శీర్షికలు, ప్రభోదాత్మకమైన కథలు ('రేపటి బొమ్మలు'. 'ప్రిన్సిపాల్ ది గ్రేట్' మరియు 'సుఖంలేని మనిషి') లాంటివి పాఠకులకు అందిస్తున్న మీ, మా 'జ్యోతి'కి మా జోహార్లు

—స్నేహలత చంద్రమోహన్,

రామగుండం. 'బి'కాలని.

'అమెరికాలో వాటర్‌గేట్ కుంభకోణం జరిగింది. నిక్సన్ నేల కరిచాడు. జర్నలిష్టుల కలం పదును ఎంతటిదో తెలిపింది. భారత దేశంలో పరిస్థితులు అస్థవ్యస్థంగా తయారవు తున్నాయి. బీహారులో నెలల తరబడి జయప్రకాష్ నారాయణ్ అవినీతిని నిర్మూలించేందుకు విప్లవ పంధాలో ఉద్యమం నిర్వహిస్తున్నారు పార్లమెంటులో లైసెన్సుల 'కుంభకోణం' నడుస్తోంది చదువుకున్న వారికి ఉద్యోగాలు లేవు. ఉద్యోగాలున్న వారికి తిండికి చాలడం లేదు, సరిపోయిన వారికి 'కస్టీ'వి దొరుకుతున్నాయి వెస్టిండీస్ క్రికెట్ జట్టు భారత దేశంలో పర్యటిస్తోంది. ఇంకా ఎన్నో ఎన్నో జరుగుతున్నాయి కాని తెలుగు మాస పత్రికలకు కథలూ, సీరియల్సూ, సినిమా వార్తలకి మించి మరేం స్టఫ్ దొరకడం లేదు గుడ్డిలో మెల్లలా 'జ్యోతి' పత్రికను పత్రికలా [కధాసంకలనంలా గాక, నవలల ప్రచురణలా గాక] కొంతవరకు నడుపు కొస్తున్నందుకు మిమ్మల్ని అభినందించాలి. నూతన సంవత్సరం నుంచి ఎన్నో మార్పులతో, ఆదర్శవంతమైన పత్రికగా రూపొందించవలసిందిగా. కోరుతున్నాను

—కె. పాండురంగారావు, బి ఇ.

విశాఖపట్నం-2.

మీరు ప్రారంభించిన 'నేనొక మంచి వెధవని' ఎంత ప్రయోజనకారో చెప్పటానికి వీలు కాదు మనం ఒకరు చేసిన తప్పును వారి ఎదురు గుండా చెప్పలేం. చెప్పకుండా వుండనూ లేము. అరె! ఆ పని చేయడం తప్పు కదా వెంటనే వెళ్ళి ఆ పని ఆపేద్దాం అనిపిస్తుంది. కానీ మనం ఆ పని ఆపేయలేము. కనీసం మీ శీర్షిక

# ఇది మీకు తెలుసా!

చిన్ననాట తన మేనత్త 'బొమ్మల పెళ్ళి'గా జరిపిన పెళ్ళిని మరువక—సారధి అనే యువకుడు యుక్తవయసు వచ్చాక, దాదాపు 20 సంవత్సరాల క్రితం తన భార్య అయిన, 'మేఘమాల'ను వెదుకుతూ బయలుదేరాడు. దొరికిన సమాచారం మేరకు విజయవాడలో వున్నదని తెలిసి అక్కడికి వెళ్ళాడు. అక్కడనుంచీ 'మేఘమాల'కోసం మరో చోటికి... అక్కడ లేదని తెలిసి తరువాత మరో చోటికి...తన భార్యను వెదుక్కుంటూ బయల్దేరాడు. దారిలో చిత్రమైన అనుభవాలెన్నో చవిచూస్తున్నాడు. సారధిని కలుసుకోవాలని వుందా మీకు! అతనికోసం మీరు వెదుకుతూ వెళ్ళనవసరం లేదు. అతనే మీ దగ్గరకొచ్చి తన అనుభవాలను వివరిస్తాడు. **'జ్యోతి సప్లిమెంట్'లో** సీరియల్‌గా ప్రచురిత మౌతున్న **'మేఘమాల'** నవలలోనుంచి మిమ్మల్ని పలకరిస్తాడు.

**'జ్యోతి సప్లిమెంటు-4** (డిశంబరు 74) లో సారధి తన కథతోపాటు, **కె. రామలక్ష్మి నవల 'బ్రహ్మచారి-బహుకుటుంబి', జి. యస్. సూరి నవల 'ఈ ఉత్తరానికి జవాబు రాదు'** కూడా మీకు అందిస్తాడు

---

చదివిన తర్వాతనైనా వాళ్లలో వాళ్లు మధనపడుతూ వుంటారు. మళ్ళీ ఆ పనులు చేయటానికి ప్రయత్నించరూ అనిపిస్తుంది. ఇంత ప్రయోజనాత్మకమైన శీర్షిక ఇంతకు ముందెప్పుడూ ఏ పత్రికా ప్రారంభించలేదు. ఈ శీర్షికకు మగవాళ్ళే పంపాలా? లేక ఆడవాళ్లు కూడా పంపవచ్చా తెలియ చేయగలరు. —సమ్మెట అండాళు

[కేవలం పురుషులకే నిర్దేశించిన శీర్షిక కాదు ఇది. -ఎడిటర్]

# వస్తుగుణ విశేషములు

సుగుణ

## గుంట కలగర

గుంట కలగర ఆకు యెక్కువగా తేమ ఉండేచోట్ల పెరుగుతుంది నలుపు, తెలుపు, పసుపు మూడురంగుల పూలతో ఉంటుంది, అన్నిట్లో నల్లపూవులున్నది శ్రేష్ఠము. కాని ఇది దొరకడం చాలా కష్టము. నల్లగుంట కలగర రసము వంటికి పూసుకుంటే "అదృశ్యయోగము" సిద్ధిస్తుందనీ, శరీరము ముడుతలు పడదనీ ఒక వాడుక ఉంది. అందువల్లనేమో అది దొరకదు

పోతే తెల్లపూవులున్నది, పచ్చపూవులది మనకు బాగానే దొరుకుతుంది పచ్చపూల గుంట కలగర కామెర్ల జబ్బుకు చాలా ఉపయోగపడుతుంది. ఈ యాకు కూర కామెర్ల రోగికి నిత్యం వండిపెడితే జబ్బు తగ్గుతుంది.

గుంట కలగర కండ్లకు చలవ చేస్తుంది. క్రిములను పోగొడుతుంది చర్మవ్యాధులను, దంత వ్యాధులను కూడ తగ్గిస్తుంది

గుంట కలగర రసము మేకపాలు సమానంగ కలిపి యెండలో ఇగుర నిచ్చి అది నస్యము చేయిస్తే యెటువంటి తల నొప్పయినా తగ్గుతుంది.

గుంట కలగర రసంతో కడిగితే అన్ని రకాల కురుపులు పుండ్లు మానుతాయి.

లోహ పాత్రలో నూనెవేసి గుంట కలగరాకు వేయించి తీసి అది తిని పాలు తాగితే బొల్లి తగ్గుతుంది.

గుంట కలగర చూర్ణము, కరక్కాయ చూర్ణము, పాత బెల్లముతో కలిపి సేవిస్తే పైత్యపు మంటలు తగ్గుతాయి

గుంట కలగర రసంతో మిరియాలు నూరి మాత్రలుగాచేసి తీసికుంటె జ్వరాలు తగ్గుతాయి.

గుంట కలగర రసం ఒక గిద్దెడు రసంలో $\frac{1}{2}$ తులం ఉప్పు కలిపి 5 పూటలు ఉదయాన తీసికుంటె ఉబ్బు(నంజురోగం) వ్యాధి తగ్గుతుంది

మందార పువ్వులు, గుంట కలగర ఆకు, పువ్వులువేసి కాచిన నూనె తలకు చాలా మంచిది. ఈ యాకుకు జుట్టు వత్తుగా నల్లగా పెంచే గుణమున్నది. మెదడుకు మంచిది.

ఈ యాకు కూర రుచిగా ఉంటుంది. రక్తము శుభ్రపరుస్తుంది. ఆకు రసము కణతలనొప్పి. అన్ని నొప్పులను పోగొడుతుంది.

గుంట కలగరప మూఃముగ (పచ్చిది) తెచ్చి నూరి నూనెలో కలిపి పూస్తే ఏనుగ కాలు (పైలేరియా) వ్యాధి తగ్గుతుంది. ఇలా అనేక విధాల గుంట కలగర ప్రయోజనకారి. ★

ప్రయోజనాత్మకమైన మంచి శీర్షిక!



# నేనొక మంచి వెధవను!

ఆదివారం! సాయంత్రం ఆరున్నర!!

సినిమాకి వెళ్ళాలని నిశ్చయించుకోవటంతో నా ఫ్రెండ్ రాజు దగ్గరికి బయల్దేరాను సైకిల్ వేసుకుని

జంక్షన్! సైకిల్ తొక్కుతున్నాను!

"ఏయ్ మిస్టర్!"—ఎవరిదో కేక?

"ఏయ్ మిస్టర్!!"—యీ సారి కాస్త గట్టిగా అదే కేక ఎందుకైనా మంచిదని వెనక్కి చూశాను, బ్రేకు వేస్తూ

పోలీసు! నా వేపే చూస్తున్నాడు!!

. ఆగమన్నట్టు సైగచేసి, సమీపించాడు.

"సైకిలా పక్కన పెట్టు "అన్నాడు ఆజ్ఞాపన దోరణిలో.

ఎందుకో నా కర్థం కాలేదు ఓసారి అటూ యిటూ చూసి, సైకిల్ వేపు చూసుకున్నాను. దోషం (లోపం) కనిపించలేదు

"నిన్నే! ఏమిటలా చూస్తావ్? సైకిల్ పక్కన పెట్టు..." గద్దించాడు.

"ఎందుకండీ?" అనడగబోయి, మరో సారి సైకిల్ వంక చూసుకున్నాను అప్పటిగ్గాని తెలీలేదు 'లైటు' లేదని.

సాయంత్రం సమయంలో లైటు లేకపోతే వదలరని తెలియగానే నీరసం, భయం రెండూ ఆవరించాయి. ఇవతల సినిమాకి టైమయిపోతుంది ఆవేళే ఆఖరు ఆ ఆటకు తప్పితే మరో ఆటకి నాకు వీలుపడదు ఆట మిస్సయితే మొత్తం సినిమాకే మిస్సయిపోతాను

కంగారు! గబుక్కున జేబులోంచి రూపాయి తీసి పోలీసు చేతిలో పెట్టాను.

"ఒదిలెయ్యండి సార్! " నెమ్మదిగా బ్రతిమాలాను, చేతిలో రూపాయిని చూసుకున్నాడు ఛాల్లేదేమో!

"పద స్టేషన్‌కి" అన్నాడు

ఇదేమిటి? ఇంతవరకు సైకిల్ పక్కన పెట్టు అన్నవాడల్లా స్టేషన్‌కి పదమంటున్నాడు—అనుకున్నాను

నాకేం తోచలేదు

ఒక పక్క ఆతృత, మరో పక్క భయం—చటుక్కున మరో రూపాయి తీసి చేతిలో పెట్టాను కదిలిపోయాను ముందుకు ఊరికినే రెండురూపాయలు

పోగొట్టుకున్నందుకు బాధనిపించింది. కొంతదూరం వెళ్ళాక కారణం తరచి చూశాను—

నేను తప్పుచేశాను. ఆ తప్పునుంచి తప్పించుకోడానికి రెండు రూపాయలిచ్చాను. దేనికి? అదేమిటి? ఆలోచించుకునే సరికి నాకే సిగ్గనిపించింది. కొన్నాళ్ళ క్రిందట జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది—

నా ఫ్రెండ్ రాజు, నేను—డబుల్స్ కారణంగా పట్టుబడిన ఇద్దరు కుర్రవాళ్ళను చూశాం పోలీసు సైకిల్ వదలనంటున్నాడు. నానావిధాల బ్రతిమాల్తున్నారు వీళ్లు ఏం జరుగుతుందోనని మేమిద్దరం నిలబడిపోయాం

ఏం నిశ్చయించుకున్నారో ఏమో! చెరో రూపాయి తీసి, పోలీసు చేతిలో పెట్టారు. పోలీసు, వాళ్ళ నొదిలేశాడు అప్పుడు నేనన్న మాట నాకింకా గుర్తే—

"చూశావ్ రా, రాజూ! తప్పు చెయ్యటమే కాకుండా లంచం కూడా యిచ్చారు. ఇలాంటివాళ్ల వల్లే యిలా తయారైంది మన దేశం."

ఇప్పుడు నేను చేసిందేమిటో తెల్సుకునేసరికి, అప్పుడు అన్న మాటల్ని ఎలా వుపసంహరించుకోవాలో తెలీలేదు.

'సత్యం'

అది కోదాడ బస్టాండ్. కోదాడ విజయవాడకు, హైద్రాబాద్ కు మధ్యవుంది ఖమ్మం బస్సు పోవడానికి యింకా పావు గంట టైముంది ప్రయాణీకులు మాత్రం నాల్గు బస్సుల్లో పట్టేంతమంది వున్నారు. బస్ కండక్టర్ దిగి "క్యూలో నిలబడి పొండి!" అని చెప్పి కంట్రోలర్ రూమ్ లోకి వెళ్ళిపోయాడు. అందరూ గుమికూడారు [దాంట్లో నేనూ వున్నాను.] బస్సు లోపలికి నెట్టుకొంటూ ఎక్కుతున్నారు ఒకతను తన దస్తీని (చేతిరుమాలు) లోపల పడేసి ప్రక్కకు తొలిగాడు ఇంకొకతను తన చేతిలోనున్న దినపత్రికను బస్సులోపల పడేశాడు మరొకతను తన జేబులోవున్న డైరీని తీసి లోపల పడేశాడు వీరి ముగ్గుర్నీ చూసి నా వెనుక నిల్చొన్నతను చంకలోవున్న గొడుగును బస్సులో పడవేసినాడు [ఇం డైరెక్ట్ రిజర్వేషన్సు కాబోలు] 'మీ దుంపతెగ! మీరు మావలె బస్సెక్కలేరా!' అని అందామనుకొన్నాను ఇంకా ఐదు నిమిషాలు టైముంది ఎలాగో నేను బస్సెక్కాను కొంతమంది కూర్చొన్నారు. మిగిలిన సీట్లన్నీ దస్తీలతో, పేపర్లతో, డైరీలతో వున్నాయి నావెనుక వున్నవాడు మోటువాడని వస్త్రాలంకరణ చూస్తే తెలుస్తుంది. ఒక సీటుమీద వున్న గొడుగు తీసివేసి తటాలున తను కూర్చొన్నాడు. నా రెండు నిమిషాల పర్యవేక్షణలో ఒక ఖాళీ సీటు కన్పించింది. వెంటనేపోయి కూర్చొన్నాను. ఈలోపుగా పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది కండక్టర్ బస్సెక్కాడు. కొంతమంది బస్సెక్కి నిల్చున్నారు. కొంతమంది ఎక్కలేక క్రిందనే ఉండిపోయారు. ఒకతను నావద్దకొచ్చి, "నా దస్తీ తీసివేసి నీవు కూర్చొన్నావేమయ్యా! లేలే!" అని సీటుక్రింద పడి

వున్న దస్తీతీసి చూపించాడు, ఈ మాటలు విన్న కండక్టర్‌వచ్చి నన్ను లెమ్మని దబాయించాడు లాభంలేదని నేను లేచినిల్చొన్నాను బస్సు కదిలింది గొడుగతనువచ్చి 'మోటువాడ్ని' లేపాడు అతడు గొణుక్కుంటూ నిల్చొన్నాడు

అప్పుడనిపించింది : వీరందరిలో చాలామంది అన్యాయంగా బస్సెక్కి కూర్చొన్న వాళ్లే : వందకు తొంభై మంది యీ విధంగా చేస్తే వేలెత్తి ఏం చూపగలం : ఎలా చూపగలం :

బస్సు ఎక్కేటపుడు సీట్లలో కొంత మంది దస్తీలను, పేపర్లను వేస్తుంటే ఏమీ అనలేక పోయాను ఎందుకు? ప్రయాణీకుడు, కండక్టర్ నన్ను సీటు నుంచి లెమ్మని గట్టిగా దబాయించినపుడు ఏమీ అడగలేకపోయాను ఈ బలహీన మనస్తత్వం నన్ను వెధవను చేసింది.

—గ్రంధె జనార్ధన్‌రావు, కోదాడ.

శతమర్కట సన్నిభులం మిత్రత్రయం చల్లనిగాలి మేస్తూ, ఊరి చివరగా పచ్చని పొలం గట్టుమీద రోడ్డువారగా కూర్చున్నాం

యావనసహజమైన స్త్రీ మనస్తత్వ పరిశీలనను చర్చిస్తూ ఎవరికి తోచినట్లు వాళ్ళు అవాకులు చవాకులు మహత్తరంగా మాట్లాడుతున్నాం ఘోరంగా విమర్శిస్తున్నాం, ఎవళ్ళూ వినడం లేదనే ధైర్యంతో


మా కెదురుగా క్రొత్త 'సువేగా' ఆగింది సిక్కు మతస్థుడు గాబోలు సలాములు చేస్తూ, చక్కని ఎంబ్రాయిడరీ చేసిన బొందు సంచీని తెచ్చాడు

పచ్చి శృంగారపు జోకులు, నాలుగు జోకాడు. అతి వేడితో అంతంత మాత్రంగా ఉన్న శర్మనీ, రామం మొటిమల్ని, హోటలు మెతుకులు పడక బక్కగా చిక్కిపోయి ఉన్న నన్ను స్త్రీని సుఖపెట్టడం కష్టమన్నట్లుగా కథలూ కార్పణ్యాలూ చెప్పకొచ్చాడు. కొన్ని సెక్స్ బలహీనతల్ని వివరించాడు. మాకూ నిజమే ననిపించింది

రతి క్రీడా భంగిమలున్న సహజ ఛాయా చిత్రాలు చూపించాడు. ఆ స్త్రీ

పురుషులందరు తన మందు వాడి అంత సుఖజీవితం గడుపుతున్నారన్నాడు. వాళ్లెంత సిగ్గులేకుండా తీయించుకున్నారనే ఆలోచనకంటె, మాకు నచ్చిన స్త్రీలతో మమ్మ ఊహించుకొనే గమ్మత్తయిన ప్రపంచంలో పడ్డాము. సరే, ముగ్గురం చిత్తయిపోయి మందు కొనేయాలనే క్యూరియాసిటీ పెరిగిపోయింది మందు తయారుచేయమన్నాము

కుంకుమ పువ్వు, డ్రైయాపిల్ పౌడర్ తులాల లెక్కన మిశ్రమంచేసి 50/- రూపాయలు బిల్లన్నాడు ఖరీదునీ,




మందునీ నమ్మమన్నాము.

వాడి చిరా చూపించాడు. వందలాది యువకులు ఫొటోలతో సహా మంగు ఖరీదు ఇచ్చినట్లు సంతకాలతో నిండి ఉంది. వాడి దివ్యౌషధం పొట్లంగట్టి తెచ్చుకున్నాం కొన్నాళ్ళు మందు వాడటానికి బద్ధకించాము నా వాటా పొట్లం నేను తీసికొని జాగ్రత్త పెట్టాను

ఇంతలో ముహూర్తం పెడతారనగా మంగు వాడదామని పాలల్లోవేసి త్రాగబోయాను వెగటు వాసన వచ్చింది. మానేశాను. కాని కళ్ళముందు వాడు చూపించిన నగ్న చిత్రాలు గిర్రున తిరిగాయి. ముక్కు మూసుకుని త్రాగేశాను. అంతే కళ్ళు తిరిగినట్లు అయింది. డోకొచ్చింది. మర్నాడు ఆముదం పుచ్చుకొంటేగాని దాని 'ఇది' పోలేదు

ఆ మందుమీద, మోసంచేసిన ఆ సింగు మీద, నాలాంటి అమాయకుల్ని యువకుల్ని మోసంచేసి కొన్న వాడి కొత్త సువేగామీద ఎక్కడలేని కసి వచ్చింది.

మా ఫ్రెండు రూముకి వెళ్ళేసరికి మరొక సింగుగాడు అదే పద్ధతిన వాడికి వివరిస్తూంటే ఒళ్ళుమండి, వాణ్ణి తన్ని, అరచి, గోలచేద్దామనుకొన్నాను. కానీ ..

నేను మోసపోయాననే చెప్పుకోవడానికి నాకు ఆ సమయంలో నామోషీ అనిపించింది కానీ, ఇప్పుడనిపిస్తోంది. నేనింత 'మంచి వెధవ'నన్న మాట!

—'వజ్రేంద్ర'

# అద్దంలో ప్రతిబింబం

జీవితం అద్దంలో
మధ్య తరగతి ప్రతిబింబం
వికృతంగా కవిపించింది।
మొహంలో ఆకర్షణా?
లేదు లేదు—
మృత్యువు కౌగిట్లో చిక్కి
అవసాన దశలో పడే ఆవేదన।
కన్నుల్లో కళా?
లేదు లేదు—
కాష్ఠంమీది శవం
కళ్ళు తెరచి చూసిన చూపు।
బుగ్గల్లో నిగ్గా?
లేదు లేదు—
మండి మసిగా మారిన
అగ్గిలోని బొగ్గు।
ముక్కులో సరళత్వమా?
లేదు లేదు—
ఆకాశం వైపు చూస్తోన్న
స్మశానంలోని
సగం కాలిన కొరకంచు।
పెదవుల్లో మృదుత్వమా?
లేదు లేదు—
వాన ముఖం నోచుకోని
వడదెబ్బ తిన్న బీడు।
'అద్దంలో ప్రతిబింబం' అందమా?
లేదు లేదు—
ఆదిలోనే త్రుంచి విసిరేసిన
కాంతి విహీనపు మొగ్గ।।

—బద్ది నాగేశ్వరరావు

# నాకేటి తెలుసు !

పూరిపాకా తలావికి
పన్నునేకుండా సెత్తానన్నాడు.
వున్న పాక పీకింతాడని
నాకేటి తెలుసు.

సెరువ్‌లో సేపలట్టేందుకు
వుత్తినే వలలిప్పింతానన్నాడు.
సేపలట్టాలంటే, సిత్తుకట్టాలంటాడని
నాకేటి తెలుసు.

మా వూరి గుళ్లో
దీపం ఎడతానన్నాడు
దేవుణ్ని సూడాలంటే, దచ్చినిమ్మంటాడని
నాకేటి తెలుసు.

బియ్యం సయ్యంగా
ఇప్పింతానన్నాడు
కల్లు కంట్రోల్ ధర కిప్పింతాడని
నాకేటి తెలుసు.

మరి గట్టాంటోడికి
ఓటెట్టా ఏసినావ్?
ఐదురూపాయ లిత్తానంటే ఓటేశా
గెలిసినాక ఐపునేకుండా పోతాడని
నాకేటి తెలుసు।

—యస్. కె. బాజీ

# నేటి సినిమాలు-తీరుతెన్నులు

యాద్దనపూడి... 

యాడ్పుగంటి లక్ష్మణరావు

ఇటీవల కాలంలో చాలా సినిమాలు వసూళ్ళ దగ్గరన్నా విజయవంతం కాలేక పోతున్నాయి. అనేక కారణాలుండొచ్చు కాని కొన్నింటినైనా పరిశీలిద్దాం.

కథ, సంభాషణలు, స్క్రీన్ ప్లే పూర్తిచేసుకుని దర్శకుని అవగాహన అయినతర్వాత అందులోని ప్రతిఅంశాన్ని ఆ చిత్రంలో నటించే కళాకారులకు, సాంకేతిక నిపుణులకు చెప్పి వినిపించే అలవాటుండేది పూర్వం ఇక ఏ ఒక్కరికీ మళ్ళా తావుండేదికాదు

అలాగే ఆనాటి నాటక సమాజాలున్నా. స్టేజీమీద ఎన్ని పాత్రలుంటే అందరి డైలాగ్సు అందరికి వచ్చివుండేవి డైలాగ్సేకాదు. డెలివరీ విధానంకూడా వచ్చివుండేది

కీ. శే. కోడూరి అచ్చయ్యగారు పై సూత్రాలన్ని తప్పక అమలుపరిచేవారు మన హీరో శ్రీ నాగేశ్వరరావుగారు కూడా ఆ ఒరవడినుండి వచ్చినవారే

అలాగే సురభి కంపెనీ, ప్రజా నాట్యమండలి, కీ. శే. రాజారావుగారు, కీ. శే. డి. వి సుబ్బారావుగారు, కీ. శే పి సూరిబాబుగారు మరకొందరు పైసూత్రాలన్ని అమలుపరచే నాటి నాటక సమాజాల్ని పటిష్టంచేసి పేరుబడసారు.


ఓసారి బందరు నోబుల్ కాలేజీకి ఆర్థిక సహాయంకోసం విజయవాడ జింఖానా ఆవరణలో పేరుబడ్డ సినిమా తారలంతా నాటికలు వేశారు. ఎవరేం చెప్పారో ప్రేక్షకులకు తెలియకపోతే మానేవారిలో వారికే తెలియలేదు

ఎటుదిరిగి వారిమీద ప్రేక్షకులకున్న అభిమానంతో ఆనాడు ఏం జరిగినా సరిపోయింది కాని క్షంతవ్యం కానిపని.

ఇప్పట్లో రవి ఆర్టు థియేటర్సు శ్రీ సి. నాగభూషణంగారు పాత ఒరవడికి తలమానికంగా ఉన్నారు

ఇక సినిమాలలో చర్విత చరణమే అవుతుంది. అయినా మొదటి తరానికి చెందిన కీ॥ శే॥ గూడవల్లి రామబ్రహ్మం, కీ॥ శే॥ సి పుల్లయ్య, కీ॥ శే। కె వి రెడ్డి, శ్రీ బి ఎన్ రెడ్డి, శ్రీ పి పుల్లయ్య, శ్రీ ఎల్. వి. ప్రసాద్ మొ। వారు కథా రచన, సంభాషణలు స్క్రీన్ ప్లే పూర్తి కాకుండా సెట్సుకు వెళ్ళే అలవాటుండేదికాదు అలాగే సెట్సుకు, కాస్ట్యూమ్సుకు తగిన ప్రాధాన్యత మాత్రమే ఉండేది

ఇటీవల ఎన్ ఎ. టి. వారి పిచ్చిపుల్లయ్య చూచే సదవకాశం కలిగింది. కథకు ప్రాధాన్యమున్న చిత్రం అది. అది జమీందారీ కుటుంబం. కాని దుస్తులకు ప్రాధాన్యతలేదు పిచ్చిపుల్లయ్య పాత్రధారి శ్రీ ఎన్ టి. రామారావు పేదరైతు కుటుంబంలోనివాడు. బస్తీకెళ్ళాడు. బడా జమీందారుల యింట చేరాడు కాని ఆడంబరము సూచించే విధానాలేమీ లేవు. ఆ పాత్ర పెరిగినకొలదీ అతని మనసును



'దేవుడుచేసిన పెళ్ళి' లో శోభన్‌బాబు, శారద

పెంచి చూపించారు. ఆడంబరము పెంచ లేదు.

అందుకేనేమో ఆంధ్ర ప్రేక్షకులు మాత్రం ఒక నిర్ణయానికి వస్తున్నారు. మునుపటి సినిమాలే బాగుంటున్నాయని, బాగుంటాయని.

ఇప్పుడో! కథాబలము లేదు. కాశ్మీరులు రకరకాల దుస్తులు, కలర్లు, ప్రతి చిత్రం బాగుందని ప్రచారశాఖ నిర్వహణ, వాయిద్యాల ఘోష, తీరా చూచాక ఆశా, నిరాశ.

కథకూడా సగంలో మారుతోంది. డైలాగ్సు సెట్సుకొచ్చాక మారుతున్నాయి. కొన్ని డైలాగులయితే సెట్టులో అందరూ ఉన్నాక, అవి యింకా ఏ పేరుబడ్డ హోటలులోనే ఉంటున్నాయి.

ఇన్ని చేసినా మరి నిర్మాత, కొన్ని సందర్భాలలో నిలబడగలుగుతున్నాడు. జిల్లాలవారీ అమ్మకాలొచ్చినాక. కాని ఇది తాత్కాలికమే. ఇది శుభ సూచకం కాదు.

కారణం ఒక బాగున్న సినిమాను అదే జిల్లాలో రెండవసారి మూడవసారి కూడా ఆడించుకుంటాడు బాగుంది. కాని అతడికే బాగా నడవని సినిమా ఉందనుకోండి. నడిపించలేక వ్యాపార సరళిలో వీలయినంత తక్కువ షరతులకు అంగీకరిస్తున్నాడు. ముఖ్య పంపిణీదారునికి కూడా కొన్ని సమస్య లడ్డువస్తున్నవి. ఒక జిల్లా హక్కుదారుని ప్రింటు ఖాళీగా ఉందనుకోండి. మరొక జిల్లా హక్కుదారుని ఏరియాలో బుకింగ్ వస్తుంది. వారి ప్రింటులు ఖాళీగా ఉండవు.

ఎగ్జిబిటరు ఓమాదిరి పిక్చరు సెకండ్ రన్ వేయడానికి చాలా కష్టమౌతోంది. ప్రాంతీయంగా జిల్లా హక్కుదార్ల దగ్గర



'పరివర్తన'లో లక్ష్మి

ఉండే మంచి చిత్రాన్ని వేయడానికే ఉత్సాహం చూపుతున్నాడు. యిన్ని కారణాలగా ప్రదర్శకునికీ, పంపిణీదారునికీ ఉన్న వ్యాపారసన్నిహితాలు, సంబంధాలు సన్నగిల్లుతున్నాయి.


దానికి తోడు ప్రభుత్వం కూడా, పాడి పరిశ్రమకు, ఇటుకరాతి పరిశ్రమలకు, విశ్రాంతి భవనాలకు, అప్పు లెడుతోంది. ఆదుకుంటోంది. మనకు కూడా సంవత్సరానికో, గుర్తులేకపోతే మరో సంవత్సరానికో, కంచునంది, రాగినంది ఇస్తోంది లెండి. కాదనకూడదు. ఇంతకూ ఈ పరిస్థితికి ఎవరు కారణమని ఓ ప్రసిద్ధ దర్శకుడిని పరామర్శిస్తే వచ్చిన మాటలివి. 'ఇదివరకు చదువున్నవాళ్ళు, ఆడంబరాలు లేనివాళ్ళు, క్రమశిక్షణకు అలవాటుపడ్డ వాళ్ళు, సాహిత్యాభిలాష ఉన్నవాళ్ళు వచ్చారు' అంటుండగానే ఇప్పుడివన్నీ లోపించిన వంటారా అని అడిగితే 'అడగక్కరలేదు కనిపిస్తోందంతే' అన్నారు.

యువతరం పై మాటలకు ఉగ్రరూపం దాల్చక తమ్ముతా మొకసారి ఆత్మపరీక్ష చేసుకుంటే మంచి సినిమాలే చూపొచ్చు మున్ముందు ప్రేక్షకులకు ఇటీవల ఆయనో పల్లెటూరు వెళ్ళారట బంధువుల ఇంటికి. సుష్టుగా భోజనంపెట్టి తదనంతరం ఆ ఇంటాయన 'అబ్బాయీ మావాడొకడు ఇంట చదువూ సంధ్యాలేదు అటు పొలానికీ వెళ్ళడంలేదు ఉత్తినే గాలికి తిరుగుతున్నాడు మీ సినిమాలలోనికి తీసుకెళ్ళరా అన్నాట్ట' ఆ దెబ్బతో ఆయనకు మతిబోయి, నే వెళ్ళి కబురంపుతాలే అంటూ తమపైన ఉన్న పై సద్భావానికి లోలోన బాధబడక తప్పలేగుట!

నిర్మాతనడిగితే, దర్శకుడదని, దర్శకుని అడిగితే పంపిణీదారునిదని, మరికొందరు నటీనటులదని, జోక్యం ఉంటుంటోందని అందరూ చెపుతుంటుంటారు. విత్తు ముందో చెట్టుముందో చెప్పలేని దైన్యస్థితి. ఏదైనా సమిష్టికృషి చాలా అవసరం. అందుకు కాలవ్యవధిలేదు. వేగంగా వెడుతోంది.

వేగం తగ్గితేనే మంచిదని, మళ్ళీ వెలుతురున్న చిత్రాలు చూస్తామని, ఆశిద్దాం.

## సీరియల్




''కళ్యాణికి,

జరిగినదానికి చింతిస్తూ నీకు ఉత్తరం రాయడంకూడా మీ వారికి యిష్టం వుంటుందో వుండదోనని యీ నెలరోజులుగా సందేహిస్తూనే జాప్యం చేశాను. కాని నీ బాధ తలుచుకుంటే యీ ఉత్తరం వ్రాయకుండా వుండలేకపోయాను. నా ఉనికి తెలుసుకోడానికి నీ వెంత ఆరాటపడ్తూంటావో తెలిసీ నిన్నింకా హింసించలేక ఏమయినా సరేనని ఉత్తరం రాస్తున్నాను. మీ వారికి నా క్షమాపణలు అందచెయ్యి అవసరమనుకుంటే యీ ఉత్తరం ఆయనకి చూపించు అపార్ధానికి తావు లేకుండా

కళ్యాణీ, నేనేం రాయను? ఏం రాయగలను? నేను తిరిగి వచ్చేసరికి యీ స్థితిలోనే నీ వుంటావని తెల్సినా, ఎందుకో అప్పుడప్పుడు వెర్రిగా నా కోసం నా కళ్యాణి రెండేళ్ళేమిటి ఎన్నేళ్ళయినా నిరీక్షిస్తుంది. నేను పెద్ద ఉద్యోగినై ఎదురుగా గర్వంగా నిలబడతాను, అప్పుడింక కళ్యాణి నాది కాక ఏమవుతుంది అని

పిచ్చిపిచ్చిగా ఆలోచించాను. ఇది భారత దేశమని, ఓ ఆడపిల్ల తన యిష్టంవచ్చిన పెళ్లి చేసుకుంటానంటే కుదరదని, ఓ దౌర్భాగ్యుడికోసం ఏళ్ళతరబడి ఎదురు చూస్తూ కూర్చుంటాను పెళ్ళి చేసుకో కుండా అంటే ఆ ఆటలు, ఆశలు సాగవని మరిచిపోయి, వెర్రిమొర్రి కలలు గనేవాడిని నీవు పెళ్లి చేసుకోకుండా నా కోసం ఎదురుచూస్తూ వుండాలని వున్నా. నీ చుట్టూ మనుష్యులు వూరుకోరని తెలిసీ నీ మీద భ్రమతో కలలు గనడం వెర్రి గాదూ!

కళ్యాణీ నే నింట్లోంచి వెళ్ళిపోయి ఏం అవస్థలు పడ్డానో, ఎన్ని బాధలు పడ్డానో, అయిదేళ్ళ తరువాత చెప్పడం, చెప్పి నిన్ను బాధపెట్టడం నా కిష్టంలేదు. అదృష్టమో దురదృష్టమో ఎయిర్ ఫోర్సులో చేరాను. రెండేళ్ళ తరువాత ఆఫీసరు హోదాని అందుకున్నాను అప్పుడిక మామయ్య ముందు నిలోగలిగే తాహతు వచ్చిందనిపించింది. రెండేళ్ళ తరువాత నీకు ఉత్తరం రాశాను. ఎంతో గర్వంగా నా గురించి రాసి, నిన్ను చూడడానికి వస్తానని వెంటనే జవాబు ధాయమని రాశాను. ప్రతిరోజూ నీ జవాబుకి ఎంతో ఆరాటంగా ఎదురుచూశాను. జవాబు లేదు ఆ తరువాత మరి రెండు. వాటికీ జవాబు లేదు. ఆ తర్వాత రిజిష్టర్ ఎక్నాలడ్జ్మెంటుతో రాశాను. ఎడ్రసీ నాట్ ఎవయిలబిల్ అని తిరిగివచ్చింది. గాభరా పడ్డాను. పోనీ నీకు పెళ్లయి అత్తవారింటికి వెళ్ళివుంటావు. మామయ్యవాళ్ళేం అయ్యారు అనుకుంటూ ఏ సంగతి తెలియక దిగులుపడ్డాను. మామయ్య నా ఉత్తరాలకి జవాబు యీయడానికి యిష్టపడక వూరుకున్నాడనుకున్నా రిజిష్టర్ లెటర్ మనిషి లేడు అని ఎందుకు తిరిగివస్తుంది అన్పించింది ఏ సంగతి తెలియక కొన్నాళ్లు గడిపాను

ఆఖరికి ఓసారి వెళ్ళి సంగతి సందర్భం ఏమిటో తెలుసుకు రావాలని బయలు దేరాను! అక్కడేముంది? ఇరుగుపొరుగు ద్వారా సంగతులన్నీ విన్నాను మామయ్య పోవడం, నీ పెళ్ళవడం ఆస్థులన్నీ అమ్ము కుని మీరు హైదరాబాదు వెళ్ళిపోయారని విన్నాను

కళ్యాణీ, నే నెవరికోసమయితే ఈ స్థితికి ఎదిగానో, ఎవరి ముందరయితే గర్వంగా నిలబడాలనుకున్నానో, నన్ను చూసి సంతోషించడానికి వారెవరూ లేరు. నా యీ హోదా, ఉద్యోగం ఎవరికీ పని కొచ్చేది కాదు. ఎవరినయితే ఈ ఉద్యోగంతో స్వంతం చేసుకోవాలనుకున్నానో వారిప్పుడు నా కందనంత దూరం అయి పోయారు.

ఎంత నిరాశ, నిస్పృహ నన్నావరించి వుంటాయో ఆలోచించు నీకు పెళ్ళయిందని విన్నాక యింకా ఎవరికోసం, ఎందుకోసం యీ బ్రతకడం అన్న నిర్లిప్తత ఆవహించింది నిన్ను మరిచిపోవాలని, నాది కాని వస్తువుపట్ల వ్యామోహం ఇంక పెంచుకోకూడదు అని నిన్ను తలవకూడదని అనుకునేవాడిని. కాని అది సాధ్యమా? నిన్నొకసారి వచ్చి చూడాలనిపించింది. చూస్తే నీవు పరాయిదానివన్న భావనని

## జరిగిన కథ

డాక్టర్ కల్యాణి దగ్గర హౌస్ కీపర్ సుజాత కల్యాణి దగ్గర అసిస్టెంటుగా చేరిన రామకృష్ణ, సుజాతలు ప్రేమించుకున్నారు వారి పెళ్లి కళ్యాణే జరిపించింది. కళ్యాణి భర్త డాక్టర్ రంగారావు తాగుబోతు భార్యను చాలా హీనంగా చూస్తుంటాడు బావ ఆనంద్ వచ్చి తన దగ్గర వున్నంతకాలం ఉత్సాహంగా ఉండేది కల్యాణి. ఎంతో మంచిదనుకున్న కల్యాణి భర్తను మోసంచేస్తూ బావతో ప్రేమకలాపాలు సాగించడం వింతగా అన్పించింది సుజాతకు సుజాత అనుమాన నివృత్తిచేస్తూ తనకథ చెప్పసాగింది కల్యాణి

కల్యాణి మామయ్య కొడుకు ఆనంద్ బీదవాడు. కల్యాణి ఇంట్లోనె ఉండే వాడు బీదవాడన్న కారణంగా కల్యాణి తండ్రి ఆనంద్‌ను హీనంగా చూసేవాడు. అయినా యౌవనంలో ప్రవేశించిన కల్యాణి,ఆనంద్‌లు ప్రేమించుకొన్నారు కల్యాణి తండ్రి వారి పెళ్ళికి వప్పుకోలేదు కల్యాణి ఎదురు తిరిగింది. ఆనంద్ ఇంట్లోంచి వెళ్ళ గొట్టబడ్డాడు కళ్యాణిని బలవంతాన పెళ్లికి వప్పించారు కల్యాణిని చూడటానికి ఆనంద్ చాలా కాలానికి రావడంతో ఆనందం, బాధపట్టలేక అతన్ని కౌగిలించు కొని ఊరటచెందింది కల్యాణి అదిచూచిన ఆమెభర్త రంగారావు వీరిద్దరినీ అనుమా నించి, ఆనంద్‌ను అవమానించి పంపాడు

---

సహించలే ననిపించింది ఎప్పటికయినా నా మనసు ఆ నిజాన్ని వప్పుకుంటే అప్పుడు వచ్చి చూద్దాం అనుకున్నాను

ఆ మూడేళ్లు ఎలా గడిచాయో అడ గద్దు బ్రతకడానికి డబ్బుండాలి గనక ఉద్యోగం చేయడం - నిన్ను మరిచిపోవ డానికి త్రాగడం - నీవు గుర్తు వచ్చినప్పు డల్లా త్రాగి వళ్లు తెలియని స్థితిలో అలా పడివుండేవాడిని. నిన్ను మరవలేక, నిన్ను గుర్తుచేసుకుని నీవు నా దానివి కావన్న నిజాన్ని భరించలేక నరకం అనుభ వించాను. అలాగే రోజులు దొర్లించాను

ఆఖరికి యిన్నాళ్లయినా నా మనసు నీవు నా దానివి కావన్న నిజాన్ని అంగీక రించడానికి యిష్టపడలేదు ఓసారి కళ్లతో నిన్ను చూస్తే - ఆ నిజం మనసు అంగీక రిస్తుందేమో ననిపించి. భరించలేక ఆఖరికి బయలుదేరి నీ దగ్గిరకి వచ్చాను

వచ్చాక, అక్కడ జరిగిన సంఘటన తర్వాత నా బాధ, ఆవేదన మరింత ఎక్కువయ్యాయి. నిన్ననవసరంగా అవ మానం పాలు చేశానని, మీ భార్యాభర్తల మధ్య కలతలు రేపానన్న అశాంతి నన్ను నిలవనీయడం లేదు కళ్యాణీ నిన్ను చూసిన క్షణంలో నీవు వివాహితవి అన్న నిజమే గుర్తు రాలేదు. నా కళ్యాణిని అన్నాళ్ళ తరువాత చూసిన ఆనందం, అన్నేళ్ళ వియోగం తర్వాత కల్గిన ఆవే దన, ఆవేశం నన్ను నేను మరిచేట్టు చేశాయి ఆ క్షణంలో నా పూర్వపు కళ్యాణే కళ్ళముందు సాక్షాత్కరించింది. ఐదేళ్ళ వియోగ దుఃఖాన్ని నీ కౌగిలిలో

మరిచిపోవాలన్న ఆరాటంలో యదార్థాన్ని మరిచి అనుచితంగా ప్రవర్తించాను దాని కిప్పుడు ఎన్ని క్షమాపణలు చెప్పినా ప్రయోజనం ఏమిటి?! నా కారణంగా నీ వైవాహిక జీవితంలో కలతలు రాకూడ దని నా కోరిక. మరొకసారి మీ వారికి నా మనఃపూర్వక క్షమాపణలు అంద చెయ్యి

కళ్యాణీ, యింకేం రాయను. ఈ ప్రపంచంలో నీవు తప్ప నా కెవరూ నా అనేవారు లేరు! నిన్నుకూడా పోగొట్టు కున్నాను! కనీసం ఎప్పుడయినా నీ యింటికి వచ్చి నీతో మనసారా మాట్లాడ గలిగే అవకాశంకూడా పోయింది. ఇంకేం చెయ్యను! నా కెవరున్నారు?! నా కష్టం, సుఖం చెప్పుకోడానికి ఎవరూ లేని ఏకాకిని! చిన్నప్పటి దౌర్భాగ్యమే యిప్పటికీ నన్ను వదలడం లేదు. ఇంత దురదృష్ట వంతులు ఇంక ఎవరన్నా వుంటారో లేదో తెలియదు! కళ్యాణీ బాధపడకు నా కోసం! నాకీ బాధలు అలవాటే! అన్నింటిని గరళంలా దాచుకుని యిలా బ్రతుకు తూనే వుంటాను ఏకాకిగా—సదా నీ సుఖం కోరే నీ బావ ''

బావ ఉత్తరం చూసి కళ్ళ నీళ్ళు నిండుకుపోయాయి! గొంతు నిండా దుఃఖం పొంగింది. తెలియని పిచ్చి దుఃఖంతో ఆయనింటికి రాగానే ఆ ఉత్తరం ఆయన మీదకి విసిరికొట్టాను నా దుఃఖం ఆవేదన కలిపి కసిగా నిందించాను ఆయన్ని.

''అంతలా వాడికోసం ఏడవడంలోనే తెలుస్తూంది నీ మనసు. నీ నిజాయితీ. చేసిన తప్పుకి సిగ్గు పడాల్సింది పోయి పైగా నన్నంటున్నావు ఇదిగో నీ వైఖరి నాకేం నచ్చలేదు వాడొచ్చిందగ్గరనించీ నీ ప్రవర్తన నాకేం బాగులేదు'' కఠినంగా అన్నారు

''వాడు గీడు అనకండి, మర్యాదగా మాట్లాడండి'' ఉక్రోషంగా ఆవేశంగా అన్నాను.

''అంటాను. తప్పకుండా అంటాను వాడి కంతకంటె మర్యాద కూడా యివ్వాలేమిటి?'' కవ్వించి రెచ్చ గొట్టే ఆయన ధోరణికి కోపం వస్తున్నా ఏం చెయ్యలేని స్థితి నాది చేసిన చిన్న తప్పుకి ఎంత పెద్ద శిక్ష!

ఈ విషయం గురించి అవకాశం వచ్చి నప్పుడల్లా చెప్పడం ఆయన మానలేదు. నా బలహీనతని, నా పొరపాటుని నిమిష నిమిషానికి వేలెత్తిచూపడం నేను సహించ లేని విషయంగా తయారయింది ఏమి చెయ్యలేను గదా అని పిల్లిని గదిలో పెట్టి అదే పనిగా హింసిస్తే, రెచ్చగొడితే ఎంత కని సహిస్తుంది! ఆఖరికి తెగించి తిరగ బడుతుంది! భయపడకుండా మొండిధైర్యంతో తిరగబడి రక్కుతుంది అదే స్థితి అయింది నాది! ఒకరోజు యింక భరించలేక తిరగ బడ్డాను నేనూ మనిషిని—నాలోనూ చీము నెత్తురు వుంది. కాస్తో కూస్తో చదువు కున్నాను. ఆత్మాభిమానం వుంది

'అవును బావ నా ప్రియుడే మే మిద్దరం ప్రేమించుకున్నాం యింకా ప్రేమించుకుంటున్నాం మిమ్మల్ని నేన కావాలని పెళ్ళి చేసుకోలేదు. నే నెప్పుడూ

మిమ్మల్ని ప్రేమించలేదు ఇంక మీరెం అనుకున్నా, అన్నా నాకేం లెక్కలేదు, మీ యిష్టం వచ్చినట్లనుకోండి' అని విసురుగా వెళ్లిపోయాను. ఆయన కాసేపు అలాగే నోటిమాట రాక నిలబడిపోయారు

ఆ రోజునించి ఆయన సాధింపు తగ్గింది కాని ఆయన నాతో చాలా ముభావంగా వుండడం ఆరంభించారు నాకూ మాట్లాడాలనే మనసు లేనందున అదీ ఒకందుకు మంచిదే ననిపించింది ఎప్పుడన్నా ఆయన ఈ విషయం ఎత్తి ఏదన్నా అంటే రక్కున జవాబిస్తూండేదాన్ని అన్నింటికి తెగించిన నన్ను ఆయన ఇంకేం చెయ్యగలరు! ఆయన అన్నవన్నీ ఆయనకే అవమానం కలిగేట్టు జవాబిస్తుంటే ఇంకేం చేస్తారు భార్య "అవును నేనింకోర్ని ప్రేమిస్తున్నాను నిన్ను ప్రేమించడం లేదు నీ ఇష్టం ఏం చేసుకొంటావో చేసుకో అన్నట్టు మాట్లాడేక యింక ఆ మగాడికి మాట్లాడడానికి ఏమి వుండదు! చేతనయితే ఆ భార్యని వదలాలి అంతే అదే స్థితిలో పడ్డారాయన నా జోలికి రావడం మానేశారు

బావకి జవాబు రాశాను అప్పుడప్పుడు క్షేమ సమాచారాలన్నీ తెలుపకపోతే నీ చింతతో నేను సుఖంగా వుండలేను. ఉత్తరాలు మానకు అని రాశాను బావ ఉత్తరాలు రాస్తూండేవాడు

ఇంట్లో మా అమ్మకి మా యిద్దరి మధ్య కలతలు కలహాలు అన్నీ తెలుస్తున్నాయి దాచినా దాగేవి కావు యివి అమ్మ నన్ను చాటుగా మందలించేది, ఆయనతో వాదన పెట్టుకుంటున్నందుకు. పెళ్ళయినదానివి, అతను చెప్పినట్లు నడచుకోవాలి అత నన్నాడంటే నీ తప్పు లేకుండా అన్నాడా, జరిగిందేదో జరిగింది. ఇంక అయినా అతని మాట విను, ఇద్దరూ అస్తమానూ ఎందుకలా మాట మాట అనుకుంటారు ' అంటూ మందలించేది

"ఊరుకో అమ్మా, నీవూ అలా మాట్లాడతావేమిటి? నేనేదో ఘోరాపరాధం చేసినట్లు మాట్లాడుతావేమిటి, అసలు సంగతి చెప్పినా అస్తమానూ సాధిస్తూంటే భరించడానికి నేనేం మనిషిని కానా అన్నాళ్ళకి మనిషి కంటికి కనిపిస్తే అలా ఎవరన్నా చేస్తారు ఇంతలో నా పాతివ్రత్యానికి ఏం లోటు రాలేదులే ఛా వెధవ దేశం, వెధవ మనుష్యులు మకీ మగాడ్ని ఆ మాత్రం ముట్టుకుంటేనే అవినీతి క్రింద లెక్క ఏమిటి'' అని పౌరుషంగా అన్నాను అమ్మ ఏమి అనలేక, మా గొడవలని సరిదిద్దలేక బాధ పడుతూండేది.

రోజులు అతి భారంగా గడిచేవి అసలే అన్యోన్యత కరవయిన మా కాపురం యీ సంఘటన తర్వాత ఎంత బాగ సాగి వుంటుందో ఆలోచించు నా విరక్తి రోజు రోజుకి పెరిగిపోసాగింది.

## 42

మరో ఆరునెలలకి గాబోలు బావ పని మీద హైదరాబాదు వచ్చాడు ఇంట్లో వంటవాడికి ఆరోజు బజారులో కనిపించాడట బావ. ఆ సంగతి నాతో చెప్పాడు.

నే నాశ్చర్యపోయాను. బావ యింటికి రానందుకు నొచ్చుకున్నాను. కాని ఎందుకు రాలేదో తెలిసి ఎలా నిందించగలను? వూర్లోకి వచ్చాడని తెలిసీ బావని చూడకుండా, పలకరించకుండా వుండగలగడం నా శక్తిలో లేకపోయింది. కానీ ఎక్కడున్నాడో తెలియక నేను ఆందోళనపడ్డాను ఆఖరికి ఊహించి రెండు మూడు పెద్ద హోటల్సుకి ఫోను చేశాను. బావ ఆచూకి దొరికింది. తాజ్ మహల్‌లో దిగాడని తెలిసింది బావతో మాట్లాడడంకోసం నా మనసు తహతహలాడింది. ఇంటికి పిలిచే ధైర్యం లేకపోయింది అందుకే నన్ను పబ్లిక్ గార్డెన్సుకి వచ్చి ఓ అరగంట కలుసుకుని మాట్లాడమని ఫోనుచేశాను

"ఇంటికి రాకుండా ఎక్కడో హోటల్లో దిగడమేమిటి బావా" అన్నాను. అన్నానే గాని నా అధైర్యం, నిస్సహాయత నా గొంతులోనే పసిగట్టి "వద్దు కల్యాణీ, జరిగిన గొడవ చాలు వీలుచేసుకుని సాయంత్రం గార్డెన్స్‌కి వస్తాను మీవారు ఏం అనుకోరు గదా, మళ్ళీ ఏం గొడవ జరగదు కదా" అన్నాడు సందేహిస్తూనే

"పరవాలేదు" అన్నాను నిబ్బరంగానే, నిజంగానే బావతో ఓగంట కబుర్లు చెప్పుకోడంకోసం ఆయన ఎన్ని అన్నా భరించగలను!

ఫోనులో నేను మాట్లాడడం—ఆయన క్రిందకివచ్చి టిఫినుకోసం కూర్చుంటూ విన్నారు. నేను వచ్చి డైనింగ్ టేబిల్ దగ్గిర కూర్చుని మాట్లాడకుండా టిఫిన్ తినడం ఆరంభించాను. నేను ఏదన్నా చెపుతానేమోనని కాసేపు చూసి ఆగలేక "ఎవరితో మాట్లాడావు?" అన్నారు. "మా బావతో" అన్నాను ముభావంగా. ఆయన మొహం ఎర్రబడింది. కాసేపు వూరుకుని "మళ్ళీ వచ్చాడన్న మాట, ఎక్కడికి రమ్మంటున్నావు యింటికా?" ఆయన గొంతులో కసి, అసూయ, ఆగ్రహం అన్నీ తొంగిచూస్తున్నాయి

నేను ఒక్కక్షణం తిరస్కారంగా చూసి "ఆ అర్హత నాకుంటే, నా భర్తలో ఆమాత్రం సంస్కారంవుంటే ఆ పనే చేసేదాన్ని గార్డెనుకి రమ్మన్నాను .."

"వెడతావా ?" అన్నారు నావైపు తీక్షణంగా చూస్తూ

"వెడుతున్నాను" అన్నాను దృఢంగా. అంత సూటిగా జవాబు వస్తుందని ఎదురు చూడని ఆయన కొన్ని క్షణాలు వూరుకుని

"గార్డెన్సుకో, హోటలుకో ఎవరికి తెలుస్తుందిలే వెళ్ళు వెళ్ళు" అన్నారు హేళనగా. ఆయనలా మాట్లాడుతూంటే నాకు మరింత పట్టుదల వస్తుంది.

"నే నెక్కడికి వెడుతున్నానో, ఏంచేస్తున్నానో కనిపెట్టడానికి ఓ డిటెక్టివ్‌ని పెట్టుకుంటే సరి, లేకపోతే స్వయంగా వెనకాల బయలుదేరితే మంచిదే .." అంటూ లేచి వెళ్ళిపోయాను

## 43

ఆ సాయంత్రం, బావతో గడిపిన ఆ గంట, జీవితంలో మరిచిపోలేని రోజు నాకు. ఎన్నేళ్ళ తరువాతో మనసులు విప్పి మాట్లాడుకున్నాం ఒకరి కన్నీళ్ళు ఒకరు తుడుచుకున్నాం అన్నాళ్ళు పడిన ఆవే

దనలని ఇద్దరం పంచుకున్నాం. "బావా, ఎప్పుడైనా యిలాగైనా కంటబడుతుండు. కనీసం ఒకరినొకరు కళ్ళతో చూసైన తృప్తిపడదాం" అన్నాను కళ్ళనీళ్ళతో

"నేను రావడానికేం కల్యాణీ, నీ వెప్పుడు రమ్మంటే అప్పుడు నీ సమ క్షంలో వాలుతాను కానీ మీ ఆయన

ఆయన కిష్టం వుండదు నావల్ల మీ రిద్దరూ అసలు విన్ననగా యీవూరొచ్చి నిన్ను చూడకుండా వుండడానికి నే నెంత విగ్రహించుకున్నానో, ఎంత బాధపడ్డానో నీకెలా తెలుస్తుంది నీ యింటిముందు నించి అలా రెండుసార్లు తిరిగాను లోప లికి వచ్చే ధైర్యం లేకపోయింది యింటి ముందు నీవు కనిపిస్తావేమో ఒకసారి కళ్ళతో చూసి సంతృప్తి పడదామను కున్నాను తప్ప, సాహసించి నీ దగ్గిరకి రాలేకపోయాను, నీకు ఫోనుచెయ్యాలన్నా భయం వేసింది, ఫోను చేస్తే నీవు నన్ను కలుసుకోకుండా వుండలేవు ఇదంతా ఆయ నకి మరింత కోపకారణం అవుతుందని, నీ జీవితం మరింత నరకం అవుతుందని "

"ఇప్పు డింక క్రొత్తగా అయ్యేందుకు ఏముంది బావా, పెళ్ళయిందగ్గిరనించి ఒకేలా వుంది మా కాపురం యీ ఆరు నెలలనించీ అయితే నరకంలో వున్నట్టే వుంది" అంటూ పెళ్ళయిం దగ్గరనించి అంతా చెప్పాను ఆ పెళ్ళి నే నేపరిస్థితు లలో చేసుకోవలసి వచ్చిందో చెప్పాను ప్రస్తుతం యింట్లో తేలున మాటలు, ప్రవ ర్తనగురించి అంతా వ్యధతో చెప్పు కున్నాను.

అంతా విని బావ బాధగా నిటూర్చాడు .. "నానించేకదా కళ్యాణీ, నీ వైవాహిక జీవితం యిలా దెబ్బ తింది?" అన్నాడు. ఆ మాటకి జవాబు చెప్పలేకపోయాను. ఒక విధంగా ఆమాట నిజమే!, బావమీద నాకు ప్రేమ లేకపోతే ఆయనని పెళ్లాడడానికి, పెళ్లాడి ప్రేమించడానికి ప్రయత్నించే దాన్నేమో! చాలామంది ఆడవాళ్లలాగే పెళ్ళి చేసుకుని ఆ సంసారంలో యిమిడిపోయి అదే సుఖం అనుకుంటూ బ్రతకగలిగే దాన్నేమో!

"కళ్యాణీ, జరిగిందేదో జరిగింది. యిప్పు డెంత విచారించినా చేయకల్గింది ఏమిలేదు. అనవసరంగా మనస్తాపం పెంచు కుని నీవు బాధపడి నీ భర్తని బాధపెట్టడం మంచిది కాదు పెళ్ళి చేసుకున్నావు ఆ వివాహాన్ని గౌరవించి యీ సంసారంలో యిమడడం తప్ప నీవేం చెయ్యలేని అశక్తు రాలివి" అంటూ నన్ను ఓదారుస్తూ ఆ జీవితం అలాగే గడపక తప్పదని నచ్చ చెప్పాలని చూశాడు బావ.

"కళ్యాణీ, నాజీవితం అన్నివిధాలా పాడయి పోయింది జీవితపోరాటంలో అన్నింటా నష్టపోయాను. కనీసం నీవయినా సుఖంగా వున్నావన్న తృప్తి నాకు మిగలనీ, నీవు ఆనందంగా బ్రతుకుతూంటే చూసి ఆనందించే అదృష్టం అయినా నాకు దక్కనీ, నీ విలా బాధపడితే నేను సహించలేను కళ్యాణీ" అన్నాడు ఏడుస్తున్న నన్ను చూసి బావ.

పుట్టెడు దుఃఖాన్ని పుక్కిలించి, ఆనం దాన్ని నటిస్తున్న బావని చూసి విషాదంగా

నవ్వాను—" తలోకొమ్మదూపి కూల్చే పిన యీ చెట్టుకి నీళ్లుపోసి మళ్ళీ పూలు పూయించాలని చూ స్తున్నావా బావా, .. లేదు బావా, అలా జరగదు ఇక యీ చెట్టు యీ నేలమీద పెరగదు బావా నీవు కా స్త ఆలస్యంగా వచ్చావు బావా లాభం లేదు "

"కల్యాణీ!"

"అవును బావా, ఆడదాని జీవితం ఆత్మ వంచనతో గడిచిపోవడానికి సంఘం తీర్చి దిద్దిన అపురూపమయిన ఏర్పాటు-వివాహం! అంతే. అంతకన్న యింకేమి కాదు. చిన్న ప్పటినించి అల్లారుముద్దుగా పెంచిన తల్లి తండ్రులు ఆ అమ్మాయి యిష్టా యిష్టాల ప్రమేయం లేకుండానే ఓ అయ్య చేతులో పెట్టి కాళ్ళుకడిగి-చేతులు కడుక్కుంటారు. తమ బాధ్యతను తీర్చుకుంటారు. ఆమె యిష్టా యిష్టాల ప్రమేయంలేకుండానే ఆ అయ్య ఆమె శరీరంతో రాజీపడి, పిల్లల్ని కని తన బాధ్యతని తీర్చుకుంటాడు. కన్నతల్లికి పట్టెడన్నం పెట్టి కన్నుమూశాక కా స్తంత బుగ్గిచేపి కన్నకొడుకు తనబాధ్యత తీర్చు కుంటాడు. ఈ బాధ్యతల బాధా తోరణంలో ప్రతీ దశలోనూ ఆత్మార్పణ చేసుకున్న ఆ యిల్లాలికి సంఘం యిచ్చే బిరుదు - మహా పతివ్రత - అంతే కాదూ?"

"కళ్యాణీ, - ఏమిటి నువ్వు మాట్లా డేది "

"ఇవి మాటలు కాదు బావా! నా మన స్సును దహించివేస్తున్న ఆలోచనలు. నా మనస్సుని చంపుకుని, నా కలలని కల్లలు చేసుకుని యిలా బ్రతకడానికి నేను చేసిన నేరమేమిటి? ఈ దేశంలో ఆడపిల్లగా పుట్టడమేనా? ఊహలు తెల్సిన వయస్సులో ఊహించుకున్న కలలని నిజం చేసుకోవా లని, మనస్సున్న వాడికి మనసిచ్చినవాడికి యిల్లాలు కావాలని అనుకున్నాను - అది నా తప్పా? తమ అంతస్థులు, అభిజాత్యా లకు పణంగా పెట్టబోతున్న తల్లి తండ్రు లని ఎదిరించాను - అది నేరమా? బలవం తంగా కట్టిన మాంగల్యం ఉరిత్రాడయినా, ఆ వివాహాన్ని గౌరవించి తన సొంతం చేసుకున్న భర్తతో నోరెత్తకుండా కాపురం చేశాను ఎన్నో ఏళ్ళకి కనిపించిన ప్రియుడ్ని చూపి కరిగిపోయిన కలని తల్చుకుని క్షణ కాలం వాపోయాను — అది దోషమా — అది మోసమా?—

"ఏ సందర్భంలోనూ నా మనస్సుని వంచించుకోకుండా బ్రతకాలనుకున్నాను నిజాయితీతో తల్లికి, తండ్రికి, ప్రియుడికీ, సంఘానికి, భర్తకి నా మనసు విప్పి చెప్పాను నిష్కపటంగా నా జీవితాన్ని తెరిచి వుంచాను అర్థం చేసికోని తల్లి తండ్రులకి, అర్థం చేసుకో ప్రయత్నించని భర్తకీ, అర్థమే తెలియని సంఘానికి పాచిక నయ్యాను. ఆయన నన్ను "కులట" అన్నారు. న న్నసహ్యించుకుంటున్నారు. నిన్ను కళ్లారా చూసే అవకాశాన్ని కూడా దూరం చేస్తున్నారు? ఏ నేరానికి నే నీ శిక్ష అనుభవించాలి? - ఏ న్యాయస్థానం నా కీ శిక్ష వేసింది?"

"కళ్యాణీ ఏమిటీ ఉద్రేకం ఈ ఆవేశానికిప్పుడు అర్థం ఏమిటి?"

"హు అవునుబావా! నాలాంటి

నేనేకాదు.బావా, ఇవాళ చాలామంది స్త్రీలు నా స్థితిలోనే వున్నారను కుంటాను. నిజాయితీ ఎంత దెబ్బతీస్తుందో నాలాంటి అభాగ్యురాలి జీవితాలుచూసి పాఠం నేర్చుకోనీ! అబద్ధంతో బ్రతుకుతూ పతివ్రత లుగా చచ్చిపోతున్నారు చెప్పుబావా, యిలా కన్నతల్లిగా, యిల్లాలిగా బాధ్యతల్ని నెర వేర్చుకుంటూ ఈదేశంలో పుట్టిన పాపానికి నా తియ్యటి ఆలోచనలకి సమాధికట్టి పతివ్రతగా నన్ను చచ్చిపొమ్మన్నావా? అందరితోపాటు నీ కోరిక, నీ దీ వె నా అదేనా?'

"కళ్యాణీ! నాకోరిక అదికాదని నీకుతెలుసు! కాని అవునని ఎదిరించే హక్కు అర్హత నాకులేవు కళ్యాణీ. జీవితంలో నష్టపోయింది నీవు. తిరగబడే హక్కు నీకే వుంది" ఆర్ద్రంగా అన్నాడు బావ నా కళ్ళనీళ్ళకి చలించి

"అవును నాకేవుంది నువ్వు మళ్ళీ కని పించాక ఆ హక్కుని సార్ధకం చేసుకోవా లనుకున్నాను నలుగురూ నన్నసహ్యించు కోనీ, మనసులో, నన్నర్ధంచేసుకోగల ఒక్క ఆడదయినా అభినందిస్తుందని నాకు తెలుసు. తరతరాలుగావస్తున్న ఈ పద్మ వ్యూహంలో నేనూ యిరుక్కున్నాను యీ చేదునిజం నిరూపించేయిల్లాలిగా బ్రతకలేను పతివ్రతననిపించుకోవాలనేకోరిక నాకులేదు నాజీవితాన్ని నేను క్రొత్తదారి పట్టించు కుంటాను బావా, అందుకే నీతో మాట్లాడాలని రమ్మన్నాను బావా!

బావ నిర్ఘాంతపోయి చూశాడు అంటే చెప్పాను బావకి నామనసులో రగులుతున్న ఆలోచనని— మనసులు కలవని, అభి ప్రాయాలు అతకని భార్యాభర్తలు ఒకరి నొకరు ద్వేషించుకుంటూ, యింట్లో నరకం చూస్తూ యింకా కలిసే బ్రతకాలన్న ఆలోచనని ఆమోదించని చదువు, సంస్కారం నాకుంది నా బ్రతుకు నేబ్రతక గలిగే సంపాదన వుంది! ఆయనని ప్రేమిం చలేక, బావని ప్రేమిస్తూ ఆయనతో కాపురం చేయడంలో అర్ధం లేకపోవడమేకాక-అది అన్యాయం! ఆయనకి ద్రోహం చెయ్యడమే కాక, నాకునేను ద్రోహం చేసుకోవడం అవుతుంది! ఆత్మవంచనతో లోకంకోసం బ్రతకడం యిల్లాలిధర్మమని నేను నమ్మని నిజాన్ని ఎందుకు ఆచరించాలి' ఆయనని ప్రేమించలేని నేను, ఆయనవిడిచి స్వేచ్ఛకోరి నాకు నచ్చిన మనిషితో జీవితం ప్రారం భించే హక్కు నాకులేదా? యీనాడు ఆ అవకాశం అందుబాటులో వుంటే—యిలా కాపురం నరకం చేసుకోవడం, ఆనరకంలో మగ్గడంలో అర్ధంలేదు బావవచ్చి వెళ్ళిన తరువాత ఆయనమధ్య నామధ్య కలతలు లేని, కాపురంలో సుఖశాంతులు కరవయిం దగ్గిరనించి-ఓరోజు విరక్తిలో-నాలో యీ ఆలోచన చోటుచేసుకుంది రోజులు గడుస్తున్నకొద్దీ-విరక్తి మరింత పెరిగి న యీ ఆలోచన దృఢపడ సాగింది మనసులో కానీ ఆలోచిస్తుంటే-ఆచ రించడం అంత సుళువుకాదేమోనని పించి భయం అప్పించేవి. సంఘంలో కాస్తో కూస్తో పరువు మర్యాదవున్న

అంగీకరిస్తారా? ఆస్థి. సంపాదన వున్న నన్ను అంత సులువుగా వదులుకోవడానికి అంగీకరిస్తారా? కోర్టులు, కేసు అంటూ ఆయన పరువుని బోగొట్టడానికి వప్పుకుంటారా? తామిద్దరేకాక తమకి పుట్టిన పిల్లలున్నారు పిల్లల భవిష్యత్తు దృష్ట్యాఅయినా తను విడిపోవడానికి అంగీకరిస్తారా? ఒకవేళ నేను కోర్టుఎక్కినా విడాకులు, పొందినా, ఆయన పంతానికైనా పిల్లలని యీయడానికి అంగీకరించకపోతే నేనేం చెయ్యాలి! పిల్లలని నేను వదులుకోగలనా? అమ్మో! పిల్లలు. నాపిల్లలు. నా పసివాళ్ళు వాళ్ళని, చూడందే ఒక్క రోజయినా వుండలేని నేను వాళ్ళని శాశ్వతంగా ఎలా వదులుకోగలను? వదిలినా తరువాత-ఆ చింతతో ఆ జీవితంలో ప్రశాంతంగా జీవించగలనా? పిల్లలని వదిలి బ్రతకడం ఓ తల్లికి సాధ్యమా? ఏ ఆనందాన్నయితే నేను కోరుకుని వెళ్ళానో అది పశ్చాత్తాపంగా మారుతుందేమో!— ఆలోచనలతో బుర్ర వేడెక్కేది - కాని సమస్యకి పరిష్కారం తోచేదకాదు. నా ఈ ఆలోచన బావముందు పెట్టాను.

బావ కొంచెం తెల్లపోయాడు- ''నిజంగానే అంటున్నావా కళ్యాణీ. యింత దూరం ఆలోచిస్తున్నావా?'' అన్నాడు

''అవునుబావా. రోజులు యిక్కడ గడపడం రోజురోజుకీ దుర్భరమవుతూంది బొత్తిగా మనసులేని యీ కాపురం ముళ్ళ మీద వున్నట్లేవుంది. యింక యిక్కడ వుండలేను బావా'' బేలగా అన్నాను.

బావ కాసెపు అలోచించి . ''మీ ఆయన వప్పుకుంటారనుకోను అదీకాక పిల్లలు ''

''అవును, అదే నా భయమూ. ఆయన అంత సుళువుగా ఎందుకు వప్పుకుంటాడు ఆయన గౌరవం, ప్రతిష్ట ఆలోచించయినా వప్పుకుంటారనుకోను .ఒక వేళ వప్పుకుని పిల్లలని యీయకపోతే ..''

''ఈవిషయం అనుకున్నంత సుళువుగా తేలేదికాదు కళ్యాణీ, మనం ఎంత మారుతున్నాం అనుకున్నా, ఎంత పురోగమిస్తున్నా విదేశాలలో మాదిరిగా స్వేచ్ఛగా విడాకులు తీసుకునేవరకు యింకా రాలేదు కొట్టుకుంటూ తిట్టుకుంటూ ఒకరినొకరు ద్వేషించుకుంటూనైనా కాపురాలు చేద్దామనుకుంటారుతప్ప, విడిపోవడం, విడాకులు అన్నవి నామోషీగా, తలవంపుగానే తలిచే స్టేజిలోనే వున్నామింకా! నీ ఆలోచన నెరవేరుతుందని తోచదునాకు అందులో నీవు నాకోసం విడాకులు యిస్తున్నావని ఆయన కర్థమవుతుంది అలాంటప్పుడు అసలు వప్పుకోడు తను సుఖపడకపోయినా నీవు స్వేచ్ఛపొంది సుఖపడడం అన్నది ఆయన సహించడు! అసలు నీవు కోర్టులో విడాకులు కోరడానికి బలమైన కారణం ఏం చూపించగలవు? రోగిష్టా, దుర్మార్గుడా, అసమర్ధుడా ఏదన్నా గట్టి కారణం వుండాలిగదా బాగా ఆలోచించు ఈ విషయంలో నేనేం చెప్పగలను! నీవు స్వేచ్ఛపొంది నాకళ్యాణివి అవుతానంటే నాకంతకంటే ఆనందం ఏముంటుంది! నీ పిల్లలు-నా పిల్లలు కాకపోయినా నా పిల్లలు

గానే చూసుకోగలను. నామీద నీకామాత్రం నమ్మకం వుందనుకుంటాను నేనేమిటో. నా మనసేమిటో నీకు తెలుసు. ఏవిషయం లోనూ నీకు అన్యాయం, లోటు జరగదు. అంతకంటే నేనేంచెప్పను!'' అన్నాడు బావ. బావ ఈ విషయంలో చేసేదేముం టుంది? నేనే సమయంచూసి, నాకు విడాకులు కావాలన్న విషయాన్ని ఆయనకి తెలియ చెయ్యాలనుకున్నాను

బావతో మాట్లాడి యింటికి వచ్చేసరికి అనుకున్నదానికంటే చాలా ఆలస్యమే అయింది ఆయన మేడమీద వున్నారు. నన్ను చూస్తూనే ''అయిందా బావతో మాట్లాడడం ''కసిగా హేళనగాఅన్నారు

''అయింది'' అన్నాను నేను ముభావంగా బట్టలు మార్చుకుంటూ

''మూడు గంటలసేపు రాత్రి యింత వరకు పార్కులోనే కూర్చుని మాట్లాడు కున్నావంటే నమ్మేటంత తెలివితక్కువ వాడిని కాను... ఇదిగో కళ్యాణీ, నీవరస నాకేం నచ్చలేదు నేను వద్దంటున్నా వెళ్ళావు వెళ్ళినదానివి యిప్పటికి వచ్చావు అసలునీవు గార్డెన్సుకే వెళ్ళావో, మరెక్కడికి వెళ్ళావో, ఏంచేశావో నాకు నమ్మకమేమిటి? నీ ఉద్దేశంలో-నీవేంచేసినా నేను ఊరుకుంటా ననుకున్నావేమో? నేను నీకు మొగుడ్ని అన్నమాట మరిచిపోకు నీ ఆటలు నాదగ్గిర సాగవని గుర్తుంచుకో.'' కోపంగా అన్నారు

''మీకు నమ్మకం చూపటానికి నామాట తప్ప వేరే ఏసాక్ష్యంలేదు నాదగ్గిర. నామీద అంత నమ్మకం లేనపుడు, భార్యప్రవర్తన పట్ల అంత అనుమానం వున్నప్పుడు యింకా ఆ భార్యతో కాపురం ఎందుకు చెయ్యడం విడిపోవడం మంచిది '' అన్నాను. నామనసులోమాట బైట పెట్టడానికి అంత త్వరగానే వీలుచిక్కినందుకు ఓ విధంగా సంతోషంగానే అన్పించింది.

ఆయన కాస్త షాక్ అయ్యారు. ''ఓహో అంతవరకు వచ్చిందన్నమాట వ్యవహారం వాడ్ని చూసేకేకదూ నీ యీ ఆలోచనలు యిలా పెడత్రోవన బట్టటం'' పళ్ళబిగువున అన్నారు

''అనవసరంగా బావనేం అనకండి ఆలోచించడం నాకూవచ్చు ఇందులో బావ దేంలేదు నేను అన్నదానిలో తప్పేంవుంది. ఒకరి నొకరం ద్వేషించుకుంటూ, ఇల్లు నరకం చేసుకుంటూ కాపురం చేసేకంటె విడిపోవడం ఇద్దరికీ మంచిది ''

''సరే విడిపోవాలని అంత సరదాగా వుంటే కోర్టుకెక్కు. అంతేగాని, నీ మాటలతో నన్నేదో బెదిరించాలని మాత్రం చూడకు విడిపోదాం అంటే భయపడి నీవేం చేసినా చూస్తూ వూరుకుంటానని మాత్రం అనుకోకు'' బింకంగా అని వెళ్ళిపోయారు అక్కడనించి పైకి నిర్లక్ష్యంగా, బింకంగా అన్నా విడిపోదామనే వరకు వచ్చిన నా ధోరణికి ఆయన కాస్త బెదిరినట్లు ఆయన మొహమే నాకు చెప్పింది.

అప్పటినించి సీరియస్‌గానే విడాకుల విషయం ఆలోచించేదాన్ని. డైవోర్సు చట్టం, నిబంధనలు గురించి, అసలు విడాకులు ఏయే కారణాలు చూపుతూ అప్లై

చెయ్యాలో ఏపీ తెలియనందున ఏ ప్లీడరు నన్నా సంప్రదించాలనుకున్నాను. కానీ నలుగురికీ ఆ వూర్లో నేను బాగా తెలుసు. ముందే యీ గొడవంతా నలుగురికి చాటి నట్టవుతుందేమో. ఆయనతో ముఖాముఖి మాట్లాడితే, ఆయన అభిప్రాయం ఎలా వుందో తెల్సుకోగలిగితే ఆ తర్వాత లా ప్రకారం విడిపోవచ్చు. కాని ఆయనతో ఎదురుగా యీ విషయం మాట్లాడడం ఎలా? ఇలాంటి సున్నిత విషయాలు ముఖాముఖి చర్చించడం ఎలాగ! నే అడిగినా ఆయన సవ్యంగా జవాబిస్తారా? ఏం చెయ్యాలో తోచేది కాదు ఇంచు మించు ఆయన నాతో పూర్తిగా మాట్లాడడం మానేశారు నా ఆలోచనలు ఓ రూపు దాల్చకముందే ఓ ఘోరమయిన సంఘటన జరిగింది

## 44

అప్పుడు మొదటి సారి పాకిస్థాన్ యుద్ధం జరుగుతుంది బావకూడా ఫ్రంట్‌కి వెళ్ళాడు. మనవాళ్ళు ఎంతో ధైర్య సాహసాలతో పోరాడారు! అంతిమ విజయం మనదే! అయితే మన తరుపున ఎంతో మంది సైనికులని కోల్పోయాం! మరెన్ని వేలమందో క్షతగాత్రులయ్యారు అందులో బావ ఒకడు!

శత్రు స్థావరాలమీద దాడి జరిపి బేస్‌కి తిరిగి వస్తుండగా బావ ఫైటర్ విమానం మరొక శత్రువిమానం కురిపించిన బాంబుకి నేల కూలింది. అప్పుడు బావ చాలా లో హైట్‌లో వుండడంవల్ల చావు తప్పి బ్రతికి బయటపడ్డాడు. బేల్ అవుట్ కావడానికికూడా సమయం చిక్కక విమానంతోపాటు నేల కూలాడు మంటలు చుట్టుముట్టాయి. బెల్ట్ విప్పుకని వచ్చేలోపల బావ దుస్తులకి నిప్పంటుకుని కాళ్లు, పొట్ట అన్నీ బాగా కాలిపోయాయి. ఎత్తునించి పడ్డ అదుటికి కాలర్ బోన్, చెయ్యి ఫ్రాక్చర్ అయ్యాయి అవి కాక గాజుపెంకులు గుచ్చుకుని మొహం అంతా గాయాలు! ఆ స్థితిలో బావని చుట్టూ వున్న వారు చూసి మండే ప్లేనునించి బయటికి లాగారు ఆస్పత్రిలో జాయిన్ చేశారు. బావకి వున్న ఒక్కగానొక్క బంధువుని నేను. ఏదన్నా ప్రమాదం జరిగితే నాకు తెల్పమని నా ఎడ్రసు యిచ్చాడుట. బావ చావు బ్రతుకుల్లో ఢిల్లీ ఆర్మీ హాస్పిటల్‌లో వున్నట్టు టెలిగ్రాం యిచ్చారు, నా ఆందోళన, నాబాధ, ఆరాటం ఎలావుంటాయో ఊహించు బావ ఆ స్థితిలో వున్నాడని తెలిసి వెళ్ళకుండా ఎలా వుండగలను? వెంటనే ఢిల్లీ ప్రయాణం అయ్యాను ఆయనతో బావసంగతి చెప్పి, నేను ప్రయాణం అయివెడుతున్న సంగతి చెప్పాను

"ఏమిటీ, నీవు వెడతావా? మతిగానీ పోయిందా ఆడదానివి ఒకర్తివీ వెళతావా ఆఆస్పత్రికి. ఇంతకీ నీవువెళ్ళి ఏంచేస్తావు?" చిరాకుగా నుదురు చిట్లించి, తీక్షణంగా అన్నారు నాకు వళ్ళుమండింది. ఏంచెయ్యడానికా వెళ్ళడం! ఆత్మీయుడు ఆపదలో వుంటే ఆపద తీసేయగలరనా వెళ్ళడం! కళ్ళారా చూడడానికి, తన వాళ్ళన్న వాళ్ళు వున్నారన్నతృప్తి నందించడానికి. ధైర్యం

చెప్పడానికి, శాంతి నీయడానికి ఎందుకు వెళ్ళడం అన్న ప్రశ్నఏమిటి। బావ ఏకాకి। నేనుకాక మరెవరున్నారు।

"వెళ్ళి ఏంచేస్తాను. చూస్తాను వీలయితే కదల్చగలిగే స్థితిలోవుంటే తీసుకువస్తాను, బావకి మేంతప్పయింకెవరున్నారు?" కోపం వస్తున్నా సౌమ్యంగానే అన్నాను.

"ఇక్కడికి తీసుకొస్తావా? మతుండే మాట్లాడుతున్నావా? ఇదిగో కళ్యాణీ పిచ్చి పిచ్చి ఆలోచనలుమాను. ఇక్కడికి తీసుకొచ్చిపెడితే ఎవరుచూస్తారు ....అయినా నాకిష్టంలేదు ఇక్కడికి తీసుకురావడం . అంతగా అయితే వెళ్ళిచూసి వెంటనే.. వచ్చేయి" అన్నారు మహా ఉదారంగా పర్మిషన్ ఇస్తూ

"ఎవరు చూడడం ఏమిటి? మనిద్దరం డాక్టర్లం, ఇంట్లో అమ్మవుంది చూడడానికి బావకి వున్నవాళ్ళంమేమే... ఆస్పత్రినించి డిస్చార్జి అయ్యాక కోలుకునేవరకు మాదగ్గిర కాక ఎక్కడుంటాడు?" చాలా సూటిగా అడిగాను

"అదంతా నాకనవసరం , .నాయింట్లో వాడిని తెచ్చిపెట్టడానికి వీలులేదు" ఖచ్చితంగా అన్నారు

నాకోపం కట్టలు తెంచుకుంది ...బావని అంత శత్రువులా చూడడం సహించలేక పోయాను చావు బ్రతుకుల్లోవున్న మనిషి మీద అంత కఠినంగావుండే ఆయన కఠినతని సహించలేకపోయాను ఆయన వంక సూటిగా చూశాను.

"ఈయిల్లు నాయిల్లు...అందుకని పెట్ట దలుచుకున్నాను .." అన్నాను నిర్మొహమాటంగా. ఆయన నిర్ఘాంతపోయారు. తరువాత కోపం మొహంనిండా పొంగింది బుసకొట్టారు

"నీయిల్లా . ఇంతవరకు వచ్చిందా వ్యవహారం.. " అంతకంటె మాట్లాడలేక పోయారు.

"ఇంతవరకు తెచ్చింది మీరు। బావ వచ్చినదగ్గరనించి ప్రతి చిన్నవిషయాన్ని రాద్ధాంతం చేస్తున్నదిమీరు। నన్నుమానిస్తూ, అడుగడుగునా అవమానిస్తూ, లేనిపోని ఊహలతో మీరు బాధపడ్తూ, నన్ను బాధపెడ్తూ ఇల్లు నరకం చేస్తున్నది మీరు। నా అనేవాళ్ళులేని నా బంధువుని, చావుబ్రతుకుల్లోవున్నమాబావని తెచ్చి ఇంట్లో వుంచుకునే అధికారం ఆ మాత్రం నాకు లేదా? యీ యిల్లు, యీ ఆస్థి నాది అంతే కాక యిందులో సగం సంపాదన నాదే - ఆ మాత్రం నా చుట్టాన్ని ఇంట్లో పెట్టుకునే హక్కు నాకు లేదా। ఆస్థి లేకపోయినా, యీ యింటి యజమానురాలిగా నా అన్నవాళ్ళకి ఓ పూట తిండికూడ పెట్టుకోలేని స్థితిలో యింకా నేనుండను భర్తగా మీకు నామీద హక్కు లుండవచ్చు కానీ ప్రతీ దానికి యిలా కట్టడిచేస్తే ఏ ఆడదీ సహించదు। నాఇంట్లో నాకు ఆమాత్రం స్వేచ్ఛ, స్వతంత్రం లేకుండా పడి వుండను మీ యిష్టం వచ్చినట్లు మీరనుకోండి చేసుకోండి నేనెవరికి సంజాయిషీలు ఇవ్వాల్సినంత తప్పు పనులు ఏమి చెయ్యడం లేదు " అంటూ విసురుగా వెళ్ళిపోయాను.

ఢిల్లీ వెళ్లి బావ స్థితి చూస్తే కన్నీరాగ

లేదు క్రిందభాగం అంతా కాలిపోయింది. మొహం అంతా గాయాలు' చేయికి, కాలర్ బోన్‌కి ఫ్రాక్చర్లు!... వళ్లు తెలియని స్థితిలో, వంటినిండా కట్లతో ఆ స్థితిలో చూస్తే బావ అసలు బ్రతుకుతాడా అన్పించింది. బ్రతికినా మళ్లీ ఎన్నాళ్లకి మనుష్యులలో పడతాడు అనుకున్నాను రక్తం చాలా పోయిందట' మూడో రోజుకి గాని అసలు తెలివి రాలే దట డాక్టరు నయిన నాకు బావస్థితి గురించి ఎవరూ చెప్పక్కర లేకుండానే తెలుసు కున్నాను. మరో వారంరోజులు గడిస్తేకానీ గండం గడిచిందీ లేనిదీ ఎవరూ నిర్ణయించ లేరనుకున్నాను. అక్కడ పెద్ద సర్జను అదే అన్నారు. అప్పుడు కాదుకదా మరో నాలుగయిదువారాలు లోపల బావని అక్కడ నించి కదల్చడం అసంభవం! అయినా ఆస్పత్రిలో - అందులో మిలిటరీ ఆస్పత్రి కంటే మనం ఏం జాగ్రత్తగా చూడగలం! అన్నివిధాల ఎటెంషన్ వుండాలి-అలాంటి చోటు అయితేనే ట్రీట్‌మెంటు, ఎటెంషన్ అన్నీ పకడ్బందీగా వుంటుంది. అక్కడి డాక్టర్లు ఆరువారాలపాటు ఆస్పత్రిలో వుండి తీరాలి. తర్వాత పరిస్థితి బాగుంటే అప్పుడు మీరు యింటికి తీసికెళ్లి మీ ట్రీట్‌మెంట్‌లో వుంచుకోవచ్చు అన్నారు

నాకూ అదే మంచిదనిపించింది అన్నాళ్లు నేను అక్కడ వుండడం కుద రదు గదా! ఆడదాన్ని, ఏ హోటల్లోనో వుంటూ బావని చూసుకుంటూ వుండడం చాలా కష్టం! అసలే కోపంగా వున్న ఆయన ఏమంటారు? ఆయన అన్నా అనక పోయినా అన్నాళ్లు నేనక్కడ వుండడం సమంజసం కాదు. అసలు బావ వప్పుకో లేదు ఆ సూచనకి. అమ్మని పంపిస్తా నన్నాను అందుకూ వప్పుకోలేదు బావ. ఆడది అమ్మ వచ్చి వంటరిగా ఎక్కడ వుంటుంది, అయినా మిలటరీ ఆస్పత్రిలో మంచి ఎటెన్షన్ వుంటుంది. ఎవరూ వుండి చూడాల్సిందేం లేదన్నాడు

రెండు రోజు లుండి, బావకి ధైర్యం చెప్పి, అక్కడి డాక్టర్లని, నర్సులని అతని స్థితి ఎలావుందో ఎప్పటికప్పుడు తెలియ చెయ్యమని అర్థించి, అవసరమైతే ఫోను చెయ్యమని నెంబరిచ్చి, అందరికీ మరీ మరీ చెప్పి అప్పగించి తిరిగి వచ్చాను

బావ సగం టైము మార్ఫియా మత్తులో వుండేవాడు. తెలివిలో వున్న ప్పుడు కళ్లుతెరిచి అలా నావంక జాలిగా, దీనంగా చూసేవాడు కొద్దిక్షణాలు. ఆ మాత్రం శ్రమకుకూడా తట్టుకోలేనట్టు మళ్లీ కళ్ళు మూసుకుపోయేవి నేను వెడుతున్నా నని చెబితే కళ్ళు ఆడించాడు సరే నన్నట్టు కదల్చడానికి వీలుగా వున్న చేయితో నా చెయ్యి పట్టుకుని అలా చూస్తూ కళ్ళ నీరు నింపుకున్నాడు 'కళ్యాణీ!' బావ పెదాలు అస్పష్టంగా కదిలాయి బావని ఆ స్థితిలో వదిలి రావడానికి సుతరామూ మనసు వప్పలేదు కాని మరో మార్గంలేక కన్నీ ళ్లతో శలవు తీసుకుని వచ్చాను. 'కాస్త నయం కాగానే నేను మళ్ళీ వచ్చి ఇంటికి తీసికెడతాను బావా!' అన్నాను. 'వద్దన్నట్టు' తలాడించాడు బావ ఆ స్థితిలో వున్న బావతో అప్పు డంతకంటె ఏం చెప్ప కుండా వూరుకున్నాను. ప్రాణాలన్నీ బావ దగ్గిర వదిలి ఒక్కర్తినీ ఇంటికి వచ్చాను.

# 45

వంటరిగా యింటికి వచ్చిన నన్ను చూసిన ఆయనలో తనమీద భయంవల్ల, తన ఆజ్ఞవల్ల బావని తీసుకురాలేదన్న సంబరం కనిపించింది. ఆ గర్వం కళ్లలో తొంగిచూసింది నేనేం అనలేదు ఆయన ఏమి అడగలేదు కనీసం బావ ఎలా వున్నాడన్న విషయంకూడా మాట వరసకయినా అడగలేదు. అమ్మతో వివరంగా అంతా చెప్పాను ఇద్దరం బావని తలుచుకుని కళ్లనీళ్లు పెట్టుకున్నాం అంతకంటె చెయ్యగలిగింది ఏముంది '

బావ గండం దాటినట్లు, ప్రోగ్రెస్ అవుతున్నట్టు ఉత్తరం వచ్చింది ఎప్పటికప్పుడు బావ ఆరోగ్యం ఇంప్రూవ్ అవుతున్నట్టు ఉత్తరాలు వచ్చేవి ఆరు వారాలకి బావ కాలిన గాయాలు, మిగతా గాయాలు మానాయని, ప్లాస్టర్స్ మరో నాలుగైదు రోజులలో విప్పుతామని, అప్పుడు మీరు కావలిస్తే యింటికి తీసికెళ్ళవచ్చని ఉత్తరం వచ్చింది అమ్మతో ఆలోచించి నే మళ్లీ వెళ్లడం అనవసరమని తోచి బావని అక్కడ ప్లేను ఎక్కించుతే ఇక్కడ దింపుకుంటానని రాశాను బావకీ రాశాను అసలు బావ ఆరోగ్యం కాస్త కుదుటపడిం దగ్గిరనించీ నేను ఇక్కడికి తనని తీసుకువస్తానని రాసిన సూచనని ఆమోదించలేదు. మా భార్యా భర్తల మధ్య మళ్లీ గొడవలు తలెత్తడానికి తను కారణం కావడం తన కిష్టం లేదని రాశాడు. నేను చాలా రాసి. తనని ఆ స్థితిలో వంటరిగా ఎంతమాత్రం వదలనని, దానికోసం ఎవరేమనుకున్నా లెక్కచెయ్యనని, నీవు నా యింటికి రాకపోతే నేనే నీ దగ్గిరకి వచ్చి నీ ఆరోగ్యం కోలుకునేవరకు వుంటాను అని రాశాను బావ చేసేదేం లేక, నన్ను కాదనలేక సగం అయిష్టంగానే నా దగ్గిరకి రావడానికి వప్పుకున్నాడు

బావ వచ్చేరోజున - ఆస్పత్రినించి - ఎయిర్ పోర్ట్‌కి వెళ్ళడానికి చాలా ముందుగా బయలుదేరాను నేను యింటికి వచ్చేస్తూ వెడుతున్నానని ఆయనకి చెప్పాను ఆయన కాస్త ఆశ్చర్యంగా 'అప్పుడేనా!' అన్నారు.

"ఈ బావ వస్తున్నాడు ఎయిర్ పోర్ట్‌కి వెళ్లాలి " అన్నాను నలుగురి మధ్య కూర్చున్న ఆయన నా వంక ఒక్క తీక్షణమైన చూపుమాత్రం విసిరారు ఉ ఆ అని అనలేదు నేను బయటికి వచ్చేశాను

బావని ఇంటికి తీసుకొస్తున్న విషయం ఆయనకి నేను చెప్పలేదు ఆరోజు - నాయిల్లు, నాఆస్థి, అని చెప్పినదాన్ని-మళ్ళీ యీవిషయం ఎత్తి ప్రత్యేకంగా ఆవిషయం మరోసారి చెప్పడం అనవసరంగా మరోసారి గొడవకి కారణం అవుతుందని పించి వూరుకున్నాను ఎలాగో బావని తీసుకొచ్చాక ఆ విషయం తెలుస్తుంది అంత ఖచ్చితంగా నేను చెప్పాక యింకా ఆయన ఈ విషయంలో ఏమీ అనరని నమ్మాను

ఎయిర్‌పోర్టునుంచి బావని వెంట పెట్టుకుని వచ్చాను. బావ పూర్తిగా కోలుకోవడానికి కనీసం మరో నెలరోజులు

పడుతుందని బావని చూడగానే అర్ధం అయింది రక్తం కోల్పోయి, పాలిపోయి, మొహంనిండా గాయాలతాలుకు మాసీ మానని మచ్చలతో, ప్లాస్టర్లువిప్పినా చెయ్యి అవీ యింకా పూర్తిగా స్వాధీనంలోకి రాని బావని మరో నెలయినా మెడికల్ కేర్‌లో వుంచి జాగ్రత్తగా చూడాలని బోధపడింది బావకోసం గెస్ట్‌రూము సర్దించాను బావతో అమ్మ, నేను కూర్చుని ఈమాట ఆమాట చెప్తున్నాం ఈలోపల ఆయనింటికి రానే వచ్చారు, బావని తీసుకొచ్చి మాట్లాడు తున్నా మనసులో నాకు కాస్త జంకుగానే వుంది నన్నేమంటారని కాదు అన్నా బావకోసం భరించగలను నేను బావముందు ఏదన్నా అంటే బావ బాధ పడుతాడని, బావని అవమానిస్తారేమో నని జంకుగానే వుంది

భయపడ్డంతా అయింది ఆయన వస్తూనే "కళ్యాణీ!" అని పెద్ద కేక పెట్టారు హాలులోంచి బావ, అమ్మ, నేను మొహాలు చూసుకున్నాం. నేను పైకి భయ పడనట్టు కనిపించడానికి ప్రయత్నిస్తూ నిబ్బరంగా లేచి వచ్చాను

"ఈ ఇంటికి యజమాని ఎవరు? ఈ ఇంట్లో నా స్థానం ఏమిటో యీ రోజుతో తేలిపోవాలి. చెప్పు .." చాలా కోపంగా గర్జించినట్టే అడిగారు అనుకున్నంతా అయింది బావని అవమానించకుండా వదలరు.

"ఏమిటీ గొడవ ఇప్పుడు?" అన్నాను.

"గొడవే. అసలు నీవు నా భార్యవో కాదో, నేను నీకు మొగుడ్ని అవునో కాదో తేల్చి చెప్పు. నా మాటకి విలువ లేని యీ ఇంట్లో నా స్థానం ఏమిటో తెలుసు కోవాలి."

"మీ స్థానం ఏమిటో మీకు తెలుసు ఆ స్థానం, ఆ గౌరవం మీరు నిల్పుకోలేక పోతే ఆ తప్పు నాది కాదు" కటువుగా అన్నాను

"అంటే ?" తీక్షణంగా అడిగారు.

"అంటే, అవసరమైనదానికి, కాని దానికి ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేస్తూ మనిషి మీద అవతలి వాళ్ళకి గౌరవం లేనట్టు చేసుకుంటున్నది మీరే "

"రాద్ధాంతమా ఇది ఏ మొగుడూ పెళ్లాం ప్రేమ వ్యవహారాన్ని సహించడు పెళ్లాం తన ప్రియుడిని ఇంట్లో తెచ్చి పెడ్తే ఏ మొగుడూ వూరుకోడు."

'ఆపండి.' గట్టిగా అరిచాను. అంత హీనంగా, నీచంగా మాట్లాడుతూంటే సహించలేక పోయాను

"ఏం, వున్నమాట అంటే వులు కెందుకు, సరే, ఇది నీ ఇల్లు అంటున్నావు గనక నేనీ ఇంట్లో వుండాలో అక్కరలేదో తేల్చుకోడం మంచిది ఇద్దరికీ నేనూ నీవూ కలిసి వుండాలంటే నా ఇష్టానికి వ్యతిరేకంగా జరగడానికి వీలులేదు ఇంట్లో. ఆలోచించి చెప్పు నీకు మొగుడు కావాలో, బావ కావాలో. చెప్పు" నేను తిరస్కా రంగా చూశాను అంతదాకా వచ్చాక ఇంకా భయపడటానికి ఏం కనిపించలేదు

' తేల్చుకోవలసింది మీరు ఇదివరకే చెప్పేను నేను. నా మీద అంత నమ్మకం లేనపుడు విడిపోవడం మంచిదని" నిష్కర్ష గానే చెప్పేశాను.

అమ్మ లోపల్నించి 'కళ్యాణీ' అంటూ వారిస్తూ గాభరాగా వచ్చింది. బావ కూడా లోపల్నించి 'కళ్యాణీ!' అన్నాడు హెచ్చరిస్తున్నట్టు.

"ఏమిటి నాయనా ఈ గొడవ. ఏం జరిగింది?" అమ్మ కలుగ చేసుకుంటూ అంది.

"ఏం జరిగిందా! అడగండి మీ అమ్మాయినే అడగండి ఏం తెలియనట్టు అడుగుతున్నారు ఇంకా" ఆవేశంతో పెద్దా చిన్నా తారతమ్యం కూడా మరచి అమ్మ మీద ఎగిరి పడ్డారు.

"కళ్యాణీ, ఏమిటే ." అంది అమ్మ.

"ఏం లేదమ్మా. క్రొత్త గొడవ ఏం కాదు ఎనిమిది నెలల నించి జరుగుతున్న గొడవే ' విసుగ్గా అన్నాను

"ఆనంద్ వచ్చాడనేనా బాబూ నీ కోపం" అమ్మ అడిగింది

ఆయన నా వంక ఉరిమి చూశారు. ఆయన కోపానికి బెదరలేదు నేను. "అవునమ్మా, బావని తీసుకు రావడానికి వీలు లేదన్నారు. తీసుకు వచ్చానని ఈ కోపం. నా ఇంట్లో, నా బంధువు, రోగంతో వున్న బంధువుని కొన్నాళ్లు ఆదుకునే స్వాతంత్రం కూడా నాకు వుండకూడదని ఆయన ఉద్దేశం" ఆవేశంగా అన్నాను.

"బంధువు, వుత్త బంధువయితే ఎవరేమంటారు. ప్రియుడను" ఎకసక్కెంగా అన్నారు

"భార్య ప్రియుడిని ఇంట్లో తెచ్చి పెట్టుకుంటే వూరుకునేటంత సంస్కార వంతుడిని కాను."

"ఏమిటి నాయనా ఆ మాటలు అదేం కాని పని చేసింది ఆనంద్‌కి వున్న వాళ్ళం మేమే. వాడీ స్థితిలో వుంటే చూస్తూ ఎలా వదిలేయగలం. దానికోసం నీవిలా మాట్లాడడం ఏమీ బాగులేదు" అమ్మ నొచ్చుకుంటూ కాస్త గట్టిగానే అనేసింది ఆయన అమ్మ అలా అంటుందని ఎదురు చూడలేదనుకుంటాను. ఒక్క క్షణం తడబడి, తగ్గిపోవడం ఇష్టం లేక "అవును ఎందుకు బాగుంటుంది మీ అమ్మాయి చేసే పనులు బాగుంటాయి గాని, నేనిలా అనడం బాగుండదు" కసిగా అన్నారు

"నేనేం చేశాను. నేనేం కాని పనులు చేసానని మీ యీ మాటలు" తీవ్రంగా అన్నాను.

"అబ్బే ఏం చేయలేదు మరో మగాడ్ని కౌగలించుకోడం తప్ప ఏం చెయ్యలేదు సిగ్గు లేకుండా ఇంకా అడుగుతున్నావు?"

ఆయన చూపుల్లో మాటల్లో కసి. హేళన భరించడం దుర్లభ మవసాగింది. బావ ఎప్పుడు వచ్చి నించున్నాడో, గుమ్మం దగ్గిర తలుపు ఆసరాతో, పాలిపోయిన మొహంతో నిల్చున్నాడు. ఆదుర్దాగా చూస్తూ ఆయన పదే పదే నే చేసిన తప్పుని ఎత్తి చూపుతూ, ఆ నేరానికి నన్ను అవమాన పరుస్తూంటే ఆఖరి మెట్టుకు వచ్చింది నా సాహసం ముఖ్యంగా బావ ఎదురుగా ఆయన అలా మాట్లాడడం నాకంటె బావకి ఎంత కోతగా వుంటుందో అర్థం అయి వూరుకోలేక పోయాను.


"అవును, నేను తప్పు చేశాను. నేను

కాని పని చేశాను నేను కులటని. ఇలాంటి భార్యతో ఇంకా ఎందుకు కాపురం చెయ్యాలనుకుంటున్నారు? నే నెలాంటి దాన్నో తెలిసీ ఇంకా యీ ఇంట్లో నాతో కలిసి కాపురం చెయ్యడానికి మీకు లేని పౌరుషం, సిగ్గు నాకెందుకు నే చేసిన పనికి నేను సిగ్గు పడడం లేదు సిగ్గు పడవలసిందిగా మీరనుకుంటే వెంటనే మనం మన యీ భార్యా భర్తల సంబంధం తెంచుకుందాం.. యీ మాట ఇదివరకే చెప్పాను. మళ్ళీ చెపుతున్నాను'' ఆవేశంతో నా మాట వణికింది.

''కళ్యాణీ '' అమ్మ గట్టిగా కేక వేసింది. ''ఏమిటే ఆ మతిలేని మాటలు.''

''అమ్మా, నీవూరుకో. ఇంక ఇంట్లో యీయన చేత అడుగడుగునా అవమానం సహించలేను దేనికన్నా ఓ హద్దు అంటూ వుంటుంది ఎంతకని సహిస్తాను నేనూ మనిషినే. నేను చేసిన చిన్న తప్పుకి పదే పదే నన్నిలా హింసిస్తూంటే ఎంతకని భరించ గలను నా ఇంట్లో నా బంధువుకి ఓ పూట పట్టెడన్నం పెట్టుకో స్వాతంత్రం లేని బ్రతుకు నాకక్కరలేదు ఇలా యీ నరకంలో కొట్టుకు చస్తూ కాపురం చేసుకుంటూ బ్రతికే బ్రతుకు నాకవసరం లేదు. మా కాపురం ముందు నించీ ఒకలాగే వుంది. ఇప్పుడు మరింత అధ్వాన్నం అయింది ఇంక విడిపోవడం ఇద్దరికీ మంచిది ''

(సశేషం)



# రాధమ్మ పెళ్ళయింది

వాణిశ్రీ

కొండకు పోతున్న ప్యాసింజర్, బీర్ త్రాగి పొట్ట నింపుకున్న త్రాగుబోతులా నెమ్మదిగా వచ్చి ప్లాట్ ఫారం మీద ఆగింది.

దిగేవాళ్ళను దిగనివ్వకుండా, ఎక్కేవాళ్ళు ఎగబడుతున్నారు. నా చిన్నప్పుడు మా వూళ్ళో కరణం పార్టీ, ప్రెసిడెంట్ పార్టీ మనుషులు కొట్టుకోవడం జ్ఞాపకం వచ్చింది.

రైలు పొడుగునా వెతికాను, ఎక్కడైనా ఖాళీవుంటుం దేమోనని. ఊహుం... తేనెతుట్టిలో పురుగుల్లాగ లుక, లుకలాడుతున్నారు. అసలే మండిపోతున్న ఎండాకాలం. రాత్రి కాబట్టి సరిపోయింది. పగలైతే ఈ త్రొక్కిడికి పెట్టికి పదిమంది చచ్చుందురు.

ఇంతలో మా మావ వచ్చి రెక్కుచ్చుకుని లాక్కుపోయి ఒకపెట్టెలో కుక్కేశాడు. నన్నే కాదు, మా పెళ్ళి పార్టీ పాతికమందినీ ఎడ్జస్ట్ చేసేశాడు. లాక్షా గృహదహనం జరిగినప్పుడు భీముడు, తన వారందర్నీ ఎలా బైటికి చేరేశాడో అలా చేశాడు మా మావ. ఆయన దౌర్జన్యం చూపి కొందరు అసహాయులు గొణుక్కున్నారు. అంతకంటే ఏం చేసేట్లు? ఇలా దౌర్జన్యం చేసేవారికే గదా రోజులు అనుకున్నాను.

మూడుసార్లు ముక్కి, ఆరుసార్లు గాలి పీల్చుకుని బయల్దేరింది బండి. ఈ లంకణాల బోటు ఎప్పటికి గమ్యస్థానం చేరు

కుంటుందో?

ఒక బస్సు మాట్లాడితే బాగుంటుందని మా మావకి ఎడ్వయిజ్ చేశాను ఖర్చు ఎక్కువయినా సుఖంగా వుంటుందన్నాను. వింటేనా?

వెనకటి కెవడో ఇష్టంలేని మొగుడు పెరుగులో రాళ్లొచ్చాయన్నాడట. అలా "బస్సు ప్రయాణం వట్టి కుదుపులు,ఆడాళ్ళకి ఆరోనెల్లోనే పురుడొచ్చేస్తది." అన్నాడు.

ఎంగిలి చెయ్యిగూడా విదల్చడని మావకి వాళ్ళ వూళ్లో మంచిపేరుంది, ఇందుకే అయివుంటుంది. ఇంతకీ నా చావుకొచ్చింది మా బావమరది పెళ్ళి అని గొణుక్కోక తప్పలేదు

పెట్టెలో ఎక్కాను అన్నమాటేగాని ఎక్కడా చోటులేదు, లావెట్రీ ప్రక్కన ట్రంకుపెట్టిమీద చోటు చూపించాడు మా మావ నే నందుకు మొగమాట పడగా ఆయనే చతికిల బడ్డాడు, కాసేపటికి గుర్రు పెట్టాడు.

ఆ పెట్టె ఎలా వుందంటే, లోపల గదులు వున్నాయి. ఆ మూలనుంచీ ఈ మూలకు పొడుగ్గా వరండా వుంది. గదుల్లోకి ఈగ కాదుగదా, దోమగూడా జొరబడడానికి వీల్లేనంత క్రిక్కిరిసి వున్నారు

ఒక గంట అలా నిల్చునేసరికి కాళ్ళు పీక్కుపోసాగాయి . టిక్కెట్టు కొనని దొంగలా ముడుక్కుని క్రింద కూర్చోడానికి మనసు ఒప్పుకోవడం లేదు. (కాసేపటికి అది ఎటూ తప్పదు.) పగవాడికి గూడా వద్దురా బాబూ ఈ ప్రత్యక్షనరకం.

గాలి కొంచెం, కొంచెం కంట్రోలుగా వస్తోంది. దీపాలుగూడా కంట్రోలు కిరసనాయిలు బుడ్లులా వెలుగుతున్నాయి.

వరండాకీ, లోపల గదుల్లోకి. మధ్య ఒక కిటికీగూడా వుంది ఆ కిటికీలోంచి చూస్తే లోపల వాళ్ళంతా చొప్పకట్టల్లా పడున్నారు.

మరో అరగంటకి రైలు ఆగినప్పుడల్లా లైట్లు ఆరిపోసాగాయి. నా నడుములు మాత్రం పీక్కుపోసాగాయి. ఆ రైల్వే మంత్రిగారు ఒక్కసారి ఇందులో ప్రయాణంచేస్తే బాగుండును అనిపించింది.

అర్థరాత్రి దాటింది.


నేను క్రింద చతికిలబడి చేతులు, తల కిటికీకి ఆనించి జోగసాగాను. బండి కుదుపులకు అప్పుడే నిద్రలోకి జారుతున్నాను. ఇంతలోకే చెవుల్లో బాంబు ప్రేలినట్లయింది.

'అమ్మో' అని ఎవరో కేకేశారు. నిద్రమత్తు వదిలిపోయి, గుండెలు ఆగిపోయాయి నాకు తెలియకుండానే అదిరిపోయి ఆటోమాటిక్‌గా లేచి నిలబడిపోయాను

ఆ కేకకి నిద్రపోతున్న వాళ్ళు కళ్ళు విప్పిచూసి విసుక్కుని మళ్ళీ నిద్రలోకి జారిపోయారు."పీడకల గన్నావా తల్లీ." అంది అందులో ఒక ముసలమ్మ మత్తుగా.

చెడిపోయిన నిద్ర మళ్ళీ పట్టలా. సగం మేల్కొని, సగం స్వప్నస్థితిలోనూ ఆలోచిస్తూ లోపలకి చూశాను, నాకు నిద్రాభంగం చేసిందెవరా? అని.

ఆమెకూడా నాలా కూర్చోడానికి ఆసనంలేదు. రెండు బల్లలకూ మధ్య జాగాలో కూర్చుని వుంది. అప్పుడే నిద్ర లేచిన దానిలా బద్ధకంగా వుంది. తెల్లచీర, ఎర్రజాకెట్ వేసుకుని మల్లెలు, మందారాలు పూసిన లతలా వుంది.




ఏమీ తోచకపోవడంవల్ల అనుకుంటాను. నా సైటంతా అప్పగించేసి, లేత వయసులో అతి సిగ్గుతో అప్పుడే విడుతున్న గులాబీలా అందం ఒలకపోస్తున్న ఆ పిల్లవంక చూశాను నేను అదేపనిగా చూస్తున్నట్లు ఆ గుంట కనిపెట్టేసి, నన్ను చూసి చిన్నగా నవ్వింది.

నా తల గిర్రున తిరిగింది వేలెడు లేదు నాకు ఎదురు పోజ్ ఇచ్చిందే యింకా రెండేళ్ళు పోతే దేశాన్ని ఏల్తుంది ఇది మొగుడితో కాపురం చేసేరకం కాదు, ఎంతకైనా తెగించే రకంరా నాయనా అనుకున్నాను.

నేను మరింక రెస్పాన్స్ ఇవ్వలేదు. ఇంకా పీడకలలోనే వుండి నవ్వలేదుగదా! అనుకుని కళ్ళు మూసుకున్నాను. కాని నిద్ర రావడంలేదు. కళ్ళు తెరిచి చూద్దును గదా చిక్కినట్లే చిక్కి పారిపోయే అడవి లేడిలా ఆ గుంట చూసీ, చూడనట్లు చూస్తోంది.

ఎరుపు రంగులో అందమేకాదు. డేంజర్ గూడా వుందని నాకప్పుడు తోచింది.

నావంక ముసి. ముసి నవ్వులు విసిరి, నిద్రపోతున్న మరొక అమ్మాయిని లేపింది కళ్ళు నులుపుకుంటూ లేచి బద్ధకంగా వళ్ళు విరుచుకుంది ఆమె. ఆమె ఒక పెళ్ళికూతురు. ఆ పిల్లకు అక్క అనుకుంటాను.

ఆ పెళ్ళికూతురు చాలాఅందంగావుంది. ప్రాణం వచ్చిన పాలరాతిబొమ్మలా, చిగిర్చిన మామిడికొమ్మలా! స్తంభించిన విద్యుల్లతా? దిగివచ్చిన దేవతా?

నా చూపులు ఆమె వళ్ళంతా పాకుతూ, తనిఖీచేస్తూ వదలకుండా తిరిగాయి.

ఆమె కళ్లు విశాలంగా, ప్రకాశవంతంగా, అందంగా వున్నాయి. అంతేకాదు అమృతంతో నిండిన నయనాల్లా, చల్లగా, తియ్యగా వున్నాయి.

ఒడ్డులను ఒరుసుకుంటూ, తనలో కలుపుకుంటూ, భీభత్సంగా ప్రవహించే ఏటిప్రవాహంలాగ యౌవ్వనం మంచి పొంగులో బుసలుకొడుతూ రుస, రుస లాడుతోంది. అంతెందుకు ఒక్కసారి చూస్తే జన్మ జన్మాంతరాలు జ్ఞాపకం వుండేలా వుంది ఆమె.

వంటిమీద ఎంత బంగారం వుందో ఏమోగాని ఆ మసక వెలుగులో తళ, తళ మెరిసిపోతూవుంది. మన పూర్వ అలంకరణ వైభవం ఆ నవవధువులో కరువు తీరా చూశాను.

మంగళహారతిలా కనిపిస్తున్న ఆమె, నిర్ఘాంతపోయి చూస్తున్న నన్ను చూసి నవ్వింది ఆమె కనుపాపలు మిలమిల మెరిశాయి.

మంచుముక్కలు వంటిమీద పడినట్లు నా శరీరం జలదరించింది. అర్జంట్‌గా జ్వరం వచ్చేసినట్లు నెత్తురు ఒక్కసారిగా వేడెక్కిపోయి గబగబ ప్రవహించటం మొదలుపెట్టింది.

ఇంతలో ఏదో స్టేషన్ వచ్చినట్లుంది. లైట్లు పూర్తిగా ఆరిపోయాయి

కళ్ళముందర చీకటి కమ్ముకుంది

ఆకాశదీపం, అందని మానిపండు అంటారే అటువంటివి జ్ఞాపకం వచ్చాయి నాకు బాగా డబ్బున్నవాళ్ళలాగే వున్నారు. ఈ థర్డ్‌క్లాసులో, ఈ భయంకర భీభత్సంలో, ఈ ప్రత్యక్ష నరకంలో, ప్రయాణం చేయడం ఎందుకు?

పాపం వాళ్ళనాన్నకూడా, మా మావకి తమ్ముడో, అన్నో అయ్యుంటారు, అని సరిపెట్టుకున్నాను.

పెళ్ళికూతురు నన్నుచూసి నవ్వడం చూస్తే, నన్నొక రోడ్‌సైడ్ రోమియో క్రింద జమకట్టారనీ, ఇద్దరూ కలిసి నన్ను కాలక్షేపానికి ఉపయోగించుకుంటారనీ అనిపించింది నాకు.

ఏమైనా సరే వాళ్ళకా అవకాశం ఇవ్వగూడదనుకుని, క్రింద కూలబడిపోయి నిద్రకి వుపక్రమించాను

అలా ఎంతసేపు కునికానో తెలియదు

నా తలమీద ఎవరిదో చెయ్యిపడినట్లయింది కళ్ళు తెరిచాను అంతా చీకటిగా వుంది. వెలిగీ వెలగనట్లు, వెలుగుతున్నా వెలగనట్లు, ఇంకో క్షణానికి ఆరిపోయే దీపంలాగ ప్రాణాలు బిగబట్టుకుని వెలుగుతోంది కంట్రోలు రైలు లైట్


ఆ చెయ్యి నా చేతిని పట్టుకుంది. అది గాజుల చెయ్యి. నిద్రమత్తులో వున్నానేమో ? బుర్ర పనిచేయక 'వూఁ' అని మూలిగాను.

నన్ను పైకి లేపటానికి ఆ చెయ్యి గట్టిగా లాగింది

"ఎవరు ?" అన్నాను.

కొంచెం తెలివి వచ్చింది. కాని—

నేనిప్పుడు ఎక్కడ వున్నాను? ఏం చేస్తున్నాను? ఆ చెయ్యి ఎవరిది? ఇంకా



## ఇల్లాలి ముచ్చట్లు కాదు!

నవంబరులో భారతదేశ పర్యటన జరిపిన శ్రీలంక ప్రధాని శ్రీమతి సిరిమావో బండారునాయకె న్యూఢిల్లీలో భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధితో చర్చలు జరిపినప్పటి చిత్రం

---

మగతగానే వుంది

"మధూ! మధూ" అంటూ ఆ చెయ్యి నన్ను గట్టిగా పట్టుకుంది

తల పైకెత్తి చూశాను ముఖం స్పష్టంగా లేదు. ఎవరిదో ఆకారం తళ, తళ తళుకు లీనుతూ కన్పించింది.

వెంటనే మెరుపు మెరిసినట్లు, స్విచ్ వేయగానే ఇంజన్ పనిచేసినట్టు నా బుర్ర పనిచేయసాగింది.

ఆ చెయ్యి పెళ్ళికూతురిది

కీ ఇచ్చిన బొమ్మలాగా లేచి నిల్చున్నాను.

"నీ కోసమే ఎదురుచూస్తున్నాను మధూ!" అంది ఆమె గుడ్డి వెల్తుర్నీ, మసక చీకటినీ ఆమె చూపులు చీలుస్తున్నాయి

"నా పేరు మధుకాదు." అన్నాను.

"నన్నింకా ఏడ్పించకు" అని తన తల నా గుండెలమీద ఆనించింది. నా జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి తన్మయత్వం చెందింది.

లైట్లు పూర్తిగా ఆరిపోయాయి.

ఆమె స్పర్శ తగలగానే నా వళ్ళు ఝల్లుమంది సిగ్గో, ఆనందమో. ఏదో తెలియడంలేదు. పరిగెత్తుతున్న పాసింజర్ బండి నా గుండెలమీదనుంచి పోయినట్లు వుక్కిరి, బిక్కిరై పోయాను నా స్థితి అయోమయం అయిపోయింది. ముచ్చెమటలు పోశాయి

ఎవరైనా చూస్తున్నారేమోనని బిత్తర చూపులు చూశాను అందరూ గాఢ నిద్రలో వున్నట్లున్నారు ప్రక్కనవున్న

మనిషి గూడా కనిపించడంలేదు.

''ఇన్నాళ్లూ ఎలా వున్నావు మధూ?''

''నేనా?''

ఆమెకు శోకం పెల్లగిల్లి వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ, ''మధూ! నువ్వు తప్ప నాకీ లోకంలో ఎవరూవద్దు. నీకోసం ఎంత సాహసమైనా చేస్తాను వెళ్ళిపోదాం పద ఎవరికీ తెలియని ఎక్కడికైనా పోయి సుఖంగా వుందాం'' అంది సన్నగా.

''అమ్మో!'' అన్నాను ఆందోళనగా.

''నా గుండెల్ని ముక్కలు చెయ్యకు మధూ నా ఆశల్ని భగ్నం చెయ్యకు. ఇప్పుడు నేను వెనక్కి ఆలోచించలేను. ఒక క్రొత్తలోకంలోకి వెళ్తున్నాననే సంతోషంలో వున్నాను. నన్ను నరకానికి నెట్టివెయ్యకు.'' ఆమె మాటలు అమాయకంగానూ, స్వచ్ఛంగానూ, సెలయేటి మర్మర ధ్వనులలా వున్నాయి.

నా కెందుకో ఈ అనుభవం కొంత వేదన కలిగించింది. ఆనందంగా కూడా వుంది. ఉగాది పచ్చడిలా తియ్యగా, పుల్లగా, చేదుగా అనిపించింది ఏం చెయ్యాలో తోచలేదు ఆమెను వదిలించుకుందికి ప్రయత్నించాను. నా చుట్టూవున్న చేతుల్ని లాగాను. కాని ఆమె వదల్లేదు

ఆ మధు ఎవడో? వదిలితే వాడు వెళ్ళిపోతాడేమో అనుకున్నట్లుగా ఇంకా గట్టిగా పట్టుకుంది నేను మధునికాదు మొర్రో అన్నా ఆమె వినేట్లులేదు.

''మధూ! ఇప్పుడు నాకెలావుందో తెలుసా? ఎండిపోయిన పొలంలో వర్షం పడినట్లు హాయిగావుంది, మధూ! ఈ క్షణంలో నాకు నిన్నుమించిన ప్రియతములు ఎవరూలేరు. నీ జీవితమే నా జీవితం, నా సర్వస్వం నీకోసమే! చావవలసివస్తే ఇలాగే ఇద్దరం కలసి చచ్చిపోదాం.'' స్టేజీమీద నాటకం వేసేదానిలా ఒకళ్లు చూస్తున్నారనే బాధ లేనట్లే మాట్లాడేస్తోంది.


ఆ పెళ్ళికూతురి పేరేమిటో? అడగాలనుకున్నాను కాని ఇంకా గట్టిగా ఏడుస్తుందేమోనని సందేహించి వూరుకున్నాను ఏమైనాసరే ఆమె మనస్సు మాత్రం దూదిలా మెత్తనిది, సముద్రంలా నిండైనది. ఆకాశంలా విశాలమైంది. ఆమె మధుకోసం ఎన్ని సుఖాలైనా త్యజించగలదు, ఎన్నికష్టాలైనా భరించగలదు, ఎన్నిత్యాగాలైనా చెయ్యగలదు అనిపించింది.

ఆమె 'మధు' కోసం ఎదురుచూస్తూ వుంది ఆ భ్రమలో నన్నే మధు అనుకొంటూ వుంది. నేను కాదని చెప్పినా నమ్మకపోవడానికి కారణం, తను నిర్మించుకున్న ఆశాసౌధాలు కూలుతాయనిభయం. మధు కౌగిట్లోవున్న సుఖం స్వప్నానికి మల్లే తృటిలో అదృశ్యమవుతుందేమోనని బెంగ.

ఆమె మధును గాఢంగా ప్రేమిస్తోంది. ఆ మధు ఆవిడకు ప్రాణం. మధు ఆవిడకు మర్మం, మధు ఆమెకు సత్యం, మధు ఆమె నేత్రజ్యోతి

ఆమె ప్రేమలో మునిగి తేల్తూ ఉన్మాద స్థితిలో వుంది

నిజానికి ప్రేమలా పిచ్చెత్తించేది ఈ




లోకంలో వేరేదీలేదు ప్రేమకు ఆది అంతం లేదని నాకు అనిపిస్తూవుంది. నేను ప్రేమను అనుభవించకపోయినా ఆమె పరిస్థితి చూస్తుంటే ప్రేమలో విషంలాంటి డేంజర్, అమృతంలాంటి తీపి, బ్రాందీ లాంటి మత్తు వున్నాయనిపించింది.

"మాట్లాడవేం? మధూ! నేను చేసిన కబురు అందిందో లేదో, నువ్వు వస్తావో రావో? అని ఎంతో భయపడిపోయాను. నిన్ను పోలీసులు తీసుకుని వెళ్ళారని విని ఎంత బాధపడిపోయానో తెలుసా? ఇన్నాళ్ళూ ఆకలి, దాహం మర్చిపోయాను ఏపని చేయడానికీ ఇష్టం పుట్టేదికాదు. శరీరం శిథిలమైంది. సోమరితనం పుట్టింది. మనసులో బాధ, గుండెల్లో మంటలు. నువ్వు దూరమైనందుకు ఎప్పుడూ ఏడ్వా లనిపించేది. మాట్లాడవేం? " అని నన్ను కదిపింది.

"నేను మధునుకాదు. నువ్వెవ్వరివో ఏమిటో? నాకు అర్థంకావడంలేదు." అన్నాను నెమ్మదిగా.

ఆమె నన్ను వదిలింది.

నన్ను ఎవరూ మోసం చెయ్యలేరు. ఇంత సీరియస్‌లో గూడా ఎగతాళిగా మాట్లాడతావెందుకు? లేక ఈ చివరి సమయంలో పిరికివాడివి అవుతున్నావా? మనసు మార్చుకోకు మధూ. నీ చుట్టూ పరిస్థితులు ఎన్నిమారినా, అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ నిన్ను ప్రేమిస్తూనే వుంటాను. నువ్వు లేకపోతే నేను జీవించేది కల్ల" అన్నది.

చీకట్లో ఆమె కనుపాపలు స్ఫటికం ముక్కల్లా మెరుస్తున్నాయి.

మనుషులు దూరంగావున్నా వారిప్రేమ

పచ్చగానేవుంది తావులను వెదజల్లుతూనే వుంది నిజమైన ప్రేమంటే వీరిదేనేమో? అనిపించింది

నామాటలు ఆమె ఎగతాళిగాను, పిరికి తనంగానూ అర్థంచేసుకుంటూవుంది నేనేం చేయాలి? ఏమాత్రం గట్టిగా మాట్లాడినా ఎవరో ఒకరు నిద్రలేవవచ్చు. గొడవ జరగవచ్చు

ఆమె కథ వింటూవుంటే నా గొంతు మూగపోయింది నా మనసు చెమ్మగిల్లింది, మౌనంగా వుండిపోయాను.

నేను ఎంతకీ మాట్లాడకపోవడం చూసి ఆమె నాచెయ్యి పట్టుకుని, "మధూ! నువ్వు ఎందుకు అలావున్నావు? చెప్పు. నన్నేం చెయ్యమంటావు? ఆజ్ఞాపించు నాకీజీవితం మీద పూర్తిగా విసుగుపుట్టింది నీకు ధైర్యం లేకపోతే చెప్పు ఈ పరిగెత్తే రైల్లోంచి దూకుదాం పోవలసిన రోజు వచ్చేటప్పటికి ఈ ప్రాణాలను పోనివ్వ డమే మంచిది శరీరంమీద మమకారంతో ప్రాణాన్ని బంధించి, మనసుని చంపి తప నతో కొట్టుకోవడంవల్ల సుఖం ఏముంది?" అంటూ చిన్నగా ఏడ్చింది నాచేతిమీద ఆమె కన్నీరు బొట, బొటకారింది

నాలో అంతకుముందువున్న నిగ్రహం తుత్తునియలై, చేతులు, కాళ్ళూ గజగజ వొణికిపోయాయి

ఆమె మాటలు గుండెల్ని చీల్చుకువచ్చి నన్ను కలచివేచినై తీవ్రమైన ఆవేదన ఆమె చేతినుంచి నాచేతిలోకి ప్రవేశించి, శరీరమంతా వ్యాపించింది లోపల వేదన సుళ్ళుకట్టి తిరుగుతూవుంది

ఆమెను ఒక కన్నుతో నవ్విస్తూ, ఇంకొక కన్నుతో ఏడిపిస్తున్నట్లు అనిపిం చింది నాకు. నేను 'మధు' అనుకొని ఆమె ఆనందిస్తూవుంది మధు ఎందుకో మారి పోయాడని చింతిస్తూవుంది

నేను మధుని కాదని ఆమెను ఎలా నమ్మించాలో నాకు అర్థంకాలేదు ఒకవేళ నమ్మించినా, ఆ మధు రాలేదని నిరాశతో రైల్లోంచి దూకి చావదుగదా? అని భయం వేసింది. ఆమె ఏమైతే నాకేం? నాకేం సంబంధం? ఎందుకోగాని ఈ ఆలోచన నా మనస్సును కొంచెం కలవరపెట్టింది.

"ఏడవకు" అన్నాను

చిక్కగా చుట్టు ముట్టిన ఆ చీకట్లో, ఆమెను ఓదార్చడానికి ప్రయత్నిస్తుంటే, ఏటి వరదకి గట్టు తెగిపోయినట్లు, ఆమె దుఃఖం మరింత ఎక్కువై పోయింది

ఆమె ఏడుపు వింటుంటే అసలు మను ష్యులు ఒంటరిగా కష్టాలు అనుభవించ లేరు. సుఖాలూ అనుభవించ లేరు అని పించింది నాకు.

ఇప్పుడు తనతోపాటు కష్టసుఖాలు పంచుకునే వ్యక్తి 'మధు' ఆమె ఎదుట ప్రత్యక్ష మయ్యాడు మధు ఆమె కోసం ఏడవ గలడు, నవ్వగలడు అవసరమైతే ఆమె కోసం ఆత్మార్పణ చేయగలడు

ప్రేమలో ఎంత డేంజర్ వున్నా, ఆ ప్రేమను నేను అనుభవించనందుకూ, ఆమె వంటి ప్రియురాలు దొరకనందుకూ, నేను ఆమెకు తోడునీడ అయిన మధు వంటి అదృష్టానికి నోచుకోనందుకు విచారం వేసింది

ఆమె కాసేపు ఎవరికీ వినిపించ కుండా నోరు నొక్కుకుని ఏడ్చింది. నాకు మాత్రం వెక్కిళ్లు వినిపిస్తూనే వున్నాయి.

కొండమీదవున్న ఓ దేవుడా? ఏం సృష్టి స్వామీ ఇది? కొందరిమధ్య ప్రేమ లేకుండా ఎందుకు కట్టి పడేస్తున్నావు? ప్రేమ వున్న చోట అల్లకల్లోలాలు, తుపాన్ బీభత్సాలూ ఎందుకు కల్పిస్తున్నావు? అంత చేతగాని వాడివి ఆ పదవిలో ఇంకా ఎందుకున్నావు? రాజీనామా చేసి నీ నిజాయితీ నిరూపించుకోరాదూ? ఎందుకయ్యా నీకీ పదవీ వ్యామోహం?

అనేక ఆలోచనలతో నా మనస్సు కలవర పడింది. ఏం లాభం? నాకు కలవరమే మిగిలింది

ఆమె నా భుజాలు రాస్తూ, నా మెడ మీద చేతులు వేసి, నా ముఖాన్ని దగ్గరగా లాక్కుంది. ఆమె స్పర్శకు నా శరీరం మంచుకు వొణికినట్లు వొణికి పోయింది.

ఆలోచనల మీద ఆలోచనలు ఆ ఆలోచనలు నాకు వెర్రెత్తించేస్తున్నాయి. ఇంకొంచెం సేపుంటే పిచ్చి పట్టేట్టు వుంది పిచ్చెత్తించి కళ్లకి పొరలు కప్పేస్తున్నది. ఆమె జడలోంచి వస్తున్న మల్లెల మత్తు వాసన. ఆమె శరీరపు యవ్వనం సువాసన

మనిషి జీవితంలో కొన్ని ఉన్మత్త సమయాలుంటాయి. నిగ్రహం, నిష్ట ఒక చిన్న సంఘటనతో, ఒక్క క్షణంలో సడలి పోవడానికి అవకాశం వుంటుంది. నేను మధులా ప్రవర్తించి వుంటే?

ఆమె ముఖం చూస్తుంటే నాకెందుకో గౌరవ భావమే కల్గింది ఆమె మాటలు వింటుంటే అజ్ఞాత అంధకారాన్ని చీల్చే జ్ఞానరేఖల్లా వున్నాయి.

మానవత్వం, మనసు వున్న మనిషి ఏ యుగంలోనూ, ఎట్టి పరిస్థితిలోనూ 'మధులా' నటించి ఆమెను మోసగించ లేడు.

నేతి గులాబ్‌జామ్ చేతిలో పెట్టినట్లయింది కాని దాని యజమాని మధు

''ఎందుకు బాధపడుతున్నావు?'' అంది.

''బాధ పడటం కాదు. ఆలోచిస్తున్నాను. నువ్విలా పసుపు బట్టలతో పెళ్లి పీటల నుంచి మాయమై పోతే నీ మీద అపవాదు రాదా?'' అన్నాను

''ప్రేమించే మనిషి కోసం అపవాదులు, ఆపదలు సహించడానికి తయారుగా లేనప్పుడు బ్రతికి ప్రయోజనం ఏముంది?'' అన్నది ఆమె. మానవత్వానికి కొన్ని కనీస ధర్మాలున్నట్లు, ప్రేమకు ప్రిన్సిపల్స్ వున్నాయి అని ధ్వనించాయి ఆమె మాటలు

నేనేం మాట్లాడ గలను?

దున్నపోతూ కనీ ఎరగదు, పాలిచ్చీ ఎరగదని, నేను ప్రేమించీ ఎరగను, నన్నెవరూ ప్రేమించీ ఎరగరు అందుకని మౌనంగా వుండిపోయాను

''మధూ! స్త్రీ జీవితంలో ఇద్దరు ప్రియులుండటం అసాధ్యం అందుకే మనల్ని దేవుడు మళ్లీ కలిపాడు'' అంది. ఆమె ఆశావాది అనీ, అన్నీ తనకు అనుకూలంగా అల్లుకునే స్వభావం కలదనీ గ్రహించాను.

''మాట్లాడవేం?''

''అవును'' అన్నాను ఆమె తృప్తి కోసం.

''కొమ్మలు నరికినందువల్ల చెట్టు ఎండి పోతుందను కున్నాడు మా నాన్న'' అని నవ్వింది ఆమె.

ఆమె నవ్వు ఆపగానే, ఎవరో దగ్గారు గట్టిగా.

నేను పిరికివాడిని కాదు, కాని ఎందుకో పిరికితనం ప్రవేశించింది నాలో.

నేను లోకులకి గాని వారి తాతలకు గాని భయపడను. కాని ఆ దగ్గుతున్న వాడికి భయపడు తున్నాను.

ఎంత సింహం అయితే మాత్రం తుపాకీ చప్పుడికి భయపడక తప్పుతుందా?

''ఇక వెళ్ళి కూర్చో. ఎవరో లేచారు.'' అని నేను రెండడుగులు వాకిలి వైపు వేశాను

ఆమె నా చొక్కా పట్టుకుని లాగి ''ఎక్కడికి?'' అంది

''గాలి రావడం లేదు. వాకిట్లో నిల్చుంటాను'' అన్నాను.

'ఫలానా' స్టేషన్‌లో దిగిపోదాం అంది ఆమె.

నా గొంతున పచ్చి వెలక్కాయ పడి నట్లు మాటరాలేదు.

''వీలుంటే '' అని మూలిగాను. ''తొందర పడకు'' అని మరో మాట విసిరాను.

ఆమె చీకట్లో తడుముకుంటూ వెళ్లి పోయింది

'హమ్మయ్య' అని నిట్టూర్చి కూలబడి పోయాను. మోకాళ్ల మీద తల, నెత్తిన చేతులు పెట్టుకుని నిద్ర పోవడానికి ప్రయత్నించాను.

మనసు జరిగిపోయిన రసాత్మకమైన బాధా పూర్వకమైన సన్నివేశాన్ని నెమరు వేయటం ప్రారంభించింది.

మధు కోసం ఆమె ఎంత దుఃఖాన్ని తనలో ఇముడ్చుకొని వుందో? పరిస్థితుల వొరిపిడి వల్ల పుట్టిన హాలాహలాన్ని ఎలా దిగమింగిందో? మనసుని దహిస్తున్న అగ్నికణాల్ని ఎలా భరిస్తూ వుందో కదా?


జీవితంలో ఎన్నో బాధలు, భయాలు, ఆశలు, ఆనందాలు, అవమానాలు, అపజయాలు, సాహసాలు, సాలెగూళ్ళు వున్నాయని నాకిప్పుడు అనిపించింది

'బిడ్డను కనాలంటే పురుటి నొప్పులు తప్పవు నాయనా?' అనేవాడు వెనక మా లెక్చరర్ ఒకాయన అలాగే ప్రేమ ఫలించాలంటే ఎన్ని నొప్పులు భరించాలో?

ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో? మెలకువ వచ్చేసరికి బండి ఆగివుంది అప్పుడే తెల్లవారుతూ వుంది తూర్పు దిక్కుకు తరలి పోయిన మేఘాలు పర్వతాల లాగ నిలబడిపోయి ఎర్రబడి వున్నాయి. ఇంకా సూర్యోదయం కాలేదు.

పెళ్ళి కూతురు జ్ఞాపకం వచ్చింది.

రాత్రి జరిగిన విషయం ఎవరికైనా చెప్పాలనుకున్నాను. కాని ఎవరికి చెప్పుకునేటట్టు? ఏమని చెప్పుకునేటట్టు? అలా జరగటం చాలా అసందర్భంగాను, అసహజంగాను అనిపించింది. అదంతా ఒక కలలా అనుకున్నాను.




కల అని ఎలా అనుకోను?

ఆమె కన్పించింది.

ఆమె మొఖం చూడలేకపోయాను. నేను మధుని కాదని తెలిపి ఆమె హృదయం ముక్కలై వుంటుందని తెలుసు. ఆమెలో తాండవించే నిరాశను చూడటానికి భయం వేసింది.

ఎంతో ప్రయత్నం మీద ఆమెను చూశాను.

చేతనా రహితంగా నిలబడి పోయింది ఆమె.

పిడుగు పడిన చెట్టుకు మల్లేను, వేటగాని విజృంభణకు బెదిరిపోయి బిత్తర చూపులు చూస్తున్న లేడికి మల్లేను వణికి పోయింది.

ఆమె ఆశలన్నీ మట్టి పాలయ్యాయి. మనోరథాలన్నీ మంటిలో కలిసినై. కలల దుప్పటికి నిప్పంటుకుంది.

ఆమె కళ్లు కెంపుల్లా మారేయి ఆమె మొఖం పండు మిరపకాయలా ఎర్రగా అయింది. మాటి మాటికీ కళ్లు తుడుచుకుంటూ దుఃఖాన్ని ఆపుకుంటూన్నది. ఆమె అసహాయంగా శూన్యంలోకి చూస్తూ వుండి పోయింది

ఒక వేపునుంచి లోకం వెలుగులోకి వస్తుంటే, నా హృదయం అంధకారంలోకి వెళ్లినట్లయింది.

ఒక స్టేషన్‌లో కాంటీన్ ముందు నిల్చుని కాఫీ త్రాగుతున్నాను.

నెత్తిన తలపాగా, నీరు కావి బట్టలు, మాసిన తెల్ల గడ్డం, పగిలిన భూమిలాగ నెర్రెలిచ్చినట్లున్న ముదతల మొఖం, "మధు బాబూ!" అన్నాడు ఆత్రంగా.

నేనే మాత్రం ఆశ్చర్యపడలేదు. ఆ మధుగాడి పోలికలు కొంచెం నాకున్నాయని అర్థమై పోయింది.

నేను విచిత్రంగా చూశాను.

"వద్దు బాబూ! వెంటనే ఎల్లిపో. అయ్యగారు చూస్తే చానా ప్రమాదం." అన్నాడు

"నేను మధును కాదు." అన్నాను.

దగ్గరగా వచ్చి చూసి, నేను మధుని కాదని నిర్ధారణ చేసుకుని 'చూపు ఆనడం లేదు' అనుకుంటూ వెళ్ళిపోయాడు ఆ ముసలాడు

కొండ స్టేషన్ చేరాక మరి నాకా పెళ్లి కూతురు కనిపించలేదు.

కాలేజీలోకి ప్రవేశించాక ప్రాణం కుదుట పడింది రాత్రి సరిగా నిద్రలేనందు వల్ల కళ్లుమండ సాగాయి రోజు కంటే కొంచెం ముందుగానే భోజనం చేసి పడక వేశాను. అర్ధరాత్రికి పెళ్ళి గనుక ఇప్పట్లో హడావుడీ ఏమీలేదు. అందునా క్రొత్తల్లుడిని కాబట్టి పని నెత్తిన పడలేదు.

మూడింటికి మెలకువ వచ్చింది. స్నానంచేసి బట్టలు వేసుకున్నాను ఎవరి పనిలో వాళ్లున్నారు. ఏం తోచక దేవాలయం దగ్గరికి బయల్దేరాను

వచ్చేపోయే జనాన్ని చూడడం తప్పితే అక్కడా ఏం తోచలేదు. కాలక్షేపానికి రెండు పత్రికలు కొనుక్కుని కాలేజీకి తిరిగి వస్తున్నాను.

కాలేజీ కొంచెం దూరంలో వుందనగా మా మావ పురుకులు, పరుగులుమీద నాకు ఎదురు వచ్చాడు మనిషి ఎందుకో కంగారుగా వున్నాడు. మొఖం చెమట పట్టేసి వుంది. గంభీరంగా నిండు కుండలావుండే మనిషి భయంతో నీళ్ళు కారిపోతున్నాడు. మా మావ వెనక పరివారమంతా వున్నారు. అంతా ఆందోళనగానే వున్నారు.

నన్ను చూసి ఎక్కడి వాళ్లక్కడ మంత్రించిన వాళ్ల'లా స్తంభించిపోయారు.

"ఏం జరిగింది?" అని ప్రశ్నించాను.

మా మావ తేరుకుని ప్రక్కనున్న మా పెద్ద మావ మనవడి జుట్టు లంకించుకుని చురుగ్గా నాలుగూ అంటించాడు. నెత్తిన తాటికాయపడిన కుక్కలా వాడు 'కుయ్యో! మొర్రో' అన్నాడు అంతలోకే మా బావ మరది ముందుకు వచ్చి విడిపించాడు.

నా కదంతా ఓ మిస్టరీ అనిపించింది. వీళ్ళంతా ఎక్కడికి బయల్దేరారు? ఎందుకు ఆందోళన పడుతున్నారు? నన్ను చూసి ఆగిపోయా రెందుకు? మా మావ ఆ పిల్ల వెధవని కొట్టాడెందుకు?

"ఏమిటోయ్ ఇదంతా?" అన్నాను మా బావ మరది వంకచూసి.

వాడు కిసుక్కుమన్నాడు. సోడా కొట్టిన శబ్దం వచ్చింది వాడి నవ్వుకి, ఏడుపుకీ పెద్ద తేడా కన్పించదు. నవ్వుతున్నాడో లేక ఏడుస్తున్నాడో నాకు అర్థం కాలేదు.

"నిన్ను ఎవరో పొడిచారని సాంబడు జోక్ చేసి, మమ్మల్ని ఫూల్స్ చేశాడు, మేమంతా కంగారుగా బయల్దేరాం." అన్నాడు మా బావ మరది.

"ఏరా సాంబిగా! ఇది ఏప్రియల్ ఫస్టు గూడా కాదే. నీ జోక్ పాడుగానూ!" అన్నాను.

"జోక్ కాదు. నిజం. నిన్ను ఎవరో పొడిచారు."అన్నాడు సాంబడు ఏడుస్తూనే.

అంతా పగలబడి నవ్వుకుంటూ చెల్లా

చెదురై కాటేజీలోకి వెళ్లిపోయారు.

నాకు నవ్వు రాలేదు వాడి మాటలు చురకత్తుల కంటే పదునుగా నా గుండె ల్లోకి దిగాయి ఆ పెళ్ళి కూతురు జ్ఞాపకం వచ్చింది. వెంటనే నేను ఎన్నడూ చూడని మధు తలపుకు వచ్చాడు

ఇప్పుడు అర్ధమైంది. మధు ఆమెకోసం వచ్చి వుంటాడు. నాతల గిర్రున తిరిగింది. కాళ్లు వణికాయి. పూనకం వచ్చిన వాడి మాదిరిగా గబ, గబ అడుగులు వేసుకుంటూ వెళ్ళాడు

జనం మూగివున్నారు.

పోలీసులు అదుపు చేస్తున్నారు.

పులి చంపిన మేకలా పడివుంది శవం. నెత్తుర్లో మునిగిన మల్లెపువ్వుల్లా వున్నాయి తెల్లబట్టలు, నేలమీద కారిన నెత్తురు ఇంకా పచ్చిగానేవుంది

అతను మధు కాదు ఆ శవం మధు

సూర్యుడి తేజము, బంగారు మెరుపు, వజ్రాల కాంతీ అతని ముఖంలోచూశాను సాధువులా, శాంతంగా, సౌమ్యంగా చిరు నవ్వుతో నిద్రపోతున్నట్లు అనిపించాడు మధు

ఎక్కువసేపు చూడలేక కళ్లుమూసు కున్నాను. చూసింది కాసేపే అయినా, ఆ దృశ్యాన్ని జన్మ, జన్మలకూ మర్చిపోలే ననిపించింది.

తగలబడుతున్న మనసుని చిక్క బట్టు కున్నాను కళ్లలోంచి వుబికి వస్తున్న కన్నీరు తుడుచుకున్నాను.

నా హృదయం నిప్పులమీద వుడుకు తున్న అన్నంలా తుక, తుకలాడింది.

ఈ హత్య వెనకవున్న శక్తులు, వ్యక్తులూ ఎవరో లీలగా నాకు అర్ధమవుతూ వుంది

అలా అర్ధం కాగానే, ఒక సుడిగుండం నన్ను చుట్టు ముట్టినట్లయింది, అగ్ని పర్వతం నా కళ్ల ముందే పగిలినట్లయింది. భూకంపంవచ్చి భూమి బ్రద్దలైనట్లయింది.

ఎవరికోసం ఈ మనుష్యులు ఈ ఘోర కృత్యం చేసినట్టు? ఎవరి సుఖం కోసం? ఇంతేనా ఈ లోకంలో ప్రాణం విలువ?

ఇందుకేనా ప్రేమించుకునేది?

పేగులు ముడిపడినట్లు బాధపడ్డాను.

నా గుండెల్లో వెయ్యి గొంతుకలు ఏడు స్తున్నాయి.

ఆ మధుతో నాకు పరిచయం లేక పోయినా అతనిమీద నాకు విపరీతమైన సాను భూతి కలిగింది

ప్రేమకోసం ఇంతదూరంవచ్చి దిక్కు లేని చావు చచ్చాడు.

ఆ ముసిలాడు కన్పించాడు.

నన్ను చూస్తూనే అతని మొఖం పాలి పోయింది గడ గడలాడి పోతున్నాడు. చెమటలు పోసి వణుకుతున్నాడు.

"తాతా .." అని పలకరించాను.

అతను కన్నీళ్లు తుడుచుకుని ఒకబండ మీద కూలబడిపోయాడు. ఎంతో అలసి పోయినట్లు కన్పించాడు మనిషి.

"వూఁ " అన్నాడు.

"నీకు ఈ మధుబాబు తెలుసా?" అని ప్రశ్నించాను.

తాత నా వంక విచిత్రంగా చూశాడు.

"తెలుసు." అన్నాడు వణుకుతున్న కంఠంతో.

"రాత్రి రైల్లో ఒక పెళ్ళి కూతురు నన్ను మధు అనుకుని "

తాత అర్ధోక్తిలో అందుకుని "నాకు తెలుసు బాబూ! రాధమ్మ నా కంతా చెప్పింది " అన్నాడు కళ్లు తుడుచుకుని

"అయితే తాతా, నాకు అర్థం కాలేదు వీళ్ళ కథ. చెప్పు " అన్నాను తాతకు ఎదురుగా వున్న మరొక బండరాయిమీద కూర్చుంటూ.

"చెప్పడాని కేముంది బాబూ! మని షికి అనేక కోరికలుంటాయి. అన్నీ తీర తాయా" అన్నాడు.

నీ మెట్ట వేదాంతం మండిందిలే అని లోపల అనుకుని పైకి "ఎలా తీరతాయి తాతా?" అని ఎదురుప్రశ్న వేశాను.

"నీ పాటి తెలివి ఆ మధుబాబుకి లేక పోయింది డబ్బున్న అమ్మాయితో సంబంధం పెట్టుకోడం పొట్టలో బంగారు బల్లెంతో గుచ్చుకోవడంతో సమాననునీ, విచ్చేనకు స్వర్గం అందదనీ ఎన్నోసార్లు చెప్పాను. కాని వినలేదు, ప్రేమ ప్రేమ అనే వాడు. రాధ దక్కకపోతే చచ్చిపోతా ననే వాడు. అలాగే జరిగింది " అన్నాడు తాత విచారంగా

"అయితే మధు ఆత్మహత్య చేసు కున్నాడా ?" అన్నాను ఆశ్చర్యపోతూ.

"ఎలా తెలుస్తుంది" అన్నాడు తాత.

"ఆ రాధకి, మధుకి ఎలా ప్రేమ కలి సింది?" అన్నాను.

"ఎలా తెలుస్తుంది?" అన్నాడు మళ్ళీ తాత

"ఇద్దరిదీ ఒక్కవూరేనా ?"

"కాదు. రాధమ్మ నాన్నకి బియ్యం మిల్లువుంది. అందులో పనిచెయ్యడానికి ప్రక్కవూరునుంచి వచ్చాడు మధుబాబు. ఏడెనిమిదేళ్ళయింది అప్పుడు రాధమ్మ పదేళ్ళ పసిపిల్ల "

"అయితే చిన్ననాటి అనురాగం అన్న మాట "

"అవును బాబూ! బావా మరదళ్ళలాగే చిలిపిగా, సరదాగా, నవ్వుకుంటూ వుండే వాళ్లు. వయసులో వున్న మనసులు పువ్వు ల్లాంటివి. వాళ్ళని ఎవరూ పట్టించుకునే వారు కాదు రాధమ్మ చదువుకుంటూ వుండగా పెళ్ళి సంబంధాలు వచ్చాయి. డబ్బునోళ్లు బాబూ! ఆ పిల్లను చేసుకో డానికి ఎవరైనా ముందుకు వస్తారు. అప్పుడు రాధమ్మే మనసులో మాట తల్లికి చెప్పింది మధు అంటే ఆ తల్లికి గూడా ఇష్టమే కాని తండ్రిమాత్రం 'కంయ్' మంటూ ఇంతెత్తు ఎగిరాడు. ససేమిరా ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదన్నాడు "

"అర్థమయింది "

"ఏమర్థమయింది బాబూ! మా కామందు మామూలు మనిషి కాదు భారతంలో శకుని, కృష్ణుడుగూడా ఆరిముందు సాలరు.. బియ్యం మిల్లులో డబ్బుపోయిందని కేసు పెట్టి మధుబాబుని పోలీసులకి పట్టించాడు. మధుబాబుకి నాన్నలేడు. మేనమామ, తల్లి వచ్చి మా కామందు కాళ్లు, గడ్డాలు పట్టు కున్నారు. ఈ కసాయోడు వింటేనా? డబ్బు కక్కమన్నాడు వున్న పొలం కాస్త అమ్మి డబ్బుకట్టింది తల్లి "

"వూఁ " అని నిట్టూర్చాను.

"రాధమ్మ మాత్రం పెంటపోగులో

మల్లెపూవు బాబూ. అంత నీతిగల మనిషి. చేసుకుంటే మధునే చేసుకుంటాను. లేక పోతే ఇక బ్రతకను.'' అని తెగించి చెప్పే సింది. కాని కామందు వట్టి మూర్ఖుడు. డబ్బుంది కాని మనసులేదు ఆయనగారి పద్ధతి ఎలా వుంటుందంటే కొడుకు బాగుం డాలి. కోడలు ముండమొయ్యాలి' అంటాడు.''

''మరి రాధమ్మ ఇష్టంలేని పెళ్లికి ఎందుకు ఒప్పుకుంది?'' అన్నాను.

''వస్తున్నాను ఒకసారి రాధమ్మ "నా జీవితం తెగిన గాలిపటంలా అయ్యింది తాతా! బ్రతికినందువల్ల ప్రయోజనం ఏముంది? నేను ఎంతమాత్రం బ్రతకవల సిన అవసరంలేదు. మనసొకచోట, మను గడ ఒకచోట.ఆ నరకం నేను భరించలేను. మధుకోసం కాకపోతే నా జన్మ ఎందుకు?'' అని చెప్పుకుని ఏడ్చింది నేనూ కాసేపు ఏడ్చి వూరుకున్నాను మధుకోసం గంగ వెర్రులెత్తే స్థితికి వచ్చింది, నేనేం చెయ్య గలను '' అని తాత కాసేపు ఆగి, మళ్లీ మొదలుపెట్టాడు ''ఇంట్లో పోరగా, పోరగా, చివరికి రాధమ్మ ఈ పెళ్లికి ఒప్పు కుంది పెళ్లికొడుక్కి మొక్కువుందని పెళ్లి ఇక్కడచేస్తున్నారు నేను ఈ వార్త మొదట్లో నమ్మలేకపోయాను రాధమ్మని అడిగితేనవ్వి నిజమే అంది. కాని మధు కోసంకబురుచేసిందనీ, మధు వస్తే అత నితో వెళ్ళిపోవడానికి సిద్ధపడిందనీ నాకు తెలియదు '' అన్నాడు తాత

''అలాగా.'' అన్నాను అర్థమైందని తలూపుతూ.

ఈ డబ్బునోళ్ళతో అన్నీ చిక్కులే బాబూ. ఇష్టమైందా, కొంపలు తీసేవాడిని నెత్తిన పెట్టుకుంటారు. ఇష్టం లేక పోయిందా, మంచివాడి కొంపలుగూడా తీసేస్తుంటారు '' అన్నాడు తాత కసిగా.

''అందరూ అలా ఎందుకుంటారు?''

''ఎక్కువమంది అలాగే వున్నారు.'' అన్నాడు తాత డబ్బున్నవాళ్ళంటే వున్న కసి కొద్దీ

''వూఁ '' అన్నాను.

''అసలు వయసులో వున్న వాళ్ళు వెర్రివాళ్ళు అబ్బాయి. అంతా ఆళ్ళ ఆలో చనలకు అనుకూలంగా నడుస్తుందని అనుకుంటారు ఏవో కలలు కనేస్తారు. తమ చుట్టూ బలమైన కోటలు కట్టుకుం టారు, కాని అవి పేకమేడల్లా కూలి పోతాయని నా వంటివాడు చెప్పినా నమ్మరు బాబూ!'' అన్నాడు తాత.

''తాతా!''

''వూఁ ''

''మధు చనిపోయిన విషయం రాధకు తెలుసా?'' అన్నాను.

''తెలిసే వుంటది ''అని తాత లేచాడు.

తాత వెనక నేనూ అడుగులు వేశాను.

''అయితే ఈ పెళ్ళి ''

''రాధమ్మ చేసుకోదు. అంతేకాదు రాధమ్మ ఇంక బతకదు. ఆ బిడ్డ మనసు నాకు తెలుసు.''

''అంతేనా?''

''అంతే రాధమ్మ తండ్రికంటే మొండి మనిషి.'' అంటూ, ఏదో గొణు క్కుంటూ వెళ్ళిపోయాడు.

తాత వెళ్తున్న వేపుకే చూస్తూ నిల్చుండి పోయాను. ఆమాటలకి గుండెలు ఎందుకో దడ దడ కొట్టుకున్నాయి. రక్తం వెచ్చగా పారింది.

జీవితాలు విచిత్రంగా కన్పిస్తున్నాయి నాకు. ఈ ప్రపంచం వింతగొల్పుతూ వుంది. కొందరు దేవతల్లా ప్రవర్తిస్తుంటే మరికొందరు రాక్షసుల్లా రక్తం త్రాగుతున్నారు

పులిని పులి తినదు. కాని మనిషి మనిషిని తినేసి బ్రేవ్‌మని త్రేనుస్తున్నాడు. డబ్బే లోకంగా భావించేవారికి పాపం అన్నా, నరకం అన్నా ఏం భయంలేదని నాకర్థమయింది. పెద్దచేప చిన్నచేపలను తింటున్నట్లే పెద్ద మనుష్యుల ముందు చిన్న మనుష్యులు నాశనం కావలసిందేనా? అని నేను బాధపడ్డాను

విధి, దురదృష్టం అని పేటిసంటామో, వాటి అర్థమేమిటో నాకిప్పుడు తెలిసింది.

రాధను ఇప్పుడు పరాయి మనిషిగా చూడలేకపోయాను. ఎందుకో నాకు ఆత్మీయురాలై పోయింది. "రాధమ్మ ఇక బ్రతకదు" అన్న తాత మాటలు ఇంకా వినిపిస్తూనే వున్నాయి నాకు.

సూర్యుడు పడమటి లోయలోకి దిగిపోయాడు. ఆకాశం మధు నెత్తురులా ఎర్రబడింది. కామందులా నల్లటి చీకటి తరుముకొచ్చింది.

తాత నెమ్మదిగా అడుగులు వేస్తూ దూరంగా కన్పించాడు. తాతను వెంబడించాను.


పెళ్ళికి సన్నాహాలు జరుగుతున్నాయి. కాటేజిముందు కొన్ని కుర్చీలు వేసి వున్నాయి. ఎక్కువభాగం పిల్లలు ఆక్రమించి ఆడుకుంటున్నారు. పెళ్ళికొడుకు సీరియస్‌గా, నవ్వితే ఎక్కడ ముత్యాలు రాలిపోతాయో అన్నట్లుగా వున్నాడు. ఆ పెళ్ళికొడుకుని చూస్తేనే నాకు ఎందుకో వొళ్ళు మండుకొచ్చింది. ఎంత గర్వం? ఎంత గొప్ప? ఎంత అతిశయం? ప్రతి మూమెంట్‌లోనూ తనకు డబ్బున్నట్టు, హుందాగా ప్రవర్తించాడు, పెద్ద ప్రిన్స్ ఆఫ్ నైజామ్‌లాగా, అటూ, ఇటూ, ఇటూ, అటూ పచార్లు చేస్తూ కుక్కల్నిచూసే ఏనుగులా అందరి వంకా చూశాడు

చల్లటిగాలి వీస్తున్నా, నాహృదయంలో ఆవేదన చల్లారలేదు మధు ముఖమే చెక్కుచెదరకుండా నిల్చిన జ్ఞాపకపు మడతలా కన్పిస్తోంది,

రాధ తండ్రి ఏదో హడావుడీ చేస్తున్నాడు. తాత అతని వెనకే వున్నాడు. ఏదో పనిచేస్తూ నేను రాధ తండ్రిని గుర్తుపట్టాను. పెద్ద ఎనుబోతులా వున్నాడు. గామా పహిల్వాన్ని, కింగ్‌కాంగ్‌నీ చెరో చెత్తో కొట్టి చంపగలడనిపించింది ఆముఖం చూస్తుంటే హిరణ్యకశిపుడూ, రావణాసురుడు లాంటి పాత విలన్లు గుర్తుకు వచ్చారు. అతని అంతరంగంలో ఎంత అమానుషత్వం, పశుత్వం, ఎంత నిర్దయ, హింస, మోసం, కపటం, దాక్కుని వున్నాయో నాకు తెలుసు.

అతనేకాదు. అక్కడున్న మరికొందరు కూడా మనుష్యుల్ని తినే పులుల్లాగ, ఏనుగును వెనకనుంచి దెబ్బకొట్టే సింహాల్లాగ,

ముప్పైతొమ్మిదేళ్ళ క్రితం పుట్టింది
నోటబుల్ హాస్యము
అది వింటూ చేసింది గోదావరి
ఆనందపు లాస్యము
నవ్వే పెదవుల్ని—నవ్వలేని
హృదయాల్ని కనగల కమెడియన్
హీనజనులు—దీనజనులు
బాధితులూ—శోధితులూ కారంటా
డతనికి బర్డెన్
బలి, శిబి, దధీచి, కర్ణులను
అనుసరించు మంచివాడు
లారెల్, లూయిస్, చాప్లిన్ లంతటి
గొప్పవాడు
చాచిన ఏ హస్తము
అవ్వదు అతడిముందు రిక్తము
రాజబాబు చేస్తాడు మంచి కామెడీ



ఉంతకుమించి చూపిస్తాడు జనం మెచ్చు
హ్యూమానిటీ
ఎంత రాసినా కొంచెమే అవుతుందేమో
అనిపించే గ్రేట్ మేన్
కనుక ముగిస్తూ చెప్తున్నాను అతనికి
నా పార్డెన్.

---

కోరలున్న అడవిపందుల్లాగా కన్పించారు.

ఇద్దరు ముత్తయిదువలు చెరో చెయ్యి పట్టుకుని రాధను తీసుకుని వచ్చారు.

పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు ప్రక్క ప్రక్కనే కూర్చున్నారు

మంగలివచ్చి కాళ్ల గోళ్ల తీశాడు

పురోహితుడు ఏవో మంత్రాలు చెప్పి, దంపతుల్ని స్నానం చేయించమన్నాడు

పెళ్ళి కొడుకుని, పెళ్లి కూతుర్ని పుష్కరిణిలో స్నానానికి తీసుకుని వెళ్ళారు. నేను వాళ్లకంటే ముందుగా వెళ్ళి కోనేటి దగ్గర నిల్చున్నాను.

ఏం జరుగుతుందో నాకు అర్థం కావడం లేదు. ఈ పెళ్ళి జరుగుతుందా? లేదా? జరుగుతుంది. లేదు. ఎలా చెప్పడం?

పెళ్ళి కూతురు, పెళ్లి కొడుకు వేరై పోయారు

స్నానాలు పూర్తయ్యాయి. కాటేజీకి వెళ్ళారు.

రాధమ్మ పెళ్లయింది.

నా కడుపు మండి పోయింది. ఆ తాత కన్పిస్తే కాలుతో ఒక తన్ను తన్నాలని పించింది.

పాపం మధు ఎంత అమాయకుడు?

రాధ! ఎంత తేలిగ్గా మర్చిపోయింది మధుని? రాత్రి అన్ని మాటలు చెప్పిన ప్రియురాలేనా ఈమె? ఛీ నీచమైన మనుగడ కోసం, ప్రేమకే కళంకం తెచ్చి పెట్టింది. ఇటువంటి స్వార్థపరులు వుండబట్టే ప్రేమకు విలువ లేకుండా పోయింది.

దీని కపటం తెలుసుకోలేక పోయిన మధు, ఒక్కాలేక చావు చచ్చాడు. ప్రేమకు బలై పోయాడు.

రాధమ్మ పెళ్ళి చేసుకుంది.

రేపు కార్యం చేసుకుంటుంది.

భర్తతో కాపురాని కెళ్తుంది

తర్వాత బిడ్డల్ని కంటుంది

ఉత్తమఇల్లాలని పేరు తెచ్చుకుంటుంది.

కాని ఒక హంతకురాలని ఎవరికి తెలుస్తుంది?

ఈ కిరాతకిని నమ్మి మధు అనే ప్రేమజీవి ప్రాణాలు త్యాగం చేశాడని ఎలా తెలుస్తుంది చరిత్రకి.

ఇంకా ఆమె మొఖం చూస్తూ కూర్చోవడం పాపం అనిపించి మా కాటేజీకి వెళ్లాను.

నేను అదోలా వుండడం చూసి అందరూ ఆందోళన చెందారు. వంట్లో బాగా లేదన్నాను.

ఆ రాత్రి మా బావ మరిది పెళ్ళయి పోయింది. నాకు నిద్ర సరిగా పట్టలేదు.

ఉదయం లేస్తూనే మా పెద్ద మావయ్య మనవడు సాంబడు ఒక దుర్వార్త మోసుకు వచ్చాడు

"ఎవరో పెళ్ళి కూతురు కోనేట్లో పడి చచ్చిపోయిందట " అని.

ఆ వార్త వింటూనే మా మావ వాడి నెత్తిన ఒక మొట్టికాయ వేసి, "చంపుతాను వెధవా? వెధవ్వేషాలూ నువ్వూనూ!" అని కేకలు వేశాడు.

"నిజం తాతయ్యా! కావాలంటే వెళ్ళి చూడండి. అందరూ వెళ్ళి చూస్తున్నారు. ఆ అమ్మాయి పెళ్ళి రాత్రేనట అయ్యింది" అన్నాడు.

నా గుండె ఆగిపోయింది.

రాధమ్మ కాదు గదా?

ఏమో?

అందరూ కోనేటి వైపు వెళ్లారు నేనూ బయల్దేరాను.

రాధమ్మ శవం చూసి ఆగిపోయాను.

కొందరు ఏడుస్తున్నారు కొందరు నెత్తీ నోరూ బాదుకుంటున్నారు మగవారు ఏడవలేక దిగాలు పడిపోయి చూస్తున్నారు. ఆ వాతావరణం హృదయ విదారకంగా కన్పించింది

నా మెదడులో మరుగుతున్న ఆవేదనలు, గుండెల్లో పొర్లుతున్న ఆవేశాలూ ఒకచోట సంగమించి కన్నీళ్లుగా బైటపడ్డాయి.

"రాధమ్మా! నన్ను క్షమించమ్మా! నిన్ను అపార్థం చేసుకున్నాను నువ్వు దేవతవు " అని ఆమె శవం కాళ్లు పట్టుకుని అనాలనిపించిది.

అనుకోవడం వేరు. ఆచరించడం వేరు.

నా కన్నీళ్లు చూసి, మా ఆవిడ "మీదెంత మెత్తని మనసండీ!" అన్నది

నేనేదో చెప్పాలని ప్రయత్నించాను. కాని సాధ్యం కాలేదు.

పెనవేసుకు పోయిన మానవ సంబంధాలు ఇంత పుటుక్కున తెగిపోతూ వుంటే మనుగడకు అర్థం ఏమిటి?

ఈ లోకం నాకు శూన్యంగా కనిపిస్తోంది.

★

# కబుర్లు

## జలసాని ప్రసాదరావు

మా ఆలిండియా బుడ్డరచయితల మహాసభకు మీరు వస్తున్నారు గదా?'' అని నిలేసి అడిగేరు సదరు సంఘం సెక్రటరీ జనరల్ గారు.

**"ఎవరండీ! ఆ బుడ్డరచయితలు? ఏ లోకంనుండి వస్తున్నారూ?'' అని పరామర్శించేను.**

''ఓరి! అమాయకుడా!'' అన్నట్టు భూతద్దాల్లోంచి ఎగాదిగా చూసేరు సెక్రటరీ జనరల్ గారు

''ఈమధ్య ప్రతి కవిగాడూ తనకు తానే మహాకవి అనో, కవిరత్న అనో, కవి వజ్రం, కవి కిర్సనాయిల్, కవి పంచదార అనో బిరుదులు తగిలించుకుని అచ్చేయించుకుంటున్నారు గదాండీ! దాంతో మా ఆలిండియా మహాకవుల మహాసభలకు విలువలేకుండా పోయింది పైగా వీళ్ళంతా గ్రాంట్లుకోసం ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుమీద దాడులు మొదలెట్టటంతో గవర్నమెంటు హడలిపోయి ''ఇక్కడ మహాకవులకు, వారి మహాసభలకు గ్రాంట్లు ఇవ్వబడవు'' అని ఓ బోర్డుకూడా తగిలించేసింది. గ్రాంట్లు లేకుంటే మనం మహాసభలు జరపటం, సాహిత్యసేవ చేయటం ఎలా చెప్పండి? అసలే మా ఆవిడ, మా పెద్దమ్మాయి పెళ్ళి అర్జంటుగా చేసేయాలని రోజూ పోరుతూంది కూడానూ అందుకని గవర్నమెంటు బోర్డును తప్పించుకుని లోపలికి దూరి గ్రాంటుకొట్టుకు రావటం కోసం ఈసారి మహాకవుల మహాసభలకు బదులు బుడ్డకవుల మహాసభ లేర్పాటు చేస్తున్నాను'' అన్నా రాయన ఘనకార్యం చేస్తున్నవాడిలా

''మరి బుడ్డకవులంటే ఎవరండీ?''

''మన్లో మాట! బాలకవులు అంటే 'మొన్న నేగదయ్యా ఆలిండియా బాలల మహాసభలకు గ్రాంటిచ్చాం దానికి చాలామంది బాల కవులు కూడా వచ్చారు గదా! మళ్ళా ఈ మహాసభ లెందుకూ?' అనగలరు గవర్నమెంటులోని తలనెరిసిన రంధ్రాన్వేషులు. అందుకని గ్రామ్యభాషలో బుడ్డకవుల మహాసభలంటున్నాం అదీగాక మనం ప్రజలభాషనూ, మాండలికాల్నీ గౌరవిం

చాలి గదా!'' అన్నారాయన.

అని, "చూశారూ! మనందరికీ సరదాగా ఉండటంకోసం ఈసారి మన మహాసభలు కోటప్పకొండ మీద తిరణాల జరిగే మూడ్రోజులూ ఏర్పాటు చేశాం హైదరాబాద్‌లో కోటప్పకొండకు స్పెషల్‌గా రెండులారీలుకూడ ఏర్పాటు చేశాం లారీ ఛార్జీ చాలా చవక కోటప్పకొండ తిరణాల ఇలా చవగ్గా చూసివచ్చే ఛాన్సు మీకు మళ్ళీ దొరకదు కనుక తప్పకుండా రండేం!'' అన్నారాయన

నేను కోటప్పకొండ వెళ్తున్నానని తెలిసి, మా ఇంట్లో అంట్లుతోమే లచ్చమ్మా, దాని మొగుడు రిక్షా రంగన్న ఓ రోజు తెల్లారే నాదగ్గరికి డిప్యుటేషన్ వచ్చేరు వాళ్ళకు కొండలో ఏదో మొక్కుందట "బాబ్బాబు మీ బుడ్డకవుల లారీలో మమ్మల్ని కొండకు తీసుకుపోయి పుణ్యం కట్టుకోండీ! మా పుణ్యములో సగం మీకు ఫ్రీగా ఇచ్చేస్తాం బస్సుఛార్జీలు మేము పెట్టుకోలేం'' అని బ్రతిమాలేరు.

వాళ్ళపీడ పడలేక సెక్రటరీ జనరల్ గార్ని సలహా అడిగేను. ఆయన అమాంతము ఎగిరి వాటేసుకున్నారు "మీరు రావటమే గాక మరో ఇద్దర్ని కూడా తీసుకొస్తున్నారన్నమాట! దాందేముందీ, వాళ్ళిద్దర్నీ డెలిగేట్ల జాబితాలో చేర్చేదాము ఫీజు కట్టండి!'' అని ఫారాలిచ్చేడు

ఇచ్చి "మీరు గానీ మరో నలుగుర్ని డెలిగేట్లుగా చేర్పిస్తే మీకు డెలిగేట్ ఫీజులో కన్సెషన్ ఇస్తాం సుమండీ'' అని హామీకూడా ఇచ్చేరు.

మొత్తంమీద రెండులారీల నిండా బయల్దేరి కోటప్పకొండలో దేవస్థానం వారి తాటాకుల ధర్మసత్రంలో మకాం వేసేం.

ఆ మర్నాడు ఓ మాజీ మంత్రిగారు మా ఆలిండియా బుడ్డ రచయితల మహాసభలకు ప్రారంభోత్సవం చేసేరు మరో మాజీ పంచాయితీబోర్డు ఛైరుమేన్ అధ్యక్షత వహించేరు. ఓ మాజీ మ్యునిసిపల్ కౌన్సిలర్ సందేశాలు చదవేడు. ఓ కిరాణాదుకాణం ఓనరుగారు స్వయంగా సందేశం ఇచ్చారు ఆఖర్న ఎడ్యుకేషన్ డిపార్టుమెంటులో గ్రాంట్లఫైళ్ళు చూసే సెక్షన్ గుమాస్తాగారు "రచయితలు - బుడ్డరచయితలు - తారతమ్యపరిశీలన'' అని గంటన్నర సేపు మహోపన్యాసం చేసేరు మా బుడ్డ రచయితలంతా ఆ నిమిషాని కోసారి కరతాళధ్వనుల్తో ఆయన ఉపన్యాసాన్ని ఆస్వాదించేరు

ఆ మధ్యాహ్నం కోటప్పకొండ గుడి దగ్గర కొబ్బరికాయల కంట్రాక్టరుగా మూడు మేడలు కట్టించిన ఓ బుడ్డ సాహిత్యాభిమాని మా గౌరవార్థం విందు చేసేడు. "నేనూ మీలాగా ఒకప్పుడు కతలు, కవిత్తం గీకినవాణ్ణే! కానీ కొబ్బరికాయలు అంతకన్నా రుచికరమైన యాపారం అని తేల్చుకుని ఇక్కడ సెటిలయేను'' అని వినమ్రుడై పరిచయం చేసుకున్నాడాయన

ఆ తర్వాత పరస్పర పరిచయాల మొదలయ్యాయ్! "నన్ను పంచరత్నాల కవి అంటారు'' అంటూ ఓ శాలువగారు పరిచయం చేసుకున్నారు. "నేను ఇప్పటికి తొంభైయ్యారుగురి మీద పంచ

ఇంకా బ్రతికే ఉన్నారు'' అన్నా రాయన. మా హోస్టుగారు సగౌరవంగా ఆయనకో అరకిలో పంచదార బహూకరించేరు.

"నన్ను పండగలకవి అంటారు దీపావళికీ, సంక్రాంతికీ, పీర్ల పండక్కీ స్పెషల్ గా కవిత్వం రాసి, స్పెషల్ ఇష్యూల్లో మాత్రమే అచ్చేయిస్తాన్నేను" అని పరిచయం చేసుకున్నారింకో కవిగారు మా హోస్టుగారు సగౌరవంగా ఆయనకో లీటరు కిరసనాయిలు బుడ్డీ సమర్పించుకున్నారు

"నన్ను పీనుగులకవి అని గిట్టనివాళ్లు అంటారనుకోండి. నా అసలు పేరు నాకే గుర్తులేదు నెహ్రూగారు పోయినపుడు, నిజాం నవాబుగారి ఉంపుడుకత్తె పోయినపుడూ కూడా అందరికన్నా ముందుగ నేనే శోకగీతాలు రాసేను" అన్నాడింకో పెద్దమనిషి పరిచయం చేసుకుంటూ. మా హోస్టుగారు ఆయనకేం ఇవ్వాలో తెలీక గాబోలు సెక్రటరీ జనరల్ కేసి చూసేరు.

అలా అందరి పరిచయాలూ అయ్యాక మా లచ్చమ్మ, రంగన్నలవంతు వచ్చింది. వాళ్ళు వణికపోతూంటే ఓ బుడ్డకవిగారు "లేవరా! శ్రామికా! చెప్పరోరా నీ కవితా వైభవమ్మూ!'' అంటూ వాళ్ళను మరింత బెదరగొట్టేడు

లచ్చమ్మ వణికిపోతూ లేచి "నేనా! న్నేనా .! నేనాండీ! ఆ బాబుగారి ఇంట్లో అంట్లు తోమేదాన్నండీ'' అని నసిగింది హాలంతా చప్పట్లతో దద్దరిల్లి పోతూండగా సదరు టెంకాయల శ్రేష్టి పచు బహూకరించేరు. లచ్చమ్మ చాలా సంతోషించినట్లుంది. "ఆర్నెల్లదాకా అంట్లకాడ కొబ్బరిపీచుకు ఎతుక్కోనవసరంలేదు మామా!'' అని రంగన్న కేసి చూస్తూ మురిసిపోయింది

ఆరాత్రి మా గౌరవార్థం దేవస్థానం వాళ్ళు సంపూర్ణ మహాభాగవతం తోలు బొమ్మలాట ఏర్పాటుచేసేరు.

తర్వాత రోజూ తెల్లారే కాఫీలు త్రాగి ఓ గంటన్నర సాహిత్య చర్చలు జరుపుకుని సరదాగా తిరనాళ్ళలో తిరిగేము ఆ మూడురోజులూ "దీనినే ప్రజలతో కలసిపోయి ,వారిని అర్థంచేసికొనుట అంటారు'' అని వివరించేరు మా సెక్రటరీ జనరల్ గారు

ఆ విధంగా మేము ప్రజల్ని వారి తిరనాళ్ళనూ బాగా స్టడీచేసి చైతన్యవంతులమై నాలుగో రోజున ఎవరి గూళ్ళకు వాళ్ళం చేరాం.

నేను ఇంటికి చేరేసరికి మా ఆవిడ దినపత్రిక చేత్తో పుచ్చుకుని నా మీదకు యుద్ధానికి వచ్చింది.

"ఇదేం పనండీ! మీరు ఇన్నికథలు, కబుర్లూ రాశారుగదా! మరి ఆలిండియా బుడ్డరచయితల మహాసభకు హాజరయిన ప్రముఖుల జాబితాలో మీ పేరు ఎక్కడా లేదేమండీ! పైగా ఈ అన్యాయం ఏమిటో మాకండీ!'' అంటూ పత్రిక నా మొహాన్న కొట్టింది చూడమనుగదా

"ఈమహాసభలకు హాజరయినవారిలో ప్రముఖ రచయిత్రి లచ్చమ్మగారూ, యువకవి రంగన్నగారూకూడా కలరు'' అని ఉందా పత్రికలో. ★




రావు వాచీవంక చూసుకున్నాడు. ఆరుగంటలు! ఇంకా చీకటిపడలేదు. ఇలా వంటరిగా గదిలో కూర్చోవాలంటే రావుకు మహా''బోర్''గా ఉంది. పాడుబడ్డ ఆలోచనలు ఈగల్లా ముసిరి మనసు దాటిపోవడంలేదు! రావు ఆలోచనలు గీతగీసినట్లు ఎపుడూ ఒక పరిధిలోనే గిరికీలు కొడుతున్నాయి! ఆ వృత్తంలో ఎక్కువ భాగాన్ని...ఎక్కువేమిటి...దాదాపు మొత్తాన్ని రావు భార్యే ఆక్రమించేస్తుంది.

రావుభార్య చాలామందికంటే లావుగా చాలామందిలా నల్లగా ఉంటుంది. అపుడపుడు రావు అందుకే నాకు వేరే ఆలోచనలు రాకుండా పోతున్నాయని తనను తాను తృప్తిపరుచుకుంటాడు। రావుభార్య ఈమధ్య నల్లబడి, బాగా లావెక్కలేదు। రావు పెండ్లినాటికే అలా గుమ్మటంలా ఉంది। ఇప్పటికీ వృద్ధిచెందున్నదేగానీ ఏమాత్రం తగ్గడంలేదు।।

రావుకు తలనొప్పి కూడా మొద

లయింది।

ఇన్ని ఆలోచనలు ఇంత చికాకులో రావుకు అపుడపుడు ఆనందం లభించేది 'జయ' గుర్తుకు వచ్చినపుడు గమ్మత్తేమి టంటే ఈ సంతోషం. దాని వెనకనే దాన్నిమించిన బాధ వెంటవెంటనే కలుగు తాయి।

తాను జయను పెళ్ళి చేసుకున్నట్లయితే ఈ బాధంతా ఉండకపోను। అమ్మో ఈ ఆలోచన కూడా అంతగా రుచించ లేదు. జయను చేసుకుంటే. మూడంత స్థుల బంగళా రెండుకార్లు, నాలుగు ఫాక్ట రీలు నల్లటి భార్య. మచ్చల బొచ్చు కుక్కలూ, లెక్కకుమించిన నౌకర్లూ తనకు దక్కేవాళ్లుకారు।

కాని తాను జయను మోసంచేశాడు. ఈ ఆలోచన రావుకు చాలా సరదాగా ఉంటుంది నిజంగా తాను జయను మోసం చేయాలని చేయలేదు। పరిస్థితు లలాంటివి మరి। జయవాళ్ళు బాగా బీదవాళ్ళు కావడం రోగిష్టి తల్లి, ఒంటిరెక్క సంపాదన ఎదుగుతున్న తమ్ముళ్ళు వీళ్ళందరూ కలిసి కట్టుగా జయను మోసంచేశారు తప్ప తానుకాదు కానేకాదు।।

పూర్ ఫెలో । ఇపుడు జయ కనిపిస్తే బావుండు ఓ అనాకారి మొగుడితో ప్రక్కన అయిదుగురు పిల్లల్తో దరిద్రంతో తనని చూసి కళ్ళు దించుకుంటుంది. తానయితే 'అలాంటపుడు కొంత ఎకనామికల్ హెల్ప్' చేయగలడు. ఇంకాజయ అప్పటిలా అందంగా ఉంటే చూసి పాతస్మృతులు... జయ ఒంటి వెచ్చదనం ఒంపులు గుర్తుకు తెచ్చుకుని గర్వపడతాడు. ఛీ ఛీ తన పిచ్చి గానీ, జయ ఇపుడు తాను గుర్తుపట్టే స్థితిలో కూడా ఉండదు

*　　*　　*

రావు 'జానీవాకర్' ఓపెన్ చేశాడు. సోడా కలుపుకుని తాగాడు దాదాపు సగం బాటిలు లాగేశాడు। చిప్సు నమిలాడు. సిగ రెట్లు కాల్చాడు అయినా ఆలోచనలు రావు మనసును వదలడంలేదు।

తలుపు తెరుచుకుని రూంబాయ్ వచ్చాడు।

'సార్ ఏమైనా కావాలా।'

ఆఁ "ఏమైనా" కావాలి

"సరే సార్ ।" రూంబాయ్ అర్థ మయినట్లు వెధవనవ్వు నవ్వి, తలుపుమూసి బయటకు వెళ్ళిపోయాడు।

*　　*　　*

ఆలోచనలు, పాడు ఆలోచనలు ఆపుదా మంటే ఆగవు। ఆలోచనల్తోపాటు భార్య గుర్తుకువస్తుంది। "దట్ డర్టీబిచ్ హాంట్స్ ఆల్ వేజ్। ఛీ భార్య గుర్తుకువస్తే శరీ రంలో రక్తం సగం ఇంకిపోతుంది దాని డబ్బు తప్ప తానేమీ అనుభవించలేదు। అనుభవించడానికి దానిదగ్గిర నల్లటిరంగు రబ్బరు బెలూనులాంటి ఒళ్లుతప్ప ఏమీ లేదు। దాని మాటలు మహా కర్కశంగా ఉంటాయి। తన మచ్చల బొచ్చుకుక్క లతో మాటాడినట్లు తనతో మాట్లాడు తుంది। తనకు కోపంవస్తుంది కానీ ఏమీ అనలేడు। అనడానికి తనకు భయం। దాన్ని చూసికాదు. దానికి దాని తండ్రి ఇచ్చి పోయిన బోలెడంత డబ్బును అనుభవించ కుండా పోతానే అన్న ఆలోచనవల్ల

అబ్బ డర్టీ థింకింగ్ ఒకటే ఆలోచ నలు ఈగలు ।

*　*　*

విస్కీ_సీసా పూర్తయింది. జీడిపప్పు పూర్తయింది. రావు తలంతా దిమ్మగా ఉంది నిదానంగా స్టడీగా సిగరెట్టు తాగుతూ కూర్చున్నాడు. అన్ని ఆలోచ నలూ కలిసిపోయి, సాలెగూడులా అల్లుకు పోయి, కలగా పులగం అయిపోవడంవల్ల బ్రతికిపోయాడు రావు। ఇపుడాలోచనలు లేకకాదు। ఆలోచించే ఓపిక తగ్గిపోయింది।

గది తలుపులు తెరుచుకుని 'బోయ్' లోపలికి వచ్చాడు. వాడివెంట సెంటు వాసనా, ఆమె కూడా లోపలికి వచ్చాయి।

''తలుపేసుకోండి సార్ నేను వెళ తున్నా।'' రూంబాయ్ బయటకు పోయాడు ఆమె నవ్వుతూ తలుపు మూసింది. రావు కళ్లు పైకెత్తి ఆమెను చూశాడు। తల విది లించాడు రెప్పలు తాటించాడు। ఆల్‌రైట్। ఆమె జయే।। సందేహంలేదు కరక్టు।।

రావులో లేని ఓపికా ఉత్సాహం ఆటో మేటిక్‌గా వచ్చేశాయి పరీక్షించి చూశాడు।

జయ అప్పటికన్నా ఇపుడింకా అం దంగా ఉంది. కొంచెం ఒళ్లుచేసింది. రంగు ఇంప్రూవయ్యింది. నవ్వు పెంచు కొంది కళ్లు ఖళ ఖలంగా, లేడికళ్లలా బెదిరి చూస్తున్నాయి। పచ్చని సిల్కు_చీరె గులాబీరంగు స్లీవ్‌లెస్ బ్లౌజు వేసుకుంది. మెడలో పొడవైన తెల్లని ముత్యాలదండ, గులాబీ రేకుల్లాంటి పెదిమలు, పైకి మడిచిన కొప్పులో రెండు గులాబీలు।

''జయా ఎన్నాళ్లకు '' రావు లేచి తప్పటడుగు వేశాడు।

''నాపేరు జయకాదు లక్ష్మి।'' చేపపిల్ల నోరులాంటి ' నోరువిప్పి గవ్వలు కుప్ప పోసినట్లు గలగల నవ్వింది।

''నో నువ్వు జయవు. అబద్ధమాడకు నామీద నీకింకా కోపం పోలేదని అర్థ మయింది. పూర్ జయా। '

ఆమె మౌనంగా వింటూ బెడ్‌మీద కాళ్ళు ముడుచుకుని కూర్చుంది।

'' నేను రోగ్‌ని। ఇడియట్‌ని కాని జయా. ఏమిటిది, ఇలా అయిపోయావేం? మన ప్రేమ ''డిస్ట్రబ్'' అయినంత మాత్రాన ఏమిటిది ।''

''గడవక'' ఆమె నెమ్మదిగా అంది।

''నాన్సెన్స్ పెళ్ళయితే చేసుకోలేక పోయానుగానీ, ''హెల్ప్'' చేయనను కున్నావా? కమాన్. నువ్వెంత కావా లంటే అంత డబ్బుతీసుకో అసలెందు కిలా అయింది।'' రావు ఆమెను సమీ పించి వంగి ముద్దుపెట్టుకున్నాడు।

''మీ అమ్మ ఏమయింది?''

''చచ్చిపోయింది।''

''నాన్న।''

''నాన్నకూడా।'.

''ఊఁ''

''ఆ దినం మీరు అవునంటే నాగతి ఇలా ఉండేది కాదు।''

రావు నెవరో కొరడాతో కొట్టినట్ల యింది నిజమే। ఆ దినం తాను జయను చేసుకుంటే, తన స్థితికూడా ఇలా ఉండక పోయేది. నిజమే!।

ఆమె వళ్లో తలపెట్టుకుని, పైకి కళ్ళ

మనసు స్వీటు—మనిషి సీటు
అందమైన యాక్షన్‌లో అతనిదొక
స్పెషల్ రూటు
పాత్రల సెలక్షన్-చిత్రాలలో రిచ్‌నెస్
అతను తీసుకునే మంచి నిర్ణయాలకు
విట్‌నెస్
పరిశ్రమకు ఫ్యూచర్ హోప్ శోభన్
అంటూ చెప్పాడు మరో మహానటుడు
ఇతన్నిగురించి తన ఇంప్రెషన్.



ల్లోకి చూస్తూ మాట్లాడుతున్నాడు రావు।

"నిజం జయా। ఆ రోజుల్లో డబ్బుకు ప్రపంచంలో సరితూగ గలదేదీ కనిపించ లేదు నిజం అందుకే నిన్నుకాదన్నాను నీలో పెరిగే నా రూపంకూడా నా కపుడు ప్రేమగా తోచలేదు"

జయ పెదవులమీద శుష్కమందహాసం ఒకటి మెరిసి మాయమయింది రావు అర్థం చేసుకున్నాడు। జయ రావు తలలోకి తెల్లటి పొడవైన వేళ్ళు పోనిచ్చి నిమురుతుంది.

"కాని డియర్. అప్పట్లో నేను నథింగ్। కరేజ్‌లెస్, నెర్వ్‌లెస్. నో మోర్ డియర్ జయా? నువు నాకు కావాలి చెప్పు. ఎప్పటికీ నన్ను విడిచి పోకుండా నాతోనే ఉంటావు గదూ।"

జయ రావు మీదికి వంగిరావును కిక్కిరి బిక్కిరి చేసింది.

* * *

తన చేతిలో పాలరాతి బొమ్మ. వీనస్. గులాబీ. అన్నీ కలిసిపోయి రూపు దాల్చిన సుందర రూపం। మనసులో మళ్ళీ ఆలోచనలు వర్షాకాలం మురికి కారుతున్న బెల్లం మీద గుంపుగా ముసిరిన, ఇంకా మురికి ఈగల్లాంటి ఆలోచనలు। ఇవి తనను వదలను చచ్చేదాకా తన నల్లటి భార్య. బెలూనులాంటి భార్య వదలనిట్లే వదలవు గాక వదలవు

ఇప్పటికే జీవితంలో తాను చాలా కోల్పోయాడు. ఏదైతే ఆనందమనీ సుఖమనీ అనుకున్నాడో అదంతా సుఖాభాసమనీ మిథ్యనీ తేలిపోయింది.

ఇంతకాలం తాను త్త వెధవ బ్రతుకు బ్రతికాడు. ఇలాంటి పసిడి బొమ్మను వదిలి నరకంలో మగ్గిపోయాడు. డబ్బు కోసం, కారుకోసం బెలూనుకోసం కుక్క కోసం, నీచంగా బ్రతికాడు। డామిట్।। జయను వదిలేయడం తాను చేసిన పొరపాటు. ఇంక తాను వదలడుగాక వదలడు ప్రపంచంలో ఏది లేకున్నా తనకు జయ కావాలి।

రావు ఆలోచిస్తూనే చేయి కదిలించాడు. సముద్రపు నురుగులాంటి,నీలిమేఘాల్లాంటి

తలవెంట్రుకలు, క్రింద అరమోడ్చిన కనులు, గ్రీకు శిల్పాల్లో కనిపించే ముక్కు తగిలాయి?

ఆలోచనలు ముసురుకుంటూనే ఉన్నాయి।

రావు ఒక నిశ్చయానికి వస్తూనే ఉన్నాడు ఆ నిశ్చయం వెనక దాగి ఉన్న ప్రతి బంధకాలను ఏ మాత్రం లెఖ్ఖ చేయ దలుచుకోలేదు।

జయ తనక్కావాలి। ఇంకేం లేకున్నా ఫర్వాలేదు. అయితే మరి. ఛత్. మళ్ళీ వెధవ ఆలోచనలు।

*　　*　　*

"జయా।"

"ఊఁ"

"ఎప్పటికీ నాతో ఇలాగే ఉండి పోతావా?"

"అమ్మో।"

"ఏం। ఒకపుడు నువు అడిగితే నేను కాదన్నాను. అందుకా ఇపుడు నేనడిగితే నువు కాదంటున్నావు'"

"అది కాదు పరిస్థితులు।"

"ఐ డోంట్ కేర్। పరిస్థితులనులెక్క చేయనంత ధైర్యం నా కొచ్చేసింది." రావు మాటలు ముద్దగా వస్తున్నాయి।

"రావు ఇపుడు నీకు పెళ్ళయింది।"

"ఆ డాంబిచ్ గురించి గుర్తుచేయక। నువు నాక్కావాలి।"

"దానికి పెళ్ళి దాకా ఎందుకు? నువెపుడు కావాలంటే అపుడు నీ కోసం వస్తానుగా।"

"నో. నాకు నువు పూర్తిగా కావాలి. బాగా ఆలోచించుకో రేపటి దాకా గడువు। నీ కెంత డబ్బు కావాలో ఇపుడు తీసుకెళ్లు। బాకీలు, అప్పులు తీర్చెయ్. దట్సాల్।"

జయ రావు ఛాతీమీద తలాంచి వింటూ పడుకుంది సమయం గడిచి పోతుంది. జయ లేచింది।

"జయా డోంట్ బాదర్. ఆ పర్సులో డబ్బుంది. తీసుకో। నువు నాక్కావాలి "డోంట్ కేర్।" మంచం మీదనుండి గొణుగుతున్నాడు. జయ పర్సులోనుండి నోట్ల దొంతర తీసుకుంది తలుపు తెరుచుకుని నెమ్మదిగా బయటకు పోయింది.

*　　*　　*

"నేపోతున్నా।"

"అపుడే।" రూంబాయి అడిగాడు

"అదంతేలే।।"

""ఎంతిచ్చాడేమిటి?"

"ఉత్త పిచ్చోడు. ఇదుగో। అయిదొందలు లాగాను' నన్నూరికే "జయా" "జయా" అని పిలుస్తున్నాడు మందులో మనుషుల ఆనవాలు సరిగా దొరక లేదేమో. ఎవర్తో ఆ జయగానీ మానవుడ్ని భలే దెబ్బతీసింది. దాన్ని గురించే కలవరింతలు హహ్హహ్హా।" పాల రాతి బొమ్మ ముక్కలు చెక్కలయినట్లు నవ్వింది. రూంబోయి కూడా నవ్వాడు. ఆమె రూంబాయికి కొంత డబ్బుయిచ్చింది

"బయట రిక్షా ఉంది. పోతావా?"

"ఛీ ఇవాళ టాక్సీ పిలువ్।"

"మళ్ళీ రేపొస్తావా?"

"ఈయన దగ్గరకా? ఏమో। ఇంకేదయినా మంచి బేరం ఉంటే వీలుపడదు। వస్తారా।"




ఆమె వెళ్ళిపోయింది—

*　*　*

రావుకి తెల్లవారు ఝామున మెలకువ వచ్చింది—

మెలుకువ తోపాటు ఆలోచనలు. తల పగిలిపోయే ఆలోచనలు. రావు ఆ ఆలోచనల్తో కంపించి పోయాడు! తానెంత ఇడియట్. రోగ్ కాకపోతే రాత్రి తాను వాగిందేమిటి? ఒక్కో విషయం గుర్తుకు వస్తుంటే అంత పొద్దున్నే రావుకు చెమట పట్టేయడం మొదలయింది.

ఇంకా నయం!

జయ తన మాటలన్నింటికీ ఒప్పుకుని తనతోనే ఉంటానంటే పెద్ద గొడవే అయిపోను! గొడవే అయితే—

భార్య, కార్లు మేడ, బొచ్చుకుక్కలు నౌకర్లు ఫాక్టరీలు, స్టేటస్ బెలూను ఇదంతా ఏమయిపోయేట్ట??

★

## 'శ్రీరామరక్ష - సర్వజగద్రక్ష'

ఇహ పర సాధనకు మార్గదర్శి యైన ఈ దివ్యనామ ఫలకములను విశ్వవ్యాప్తముగా ఇంట ఇంట నలంకరించుకొని ప్రజాశ్రేయస్సుకు ప్రపంచశాంతికి తోడ్పడ ప్రార్థన.

ఇట్లు,
శ్రీరామరక్షా పున్నారావు,
గూడూరు (నెల్లూరుజిల్లా.)

మినీ నవల



# తరాలు అంతరాలు

(ప్రణవి)

"సంతోష్‌బాబుకి యీ రోజుతో యిరవైఆరేళ్ళు నిండాయి మీ అందరూ వాడిని ఆశీర్వదించాలి!" శకుంతలమ్మ కళ్ళు చెమర్చాయి ప్లేట్‌లోని స్వీట్‌ని తీసుకొని, కరిణం అన్నయ్య భార్య శ్రీదేవి నోటికందించింది

"కాబోయే అత్తగారివి! ముందు నువ్వే నీ అల్లుడిని ఆశీర్వదించాలి వదినా!"

శ్రీదేవి సంతోషంగా లేచింది. నోటినిండా స్వీట్ వుంది. "మా అమ్మాయీ, సంతోష్‌బాబూ దంపతులై, దొరబాబులాంటి పిల్లల్ని కని, కళకళలాడుతూ నూరేళ్ళు వర్ధిల్లాలి!" అని, కూతురు సీతాకుమారి తల నిమిరి, ముచ్చటగా మెటికలు విరిచింది.

దాదాపుగా అంతా యీ రకంగానే దీవించారు.

శకుంతలమ్మ సంతోష్‌బాబుకి లోగడ జాబు రాసింది. తప్పనిసరిగా పుట్టిన రోజు పండుగకి రమ్మంది కానీ యెందుకో సంతోష్ రాలేదు. అతని యిరవై ఆరేళ్ళ జీవితంలో తల్లిమాట జవదాటడం యిదే ప్రథమం. 'వాడికేం యిబ్బందులొచ్చాయో? ఒకవేళ ఆఫీసులో సెలవు దొరకలేదేమో?' అనుకొని సర్దుకుంది. అయినా మనస్సుకు స్థిమితం కలగలేదు 'వాడే ఆఫీసరు. వాడికి సెలవు దొరకకపోవడమేమిటీ?'

“శకుంతలా! ఆలస్యమైపోయిందే! యేవో బయట రక రకాలపన్లు!” కరణం గారు రొప్పుకుంటూ వచ్చాడు.

“ఫర్వాలేదు, రా అన్నయ్యా! ఇలా కూర్చో!” పలహారాల ప్లేటు అందించింది.

“ఓహోఁ బహుకమ్మగా వున్నాయి! యేఁవేఁవ్! దేవీ! చూశావులే మా చెల్లెమ్మ వంటకాలు?” భార్యని కుదిపాడు. శ్రీదేవి మూతిముడుచుకుంది.

“అన్నట్టు, చెల్లెమ్మా! మనవాడు రాలేదుకదూ?”

“లేదన్నయ్యా!”

“వాడు పెద్ద ఆఫీసర్ కదులే! యెలా తీరుతుంది? ఆఫ్టరాల్ విలేజీ కరణాన్ని నేను. నాకే తీరదు! సరేలే! అసలు విషయానికొద్దాం! కలకత్తానించి మీరు యీ వూరికి వచ్చిన నాలుగేళ్ళు నుండీ సంతోష్‌బాబు పుట్టినరోజు పండుగను ఆనందంగా చేసుకుంటున్నాము. ఇలాగే సంతోష్‌బాబు యెక్కడున్నా నూరుపండుగలు చేసుకొని, తన పిల్లలకి పండుగలుచేసి సంతోషమైన జీవితం గడపాలని, మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తున్నాను”అని, ప్లేటుని పక్కనుంచి తానే చప్పట్లు చరచ నారంభించాడు అది చూచి, మిగతా జనంకూడా చప్పట్లు చరిచారు

మొత్తానికి సంతోష్‌బాబు లేకుండానే, అతని పుట్టినరోజు పండుగ జయప్రదంగా జరిగింది

అంతా వెళ్ళిపోయారు శకుంతలమ్మ దేవునిగదిలోకి వెళ్ళింది ఆమెకెందుకో భయంగా వుంది సంతోష్‌ని కాపాడమని, యే ఆపదా రాకుండా చూడమని వేడుకుంది

ఆ రాత్రికి భోజనం సహించలేదు. అయినా బలవంతాన సంతోష్ పుట్టిన రోజు కనుక, అతని కిష్టమని చేసిన వంటకాలతో ఎంగిలిపడి లేచింది

కానీ, యెంతకూ నిద్రపట్టలేదు. సంతోష్ యెలా వున్నాడో? ఇంతవరకూ యెప్పుడూ తనమాట మీరలేదు. కానీ, ఇప్పుడెందుకు ఆగాడు. ఒకవేళ, తనను యెదిరించడుకదా? వాడికి భయ-భక్తులు చెప్పేవాళ్ళెవరున్నారు గనుక? తండ్రీ-తల్లీ తానై, గారంగా పెంచింది. తోడబుట్టిన అన్నయ్య, ‘డాక్టర్ శ్రీకాంత్’ వద్దకూడా వాడికి గారాబమే! తనని యెదిరిస్తే ఇంకేమైనావుందా? వాడికోసం ఎన్ని కష్టాలు పడింది? ఎన్ని అవమానాలకు గురైంది?

శకుంతలమ్మ మనసు పరిపరివిధాల ఆలోచించసాగింది. అలా-అలా ఆలోచనలు తన చిన్ననాటి రోజులకు సాగాయి.

బొమ్మలపెళ్ళి చెయ్యడం చాలా ఇష్టమైన ఆట తనకు. బడికి సెలవులిస్తే, రోజూ బొమ్మలపెళ్ళి చేసేది.

ఆరోజు బొమ్మలపెళ్ళి చాలా ఘనంగా చేయాలని, చాలా బొమ్మలు ప్రోగు

చిన్న పందిరికూడా వేసింది. తాను పెళ్ళికూతురుకి అమ్మ. మరో స్నేహితురాలు పెళ్ళికొడుకు తల్లి

ఇలా ఇరుపక్షాలుగా స్నేహితురాళ్ళు మారి, 'పెళ్ళి చేశారు. సూత్రధారణ అయ్యాక, ఊరేగింపు ప్రారంభించారు కొంచెందూరం వెళ్ళాక, పల్లకీనుండి పెళ్లి కొడుకు కిందపడ్డాడు. పడగానే ఆ బొమ్మ ముక్కలైపోయింది మిగతా పిల్లలంతా "అయ్యో పెళ్ళికొడుకు చనిపోయాడే!" అని బాధపడ్డారు. కానీ, తానేమాత్రం చలించలేదు అప్పటికే తన వయస్సు యెనిమిది సంవత్సరాలే అయినా, మిగతా వారిలాబాధపడలేదు. "పోనీండే! పోతేపోయాడు. అంతకన్నా మంచివాడ్ని తెచ్చి, పెళ్ళిచేద్దాం! తిప్పండి ఊరేగింపు!" అంటూ వూరేగింపుని మళ్ళించి, మళ్ళీ ఇంకో మంచి మగబొమ్మనితీసి, పెళ్ళికూతురు పక్కన కూర్చోబెట్టి తాళి కట్టించింది. భజంత్రీలు మంగళ వాద్యాలు వాయించారు

అంతలో ఇంట్లోనించి పెద్దగా ఏవో గావుకేకలు వినిపించాయి అంతా ఓక్షణం నిశితంగా విన్నారు సందేహంలేదు అది తప్పకుండా తన అమ్మగొంతే! ఎందుకో పెద్దపెట్టున యేడుస్తూంది? ఆట విడిచి ఇంటివైపు పరుగుపెట్టింది. స్నేహితురాళ్ళుకూడా అనుసరించారు.

అమ్మ తల బాదుకొంటూ, ఏవో అంటూ, పిచ్చిగా ఏడుస్తుంది తనని చూడగానే గట్టిగా కౌగిలించుకొని, మరీ మరీ ఏడ్చింది అప్పుడే నాన్న, ఇంకెవరో వచ్చారు అంతా కన్నీళ్ళు పెట్టుకున్నారు ఇరుగు-పొరుగు వాళ్లొచ్చారు అమ్మని నాన్నని ఓదార్చారు ఏవో సానుభూతి వాక్యాలు పలికి వెళ్ళారు.

దాని ఫలితం కొద్దిరోజుల్లోనే బయటపడింది. తనకు భర్తవియోగం సంభవించిందట! తన నొసట బొట్టు చెరిపారు. అన్నయ్య ప్రేమతో తెచ్చిన కలకత్తా గాజులు చిట్లకొట్టారు. ఇంకా, అనేక రకాల భూలోక నరకాన్ని చూపించారు.


ఎంత అన్యాయం? బొమ్మల పెళ్ళిళ్ళు చేసే తనకా యీ దురదృష్టం? నిజానికి తనకు పెళ్లెప్పుడు జరిగిందోకూడా తెలీదు తన భర్త ముఖం తనకు తెలీదు. కానీ, ఈతలాడుతూ, చెరువులో మునిగి చచ్చిపోయిన పేరిశాస్త్రివల్ల తనకీ అన్యాయం జరిగింది.

అప్పటినుండీ, తనను మిగతా పిల్లలతో కలిసి ఆడుకోనివ్వలేదు. ఇష్టమైన బట్టలుగానీ, నచ్చిన కూరలుగానీ వేసుకోనివ్వలేదు. తన తల్లిదండ్రులే తనని వంచించారు. అన్యాయంగా వైధవ్యం అంటగట్టారు. అలా కొన్ని సంవత్సరాలు యేడుస్తు గడిపింది.

తనతోటి స్నేహితురాళ్ళు ముచ్చటగా పెళ్ళిళ్ళు చేసుకొని, భర్తలవెంట కొత్త కాపురాలకు వెళ్ళిపోతూన్నారు. కానీ, తన విషయం యెవ్వరూ పట్టించుకోడంలేదు.

మద్రాసులో డాక్టర్ కోర్స్ పూర్తిచేసిన అన్నయ్య స్కాలర్‌షిప్‌తో

# పెద్దల నీడన ప్రత్యర్థుల కలయిక !



స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన పాత్ర వహించిన ముగ్గురు జాతీయ నాయకుల చిత్రపటం నీడన, స్వాతంత్ర్యానంతరం మారిన రాజకీయ పరిస్థితిలో ప్రత్యర్థులుగా మారిన ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి, మాజీ ఉపప్రధాని శ్రీ మొరార్జీదేశాయ్ కలుసుకొన్న సన్నివేశం. కీ॥ శే॥ వల్లభాయిపటేల్ 99 వ పుట్టిన రోజు సందర్భంగా ఢిల్లీలో ఏర్పాటైన సభ సందర్భంగా తీసిన చిత్రమిది. ఫోటోలో పార్లమెంటు స్పీకర్ ధిల్లాన్ కూడా ఉన్నారు

---

అమెరికా పై చదువులకోసం వెళ్తానన్నాడు కానీ సముద్రాలు దాటి వెళ్ళడానికి వీల్లేదని మూర్ఖించి కూర్చున్నారు తల్లిదండ్రులు.

అదే సమయానికి, దూరపు బంధువైన ఒకాయన తన కూతుర్ని వెంటబెట్టుకొని, సారె గంపలతో వచ్చాడు ఆవిడ తనకు వదినట. తనకూ, తన అన్నకూ, బాల్యంలోనే పెళ్ళిచేశారట అన్నయ్యా చదువు పూర్తి అయ్యిందని, కూతుర్ని కాపురానికి తీసుకొచ్చాడు.

కానీ, అన్నయ్యా ఒప్పుకోలేదు. తాను అమెరికా వెళ్ళదలచానని, అందుకు ఇష్టమైతే, తనతో అమెరికాకు కాపురానికి పంపమని అడిగాడు పెద్దలంతా తర్జన

భర్జనలుపడి, చివరికి అన్నయ్య-వదినలను అమెరికాకు పంపారు

అన్నయ్య అనుకున్నది సాధించాడు అందుకు తనకు చాలా సంతోషమైంది! వారు వెళ్లేముందు, తనని మర్చిపోవద్దని ద్వంద్వంగా పలికింది.

మరో రెండేళ్ళు గడిచాయి స్నేహితురాళ్ళు ఒక్కొక్కరే తిరిగి పుట్టిళ్ళకు రావడం, పురుళ్ళు పోసుకొని, పండంటి పసిబిడ్డలతో తిరిగి వెళ్ళడం తనకెంతో ముచ్చట అనిపించింది. అంతేకాదు! గుండెల్లో ఏదో కోరిక! మనస్సులో ముద్దులొలికే మమత! నరాల్లో, 'అమ్మా' అనిపించుకొని, హాయిగా హృదయానికి చేతులతో హత్తుకోవాలనే తపన!

ఉండబట్టలేక ఓ రోజు తల్లినడిగింది, పెళ్ళిచేసుకుంటానని! ఆ మాటకు తన చెంప ఛెళ్ళుమంది. భూమి గిరగిరా తిరిగినట్లయింది కళ్ళుతిరిగి నేలకొరిగింది. కొంత సేపటికి ముఖాన నీరు చల్లారు. తెలివివచ్చి కళ్ళు తెరిచింది. ఎదురుగా రౌద్రమూర్తిలా నాన్న నిల్చున్నాడు.

"దురదృష్టవంతురాలివే నువ్వు! ఒకసారి తాడు తెగిందానివే! ఇక ఆ యోగం లేదు నీకు! మళ్ళీ ఇలాంటి వెర్రి-మొర్రి ఆలోచనలు పెట్టుకుంటే, యీ స్థానంకూడా కోల్పోతావు!" బరబరా లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ రోజు కన్నీరు-మున్నీరుగా యేడ్చింది తాను. 'ఒకసారి తాడు తెగినద'ట తాను! యెంత మోసం! యెంత అన్యాయం! 'కట్నమిచ్చి పెళ్ళిచేయాలని యీ దొంగ నాటకం!' అనుకుంది.

యెంత కాదనుకున్నా తన కోరిక తనను విడిచిపెట్టడంలేదు యేం చేయాలి? తన తప్పేమిటి? మిగతావారిలా తాను పుట్టలేదా, పెరగలేదా? అందంలేదా, వయస్సులేదా? తనకెందుకీ శిక్ష? యేదైనాసరే! తానుకూడా తల్లికావాలి! 'అమ్మా' అనిపించుకోవాలి!

మరో సంవత్సరం గడిచింది తనకంటె చిన్నవారు కూడా పుట్టింటికొచ్చి, పురుడు పోసుకున్నారు. ప్రేమతో ఓ పసికందును చేతుల్లోకి తీసుకోబోయింది. వెంటనే ఆ పిల్ల తల్లి, తనను దూరంగా నెట్టింది. "నా బిడ్డని తాకకు!" ఆ మాటతో తన నవనాడులు క్రుంగినట్లయ్యింది. "అసలే నీ జాతకం మంచిదికాదు! నువ్వింటి కెళ్ళి వోమూల కూర్చోరాదు!" అని, ఆమె తల్లికూడా తనని మందలించింది.

వక్క పరుగున యింటికొచ్చి, యేడుస్తూ పడుకుంది. తల్లి భోజనానికి పిలిచినా వెళ్ళలేదు. ఆ బాధని మనస్సులో వుంచుకోలేక, తల్లితో చెప్పింది. ఆమె వోదార్చింది. వెంటనే తనకో 'బాబు' కావాలని అమ్మతో అంది.

ఆ విషయం తండ్రివరకూ వెళ్ళింది. ఆయన సాంప్రదాయకుడైన పిల్లవాడిని దత్తుచేయడానికి ప్రయత్నించసాగాడు. కానీ, అందుకు తానంగీకరించలేదు. 'ఎవరికో పుట్టిన బిడ్డని తానెందుకు ముట్టుకోవాలి? వీల్లేదు! అందరిలా తన గర్భంలో పెరిగిన బిడ్డనే కని, పెంచుకోవాలి! ఆ బిడ్డ తన రక్తంలో పాలుపంచుకోవాలి!'

అతనికి తానే అమ్మకావాలి! ఈ వుద్దేశ్యాన్ని ధైర్యంగా తల్లి-దండ్రులతో చెప్పింది.

తనను కొవ్వెక్కిందని; కండకావరమని; మదపిచ్చని, ఇలా రక - రకాల పేర్లతో తిట్టారు. తల్లి-తండ్రి చీపురు, చాంతాడు, చెప్పులతో కొట్టారు. చివరికి పెరటిలోని వేపచెట్టుకి కట్టి, కర్రుకాల్చి కాళ్ళమీద వాతలు పెట్టారు. తీసుకెళ్ళి పిచ్చాసుపత్రిలో చేర్చాలని నిశ్చయించారు.

సరిగ్గా అదేసమయానికి దేవదూతల్లా అన్నయ్య-వదిన వచ్చారు, అమెరికా నుండి. తనకి బంధవిముక్తి కలిగించారు.

కానీ, అన్నయ్య-వదినకి భోజనం వేరు. వారు వేరేగదిలో, ఇస్తరాకుల్లో విడిగా భోజనం చేయాల్సొచ్చింది. వారు సాంప్రదాయాన్ని అతిక్రమించారని ఈ ఏర్పాటు.

ఒకరకంగా అది తనకు మంచి అవకాశాన్ని కలిగించింది. అన్నయ్య-వదినలతో మనసువిప్పి మాట్లాడింది. తనకు జరిగిన అన్యాయం, అవమానం, అన్నీ పూసగుచ్చినట్లు చెప్పింది. మనిషిగా తనకున్న కనీస కోర్కెల్ని కూడా వివరించింది.

చదువు-సంస్కారం వాళ్ళను తనకు సన్నిహితులుగా చేసింది. వదిన జాలి పడింది. అన్నయ్య బాధపడ్డాడు. "ఇక్కడుంటే నిన్ను నిజంగానే పిచ్చాసుపత్రిలో చేర్చుతారు. మాతో తీసుకెళతాను. భయపడకు!" అన్నాడు అన్నయ్య.

అన్నయ్య తన నిర్ణయాన్ని చెప్పగానే, అమ్మా-నాన్న ఆనందంగా అంగీకరించారు. అన్నయ్యకు ఇదివరలో అడ్డంవచ్చిన ఆచారాలు, తన విషయంలో ఆటంక పరచలేదు కాబోలు! గుండెలమీదనుండి బరువు దింపినట్లు భావించి, సంతోషంగా వీడ్కోలిచ్చారు. కనీసం, ఓ జాబైనా వ్రాయమని తన నడగలేదు.

అంతా చికాగో వెళ్ళాము. అంతకుముందువరకూ కూపస్థమండూకంలావున్న తనకి, యీ విశాల ప్రపంచంలో అధునాతన పట్టణాలు, ప్రయాణాలు, మనుషులు మరీ వింతగా తోచింది. జీవితంమీద ఆశ పెరిగింది. తనకూ ఓ కొడుకుపుట్టి, గొప్ప వ్యక్తిగామారి, దేశ-దేశాంతరాలు విమానాలమీద, స్టీమర్లమీద, తిరుగుతూ, ప్రపంచంలో పురోగమిస్తూన్న వింతలను విజ్ఞానాన్ని పరిశీలిస్తూంటే తనకెంత తృప్తిగా వుంటుంది!

మరోసారి అన్నయ్యకి తన ఆంతర్యం గుర్తుచేసింది. అన్నయ్య-వదిన తీవ్రంగా ఆలోచించారు. "ప్రపంచంలో మన అమ్మ-నాన్నలకు తెలీని సాంఘిక మార్పులు ఎన్నో వున్నాయి సక్కూ! వాళ్ళకెలా నచ్చచెప్పాలో నాకర్థంకావడంలేదు! మామూలుగా ఓ మనిషికి ఉండవలసిన సహజమైన కోర్కెను నువ్వు కోరుకున్నావు. దానిని యెలా కాదనను? నీ కోరిక తీరడానికి, నాకు నువ్వొక మాటివ్వాలి! .." అన్నయ్య అడిగాడు.

ఆ మాటకు తన దేహం పులకించిపోయింది. ఆనందం పుప్పొంగింది. 'అంటే...? అన్నయ్య తన కోర్కె నెరవేరే అవకాశం కల్పించబోతూన్నాడన్న మాట!...'

"నా ప్రాణమైనా అర్పిస్తానన్నయ్యా! నేను అమ్మనైతే చాలు!" తన కళ్ళనుండి ఆనందబాష్పాలు జల-జలా రాలాయి

"పిచ్చి సఖ్యా" అన్నయ్య భుజాన తట్టాడు. "ప్రాణమివ్వక్కర్లేదు. అంతకంటే ముఖ్యమైనది, అంతకంటే కష్టమైనది నే నడిగేది! . ఆలోచించి, చెప్పు!"

"నా జన్మ ధన్యం కావడానికి యెంతకష్టమైనా పర్వాలేదన్నయ్యా!" తన చేతిని అన్నయ్య చేతనుంచి, వాగ్దానం చేసినట్లు గట్టిగా నొక్కింది.

శకుంతలమ్మ ఆలోచనలకి అంతరాయం కలిగింది. వంటింట్లో పిల్లి యేవో గిన్నెలు పడవేసింది.

లేచి వడి-వడిగా వెళ్ళి చూసింది. బాబుకోసం చేసిన వంటకాలని పడవేసి, పిల్లి తింటూంది. పిల్లిని తోలి, మళ్ళీ అన్నీ సర్ది, తన గదికి వచ్చింది, 'యెవ్వరకు ఎంత ప్రాప్తికల్గిన ..' అనుకుంటూ.

'యెన్ని కష్టాలు, యెన్ని అవమానాలు పడి, సంతోష్‌కి అమ్మనై పెంచానో. అలాంటివాడు, నేను రమ్మంటే రాకుండా యెందుకు ఆగాడు?' మళ్ళీ పడుకుంది!

రాత్రి సరిగ్గా నిద్రపట్టలేదు. అందుకే తెల్లగా తెల్లవారేవరకు మెలకువ రాలేదు. పాలేరు తన పనులు తాను చేసుకుపోతున్నాడు.

అంతలో వాకిటముందు యేదో గుర్రపుబండి ఆగింది. అప్పటివరకు చలిమంట చుట్టూ కూర్చున్న పిల్లలులేచి, బండివద్దకొచ్చారు. కరణంగారి చిన్నకొడుకు గేటు తెరచుకొని, లోపలికి పరుగెత్తుకొచ్చాడు "అత్తా! సంతోష్ బావ వత్తాడు." అని సంతోషంగా గంతులువేశాడు. ఆ మాటకు శకుంతలమ్మ మనసు సంబరపడి పోయింది.


'బాబు వచ్చాడా?' అనుకుంటూ, వడి-వడిగా సింహద్వారంవద్దకు వచ్చింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. 'సూట్‌లోవున్న సంతోష్‌బాబు పక్కన యెవరో ..??' నిశ్చేష్టంగా నిలబడిపోయింది.

మరో కొద్దిక్షణాలకు సంతోష్‌బాబు, అతనివెంట వచ్చిన అమ్మాయి వంగి శకుంతలమ్మ పాదాలు తాకారు. ఆమె తేరుకొని, నిశితంగా పరికించింది. పచ్చని పసిమిచ్ఛాయతో మెరిసిపోతూంది, ఆ అమ్మాయి నడుము. మెళ్ళో పసుపుతాడు కనిపించింది. శకుంతలమ్మ గుండె ఆగినంత పనైంది.

"నన్ను క్షమించమ్మా! .." సంతోష్ తడబడుతూ అన్నాడు.

ఆమె కనుకొలుకులనుండి రెండు వేడికన్నీటిబొట్లు రాలాయి. అచేతనంగా వారి శిరస్సుల మీదకు చేతులు జారాయి.

ఇద్దరూ లేచారు. ఈడుజోడుగా వున్నారు. తేనె కళ్ళు, కాస్తంత రాగి వర్ణంగా వున్న జుట్టు, కొనతేలిన ముక్కు, ఆరడుగుల పొడుగువున్న దొరబాబువంటి సంతోష్ పక్కన, అంతకు తీసిపోని అందం సంతరించుకున్నది ఆమె.



మౌనంగా లోపలికి నడిచింది శకుంతలమ్మ. ఆమెను అనుసరించా రిద్దరూ.

గ్రామీణ ప్రాంతాల్లో వార్తా ప్రసారానికి రేడియోలు, టెలిఫోన్లక్కర్లేదు. క్షణాలమీద యీ వర్తమానం వూరంతా పాకిపోయింది ఇరుగు-పొరుగు అమ్మలక్కలు ముక్కున వేలేసుకుని, గుస-గుసలాడుకుంటూ వచ్చిపడ్డారు.

శకుంతలమ్మకు అయోమయంగా వుంది 'యెలా భరించడం యీ నిజం?' యాంత్రికంగా వారిని సింహద్వారంవద్దే ఆపి, పాలేరుని కేక వేసింది వాడితో వారికి దిష్టి తీయించింది తర్వాత, బయటికెళ్ళి తలుపులు వేసి, యెవ్వరినీ లోపలికి రాకుండా చూడమంది. పాలేరు తలుపులు వేసి, బయటికెళ్ళాడు.

"యేంది? యెక్కడికంట, యెగబడతన్నారు? యెల్లండెల్లండి! తరవాత సూద్దురుగాన్లే, పెళ్ళికూతుర్ని!" అడ్డంగా వచ్చాడు

అమ్మలక్కలు ముక్కున వేలేసుకున్నారు 'పెళ్ళికూతురే??'

"అవున్రా! యెవరా వచ్చింది?" వెంకాయమ్మ అడిగింది

"సంతోస్ బాబూ, పెల్లికూతురూ!" పాలేరు జవాబు.

"అవ్వ! యిదెక్కడ విడ్డూరవ్రా! యేవీ తెలీని నంగనాచిలా శకుంతల నాటకఁవాడింది, నిన్న! మన శ్రీదేవి కూతుర్ని చేసుకుంటానంది, కొడుక్కి! తెల్లారే సరికల్లా కోడల్ని తెచ్చుకుంది! . వురేయ్! సాంబయ్యా! నిజం చెప్పరా! నీకు తెలీదుట్రా యీ సంగతి?" వెంకాయమ్మ ఆరాతీసింది.

"బలేదానివే! నాకేం తెలుసుద్ది? ఆల్లు లవ్వాడుకున్నారుగాఁవాలు, పెల్లిసేసుకొచ్చారు!"

"చూశావా, చూశావా? ఇద్రా అసలు సంగతి! . పాపం! ఆ సీతా కుమారి గతేంకావాలి? .. పోదాం పదండి! ఆ శ్రీదేవి యేంతేడుస్తుందో? సీతాలు వురిపోసుకుందేమో?"

వచ్చిన జనమంతా నోటికి వచ్చినట్లు అనుకుంటూ వెంకాయమ్మ వెంట శ్రీదేవి యింటికి సాగారు.

సంతోష్‌బాబు, పెళ్ళికూతురు లోపలికొచ్చారు శకుంతలమ్మ వసారాలో ఆగింది. పైకి యెగబ్రాకుతున్న సూర్యుడివంక దృష్టిసారించింది.

"నిన్నే నువ్వు వస్తావనుకున్నాను. నీకిష్టమైన పిండివంటలు చేశాను. కానీ నువ్వు రాకపోయినా, నీ పుట్టినరోజు పండుగను ఘనంగానే చేశాను బాబూ! యెంతమంది నిన్ను మనసారా దీవించారో! . కానీ, ఆ నోళ్ళే యివాళ ." దుఃఖం ఆగలేదు. మాట పూర్తి చేయలేక పోయింది.

"అమ్మా!...?" సంతోష్ దగ్గరగా వచ్చాడు.

"నేను భరించలేను బాబూ, భరించలేను నిన్నంతా . శపిస్తారు .. దూషిస్తారు .. నే వినలేను!" చేతులలో ముఖం దాచుకుంది

"ఊరుకోమ్మా నువ్వు! . యెవరు యేమన్నా నాకేం పర్వాలేదమ్మా! నా తల్లి దీవెనలే నాకెనలేని వరం! నువ్వు బాధపడకమ్మా!" తల్లిని పొదవి పట్టుకొని వోదార్చాడు.

ఆమె కొన్ని క్షణాల్లో తమాయించుకుంది కొడుకుకి దూరంగా జరిగింది

"నాకు తెలీకుండా, నీకేమైనా ద్రోహంచేస్తే, నువ్వీఛాయలకు రాకుండా వుండాల్సింది. కానీ యిలా అవమానపర్చకూడదు!" గంభీరంగా అంది.

"అమ్మా ..!??" అదిరిపోయాడు సంతోష్.

"ఇది పల్లెటూరు! నన్ను తలెత్తుకోనివ్వరు సంతోష్! నీకెలా చెప్పను? . కనీసం . నీ మనసులో మాట నీ తల్లికి చెప్పలేవా? యే విషయంలో నిన్ను కాదన్నానని, నాకీ శిక్ష? భగవంతుడా! . యెందుకురా, నామీద యీ కక్ష? ." విసురుగా లోపలికెళ్ళి, మంచంమీద వాలిపోయింది, యేడుస్తూ.

పెళ్ళికూతురు అచేతనురాలైంది సంతోష్ వెంటనే అమ్మవద్దకు వెళ్ళాడు.

"నన్ను క్షమించమ్మా! నే తప్పు చేశానమ్మా!" ఆమె కాళ్ళు పట్టుకున్నాడు. "నువ్వింత బాధపడతావని తెలిస్తే నే పెళ్ళి చేసుకొనేవాడినే కాదమ్మా! నువ్వు నవ్వితే సంతోషం. బాధపడితే నాకు నరకంవేనమ్మా! నరకంవే!" సంతోష్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

చివ్వరి మాటలు ఆమె గుండెల్లో గుచ్చుకున్నాయి. చివాలున లేచి, సంతోష్ తలను చేతుల్లోకి తీసుకొని, గుండెలకు హత్తుకుంది. "వద్దు బాబూ! వద్దు! అలా అనొద్దు! నీ నూరేళ్ళ జీవితం నవ్వుల పంట పండాలి! . లే! అరె! అమ్మాయి

కూడా అలా నిల్చుందే!  ఛఛ! యేవిటీవేళ, యిలా చిన్నపిల్లలా చేశాను?" లేచి, కొడుకు చెయ్యిపట్టుకొని, పెళ్ళికూతురి దగ్గరకు లాక్కొచ్చింది. "ఆ! ఇద్దరూ లోపలికి పదండి! నీళ్ళు రెడీ చేస్తాను. ముఖాలు కడుక్కొని, స్నానాలు చేద్దురు గాని!" గదిలోకి పంపి, పనిలోక దిగింది

"అమ్మాయ్ శ్రీదేవీ! చూశావుటే యీ మోసం?  నిన్న మనముందు సీతాలుని తన కొడుక్కి చేసుకుంటానందా? .. తెల్లారేసరికల్లా, వాడు దేన్నో వెంటేసుకొచ్చాడు! యెక్కడన్నా వుందా, యీ మోసం?. యీ నాటకం? ఈ బస్తీముండల్ని నమ్మకూడదే! అయ్యో సీతాలు! నీ బతుకు నవ్వులపాలైందే?" వెంకాయమ్మ శ్రీదేవికి చెప్పి, సీతాకుమారిని దగ్గరికి తీసుకుని, సానుభూతి చూపింది.

"చంటాడు చెబితే నేనేమిటో అనుకున్నా నక్కయ్యా! సంతోష్ నిజంగానే పెళ్ళిచేసుకొన్నాడా?" యింకా సందేహం తీరలేదు

"ఓసి నీ పిచ్చి మండిపోను! .. అందుకే నిన్ను యిలా ఆడించింది శకుంతల! వాడు 'లవ్వు' చేశాడటే 'లవ్వు!' మన యింటా, వంటా యెక్కడన్నా వుందా యిది?"

శ్రీదేవికి నిలువుగుడ్లు పడ్డాయి 'పదిమంది ముందూ నిన్న కోడలంది! ఈవాళ కాదంటే ?'

"అసలు మన సాంప్రదాయాన్ని చెరిచిందిగదుటే అది! వెనుకటికి దత్తు చేసుకుంటానంటే, నా కొడుకుని యిస్తానన్నా, దీనికేం మాయరోగం వచ్చిందో. వద్దని, అమెరికా పోయి దత్తుచేసుకొచ్చింది! అందుకే వాడంత లక్షణంగా వెళ్ళాడాడు నా కొడుకు చూడు! శివాలయంలో అర్చన చేసుకుంటూ యీ రోజుకీ నా మాటకోసం యెదురుచూస్తాడు ఇలాంటి దగుల్బాజీ వేషాలు వాడికేమన్నా వున్నాయా? యేం చేద్దాం! నీ ఖర్మ దాని ఖర్మ!"

"అక్కయ్యా! మీరంతా వుండండి! మనందరం వెళ్ళి, దాని నాటకా లేవిటో తేల్చుకుందాం! దొంగముండ! ఇంత నమ్మకద్రోహం చేస్తుందా! అరేయ్! చంటీ! మీ నాన్నగారెక్కడున్నారో, వెంటనే పిలవరా!' కొడుకుని పురమాయించింది వచ్చిన అమ్మలక్కలు యుద్ధానికి తయారుగా వున్నారు

దంపతు లిద్దరూ స్నానాలు ముగించారు. కాఫీ, ఫలహారాలు తీసుకున్నారు. అంతా అయ్యాక భార్యని గురించి వివరించబోయాడు సంతోష్.

"రూపా! రాత్రి నిద్రలేదుగా! .నువ్వెళ్ళి పండుకోరాదూ?"

రూప అర్థవంతంగా నవ్వి గదిలోకి వెళ్ళింది.

"మా ఆఫీసులోనే స్టెనోగా పనిచేస్తూందమ్మా యీ రూప. ఈమెకు నాకు మధ్య ప్రేమ గొడవలేవీ లేవు. కానీ సానుభూతి! ..జాలి! ..యివేనమ్మా నన్ను తనకు జతచేసింది "

"అంటే .?" అర్థంకాలేదు తల్లికి.

"రూపవాళ్ళు బీదవాళ్ళు. వాళ్ళనాన్న ఏదో కంపెనీలో గుమాస్తాగా పని చేస్తూన్నాడు. రూప స్కూల్ ఫైనల్ చదివేరోజుల్లో వోజమిందారుగారి అబ్బాయి ఆమెని ప్రేమించాడు. ఆ సంగతి వాళ్ళ నాన్నకు, వీళ్ళ నాన్నకు చెప్పాడుట రూపవాళ్ళ నాన్న భయపడ్డాడుట. వాళ్ళ నాన్న తిరస్కరించాడుట తనమాట వినకపోతే తన కొడుకువే కావన్నాడుట. కానీ అతను లెక్క చెయ్యకుండా యిల్లు విడిచి రూపని పెళ్ళాడటానికి వొచ్చాడుట. గుళ్ళో పెళ్ళిచేసుకొని, తిరిగి కారులో యింటికి వస్తూండగా, కారు యాక్సిడెంట్ అయ్యి, పెళ్ళికొడుకు, డ్రైవరు, రూప తండ్రి చనిపోయారుట! .."

"ఆఁ ..?? ...శ్రీరామచంద్రా! ." బాధగా నిట్టూర్చింది సీతలమ్మ.

"తల్లీ కూతుళ్ళు వకేసారి పసుపుకుంకుమలు కోల్పోయారు. తర్వాత బ్రతుకు తెరువుకోసం, రూప వుద్యోగంలో చేరింది అందాల బొమ్మవంటి రూప ముఖంలో వెల్తి, విచారం చూచి, నేనే వోరోజు అడిగి తెలుసుకున్నాను నా ప్రాణం విల విలలాడింది తల్లి విషయంకన్నా అన్యం పుణ్యంయెరుగని రూపకు తీరని అన్యాయం జరిగిందనిపించింది. 'మళ్ళీ పెళ్ళిచేసుకోరాదూ' అనడిగాను. రూప కన్నీరు పెట్టు కుంది. 'జీవితం చేజారిపోయిం'దంది.

"ఆ సాయంత్రం రూపవెంట వాళ్ళింటికెళ్ళి వాళ్ళమ్మతో మాట్లాడాను. తన కూతురు జీవితం చిగుర్చడంకన్నా తానేమీ కోరుకోనంది తన తల్లిని, చెల్లెల్ని వంటరిగా వదిలి తాను పెళ్ళాడలేనంది రూప.

"జీవితంలో మనిషిగా వో మంచిపని చెయ్యడానికి యిదొక మంచి అవకాశ మనిపించింది. దీనికి తప్పకుండా నువ్వు హర్షిస్తావనే నమ్మకం నాకుంది. అందుకే అక్కడికక్కడే నా నిర్ణయాన్ని తెలిపాను రూపని నేను స్వీకరించి, కుటుంబాన్ని నిలబెడతానన్నాను. ఆ మాటకి వాళ్ళంతా ఆనందించారు.

"అంతలో వాళ్ళకి తెలిసిన వో పెద్దమనిషి రావడం, జరిగిందంతా వినడం జరిగింది. వెంటనే పంచాంగం తిరగవేసి 'రేపు మంచి లగ్నం వుంది. ఇలాంటిది పుష్కరానికి వక్కసారి వస్తుంది కనుక రేపే చేసేద్దాం!' అన్నాడు. 'అమ్మకు తెలీకపోయినా సమయానికి ఆమె లేకపోయినా యిదొక దివ్యమైన కార్యంకనుక ఆమె మిమ్మల్ని క్షమిస్తుంది. మీరు రేపు పెళ్ళికాగానే బయల్దేరి మీఅమ్మ ఆశీర్వాదాలు పొందండి' అన్నాడు.

"ఇలా నీకు తెలుపకుండా, నీ అనుమతి పొందకుండా క్లుప్తంగా గుళ్ళో పెళ్ళి చేసుకొచ్చానమ్మా!"

సంతోష్ ముఖమంతా చెమటలు పట్టాయి తల్లిముఖం గంభీరంగా మారింది. సంతోష్ తన గుండెలమీది భారాన్ని దించినట్లు అనుభూతి పొందాడు. తల్లిదృష్టి యెక్కడో వుంది. యేదో తెలీనిబరువు నెత్తి కెక్కినట్లయింది



కుర్చీనుండి లేచింది. "సంతోష్ యిలా రా!" రూప పడుకొన్న గదికేసి సాగింది. సంతోష్ ఆమెను అనుసరించాడు.

శకుంతల పూజగదిలోని కుంకుమబరిణె తెచ్చి సంతోష్ కిచ్చింది.

"అమ్మా! రూపా!" వస్తూనే పిలిచింది మంచమీద పండుకున్న రూప చివాలున లేచి నిలబడింది.

"నువ్వాదృష్టవంతురాలివమ్మా! ఇదే యే ముప్పై, నలభైయేళ్ళ క్రితం గనుక అయినట్టుంటే, నువ్వు దురదృష్టవంతురాలి వయ్యేదానివి నా బాబు నీకు జీవితాన్నిచ్చాడు. నా గుండెల్లోని కోరిక, నా నరనరాల్లోని వాంఛ, నా మనో ఆశయం నెరవేర్చాడమ్మా!" ఆప్యాయంగా రూపని దగ్గరికి తీసుకొని తల నిమిరింది.

"బాబూ! యేది, యీ చిట్టితల్లి నొసట బొట్టు దిద్దోసారి!"

సంతోష్ కుంకుమబొట్టును రూపనొసట దిద్దాడు.

"ఈక్షణం నా ఆశయం ఫలించి, నా బాబువల్ల నాజన్మ ధన్యమైంది!" తన్మ

యత్వంలో కళ్ళు మూసుకుంది ఆమె కనురెప్పలనుండి సజలబిందువులు రాలాయి రూప శిరస్సుమీద.

తర్వాత కొడుకుని కోడలిని రెండుచేతులతో దగ్గరకు తీసుకొని, హృదయానికి హత్తుకుంది. "మీ యిద్దరూ నాకు రెండుకళ్ళు! ఈయింట మీరు, మీకు పుట్టబోయేవారు వేయాలి ప్రేమపందిళ్ళు!"

శకుంతలమ్మ వాత్సల్యాభిమానాలకు చకితురాలైంది రూప.

"బాబూ! రేపు యీ వూరు వారందరికీ భోజనా లేర్పాటుచేద్దాం. నీ గొప్పతనాన్ని మనిషి మనిషికీ చాటుతాను! మనిషంటే యెలా వుండాలో నేర్చుకోమంటాను! .." శకుంతలమ్మ పరవశించి అనేస్తుంది

"అమ్మా!...ప్లీజ్! ..నా దొక్క రిక్వెస్ట్! నువ్వేన్నయినా చెప్పు! కానీ, గొప్పతనం మాత్రం మనం చెప్పుకోకూడదు!" సంతోష్ అన్నాడు.

"అదేవిటి బాబూ! .?"

"అవునమ్మా! .ఇది మనలోనే వుండడం శ్రేయస్కరం ..!"

శకుంతలమ్మ విస్మయంగా చూచింది. "బాబేనా యీ మాటంది? మంచిపనిని పదిమందికీ చెప్పవద్దా? ..అంటే ? సంఘానికి భయపడుతున్నాడా?"

అంతలో కరణం అన్నయ్య తలుపుతట్టాడు

"సరే! మీరు విశ్రాంతి తీసుకోండి! భోజనాలయ్యాక, నే లేపుతాలే!" తలుపు దగ్గరగావేసి హాల్లోకొచ్చి బయటితలుపు తెరిచింది.

"యేవిటే శకుంతలా! అబ్బాయి వచ్చాడుటగా?"

"లోపలికి రా అన్నయ్యా!. "

"రావడం కాదుగానీ, అసలుసంగతి చెప్పు! .నే విన్నది నిజమేనా?"

శకుంతల వో క్షణం ఆలోచించింది. కరణంగారిని గురించి తనకు బాగా తెలుసు. వకటికి నాలుగు అల్లుతాడు. "కాదు! నువ్వు విన్నది అబద్ధం!" అతనివంక సూటిగా చూచింది

"అయితే వా డెవ్వర్నీ లేవదీసుకు రాలేదంటావు?" కరణంగారన్నాడు.

"అన్నయ్యా! యేవిటా మాటలు? .."

"మరేవిటమ్మా! గుర్రపు బండిలోంచి, చేతులుపట్టుకొని దింపలా! వూరు నిద్రపోతూందనుకున్నావా? నిన్న నువ్వన్నమాట లేవిటి? ఈ రోజు వీడుచేసిన పనేవిటి? . అసలేడి వీడు? వీడి సంగతేవిటో తేల్చేస్తా! ." లోపలికి రాబోయాడు.

"ఆగు! తేల్చాల్సిన అవుసరం నీకేంలేదు. వాడికి నీ కూతురు నచ్చలేదేమో! నచ్చినదాన్ని చేసుకొచ్చాడు. అందుకు నే నొప్పుకున్నాను!"

కరణంగారు ఆగిపోయాడు కోపం, ద్వేషం రగుల్కొన్నాయి.

"ఇదేం వూరనుకున్నావా? వల్లకాడనుకున్నావా? చేతికందినదాన్నల్లా తెచ్చి భోగంవేషా లేయిస్తావా?"

"అన్నయ్యా! " బిగ్గరగా అరిచింది. ఆ అరుపుకి సంతోష్ లేచి, తల్లి వద్దకు పరుగెత్తుకొచ్చాడు. "జాగ్రత్తగా మాట్లాడు. ఇంకోసారి మాటతూలితే నీ మర్యాద దక్కదు "

"హుఁ మర్యాద! ... నీలాంటి వంచకురాళ్ళకి మాట-మర్యాదకూడా!" ఛీత్కరించి, బరబరా వెళ్ళిపోయాడు.

దారిలో అతనిభార్య శ్రీదేవి సపరివారంగా యెదురైంది. భర్తనుచూచి బావురుమంది.

"యెందుకే మీరంతా ఆ భోగంకొంపకి? పదండి...పదండి!, దేవుడు మనకి మేలేచేశాడు. పొరపాటున మన అమ్మాయిని ఆ దగుల్బాజీ వెధవకి యివ్వాలనుకున్నాంగానీ, యిస్తే యింకేమైనా వుందా? వర్ణసంకరం అయ్యేదే! వెయ్యిగుళ్ళు కట్టించినా తీరనిపాపం!" కరణంగారు తెలివితేటలు చూపాడు.

"అదేవిటబ్బాయ్! అలా అన్నావు? ..వర్ణసంకర వేఁవిటి?" వెంకాయమ్మ అందుకుంది.

"కాకపోతే యేవిటి వదినా? ఆ సంతోష్‌గాడేవైనా సాంప్రదాయకుడనుకున్నావా? అమెరికావాడు కాదూ? ఇన్నాళ్ళనుండీ మనం ఆలోచించలేదుగానీ వాడు కిరస్తానపువాడు. దత్తు చేసుకున్నంత మాత్రాన బ్రాహ్మడవుతాడా? రండి రండి! పోదాం!"

"కాదబ్బాయ్! ఇంతటి వర్ణసంకరానికి యెలా వడిగట్టింది ఆ దుర్మార్గురాలు? నువ్వు పద! అదేదో మేము తేల్చుకొస్తాము, పదంర్రా!" వెంకాయమ్మ ముందుకు దారితీసింది. ఆవిడ వెనుక మిగతాజనం.

"యెందుకమ్మా అలా అన్నావు? యేం జరిగింది?" సంతోష్ అడిగాడు.

"యేవీలేదు. తనకూతుర్ని నీకివ్వాలనుకున్నారు. నేనుకూడా సరే అన్నాను. అందుకు యీ రాద్ధాంతం! మనఁవీ పల్లెటూరికి రాకుండా కలకత్తానించి, తిన్నగా పాండిచేరికి మీ మామయ్యవెంట వెళ్ళినా బావుండేది!"

"అమ్మా! అదేవిటి ఆడపటాలం వస్తుంది?" గేటునుండి ముందుకు వస్తున్న మూకను చూచాడు. శకుంతలమ్మ గుండె దడదడలాడింది.

"హుఁ గోరంతలు కొండతలు చేయడంకన్నా యీ పల్లెటూరి జనానికి పనేముంది! ..నువ్వు లోపలికెళ్ళు!" అంటూ సంతోష్‌ని పంపింది. కానీ సంతోష్‌కి భయంవేసింది. 'అమ్మ లోగడ మాటిచ్చిందన్నమాట! ఛీ! తన తొందరపాటువల్ల యెంత చిక్కొచ్చిపడింది!' అనుకొని, యెందుకైనా మంచిదని, తల్లికి దగ్గర్లోనే రక్షణకోసం నిలబడ్డాడు.

"యేవమ్మా వదినమ్మా!" వెంకాయమ్మ వస్తూనే ప్రారంభించింది. "యేదో నిన్న సీతాలు నీ కోడలన్నావు! తెల్లారే సరికల్లా యేవిటీలా నట్టేట్లో ముంచావు?"

"... .?" శకుంతల మాట్లాడలేకపోయింది.

"అమ్మ ననాల్సిన పనిలేదు" సంతోష్ ముందుకొచ్చాడు.

"నాకు నచ్చిన పిల్లని నేను చేసుకున్నాను."

"ఓహో! ఏది బాబూ ఆ నచ్చిన పిల్ల? మేం చూడొచ్చా?" ఒకామె అంది.

"ఓ! బాగా చూడండి!" విసురుగా లోపలికెళ్ళి, రూప చెయ్యి పట్టుకొని అందరి ముందుకు లాక్కొచ్చాడు. "ఇదిగో నా పెళ్ళాం!"

రూపని చూచి, అంతా ఆమె అందానికి ఆశ్చర్యపోయారు.

"ఈ మాత్రానికేనా అంత పొగరు! నా కూతురుకంటే యేవందంగా వుందిది?" శ్రీదేవి వుక్రోషం చూపింది.

"అత్తా! ఉక్రోషంతో అన్నా, మొత్తానికి నిజం చెప్పావు కాకిపిల్ల కాకికేగా ముద్దు!" సంతోష్ అన్నాడు.

"ఆ! ఓరి వీడి నోరుబడిపోను! చూశావా కర్మ్యా యెంతమాటన్నాడో? నా బిడ్డ కాకిపిల్లా? వీడికళ్ళు పొడవ! వీడు నాశనం ." శ్రీదేవి శోకాలుతీస్తూ శాపనార్థాలు ప్రారంభించింది

"వదినా! . "శకుంతలమ్మ ఆ మాటలు వినలేక బిగ్గరగా అరిచింది. "అంతటితో ఆపు!"

"పెళ్ళికూతురా! నీకూ అమ్మా-నాన్నా లేరా?" వెంకాయమ్మ అడిగింది. ఈ వాతావరణం చూచేసరికి రూపకి తేళ్ళు పాకినట్లయింది. ఛీత్కారపు చూపు విసిరి, మూతి ముడుచుకొని, లోపలికిపోయింది.

"అదీ సంగతి!ఆమాంబాపతు సరుకు గనుకే 'టింగురంగా' అంటూ లేచొచ్చేసింది!"

"ఆపు! నోటికొచ్చినట్లు కూశావంటే, మర్యాద దక్కదు!" శకుంతలమ్మ ఆడపులిలా గాండ్రించింది "పొండి అవతలికి! యెవరు పిలిచారే మిమ్మల్ని? పిలవని పేరంటానికొస్తారటే? సిగ్గులేపోతేసరి! పరగడుపున-పొరుగిళ్ళకు బయల్దేరారు!"

"సిగ్గెవరికిలేదో తెలుస్తూనేవుందే?" శ్రీదేవి అందుకుంది. "గంతకుతగ్గ బొంతను తెచ్చుకున్నావుగా! పుట్టు-పూర్వోత్తరాలు లేనివాడికి పట్టపురాణియే తలమాసిన వాడిస్తాడే? పూర్వీకుల సాంప్రదాయాలుచూసి, మేము మోసపోయినా, పైన దేవుడనేవా డొకడున్నాడే! వాడే కాపాడాడే మమ్మల్ని!" ఆకసంవంక చూచి దణ్ణాలు పెట్టింది.

"నిజవేనేవ్! ఈ దత్తపుత్రుడు 'కిరస్తాన'పు వాడు కదూ? అవ్వా! ఇంకేమైనా వుందా? వర్ణసంకరం .." వెంకాయమ్మ నోరు కొట్టుకుంది.

"ఏంకూశావే? నా కొడుకు 'కిరస్తాన'పు వాడా?" శకుంతలమ్మకు ఆవేశం




పెట్రేగిపోయింది. టీపాయ్‌మీదున్న గ్లాసు తీసుకొని, వెంకాయమ్మకేసి విసిరింది. చాతుర్యంగా వెంకాయమ్మ ఆ దెబ్బ తప్పుకుంది. మిగతా జనం భయపడి వెనక్కి తిరిగారు వెంకాయమ్మ, శ్రీదేవిమాత్రం ఇంకా పగ సాధించాలని వున్నారు.

“ఎంత వగలాడివే మాయదారిదానా! ఎంత పల్లెటూళ్ళోవున్నా, మా కామాత్రం తెలీదుటే? అమెరికాలో మనలా బ్రాహ్మణ సాంప్రదీయకు లెందుకుంటారే! వాళ్ళంతా కిరస్తానపువాళ్ళు కాదుటే? దత్తు చేసుకున్నంత మాత్రాన 'కిరస్తాన'పు వాడు బ్రాహ్మడవుతాడా?” శ్రీదేవి అంది

అవి వినలేక చెవులు గట్టిగా మూసుకుంది శకుంతల

“ముక్కుపచ్చలారని మొగుడి మొగమైనా చూడకుండా, వల్లకాట్లో పెట్టిన ముదనష్టపుదానవు కదుటే నువ్వు! నీకు మంచి బుద్ధులెలా వస్తాయి? వస్తే నా కొడుకునే దత్తు చేసుకొనే దానివే! ఆ కిరస్తానపు వాడిని కులంలో కలిపేదానివే కాదు!” వెంకాయమ్మ మెటికలు విరిసిపోసింది

“కాదు! కాదు! నా బాబు 'కిరస్తానీ' కాదు! నా బాబు 'కిరస్తానీ' కాదు! దొంగముండల్లారా! పొండి!” ఏడుస్తూ కాలిచెప్పులను తెచ్చి, ఇద్దరి మీదికీ విసిరింది. ఆ చెప్పుదెబ్బలు తిని, ఇద్దరూ, నోటికొచ్చిన కూతలు కూస్తూ పారిపోయారు.

“ఈడియట్స్!” వెళ్ళి తలుపులువేసి వచ్చాడు సంతోష్. ఇంకా తల్లి గోడకు తల ఆనించి, ఏడుస్తూనేవుంది.

“నువ్వూరుకోమ్మా! ఆ ఫూల్స్ అన్నారని నువ్వెందుకు ఆవేశపడతావు? నేను 'క్రిస్టియన్'ని అయితేమాత్రమేం? శాస్త్రయుక్తంగా దత్తు చేసుకున్నావ్!

సాంప్రదాయసిద్ధంగా పెంచావు. ఇంతకంటే ఇంకేంకావాలి, ఏ కులస్థుడికైనా ఏ మతస్థుడికైనా? నువ్వు బాధపడకు!'' తల్లిని వోదార్చాడు.

''కాదు బాబూ! కాదు! నువ్వు నా బిడ్డవేరా! నా స్వంతకొడుకువిరా! నా గర్భంలో పుట్టి, నా రక్తం పంచుకున్న నా బంగారుకలవిరా! నువ్వు దత్తపుత్రుడివి కాదురా!'' ఉండబట్టలేక తన గుండెల్లోని మాటను బయటికి ఏడుస్తూ అనేసింది.

''అమ్మా! ?'' విస్మయంగా అరిచాడు సంతోష్. రూప పరిగెత్తుకొచ్చింది.

''అవును బాబూ! అవును నేను నీకు స్వయాన అమ్మని! నా మాట నమ్ము!'' యేదో తెలియని వుద్వేగం వుత్పన్నమైంది. అమాంతం కొడుకుని, గట్టిగా కౌగిలించుకుంది.

''అమ్మా! నువ్వేమంటున్నావో నీకు తెలుస్తూందా? ..'' తల్లికి దూరంగా జరిగాడు. భయంగా తల్లి ముఖంలోకి చూచాడు.

''నిజం బాబూ! నిజంగా నువ్వు నా కొడుకువిరా! యేళ్ళ తరబడి గుండెల్లో దాచిన యీ నిజాన్ని యివాళ నీతో చెబుతున్నాను! .. మళ్ళీ నన్ను 'అమ్మా' అని పిలు, బాబూ!'' అంటూ, మళ్ళీ సంతోష్‌ని కౌగిలించుకోబోయింది.

''ఆగు!...'' దూరంగా జరిగాడు

ఆ శబ్దానికి శకుంతలమ్మ కంపించిపోయింది.

సంతోష్ చెవుల్లో వెంకాయమ్మ మాటలు గింగురుమన్నాయి. 'ముక్కుపచ్చలారని మొగుడిమొగమైనా చూడకుండా, వల్లకాట్లో పెట్టిన .' గట్టిగా చెవులు మూసుకున్నాడు. ''వద్దు! నే వినలేను! నే వినలేను!'' బయటికి అనేశాడు.

''బాబూ! .. అలా అనకు! .. నేను అమ్మన్రా! .. నీ కన్న తల్లిన్రా!'' చేతులలో ముఖం దాచుకుంది.

సంతోష్ వో క్షణం మౌనంగా వున్నాడు. ''మనం సంఘజీవులమని, మన చుట్టూ వో సంఘం వుందనీ గుర్తుంచుకొని చెప్పు!''

''హుం!... యీ నాటికి నువ్వు పెద్దవాడివయ్యావు!'' శకుంతలమ్మ తీవ్రంగా చూచింది కొడుకువంక ''ఆచారాల పేరుతో ఆడవారి జీవితాలను చితికి చేర్చేదిరా యీ సంఘం! అబలల జీవితాలలో ఆరని నిప్పులు రగిల్చేదిరా 'యీ సంఘం! .. ఇలాంటి దుష్టసంఘాన్ని నేను లెక్కచెయ్యను. దాని వునికి నా కక్కర్లేదు!... ఎవరు యెన్నన్నా సరే! నువ్వు నా కొడుకువనేది నిజం!'' ఆవేశంలో ఆమె ముక్కుపుటాలు యెగురుతున్నాయి. కళ్ళు యెర్రబారి వున్నాయి.

సంతోష్ కూడా ఆవేశపడ్డాడు. తాను తల్లితో మాట్లాడుతున్న విషయం మరిచిపోయాడు. ''నా చుట్టూ వున్న సంఘంలోని వక వ్యక్తిగా అడుగుతున్నా! నువ్వన్నదే నిజం అయితే, నీ కొడుక్కి నిజమైన తండ్రెవరు?...''

"సంతోష్ ..???" భూమి దద్దరిల్లింది.

"నాకు నిజంకావాలి!" రెట్టించాడు

"లేరు! .. నీకు తల్లినీ-తండ్రినీ అన్నీ నేనే! నువ్వు అమ్మ కొడుకువిరా! బాబూ! యీ 'అమ్మ' కొడుకువి." మళ్ళీ దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది

"అమ్మకొడుకు పసివాడేంకాదు, కాకమ్మ కథలు వినడానికి! నిజం చెప్పు!"

"అయ్యో! నా మాట నమ్ము బాబూ! నీకు నాన్న లేరు! . అంతకంటే ఇంకేమీ అడగకురా! . నే చెప్పలేను నే చెప్పలేను!" . నిలువలేక లోపలికివెళ్ళి బెడ్ మీద పడిపోయింది సంతోష్ అంతటితో ఆగలేదు ఆమె వెంట వెళ్ళాడు

"నువ్వు చెప్పకపోయినా, నా కర్థమైంది, భర్త ముఖం చూడకుండానే తాళి తెగిపోయిన ఆడపిల్లలు, కాలుజారితే కలిగే పిల్లలకి యేమని చెప్పు " మాట పూర్తి అవ్వకముందే సంతోష్ చెంపలు వరుస-వరుసనే చెళ్-చెళ్ మన్నాయి. కళ్ళు బైర్లుకమ్మాయి

"దుర్మార్గుడా! .. ఇదట్రా నువ్వు తెలుసుకుంది? .. ఇందుకేనట్రా నిన్ను పెద్ద చదువులు చదివించింది? . యే కొడుకురా, తన తల్లినిలా అడుగుతాడు? దేవుడా! . యింకా నన్ను బ్రతికించే వుంచావా? నా గుండెలు పగులకొట్టి, నన్ను తీసుకెళ్ళిపో ప్రభూ! .. ఈ నీచుడి ముఖం నే చూడలేను! .. పో! ముందు! .. నీ ముఖం చూపకు!" మళ్ళీ వీపుమీద బాదుతూ బయటికినెట్టి, తలుపులు వేసుకొని, భోరున యేడ్చింది

మనస్సు చెదిరిన సంతోష్ కూడా అక్కడ నిలవలేకపోయాడు రూప అడ్డు వచ్చినప్పటికీ లెక్క-చెయ్యకుండా, విసురుగా బయటికెళ్ళిపోయాడు రూప అచేతనంగా చూస్తూ వుండిపోయింది

కొంత సేపటికి తలుపులు తీసింది శకుంతలమ్మ వో సూట్ కేసుతో బయటికొచ్చింది పాలేరు సాంబయ్యాని కేకవేసి యెడ్లబండిని సిద్ధం చెయ్యమంది

"రూపా! నేనెన్నో కలలుకని, ఆశలు పెంచుకొని, కన్న కొడుకుని యీ రోజు కాదనుకుంటున్నాను నేను లేకపోయినా, వాడిని కాపాడుకొనే బాధ్యత, నువ్వు తీసుకున్నావు. అలాగే, యీ యింటి బాధ్యత కూడా తీసుకోమ్మా! నేనిక లేనని చెప్పు!" తాళపు చెవులగుత్తి అందించి, చీర కొంగును నోటికడ్డం పెట్టుకుంది

"అత్తయ్యా! అలానకండత్తయ్యా! మమ్మల్ని విడిచి వెళ్ళొద్దత్తయ్యా!" రూపకు దుఃఖం ఆగలేదు.

"వద్దమ్మా! వద్దు! యే కొడుకూ అనలేని మాట, నా కొడుకు అన్నాడు, అప్పుడే నేను చచ్చిపోయాను! .. అప్పుడే నేను చచ్చా .." వడి-వడిగా సూట్ కేస్ తో బయటికి సాగింది. సాంబయ్య, చేతిలోని సూట్ కేస్ అందుకొని బండిలో

పెట్టాడు. శకుంతలమ్మ యెక్కగానే, బండి బస్తీకేసి సాగింది. నిస్సహాయంగా చూస్తూ నిల్చుండిపోయింది, రూప.

ఊరి కాల్వగట్టుమీదున్న సరివితోపులో వంటరిగా కూర్చున్నాడు సంతోష్ చాలాసేపు. చివ్వరికో నిర్ణయానికొచ్చి, తిన్నగా యింటికొచ్చాడు తనకోసం యెదురుచూస్తూన్న రూప యెదురైంది.

"అత్తయ్య సూట్ కేస్ తీసుకొని వెళ్ళిపోయారండి, యెక్కడికో? వెంటనే వెళ్ళి పిలుచుకురండి!" ఆందోళనగా అంది.

"వెళ్ళిపోయిందా?" బరువుగా నిట్టూర్చాడు. "వెళ్ళనియ్యి! పాండిచ్చేరి మామయ్యగారింటికి వెళ్ళివుంటుంది! ఐయామ్ వెరీ సారీ రూపా! ఈ విషయాలేవీ నాకు తెలీదు!"

"మీ ప్రవర్తన నాకేం బాలేదండి! దేవతవంటి అత్తయ్యని అలా విడిచి పెట్టడం న్యాయంకాదు. ప్లీజ్! వెళ్ళి, తీసుకురండి!" భర్త చేతులు పట్టుకుంది.

"రూపా! నన్ను విసిగించకు! ఐయామ్ నాటె ఫూల్! కమాన్! రెడీకా! మనంకూడా వెంటనే వెళ్ళిపోదాం! ఈ ఇంట్లో నాకు స్థానంలేదు! క్విక్!" లోపలికెళ్ళి తమ సామాన్లు బయటవేశాడు

"ఎవర్నయినా అడిగి యెడ్లబండి ఏర్పాటుచేసుకొస్తాను" వాకిట్లోకివచ్చాడు.

అదే సమయానికి ఓ జట్కాబండి వచ్చి, యెదురుగా ఆగింది. డాక్టర్ శ్రీకాంత్ బండి దిగాడు.

జట్కా-వాలాకి డబ్బులిచ్చి, సూట్ కేస్ చేతబట్టుకొని, వెనక్కు తిరిగాడు.

"అరె! సంతోష్?? ..వెన్ డిడ్ యు కం బాయ్?" విస్మయంగా అడిగాడు "ఇదేవిటి? ఇలా వున్నావు? ..ఒంట్లో బాలేదా?" సంతోష్ భుజంమీద చెయ్యివేసి లోపలికి నడిపించాడు

"నో! ..నథింగ్!.. నాకేంలేదు. ఒన్ మినిట్ అంకుల్! .ఇప్పుడే వస్తా" అని, వెంటనే వెనక్కువచ్చాడు. తిరిగి వెళ్ళబోతూన్న జట్కావాలాని పిలిచి, పది నిముషాలు వుండమని, తాము బస్తీకి వస్తామని చెప్పాడు. తనకోసం ఆగిన మేనమామవద్దకొచ్చాడు.

"ఎందుకు బండిని ఆపావు?" ముందుకు సాగారు.

"ఇప్పుడు బయలుదేరాలనుకుంటున్నాము!"

"ఇటీజ్ ఆల్ రైట్! అసలెప్పుడొచ్చావో చెప్పనేలేదే?"

"ఈరోజు పొద్దున్నే వచ్చాం!"

"వచ్చాం అంటున్నావు. ఎవరెవరు?"

"రండి చెబుతా!" లోపలికి ముందుగా వెళ్ళాడు. వెనుక శ్రీకాంత్ వచ్చాడు. సంతోష్ ముభావంగా వున్నట్లు అనిపించింది. 'చేతిలోని సూట్ కేసుని అందుకొనేవాడే! ఎందుకో అడగలేదు; అనుకుంటూ హాల్లోని టీపాయ్‌మీద సూట్ కేస్ పెట్టి కుర్చీలో కూర్చున్నాడు.

మరుక్షణంలో సంతోష్ భార్యని పిలుచుకొచ్చాడు "అంకుల్! నిన్న నాకు మద్రాస్‌లో పెళ్ళి జరిగింది ఈమె నా భార్య 'రూప!' రూపా! మా మేనమామ గారు డాక్టర్ శ్రీకాంత్! నేను కలకత్తాలో వీరింట్లోనే పెరిగాను" పరస్పర పరిచయం చేశాడు. రూప చేతులు జోడించి, నమస్కరించింది.

సంతోష్ మాటలకు స్తబ్ధుడయ్యాడు శ్రీకాంత్ రూప నమస్కారాన్నికూడా గమనించలేదు ఆమె తిరిగి లోపలికి వెళ్ళింది.

"నాకెందుకు రాయలేదీసంగతి? నిన్న నీ బర్త్‌డేకి గ్రీటింగ్స్ పంపేబదులు మేమంతా వచ్చేవారంగా?"

"    ?" సంతోష్ సమాధానం ఇవ్వలేదు.

"ఏది మీ అమ్మ? సకూ! సకూ!" కోపంగా పిలిచాడు

"ఎవ్వరికీ తెలీదు! సడన్‌గా జరిగింది!" కొంచెం తడబడ్డాడు.

"ఓహో! అంత వ్యవహారం జరిపావన్నమాట! ఎట్‌లీస్ట్ నాకో మెసేజ్ ఇచ్చినా, పాండిచ్చేరినించి వచ్చి, నీ తరఫున నిలబడేవాడ్ని? నీ పెళ్ళి గురించి మీ అమ్మ ఎన్ని కలలు కంటుందో నీకేం తెలుసు? ఏదో సామెత చెప్పినట్టు 'అడ్డాల నాడే బిడ్డలుగానీ, గడ్డాలనాడుకాద'న్నట్టు బాగా ప్రూవ్ చేశావు! అసలు నిన్ననేదేంవుందిలే! దాని బ్రతుకే అంత! చిన్నప్పట్నించి అడియాశలు, అవమానాలతోనే గడిచిపోయింది! అమ్మా! సకూ!" చెల్లెల్ని పిలిచాడు

"లేదు నా ముఖం చూడనంటూ వెళ్ళిపోయింది!"

"ఆఁ వెళ్ళిపోయిందా? ఎప్పుడు? నాకు తెలుసు! తన మనస్సుకు సరిపడని విషయాలని తానెప్పుడూ అంగీకరించలేదు!"

"మీ చెల్లెలు వక్కతే అలా అనుకోకండి అంకుల్! ఆమె రక్తం పంచుకొని, గర్భంలో పుట్టిన నేనుకూడా అంతే! "

"సంతోష్ ??" షాక్ తిన్న వాడిలా చివాలున కుర్చీలోంచి లేచాడు.

"ఎందుకంత ఆశ్చర్యం? ఆమె రక్తం పంచుకుపుట్టానంటేనే మీరింత ఆశ్చర్యపోతున్నారు ఆమె 'గర్భస్థ శిశువు'నని తెలిసినప్పుడు నేనెంత ఆశ్చర్యపోవాలి? నాకుమాత్రం ఆలోచన, ఆసక్తీ లేదూ? సంఘంలో నేను తలెత్తుకు తిరగద్దూ? మాంసం తిన్నంత మాత్రాన యెముకలు మెళ్ళో వేసుకున్న వారిని నేనెక్కడా చూడలేదు! యెవరో, యేదో, అన్నంత మాత్రాన, మీ చెల్లెలు ఇలా చేసి, నాకు తలవంపులు చేసింది నేను దత్తకొడుకుగా హాయిగా, ఆనందంగా పెరిగాను కానీ, ఈనాడు స్వంత కొడుకునని చెప్పి, సంఘంలో నన్ను దిగ తొక్కి అవమానాల పాలేసింది మీ చెలి సంతోషంగా [illegible]

చూడలేని స్త్రీ, నన్ను తన స్వంత కొడుకని యెందుకు చెప్పాలి? తన పాపానికి ప్రతిరూపాన్ననా, యిలా అవమా " సంతోష్ గుండెల్లో ఆవేశంపొంగి, కళ్ళ నుండి అశ్రువులై కురిశాయి మాటలు దొర్లిపోతున్నాయి

ఆ మాటలకు సహనం కోల్పోయాడు డాక్టర్ శ్రీకాంత్! "యూ . షటప్ " బిగ్గరగా అరిచి, అమాంతం సంతోష నోటిని గట్టిగా చేత్తో మూశాడు.

"ఇంకోసారి అలా అన్నావంటే నీ స్నేంచేస్తానో చూడు, రాస్కెల్!" విడిచిపెట్టాడు "వక్కగానొక్క కొడుకువని గారంగా పెంచి, పెద్దచేస్తే ఇదట్రా నువ్వామెకిచ్చే రివార్డు? నీకోసం ఆమె ప్రాణాలనుకూడా లెక్కచేయలేదురా! "

"ప్రాణాలకన్నా ముఖ్యమైంది 'మానం' అంకుల్!"

"సంతోష్ !" సింహగర్జనచేశాడు. తలుపు చాటుగా వుండి వింటూన్న రూప కంపించిపోయింది

"తాతకు దగ్గులు నేర్పక్కర్లేదురా! నువ్వెంత? నీ నాలెడ్జెంత? ఈడియట్! యేవిట్రా నీ తల్లిని గురించి నీకు తెలిసింది? చెప్పు! టెల్ మీ నౌ!"

"నేను నా తల్లికి దత్తుకొడుకుని కాదు! కన్నకొడుకునిట! అయితే నాకు తండ్రిలేడు! యేం? కన్నకొడుక్కి తండ్రి యెందుకుండడు? కుంతి గర్భాన పుట్టిన కర్ణుడికి కూడా సూర్యుడనే వో తండ్రి వున్నాడే! పాండురాజు పుత్రులుగా చెలామణి అయిన పంచపాండవులకు అయిదుగురు తండ్రులున్నారే? మరి, నాకెందుకు లేడు? నే నమ్మకొడునిట? అమ్మకొడుకుని?" సంతోష హృదయంలో దాగిన అనుమానాన్ని వెళ్ళగక్కాడు

"ఇదేగా నీ అనుమానం? " కొద్దిక్షణాలు మౌనంగా తేరిపారజూశాడు "నువ్వు అమ్మకొడుకువేరా! యువర్ మదర్ యీజ్ సెంట్ పర్సెంట్ కరెక్ట్! కాదనే ఫూల్ యెవడన్నా వుంటే రమ్మను నా ముందుకి!" వుద్రేకంతో అరిచాడు

"మీ సవాల్ కన్నా నాకు జవాబు ముఖ్యం!" సంతోష్ రెట్టించాడు

"కీప్ క్వయట్! యువార్ ఆఫ్ట్రాల్ యే బాయ్! నేను చెప్పే సీక్వెన్స్‌కి సమాధానం చెప్పు! చూస్తా!" ఆవేశాన్ని అణచుకుంటూ అన్నాడు

"యుక్త వయస్సుకి రాకముందే పసుపు-కుంకాలు కోల్పోయిన వో స్త్రీకి వయసొచ్చాక స్త్రీ సహజమైన కోర్కెలుంటాయా, లేదా?"

" అఫ్‌కోర్స్!" సంతోష్ అన్నాడు

"ఆ కోర్కెలను పిచ్చితలంపులుగా తలిచి, తల్లి-దండ్రులు ఆమెను హింసించారు! మదపిచ్చన్నారు! తాళి తెగినదానికి మళ్ళీ పెళ్ళిచెయ్యకూడదన్నారు

బిడ్డల్ని కనే హక్కు లేదన్నారు! డు యు యెగ్రీ టు దిస్ సోషల్ యిన్ జస్టిస్? నువ్వొప్పుకుంటావా?"

"నో నో నెవర్!"

"నెవర్?" అపహాస్యంగా అడిగి, నవ్వాడు డాక్టర్ శ్రీకాంత్ "నీలాంటి వ్యక్తే వకడు, ఆమెను స్టేట్స్‌కి తీసుకెళ్ళాడు. అక్కడ తాను మెడికల్ రిసర్చ్ చేస్తున్నాడు. 'పెళ్ళి చేసుకోరాదు' అనే ఆంక్షవున్న యీ అమ్మాయి, కనీసం తన గర్భాన వో బిడ్డని కనాలంటుంది! భారత స్త్రీగా, శీలం చెడకుండా 'ఈమె కోర్కెలెలా ఈడేర్చడం?' అనే ఆలోచన అతనికి ప్రబలమైంది. ఆ సమయంలో పౌల్ట్రి అండ్ 'యానిమల్ హస్‌బెన్డరీల రిసర్చి ఫలించి, సంపర్క రహితంగానే, వైద్య ప్రక్రియ ద్వారా కోళ్ళూ, పశువులు సంతానం పొందసాగాయి. 'అదే ప్రయోగాన్ని మనిషిమీద యెందుకు చెయ్యకూడదు?' అన్న తలంపు కలిగింది. తన ప్రొఫెసర్‌ని, సైకాలజిస్ట్‌ని వగైరా ముఖ్యులను సంప్రదించాడు. అంతా అంగీకరించిన మీదట, ఆ అమ్మాయి అనుమతి తీసుకొని, తన ప్రొఫెసర్ ద్వారా ఆ వైద్య ప్రయోగాన్ని చేయించాడు. వారందరి కలలూ పండాయి. ఆమె గర్భం ధరించింది. నవమాసాలు మోసి, వో బిడ్డను కన్నది. అండర్ స్టాండ్? నౌ ఐ వాంట్ యువర్ ఆన్సర్! ఆ బిడ్డకి తండ్రెవరు సంతోష్? హూ యీజ్ ది ఫాదర్ ఆఫ్ దట్ చైల్డ్? సూర్యుడా? ఇంద్రుడా? చంద్రుడా?"

అంతా విని నిరుత్తరుడైపోయాడు సంతోష్. అతని కళ్ళవెంట నీరు జల-జలా కారింది.

"పార్డన్ మీ అంకుల్! నన్ను క్షమించండి!" సంతోష్ చేతులు ముఖానికి అడ్డుపెట్టుకున్నాడు. కంఠంలో దుఃఖం వినిపించింది.

"ఆన్సర్ మై క్వశ్చన్! చెప్పు!" గద్దించాడు.

"అయామ్ సారీ అంకుల్! నే నమ్మకొడుకునే! అమ్మకొడుకుని!"

డాక్టర్ శ్రీకాంత్, సంతోష్ భుజంతట్టాడు. "దటీజ్ కరెక్ట్! యువార్ రైట్! నువ్వు 'అమ్మకొడుకు'వి సంతోష్! ఆనాటి ఆ ప్రయోగం నా ప్రొఫెసర్‌కి యెంత ఖ్యాతి నార్జించిపెట్టిందో నీకేం తెలుసు? ఆ ప్రయోగం యిలా సజీవంగా నా ముందు నిలబడి నాతో మాట్లాడుతుంటె యెంత ఆనందంగావుందో నీకేం తెలుసు?" మృదువుగా దగ్గరకు తీసుకొని, నొసట చుంబించాడు.

"మీ అమ్మవద్ద నేనేమాట తీసుకున్నా సంతోష్. ఈ సంఘం కొత్తనిజాల్ని అర్థంచేసుకోలేదు! అంతెందుకు? పాతికేళ్ళనాటి ఈ ప్రయోగం, ఇంకా ప్రజలలో ప్రబలంకాలేదు చూశావా? అప్-టు-డేట్ బాయ్‌వి. నీకే డౌట్ వచ్చింది! అందువల్ల నిన్ను దత్తపుత్రుడుగా చెప్పించి, నావద్దవుంచి, ఇండియాకు వచ్చాక కూడా పల్లెటూరికి రానీకుండా పెంచాను. మరి, యీనాడు 'అమ్మ' యీ విషయం

బయటపెట్టిందంటే, పరిస్థితులలా వచ్చివుంటాయి! డోంట్ వర్రీ! ఈ నిజాన్ని వప్పుకుంటానికి మన సంఘానికి యింకా కొన్ని తరాలు పట్టవచ్చు!''

సంతోష్ కళ్ళు తుడుచుకున్నాడు. రిస్ట్ వాచ్ చూచాడు

''అంకుల్! మనం అర్జంటుగా స్టేషన్ కెళ్ళాలి! మద్రాస్ ఎక్స్‌ప్రెస్‌కి ఇంకా అర్ధగంటే టైముంది! వెళ్ళకపోతే అమ్మ వెళ్ళిపోతుంది!''

''ఈజిట్? నాక్కూడా యెదురవ్వలేదే? కమాన్! హరియప్!'' వడి-వడిగా బయటికి సాగాడు. సంతోష్ రూపను భద్రంగా వుండమని మేనమామ వెంట వెళ్ళాడు.

జట్కాలో యిద్దరూ బయల్దేరారు పావుగంటలో స్టేషన్ కెళ్ళారు అప్పర్ క్లాస్ లేడీస్ వైటింగ్ రూమ్‌లో కూర్చుని, యెటో చూస్తూంది శకుంతలమ్మ

''అమ్మా! .నన్ను క్షమించమ్మా! .ఈ అమ్మ కొడుకుని క్షమించమ్మా!'' వంగి కాళ్లు పట్టుకున్నాడు ఆమె చకితురాలైంది

వెనుకే అన్న శ్రీకాంత్ కూడా వచ్చాడు వెంటనే లేచి నిల్చుంది మిగతా జనం తమవైపే చూడడం చూచి, ముందుకు సాగింది

''ఏం సకూ? అలా ఆశ్చర్యపోతున్నావు? సినిమా క్లైమాక్స్‌లో వచ్చినట్లుందా నన్ను చూస్తూంటే? అయ్యిందేదో అయ్యింది వాడిని క్షమించు!'' ఆమె చేతిలోని సూట్‌కేస్ లాక్కున్నాడు

''అన్నయ్యా! '' ఆమెకు దుఃఖం ఆగలేదు ''అన్నయ్యా! నువ్వన్నట్లు ''తరాలు మారినా-అంతరాలు మారలేదన్నయ్యా! నా కలలు వమ్ముచేసి, నా గుండెల్లో అగ్నిగోళాలు ప్రేల్చాడన్నయ్యా!'' అన్న భుజంమీద వాలింది

''ఊర్కోమ్మా! ఏవిటిదంతా, పిచ్చిదానిలా! నేనోటి చెబుతాను చూడు సకూ! 'ఎంత పెద్ద చదువులు చదివినా, చిన్నవాళ్లెప్పుడూ, పెద్దవాళ్ళకంటే పెద్దవాళ్ళు కాలేరు! కమాన్! రా! అన్నట్టు, కంగ్రాచులేషన్స్! నీకొడుకు బంగారుబొమ్మను నీకు కోడలుగా తెచ్చాడు!''

ఆ మాటకు శకుంతలమ్మ వదనం ప్రసన్నమై, చిరుహాసరేక వెలిసింది! ''పో అన్నయ్యా! నీకంతా వేళాకోళం!''

''సంతోష్‌బాబూ!ఎవ్విరిథింగ్ యీజ్ వోకే! మీ అమ్మ టిక్కెట్టుకాన్సిల్ చేసుకురా!''

తల్లివద్ద టిక్కెట్టు తీసుకెళ్ళి, కాన్సిల్ చేశాడు సంతోష్. ముగ్గురూ కలిసి జట్కా యెక్కారు ఎదురుగా కూర్చున్న 'అమ్మకొడుకు'ని చూచి చిన్నగా నవ్వుకున్నారు అన్నా-చెల్లెళ్ళు

* * *

# కార్టూన్

## కార్టూన్

### కార్టూన్

కార్టూన్



ఇప్పుడైతే ఏదో అలవాటుపడ్డాను కాని, ఈ మాయానగర్‌కు వచ్చిన కొత్తలో నాకేమీ తోచేదికాదు ఈ వూరిపేరు మీకు విచిత్రంగా తోచవచ్చు, కాని నన్నడిగితే ఈవూరికి ఈపేరే తగిందంటాను. చూడండి బిల్డింగులు ఎలా వెలిగిపోతున్నాయో! ఒక్కొక్క భవనం ఒక్కొక్క విధంగా, దేనికదే సాటిగా ఎలా మెరిసిపోతున్నదో చూడండి! ఈ బిల్డింగులను చూస్తూంటే మీకు భారతదేశంలో ఉన్నామా, లేక ప్యారిస్‌లో ఉన్నామా లేక శాన్ ఫ్రాన్సిస్కోలో ఉన్నామా అనే భ్రాంతి కలుగకమానదు ఈ భవనాల డిజైన్లను చూస్తుంటే మీరు ఏ శతాబ్దంలో నివసిస్తున్నారో మీకే అనుమానం కలుగుతుంది దేశ కాలాల్ని తెలిసికొనడానికి వీలులేనంత ఇక్కట్లు కల్గించారీ ఇంజనీర్లు

కాని ఈ మాయానగర్ బస్‌స్టాండ్ ఉంది చూశారా. అక్కడికి వచ్చారంటే మీకు దేశకాల పరిస్థితులన్నీ అవగతమవుతాయి ఒక పెద్దసర్కిల్ ఉంది దానికో వైపు ఖాళీప్రదేశం దానిచుట్టూ కాంపౌండు గోడలపై ఏవేవో పోస్టర్లు అతికించబడ్డాయి 'ఇచ్చట మూత్రవిసర్జన చేయరాదు' అనే చిన్నబోర్డుకూడ మీకు కనపడుతుంది రెండోవైపు మార్కెట్టు మూడోవైపు టాక్సీస్టాండు నాల్గోవైపు బస్సులు వచ్చిపొయ్యే రోడ్డు. ఇక్కడికి వచ్చి నేను తృప్తిగా గుండెనిండుగా గాలి

---

హిందీ మూలం
రమేష్ ఉపాధ్యాయ్

అనువాదం
ఘటమరాజు అశ్వదనారాయణ

పీల్చుకుంటాను ఎందుకంటారా? బస్సుల్లో ప్రయాణంచేసి, సిగ్గుపడని నాలాంటి సన్నకారు మనుషులు ఎంతో మంది తప్పనిసరిగా నాకిక్కడ తారసపడతారు పిగ్గెందుకంటారా? ఇక్కడి పెద్ద మనుషులను ఆడవారు- మగవారు అనడం కన్నా 'లేడీస్ అండ్ జెంటిల్‌మన్' అంటేనే బాగుంటుంది మీ కెప్పుడైనా వీళ్లు బస్సులో కనపడితే మొహం ఆ వైపు తిప్పుకొని మీ ఉనికినే గుర్తించనట్లు ప్రవర్తిస్తారు ఆఖరికి తాము బస్సులో ప్రయాణం చేస్తున్న విషయమే మరిచిపోయినట్లు నటిస్తారు

బస్సునుంచి దిగాక దొంగతనం చేసిన వారిలా నిశ్శబ్దంగా దిగి గబగబా నడిచి బస్‌స్టాండ్ సర్కిల్ దాటాకనో, టాక్సీ స్టాండ్ చేరాకనో మార్కెట్‌లోకి వెళ్ళిన తర్వాతనో నింపాదిగా గాలి పీల్చుకొంటారు అంతదూరం వెళ్ళిన తర్వాతగాని బస్సులో ప్రయాణం చేసినందువల్ల కలిగిన పిగ్గు వారిని వదలదు మీరు మొండివారయి, వారిని వెంబడించి 'హలో' అని మాట్లాడించారనుకోండి—అప్పుడు వారు రిగల్‌నుంచి (లేదా వారెక్కడనుంచి బయల్దేరారో అక్కడినుంచి) టాక్సీకాని చివరికి ఎవరి లిఫ్ట్‌కాని దొరకలేదనీ, విధిలేక బస్సులో ప్రయాణం చేయాల్సిన పని కల్గిందనీ మీ ముందు వాపోతారు

నేను ఈ వూరికి వచ్చిన తొలిరోజుల్లో త్రోవలో వేగంగా నడిచిపొయ్యేవారిని "ఏమండీ సి-327/4 ఇల్లు ఎక్కడుందో కాస్త చెప్తారా" అని అడిగాను నేను సి - మూడువందల అంటూ వుండగా తర్వాత చెప్పబోయేది వినకుండానే అర్థమయినట్లు తలాడించి 'సారీ, ఐ డోంట్ నో' అనేసి ముందుకు వెళ్ళిపొయ్యేవారిని చూసి ఆశ్చర్యపడ్డాను సి-327/4 నంబరు గల యిల్లు వెదకటానికి నేను పడ్డ శ్రమ అంతా యింతా కాదు ఇంటినంబర్లు వరుసగా లేకపోవటం ఈ మాయానగర్ ప్రత్యేకతల్లో ఒకటి ఇటువంటి కాలనీలను పెద్ద పెద్ద నగరాల్లో మీరు చూసేవుంటారు ఒకవేళ ఇటువంటి కాలనీలోనే మీరు కూడా కాపురముంటూ వుండవచ్చు అందువల్ల రకరకాలుగా సుందరంగా ఉన్న బిల్డింగులుండే ఇలాంటి కాలనీల్లో నంబర్లు క్రమబద్ధంగా లేకపోవటం మీకు వింతగా తోచకపోవచ్చు 25 వ నెంబరు ఇంటిదగ్గరకు రాగానే దాని ప్రక్కయింటి తర్వాత గల ఇల్లే 27 వ నెంబరు బిల్డింగ్ అని మీరు భావిస్తారు కాని ఆ యింటి నెంబరు 45 అయి కూర్చుంటుంది అప్పుడు మీకేమీ తోచక తికమకపడతారు

మొదట్లో ఇంటినంబర్లు వేసిన వారిమీద నాకు విపరీతమైన కోపం వచ్చింది కాని అంతా మన మంచికే అని తలచాను ఎందుకంటారా? సి-327/4 నంబరు ఇల్లు వెదికే నెపంతోనైనా మీరు ఆ కాలనీ అంతా తిరిగి చూస్తారు। అలా కాక, ఇలా బస్సు దిగారో లేదో అలా ఇల్లు దొరికితే బస్తీ బాబుల బడాయి మీకెలా తెలుస్తుంది?

మిట్ట మధ్యాహ్నంలో అటూ ఇటూ పది సార్లు తిరగాలంటే నా తలప్రాణం తోకకు వచ్చింది కాలనీలో రోడ్లన్నీ శుభ్రంగా, విశాలంగా, నిర్మానుష్యంగా వున్నాయి।